
ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల
ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ
పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో
ఒక పూర్తి పేజీ

తెలుగు జాతీయ దినపత్రిక
# వార్త

epaper.vaartha.com WWW.VAARTHA.COM

శ్రీకాకుళం

: fb.com/vaartha Digital

Published from Srikakulam ,Visakhapatnam, Vijayawada, Hyderabad,Rajahmundry, Guntur, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem

24-5-2026 ఆదివారం సంపుటి: 32 సంచిక: 113 పేజీలు: 16 వెల: 8.00

ఇరాన్‌పై మళ్లీ అమెరికా దాడి!
5లో

నల్లకోటు న్యాయవాదుల్లో 40% నకిలీలే!

# గొడ్డలి పార్టీ డ్రామాలు చెల్లవు

### కోడికత్తి, గులకరాయితో ప్రజలను మోసం చేయలేరు..
### వివేకా హత్యలో లబ్ధిదారు ఎవరో ప్రజలకు తెలుసు
### దళిత డ్రైవర్‌ను హత్య చేసిన నిందితునికి వైకాపా రక్షణ
### మాజీ సిఎం జగన్‌పై సిఎం చంద్రబాబు నిశిత వ్యాఖ్యలు

**చిత్తూరు, మే 23 ప్రభాతవార్త:** రాష్ట్రంను అభివృద్ధి, సంక్షేమంలో ముందుకు తీసుకెళ్తుండటంతో గొడ్డలి పార్టీ ఫ్రస్టేషన్‌తో తట్టుకోలేక పోతుందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ధ్వజమెత్తారు. చిత్తూరు జిల్లా యాదమరి మండలం 14 కండ్రిగ గ్రామ సమీపంలో శనివారం జరిగిన బహిరంగ సభలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు వైఎస్‌ఆర్ కాంగ్రెస్ పార్టీని గొడ్డలి పార్టీనే అని వాఖ్యలు చేశారు. రాష్ట్రంను ఐదేళ్ళ పాటు పరిపాలించిన వైకాపా పార్టీ అకృత్యాలను వివరిస్తూ అదే గొడ్డలి పార్టీ నైజం అని విమర్శించారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి నోరు తెరిస్తే అపద్దాలు చెప్తున్నాడని, రెండు రోజుల క్రితం మీడియా ముందు వచ్చిన వైఎస్ జగన్మోహన్‌రెడ్డి మాయ నాటకాలు వేసి వెళ్ళారని ఆరోపించారు. తాను 48 సంవత్సరాలుగా రాజకీయాల్లో వున్నానని, తనపై నక్సలైట్లు తిరుపతి వద్ద 23 క్లైమోర్ మైన్స్ పెట్టి దాడి చేశారని, వెంకటేశ్వరస్వామి తనకు పునర్జన్మ ఇచ్చారన్నారు. ప్రజాస్వామ్యంలో గొడ్డలి పార్టీలకు చోటు లేదని, సమాజానికి గొడ్డలి పార్టీ హానికరం అన్నారు. గొడ్డలి పార్టీ నెవర్ అగైన్ అంటూ సిఎం పిలుపునిచ్చారు. రాష్ట్రంలో జరిగిన వైఎస్ వివేకానందరెడ్డి హత్యకు సంబంధించి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి నాటకాలు ఆడుతున్నారని, ఈ హత్యకు సంబంధించి అంతిమ లబ్ధిదారులు ఎవరనే విషయం అందరికి తెలు సునన్నారు. వైఎస్ వివేకానందరెడ్డిని తాను హత్య చేసినట్లు ఇప్పుడు వచ్చి వైఎస్ జగన్ నంగనాచి మాటలు మాట్లా డుతున్నారని విమర్శించారు. అలాగే కోడికత్తి, గులకరాయి డ్రామాలు ఆడుతూ ప్రజలను మోసం చేసే ఎత్తుగడను వైఎస్ జగన్మోహన్‌రెడ్డి అవలంభించారన్నారు. రాష్ట్రంలో వైకాపా అధికారంలో వున్న సమయంలో దళిత డ్రైవర్ సుబ్రమణ్యంను హత్య చేసి డోర్ డెలవరీ చేశారని, డ్రైవర్‌ను హత్య చేసిన నిందిడుడికి వైకాపా అండగా నిలిచిందన్నారు. అలాగే కరోనా సమయంలో మాస్క్ అడిగిన పాపానికి ఓ దళిత డాక్టర్‌పై దాడి చేసి ఆపై వైకాపా ప్రభుత్వం ఆ డాక్టర్‌ను వేధించి ప్రాణాలు తీసిందని ధ్వజమెత్తారు. మరోవైపు కుటుంబ బంధాలపై సైతం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి గొడ్డలి వేటు వేశారని, తల్లికి, చెల్లికి ఆస్తి ఇవ్వకుండా వేధిస్తున్నారని, తల్లికి తిండి పెట్టని వాడు పిన్నమ్మకు బంగారు గాజులు ఇస్తాడంట! అని ఎద్దేవా చేశారు. తల్లి, చెల్లిని చూడని వారు ప్రజలను ఎలా చూస్తారో చెప్పాలని ఆయన ప్రజలను ప్రశ్నించారు. అలాగే హిందూ దేవాలయాలపై దాడులు, అపవిత్ర కార్యక్రమాలు చేపట్టి ఉద్రిక్తతలు రెచ్చగొట్టడానికి వైఎస్‌ఆర్ కాంగ్రెస్ ప్రయత్నిస్తోందన్నారు. మరోవైపు పోలవరం, అమరావతి, పెట్టుబడులు, అభివృద్ధిపై గొడ్డలి పార్టీ అసత్య ప్రచారాలు చేస్తోందని ధ్వజమెత్తారు. వైకాపా అధికారంలో వున్న సమయంలో రాష్ట్రంలో నడి రోడ్డుపై పలువురి పీకలు కోసి వైకాపా నాయకులు వారి రక్తదాహం తీర్చుకున్నారని ఆరోపించారు. మరోవైపు రాష్ట్రంలో గంజాయి బ్యాచ్‌ను ప్రోత్సహించి రాష్ట్రంలో గంజాయి విచ్చలవిడిగా లభ్యం అయ్యేలా చేశారని, జంతు రక్తంతో కటౌట్‌లకు అభిషేకాలు చేసి రప్పా.. రప్పా.. అంటూ రంకెలు వేస్తున్నారని ధ్వజమెత్తారు. అలాగే వైకాపా నాయకులు కారు కింద సొంత పార్టీ కార్యకర్త సింగయ్యను తొక్కించారని, కడపలో వైఎస్ వివేకానందరెడ్డి హత్య వ్యవహారంలో కీలకమైన పెద్ద దస్తగిరిని హత్య చేశారని ఆరోపించారు. మరోవైపు కులాలు, మతాలు,ప్రాంతాల మధ్య చిచ్చుపెట్టి వైకాపా >>2


శనివారం 14 కండ్రిగ సభలో మాట్లాడుతున్న సిఎం చంద్రబాబు

## బిజెపికి రాజ్యసభ టిక్కెట్టు ఇవ్వలేం
### తేల్చిచెప్పిన సిఎం చంద్రబాబు

**విజయవాడ,మే 23,ప్రభాతవార్తప్రతినిధి:** ఏపీలో త్వరలో జరుగనున్న రాజ్యసభ స్థానాల ఎన్నికల్లో తమకు ఒక సీటు కేటాయించాలన్న బిజెపి అభ్యర్ధనకు టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు నాయుడు నో చెప్పినట్లు సమాచారం. ఇప్పటికే బిజెపికి రాజ్యసభ సీటు కేటాయించిన క్రమంలో మళ్లీ సీటు ఆశించడం సరికాదని సీఎం చంద్రబాబు స్పష్టం చేసారంటున్నారు. గత వైఎస్సార్సీపీ హయాంలో ఆ పార్టీ తరఫున రాజ్యసభకు ఎన్నికైన పిల్లి సుభాష్‌చంద్రబోస్, ఆళ్ల అయోధ్యరామిరెడ్డి, పరిమళ్ నత్వానీతో పాటు, కూటమి అధికారంలోకి వచ్చాక టీడీపీ తరఫున రాజ్యసభకు వెళ్లిన సానా సతీశ్ పదవీ కాలం వచ్చే నెలలో ముగుస్తోంది.దాంతో శాసన సభలో మెజారిటీ దృష్ట్యా ఈ నాలుగు స్థానాలూ కూటమికే దక్కేఅవకాశాలు స్పష్టంగా ఉన్నాయి. సీఎం చంద్రబాబు రాజ్యసభ అభ్యర్థుల ఎంపికపై ఇంకా పూర్తిస్థాయిలో దృష్టి సారించలేదు. మహానాడు పూర్తయ్యాక, >>2



## మూడోసారి పెట్రో షాక్
### పెట్రోలు 87 పైసలు, డీజిల్ 91 పైసలు పెంపు
### పది రోజుల్లో దాదాపు రూ. 5 పెరిగిన ధర

**ముంబయి,మే 23:** సామాన్య, మధ్య తరగతి ప్రజలపై మరోసారి ఇంధన ధరల భారం పడింది. ప్రభుత్వ రంగ చమురు సంస్థలు ఇవాళ పెట్రోల్, డీజిల్ ధరలను మళ్లీ పెంచాయి. తాజా పెంపుతో పెట్రోల్‌పై లీటర్‌కు 87 పైసలు, డీజిల్‌పై 91 పైసలు పెరిగాయి. దీంతో దేశ రాజధాని ఢిల్లీలో లీటరు పెట్రోల్ ధర రూ. 99.51కి చేరగా, డీజిల్ ధర రూ. 92.49కి చేరుకుంది. గత 10 రోజుల వ్యవధిలో ఇంధన ధరలను పెంచడం ఇది మూడోసారి. పశ్చిమాసియాలో నెలకొన్న ఉద్రిక్తతలకారణంగా అంతర్జాతీయ మార్కెట్‌లో పెరిగిన ముడిచమురు ధరల భారాన్ని చమురు కంపెనీలు దశలవారీగా వినియోగదారులకు బదిలీ చేస్తున్నాయి. ఇందులో భాగంగా ఈనెల 15న లీటరుకు ఏకంగా రూ. >>2


శనివారం న్యూఢిల్లీలో ప్రధాని మోడీతో భేటీ అయిన అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రుబియో

## కీలక చర్చలు
### ప్రధాని మోడీతో అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రుబియో భేటీ
### ఇరాన్ సంక్షోభం ప్రత్యేక ప్రస్తావన

**న్యూఢిల్లీ, మే 23:** నాలుగు రోజుల భారత పర్యటనకు వచ్చిన అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రుబియో శనివారం ప్రధాని మోడీతో భేటీ అయ్యారు. వాణిజ్య, భద్రత సహా కీలక రంగాలపై చర్చలు జరిపారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు ట్రంప్ తరఫున మోడీని వైట్‌హౌస్‌కు ఆహ్వానించారు. ట్రంప్ రెండోసారి అధికారంలోకి వచ్చాక భారత్‌అమెరికా మధ్య వాణిజ్యం విషయంలో విభేదాలు తలెత్తిన విషయం >>2

## గాలివాన బీభత్సం

**విజయవాడ,మే23,ప్రభాతవార్తప్రతినిధి:** ఏపీలోని కొన్ని ప్రాంతాల్లో శనివారం సాయంత్రం తరువాత భారీ గాలివాన బీభత్సం సృష్టించింది. ఏపీలోని అనకాపల్లి, కాకినాడ, తెలంగాణలోని నాగర్‌కర్నూలు జిల్లాల్లో గాలితో కూడిన వర్షం అల్లకల్లోలం సృష్టించింది. గాలివాన బీభత్సం కారణంగా ఏపీలో ఇద్దరు, తెలంగాణలో ఒకరు మృత్యువాత పడ్డారు. పలుచోట్ల విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది.అనకాపల్లి జిల్లా నక్కపల్లి, పాయకరావుపేట మండలాల్లో దాదాపు అరగంట పాటు గాలి, వాన రావడంతో చెట్లు, విద్యుత్ స్తంభాలు నేలకూలాయి. రమణయ్యపేట, ముకుందరాజుపేట, దోసల పాడు, చీడిక, జి.జగన్నాథపురం, గొడిచర్ల, డొంకాడ, చినదొడ్డిగల్లు, కాగిత జాతీయ, రహదారి వంటి >>2


వీచిన ఈదురు గాలులకు నారువ గ్రామంలో నేలకొరిగిన అరటి పంట

## ఈదురు గాలులకు భారీగా పంటనష్టం
### అరటి రైతులకు కోలుకోలేని దెబ్బ

**రణస్థలం (శ్రీకాకుళం జిల్లా), మే 23 ప్రభాతవార్త:** అది నిన్నటి దాకా ఆ పచ్చని తోటలను చూసి మురిసిపోయిన కళ్లు.. చేతికందే పంటతో అప్పులు తీరిపోతాయని, ఇల్లు గడుస్తుందని ఆశపడ్డ గుండెలు. కానీ, ఆ ఆశలన్నీ ఒక్క రాత్రిలోనే గాల్లో కలిసిపోయాయి. ప్రకృతి కన్నెర్ర జేయడంతో రణస్థలం మండలం నారువ గ్రామంలోని అరటి రైతులు కోలుకోలేని ఆవేదనలో మునిగిపోయారు. శుక్రవారం రాత్రి ఒక్కసారిగా వీచిన ఈదురు గాలులు నారువ గ్రామ రైతుల పాలిట శాపంగా మారాయి. ఎంతో కష్టపడి, కంటికి రెప్పలా కాపాడుకుంటూ పెంచిన సుమారు 60 ఎకరాల అరటి తోటలు ఈ గాలుల ధాటికి పూర్తిగా నేలకొరిగాయి. పచ్చగా కళకళలాడాల్సిన తోటలన్నీ ఇప్పుడు విరిగిపడి స్మశానాన్ని తలపిస్తుంటే, ఆ దృశ్యాన్ని చూసి రైతులు గుండెలవిసేలా రోదిస్తున్నారు. **ఒక్క రాత్రిలో అపార నష్టం:** ఈ ప్రకృతి వైపరీత్యం కారణంగా గ్రామానికి చెందిన నిద్రబంగి సూరిరెడ్డి, బోయి >>2



## ప్రభుత్వ విప్‌కు జనసేన ఎమ్మెల్యే అరవ శ్రీధర్ రాజీనామా

**విజయవాడ,మే 23,ప్రభాతవార్తప్రతినిధి:** వైఎస్‌ఆర్ కడప జిల్లా రైల్వే కోడూరు ఎమ్మెల్యే అరవ శ్రీధర్ సంచలన నిర్ణయం తీసుకున్నారు. తన ప్రభుత్వ విప్ పదవికి రాజీనామా చేశారు. రాజీనామా పత్రాన్ని ఆంధ్రప్రదేశ్ ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌కి అందజేశారు. జనసేన పార్టీ అధ్యక్షుడు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌తో శనివారం రైల్వే కోడూరు ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ అరవ శ్రీధర్ భేటీ అయ్యారు. ఈ సందర్భంగా తనపై వచ్చిన పలు ఆరోపణలు, నెలకొన్న వివాదాలపై వివరణ ఇచ్చారు. అనంతరం వ్యక్తిగత కారణాలతో విప్ పదవికి రాజీనామా చేస్తున్నట్లు పవన్‌కు తెలిపారు.అవన్ని పరిష్కరించుకున్న తరువాత బాధ్యతాయుతమైన పదవులను ఇస్తే నిర్వహిస్తానని శ్రీధర్ తమ పార్టీ >>2

## డబులింజన్ సర్కార్ వల్లే ఇబ్బడి ముబ్బడిగా ఉద్యోగాలు
### ఎపికి ఎక్కువ నిధులు తేవడంలో సిఎం చంద్రబాబు సక్సెస్
### రోజ్‌గార్ మేళాలో పాల్గొన్న కేంద్రమంత్రి బండి సంజయ్
### ఇప్పటి దాకా 12లక్షల మంది నియామకాలు పూర్తి



శనివారం గుంతకల్లులో నూతనంగా ఎంపికైన ఉద్యోగులకు నియామక పత్రాలు పంపిణీ చేస్తున్న కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్

**అనంతపురం, మే 23, ప్రభాతవార్త బ్యూరో :** దక్షిణ భారతదేశంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ప్రస్తుతం వేగంగా అభివృద్ధి చెంతుతోందని, డబుల్ ఇంజన్ సర్కార్‌లో కేంద్రం నుంచి నిధులు ఎక్కువ తీసుకురావడంలో రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సఫలీకృతులయ్యాడని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ వెల్లడించారు. కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన మాటకు మించి ఉద్యోగ కల్పనలో ముందుందని, వైరవిలకు, అవినీతికి ఆస్కారం కల్పించకుండా ప్రధాని నరేంద్ర మోడీ ప్రభుత్వం చర్యలు తీసుకుందని, ఉద్యోగులు ప్రజలకు జవాబుదారీగా ఉంటూ దేశ సేవకు అత్యధిక ప్రాధాన్యత ఇవ్వాలని ఆయన పిలుపునిచ్చారు. దేశ వ్యాప్తంగా 47 ప్రాంతాల్లో ఒకేసారి రోజ్ గార్ మేళా కార్యక్రమం నిర్వహణతో 51,000 మందికి పైగా యువతకు నియమక పత్రాల పంపిణీ కార్యక్రమం నిర్వహణలో భాగంగా శనివారం గుంతకల్లు రైల్వే ప్రభాత్ క్లబ్‌లో కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాలకు ఎంపికైన యువతకు నియామక పత్రాల పంపిణీ కోసం ఏర్పాటు చేసిన రోజ్‌గార్ మేళా కార్యక్రమంలో కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో రైల్వే డిఆర్ఎం చంద్రశేఖర్ గుప్తా, ఎడిఆర్ఎం బి.ఎస్.శివప్రసాద్, డివిజనల్ పర్సనల్ అధికారి హెచ్.ఎల్.ఎన్ ప్రసాద్, తదితర రైల్వే ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా రోజ్‌గార్ మేళాలో ఉద్యోగ నియామక పత్రాలు పొందుతున్న పలువురు అభ్యర్థులను ఉద్దేశించి ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ సందేశాన్ని కేంద్ర మంత్రి బండి సంజయ్, అధికారులు వర్చువల్‌గా వీక్షించారు..ఈ సందర్భంగా కేంద్ర మంత్రి బండి సంజయ్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాల కల్పన మరియు రోజ్‌గార్ మేళా భారత ప్రధాని నరేంద్ర మోడీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం దేశంలోని నిరుద్యోగ యువతకు భరోసా కల్పిస్తూ చేపట్టిన అతిపెద్ద కార్యక్రమం 'రోజ్‌గార్ >>2



## మాచ్‌ఖండ్ జల విద్యుత్ కేంద్రంలో అగ్నిప్రమాదం
### కోట్లల్లో ఆస్తి నష్టం

**ముంచంగిపుట్టు మే 23 ప్రభాతవార్త:** మాచ్‌ఖండ్ జల విద్యుత్ కేంద్రంలో శనివారం మధ్యాహ్నం 12.30 గంటల సమయంలో భారీ అగ్ని ప్రమాదం చోటు చేసుకోవడంతో ప్రాజెక్టుకు కోట్లల్లో ఆస్తి నష్టం సంభవించింది. అందుకు సంబంధించిన వివరాలు ఈ విధంగా ఉన్నాయి. ఆంధ్ర ఒడిస్సా రాష్ట్రాలు సంయుక్తంగా నిర్వ హిస్తున్న మాచ్‌ఖండ్ జలవిద్యుత్ కేంద్రంలో ఆరు జనరేటర్ల సహాయంతో 120 మెగా >>2

## ఐక్య ఉద్యమాలతో ఫాసిస్ట్ శక్తుల కట్టడి
### అభ్యుదయ రచనలతో ప్రజల్లో చైతన్యం
### అరసం 23వ రాష్ట్ర మహాసభల్లో వక్తలు



**తిరుపతి,మే 23ప్రభాతవార్తప్రతినిధి:** ప్రగతిశీల శక్తులు, వామపక్ష వాదులు తమ ఎజెండాలను పక్కనపెట్టి ఐక్య ఉద్యమాలు నిర్మిస్తేనే దేశంలో ఫాసిస్ట్ శక్తులను కట్టడి చేయవచ్చునని ప్రజాస్వామ్య రచయితల వేదిక జాతీయ సమన్వయకర్త ఆచార్య కాత్యాయని విద్మహే పేర్కొన్నారు. అభ్యుదయ రచయితల సంఘం (అరసం) రాష్ట్ర 23వ మహాసభలు తిరుపతిలో శనివారం ప్రారంభమయ్యాయి. గంధమనేని శివయ్య కృష్ణారెడ్డి భవన్ లో ఉదయం అరసం జెండాను రాష్ట్ర గౌరవ అధ్యక్షురాలు డాక్టర్ పి సంజీవమ్మ ఆవిష్కరించారు.అనంతరం జరిగిన ప్రారంభ సభలో డాక్టర్ కాత్యాయని విద్మహే మాట్లాడుతూ ఫాసిజానికి వ్యతిరేకంగా కమ్యూనిజం ను సుస్థిర పరచేందుకు అరసం ఏర్పడింది అన్నారు. నాటి నుండి రచయితలు చేసిన అనేక రచనలు సమాజం లో చైతన్యం తీసుకు వచ్చాయని అన్నారు. నేడు ప్రగతి శీల శక్తులు అనైక్యంగా ఉన్నాయని, ఫాసిస్టు శక్తులు మాత్రమే ఐక్యంగా ఉన్నాయని తెలిపారు. ఈ ధోరణి దేశానికి ప్రమాదకరమని పేర్కొన్నారు. ప్రగతి శీల శక్తులకు ఎవరి ఎజెండాలు వారికి ఉన్నా, ఐక్య కార్యాచరణను బలంగా ముందుకు తీసుకెళ్లాలని చెప్పారు. అభ్యుదయ ఉద్యమాల్లో అస్తిత్వం ఉండడం వల్లే ఈ పరిస్థితి వచ్చిందని,

ఐక్య వామపక్ష ఉద్యమాలు బలపడితే దేశాన్ని కాపాడుకోవచ్చునని తెలిపారు. ప్రశ్నించే వారిపై అర్బన్ నక్సలైట్లు అని ముద్రవేసి, కేసులు పెట్టడాన్ని తప్పుపట్టారు. ఈ నేపథ్యంలో లౌకిక, ప్రజాస్వామ్య, వామ పక్ష వాదులు ఏక తాటి పైకి వచ్చి ఉద్యమించాలని పిలుపునిచ్చారు. సభాధ్యక్షుడు ఆచార్య రాచపాలెం చంద్రశేఖర్ రెడ్డి మాట్లాడుతూ శాస్త్రీయమైన భారతదేశం ఏర్పడుతుందని సంఘసంస్కరణ ఉద్యమం నిరూపించిందని అన్నారు. విచ్చలవిడి తనంతో అసమానతలు పెరిగి , దోపిడి దారులు ఎక్కువ అవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు.ఎన్నికల ముందు ప్రజాస్వామ్యం అని, అధికారం లోకి వచ్చాక తూట్లు పొడుస్తున్నారని విమర్శించారు. మతాల పరంగా రచనలు చేసి సోషల్ మీడియాలో రెచ్చ గొడుతున్నారని విమర్శించారు. నేడు అరసం మహాసభల్లో కూడా రచయితల ఐక్యత అనివార్యం అని తీర్మానాలుచేయడం శుభ పరిణామమన్నారు. సమాజం >>2



## ఎండ మంటలు
### కృష్ణా జిల్లా కానుమోలు: 45.8°
### అనకాపల్లి జిల్లా మాకవరపాలెం: 45.5°

**విజయవాడ,మే 23,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రంలో ఎండ తీవ్రత అధికంగా ఉంటుంది. రోజు,రోజుకు ఎండలు ముదురుతున్నాయి.ఇంచుమించు రాష్ట్రమంతటా ఒకే వాతావరణం కన్పడుతుంది.ఎండకు ప్రజలు బయటకు రాలేని పరిస్థితి.నిత్యజీవనం భాగంగా చిరు వ్యాపారాలు నిర్వహించే వారు ఎండలో అల్లాడుతున్నారు.ముఖాలకు ముసుగులు వేసుకుని, ఎండ వేడిమి తట్టుకునే చలువ కళ్ళాద్దాలు పెట్టుకుని బయటకు వస్తున్నారు.వడదెబ్బకు అనారోగ్యంతో ఉన్న వృద్దులు మృత్యువాత పడుతున్నారు. ఒకటి రెండు చోట్ల భవన నిర్మాణ,కార్మికులు,వాహనచోదకులు వడదెబ్బతో మరణించారు.నుడు ఒక్క రోజూ వివిధ జిల్లాల్లో ఆరుగురువడదెబ్బతో మృత్యువాత పడ్డారు.వడదెబ్బ మరణాలను అధికారికంగా ఎటువంటి నిర్ధారణ జరుగలేదు,ఇప్పటి గత నెల రోజులుగా వడదెబ్బకు సుమారు 400ల మంది మరణించినట్లు అధికారులు అనుమానిస్తున్నారు.ఇక శనివారం కృష్ణా జిల్లా కానుమోలు 45.8 డిగ్రీలు, అనకాపల్లి జిల్లా మాకవరపాలెంలో 45.5 డిగ్రీలు నమోదైందనట్లు వాతావరణ శాఖ వెల్లడించింది. అనకాపల్లి జిల్లా మాకవరపాలెంలో 45.5,ఏలూరుజిల్లా కుక్కునూరు, పోలవరం జిల్లా కూనవరం, పల్నాడుజిల్లా శ్రీనగర్ 45,ఎన్టీఆర్ జిల్లా తొర్రగుడిపాడులో 44.6,తూర్పుగోదావరిజిల్లా చిట్యాలలో 44.3,విశాఖ జిల్లా రూరల్లో 42.8, అల్లూరిజిల్లా రామరాజుపాలెం, కాకినాడజిల్లా >>2

# ప్రజలను నమ్మించడానికి వైసిపి అసత్యాల ప్రచారం:

## మంత్రి పయ్యావుల కేశవ్



**విజయవాడ,మే 23,ప్రభాతవార్తప్రతినిధి:** ప్రజలను నమ్మించడానికి వైసిపి అసత్యాలను ప్రచారం చేస్తూంటుందని ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ వ్యాఖ్యానించారు.ఆ పార్టీకి గత ఎన్నికల్లో గట్టిగా బుద్ధి చెప్పినా వైసిపి నేత జగన్ విధానం మార్చుకోవడంలేదన్నారు. పయ్యావుల విజయవాడలో మీడియాతో మాట్లాడుతూ వైఎస్ కుటుంబం సమాజంలో నిందితులే కానీ బాధితులు కాదని నేరమయ రాజకీయాలకు ఆద్యులే జగన్ కుటుంబమని ఆరోపించారు. ఫ్యాక్షన్‌ను రాజకీయాల్లోకి విస్తరించింది జగన్ తాత రాజారెడ్డి. రాజకీయాల్లో హింసను కొత్త పుంతలు తొక్కించిన కుటుంబం జగన్‌ది అన్నారు. వినేవారుంటే స్వాతంత్ర్య సమర యోధుల కుటుంబమని జగన్ చెబుతారు. పులివెందుల పరిణామాలపై పుస్తకం విడుదల చేసే యోచనలో ఉన్నాం. గొడ్డలి పార్టీ వల్ల సమాజంలో తరాలు నష్టపోతున్నాయి. సమాజానికి గొడ్డలి పార్టీ హానికరమని గట్టిగా చెప్తున్నాం. అన్ని వ్యవస్థలపై గొడ్డలి వేటు వేసినందునే జగన్‌ది గొడ్డలి పార్టీ. జగన్ మంచివాడంటూ సెల్ఫ్ సర్టిఫికేట్ ఇచ్చుకోవటం విడ్డూరంగా ఉంది. రాష్ట్రంలో నేరమయ రాజకీయాలను మొదలుపెట్టింది, కొనసాగిస్తున్నదీ జగన్ కుటుంబమేనని మంత్రి పయ్యావుల కేశవ్ ఆరోపించారు. వైఎస్ కుటుంబం సమాజంలో నిందితుల స్థానంలో ఉందని, ఎంతమాత్రం బాధితులు కారని స్పష్టం చేశారు. గొడ్డలి పార్టీ వల్ల సమాజంలో తరాలు నష్టపోతున్నాయని అన్నారు. అందుకే పార్టీ సమాజానికి హానికరమని చెబుతున్నామన్నారు. శాంతిభద్రతలు, పరిశ్రమలు, రాజ్యాంగ వ్యవస్థలపై గొడ్డలి వేటు వేసిన పార్టీ కాబట్టే జగన్‌ది గొడ్డలి పార్టీ అని ధ్వజమెత్తారు. పొక్లెయిన్లు, బుల్‌డోజర్లను జగన్ కూల్చివేతలు, విధ్వంసానికి వాడితే.. చంద్రబాబు నిర్మాణం, అభివృద్ధికి వినియోగించారు. వైఎస్ రాజశేఖర్ రెడ్డిని ముద్దాయిని చేసిందే జగన్, తండ్రిని ముద్దాయిగా చేర్చా లని జగన్ కోర్టుకెళ్లిన విషయాన్ని ఉండవల్లి అరుణ్‌కుమార్ బయటపెట్టారు. రాజశేఖర్‌రెడ్డిని ముద్దాయిగా చేర్చిన న్యాయవాదికి ఉన్నత పదవి ఇవ్వలేదా, ప్రజలు జగన్ క్షుద్ర రాజకీయాలను గ్రహించినందునే ప్రతిపక్ష స్థానం కూడా ఇవ్వలేదు.

# సెకండరీ ప్రభుత్వాసుపత్రుల్లో సంక్లిష్ట శస్త్రచికిత్సల పరంపర

**- రిఫరల్స్ తగ్గించి సదరు ఆసుపత్రుల్లోనే రోగుల ఆరోగ్యానికి వైద్యుల భరోసా - మంత్రి సత్యకుమార్ యాదవ్ అభినందనలు - 32 వైద్య బృందాలకు ప్రశంసా లేఖలు పంపిన డి.ఎస్.హెచ్ కెవిఎన్ చక్రధరబాబు**

**విజయవాడ,మే 23,ప్రభాతవార్తప్రతినిధి:** ప్రాంతీయ, ప్రాథమిక వైద్య కేంద్రాలు(ప్రభుత్వ సెకండరీ) ఆసుపత్రుల్లో సంక్లిష్టమైన శస్త్రచికిత్సలను వైద్యులు విజయవంతంగా నిర్వహిస్తున్నారు. సాధ్యమైనంత వరకు కేసులను రిఫర్ చేయకుండా కష్టతరమైన శస్త్రచికిత్సలను సైతం వైద్యులు సెకండరీ ఆసుపత్రుల్లో చేసేస్తున్నారు. ఈ క్రమంలో ఈ ఏడాది జనవరి 31 నుంచి ఇటీవల వరకు జరిగిన వాటిలో 32 సంక్లిష్ట శస్త్ర చికిత్సలు ఉన్నట్లు నిశిత పరిశీలన అనంతరం డైరెక్టర్ ఆఫ్ సెకండ్ హెల్త్ ప్రధాన కార్యాలయం గుర్తించింది. అలాగే జాతీయ ఆరోగ్య కార్యక్రమాల అమల్లో 18 ఆసుపత్రులు ఉత్తమ పనితీరు కనబరిచినట్లు వెల్లడయింది. డైరెక్టర్ ఆఫ్ సెకండరీ హెల్త్ కేవీఎన్ చక్రధరబాబు మొత్తం 50 వరకు అభినందన లేఖలు పంపారు. గిరిజన ప్రాంతంలో ఉన్న రంపచోడవరం ఏరియా ఆసుపత్రిలో టోటల్ నీ రీప్లేస్మెంటు జరిగింది. చింతపల్లి ఏరియా ఆసుపత్రిలో రెక్టల్ ప్రొలాప్స్, భారీ ఫైబ్రాయిడ్ హిస్టరెక్టమీ శస్త్రచికిత్సలను అక్కడ వైద్యులు విజయవంతంగా ముగించారు. ఇలా ప్రతిభ చూపిన వారికి రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి శ్రీ సత్యకుమార్ యాదవ్ అభినందనలు తెలిపారు. ఇదే స్ఫూర్తిని నిరంతరం కొనసాగించాలని, సహచరులు కూడా ఇదేవిధంగా స్పందిస్తే రోగుల ఆరోగ్యానికి భరోసా మరింత పెరుగుతుందని పేర్కొన్నారు. టీచింగ్ ఆసుపత్రుల్లో మాదిరిగా దీళీబీ ఆసుపత్రులో ఆధునిక సౌకర్యాలు, ఆపరేషన్ థియేటర్లు, సూపర్ స్పెషాల్టీ వైద్యులు పూర్తి స్థాయిలో ఉండరు. అయినప్పటికీ దీళీబీ వైద్యుల్లో కొందరు వృత్తిపట్ల నిబద్ధతను పాటిస్తూ పెద్దాసుపత్రులకు కేసులు రిఫర్ చేయకుండా స్థానికంగానే పరిమిత సౌకర్యాల మధ్య శస్త్రచికిత్సలు చేసేందుకు మొగ్గుచూపుతున్నారని డీఎస్ హెచ్ కేవీఎన్ చక్రధరబాబు నేడొక ప్రకటనలో తెలిపారు. దీనివల్ల రోగులకు వ్యయప్రయాసాలు తగ్గుతున్నాయని, వారిపై ఆర్థిక భారం తగ్గుతుందని, విలువైన సమయం ఆదా అవుతుందని తెలిపారు. అలాగే అనారోగ్యం నుంచి త్వరగా కోరుకుంటున్నారని తెలిపారు. వృత్తిపట్ల నిబద్ధతను పాటించే వారిని తగిన ప్రమాణాలతో గుర్తించి వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ ఆదేశాలు అనుసరించి ఎప్పటికప్పుడు అభినందన లేఖలు పంపుతున్నామని వివరించారు. అన్నమయ్య జిల్లా రాజంపేట ఏరియా ఆసుపత్రి వైద్యులు కూడా సిజేరియన్ ద్వారా జరగాల్సిన ప్రసవాన్ని సహజ విధానంలో జరిగేలా చేశారు. ఓ మహిళకు తొలి కాన్పు సిజేరియన్ విధానంలో జరిగింది. రెండో కాన్పు కోసం ఇక్కడికి రాగా.. సహజ విధానంలో జరిగేలా వైద్యులు, నర్సులు కృషిచేశారు. అనకాపల్లి జిల్లా నర్సీపట్నం ఏరియా ఆసుపత్రిలో ఓ రోగికి అరుదైన శస్త్రచికిత్స జరిగింది. ఆసుపత్రిలో చేరిన సదరు రోగి శరీరం పై ఉన్న చర్మంలో 26 ఒకచోట తొలగించి, మరోచోట ట్రాన్స్ ప్లాంట్ చేశారు. ఇదే ఆసుపత్రిలో అరుదైన హెర్నియా రేపేర్స్ (స్పైజిలియన్, ఆభూరేటర్, సయాటిక్), సర్జరీ జరిగింది.ఎమ్మిగనూరు ఏరియా ఆసుపత్రిలో కంటి వైద్యులు 16 నెలల్లో 511 క్యాటరాక్ట్ శస్త్రచికిత్సలు చేశారు.

# జూన్ 21న వినూత్నంగా 'యోగాంధ్ర - 26'

## 14 రోజులపాటు విస్తృతంగా యోగాపై ప్రచారం

**విజయవాడ,మే 23,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రంలో అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని ఈ ఏడాదిజూన్ 21న వినూత్నంగా నిర్వహిస్తున్నారు. ప్రతి ఒక్కరిలో యోగా పట్ల అవగాహన కల్పించే దిశ ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తుంది.చిన్నారుల నుంచి వృద్ధుల వరకు,మానసిక, శారీరక ఒత్తిడి గురయ్యే ప్రతి ఒక్కరిని యోగా లో భాగస్వాములను చేసేందుకు ప్రభుత్వం దశలవారి ప్రణాళికను సిద్ధం చేసింది. యోగా ప్రాధాన్యం గురించి తెలిపేలా ఆసనాలు, ప్రయోజనాలు, సందేశాలు, ఆరోగ్యకరమైన జీవనంపై అవగాహన కల్పించేలా వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తుంది. ప్రతి ఒక్కరూ పాల్గొనేందుకు భారీ అవకాశాలు కల్పిస్తుంది. అదేవిధంగా ఈ ఏడాది కూడా అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఇందుకోసం "యోగాంధ్ర2026" పేరుతో ఒక కార్యాచరణ ప్రణాళికను రూపొందించింది. జూన్ 7 నుంచి జూన్ 20 వరకు మొత్తం 14 రోజుల పాటు రాష్ట్రవ్యాప్తంగా వివిధ కార్యక్రమాలతో పాటు ప్రచార కార్యక్రమాలు కూడా నిర్వహించనుంది. జూన్ 21న అమరావతిలో 25,000 మంది భాగస్వామ్యంతో రాష్ట్ర స్థాయి యోగా కార్యక్రమం జరపనుంది. గ్రామాల నుంచి జిల్లా కేంద్రాల వరకు కోటి (10 మిలియన్ల) మంది ప్రజలను యోగా కార్యకలాపాల్లో భాగస్వామ్యం చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది.ఈ సారి అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని కొత్తగా కార్యక్రమాన్ని నిర్వహించాలని పూనుకుంది. అందుకోసం ప్రతి జిల్లాకూ ఒక నిర్దిష్ట సామాజిక వర్గాన్ని లేదా సమూహాన్ని వారికి నచ్చిన థీమ్ఎంచుకుంటూ "యోగాంధ్ర" కార్యక్రమాన్ని వినూత్న రీతిలో నిర్వహించడానికి ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేసింది. ఉదాహరణకు విగిళి జిల్లాలో పోలీసు సిబ్బందితోనూ, తూర్పుగోదావరి జిల్లాలో ఖైదీలతో ఈ కార్యక్రమం నిర్వహించనున్నారు. అయితే రాష్ట్రంలో 28 జిల్లాలు ఉన్నాయి. ఈ కార్యక్రమం ప్రతి ఒక జిల్లా నిర్వహిస్తుంది కాబట్టి, ప్రతి జిల్లా నుంచి 28 వినూత్న థీమ్‌లను చూసే అవకాశం రాష్ట్ర ప్రభుత్వం కల్పిస్తుందనే చెప్పవచ్చు. అంతేకాకుండా తప్పనిసరిగా ప్రతి జిల్లా కేంద్రంలోనూ కనీసం 1,000 మంది పాల్గొనేలా ఏర్పాట్లు జరుగుతున్నాయి. జిల్లావారిగా ఎన్టీఆర్ పోలీసులు,తూర్పుగోదావరి ఖైదీలు, అంబేద్కర్ కోనసీమ రైతులు, విశాఖపట్నం సైనికులు, మాజీ సైనికులు, అన్నమయ్య అంగన్వాడీ ఆరోగ్య కార్యకర్తలు. చిత్తూరు వైద్యులు, వైద్యాధికారులు, కృష్ణా ఆటో, లారీ డ్రైవర్లు,వైఎస్సార్ కడప కుటుంబాల్లో అన్ని తరాలతో, శీకాకుళం మత్స్య కారులు, అల్లూరి సీతారామరాజు గిరిజనులు, పల్నాడు ఆశా, ఏఎన్ఎంలు, కాకినాడ ఉపాధ్యాయులు, నెల్లూరు రెసిడెన్షియల్ అసోసియేషన్, ఎన్జీవోలు, పోలవరం అటవీ ఉద్యోగులు,అటవీ కమిటీ సభ్యులు,. బాపట్ల యువత, సాంస్కృతిక కళాకారులు, విజయనగరం ఉపాధి హామీ శ్రామికులు శ్రీ సత్యసాయివ్యాపారులు అనకాపల్లిపారిశ్రామిక కార్మికులు.ఏలూరువిద్యార్థులు, అనంతపురం దివ్యాంగులు కర్నూలుపారిశుద్ధ్య కార్మికులు తిరుపతిసెలబ్రిటీలు నంద్యాలయోగా అసోసియేషన్ గుంటూరు ఇంజినీరింగ్ విద్యార్థులు పశ్చిమ గోదావరిఅథ్లెటిక్స్, క్రీడా బృందాలు ప్రకాశం డ్వాక్రా మహిళలు, మార్కాపురంపాడి రైతులు, పార్వతీపురం మన్యం వృద్ధులు అంశాలుగా యోగ కార్యక్రమాలు జరుగుతాయి. గ్రామ, మండల, జిల్లా, రాష్ట్ర స్థాయిలలో యోగా పోటీలు ప్రభుత్వం నిర్వహిస్తుంది. విద్యార్థులు, క్రీడాకారులు, మహిళా స్వయం సహాయక బృందాలు, ఆరోగ్య కార్యకర్తలు, పారిశ్రామిక కార్మికులు, సమాజంలోని ఇతర వర్గాల ప్రజలు ఇందులో చురుకుగా పాల్గొనే అవకాశాలు ఉన్నాయి.

# రాహుకేతుదోష నివారణ పూజలు నిర్వహించిన కర్ణాటక మాజీ ముఖ్యమంత్రి యడ్యూరప్ప

**శ్రీకాళహస్తి,మే 23 ప్రభాతవార్త** శ్రీకాళహస్తీశ్వరాలయంలో నిర్వహించే మహిమాన్విత రాహుకేతుదోష నివారణపూజల్ని కర్నాటక మాజీ ముఖ్యమంత్రి యాడ్యూరప్ప కుటుంబసభ్యులతో కలసి జరుపుకున్నారు. ఆయనతో పాటు షిమోగా ఎంపి రాఘవేంద్ర ఉన్నారు. వారికి రాష్ట్ర బిజెపి ఉపాధ్యక్షుడు కోలా ఆనంద్‌కుమార్ సారథ్యంలో ఘనస్వాగతం ఏర్పాటు చేసారు. కాగా దక్షిణ గోపురం వద్ద ధర్మకర్తల మండలి చైర్మెన్ కొట్టెసాయిప్రసాద్ సారథ్యంలో ఆలయ మర్యాదలతో వేదపండితులతో స్వాగతం పలికారు. ఆలయంలో నిర్వహించే మహిమాన్విత రాహుకేతుదోష నివారణ పూజలు జరిపించుకోవాలని యాడ్యూరప్ప కోరగా కోలా ఆనంద్ సారథ్యంలో ప్రత్యేక రాహుకేతుదోష నివారణ టిక్కెట్లు కొనుగోలు చేసి సహస్రలింగేశ్వరాలయం వద్ద పూజలు జరిపించారు. స్వామి అమ్మవార్ల అంతరాలయ దర్శనం ఏర్పాటు చేసారు.పూజల అనంతరం వారికి ఆలయ మర్యాదలతో మృత్యుంజయ స్వామి ఆలయం వద్ద వేదపండితులతో ప్రత్యేకాశీర్వచనాలు అందించారు. వారికి కోలా ఆనంద్ సారథ్యంలో ధర్మకర్తల మండలి సభ్యుడు వాకచర్ల గుర్రప్పశెట్టి,మాజీ రాష్ట్ర ఉపాధ్యక్షులు కండ్రిగ ఉమ,గరికపాటి రమేష్‌బాబు, వెంకటరమణానాయుడు,చాగణం శైలజలు స్వాగతం పలికారు. దేవస్థానం తరఫున ఎఇఒ మోహన్, ఎపిఆర్ఓ రవి, పర్యవేక్షకులు నాగభూషణం యాదవ్‌లు స్వాగతం పలికారు. మాజీ ముఖ్యమంత్రి యాడ్యూరప్ప అతిధి గృహంలో కొంత సేపు రాష్ట్ర బిజెపి ఉపాధ్యక్షుడు కోలా ఆనంద్‌తో చర్చించారు. అంధ్ర ప్రదేశ్‌లో బిజెపి పార్టీ అభ్యున్నతిని అలాగే కర్నాటకలో రాబోవు ఎన్నికల్లో బిజెపి జెండా ఎగురవేస్తుందని అధికారం చేపడుతుందని యాడ్యూరప్ప కోలా ఆనంద్‌కు వివరించారు. నేడు భారత దేశంలోనూ, ప్రపంచ దేశాల్లో మన ప్రధాని నరేంద్రమోదీ విధానాలు ఎంతో ఆకర్షణీయంగా ఉన్నాయన్నారు. ఆయన తీసుకుంటున్న నిర్ణయాలు ప్రజల్లో పార్టీని బలోపేతం చేసుకోవటానికి ఎంతో దోహద పడుతుందని మాజీ ముఖ్యమంత్రి కోలా ఆనంద్‌కు వివరించారు.



శ్రీకాళహస్తీశ్వరుని ప్రసాదాలను అందిస్తున్న ఎఇఓ మోహన్

# అది రాజకీయ పార్టీ కాదు.. ప్రజల కోసం ఏర్పాటు చేసిన ఫోరం మాత్రమే

## కొత్త పార్టీ ప్రచారంపై క్లారిటీ ఇచ్చిన డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు

**విజయవాడ, మే 23,ప్రభాతవార్తప్రతినిధి:** టీడీపీ నేత, ఆంధ్రప్రదేశ్ శాసనసభ డిప్యూటీ స్పీకర్ కనుమూరి రఘురామ కృష్ణరాజు తన కొత్త రాజకీయ పార్టీ ఏర్పాటు చేస్తున్నారనే ప్రచారాన్ని పూర్తిగా ఖండించారు. గత రెండు మూడు రోజులుగా సోషల్ మీడియాలో, రాజకీయ వర్గాల్లో జరుగుతున్న ప్రచారంపై స్పందిస్తూ ఆయన స్పష్టత ఇచ్చారు. తాను రాజకీయ పార్టీ పెట్టబోతున్నానంటూ కొందరు కావాలనే తప్పుడు ప్రచారం చేస్తున్నారని రఘురామకృష్ణంరాజు మండిపడ్డారు. ప్రజలకు ఉచిత న్యాయ సహాయం అందించేందుకు మాత్రమే 'తెలుగువీర లేవరా' పేరుతో ఒక ఫోరం ఏర్పాటు చేశామని తెలిపారు. కొంతమంది న్యాయవాదులతో కలిసి ఈ ఫోరమ్‌ను ప్రారంభించామని చెప్పారు. ప్రత్యేకంగా తప్పుడు ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుల కారణంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్న వారికి న్యాయ సలహాలు, మార్గదర్శకత్వం అందించడమే ఈ ఫోరమ్ ముఖ్య ఉద్దేశమన్నారు. తాను ఎదుర్కొన్న అనుభవాల దృష్ట్యా ఇతరులు ఇబ్బంది పడకూడదనే ఉద్దేశంతో ఈ వేదికను ఏర్పాటు చేసినట్లు వివరించారు. అల్లూరి సీతా రామ రాజు స్ఫూర్తితోనే 'తెలుగువీర లేవరా' అనే పేరును ఎంపిక చేశామని చెప్పారు.

### మండే ఎండల్లో పెరుగుతున్న

# బీర్ అమ్మకాలు

**విజయవాడ, మే 23,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రంలో ఉష్ణోగ్రతలు భారీగా పెరుగుతున్న నేపథ్యంలో బీర్ అమ్మకాలు గణనీయంగా పెరిగాయి. మండుతున్న ఎండల కారణంగా ప్రజలు చల్లని పానీయాలతో పాటు బీర్ వైపు మొగ్గు చూపుతున్నట్లు గణాంకాలు చెబుతున్నాయి. ఏప్రిల్ 2025తో పోలిస్తే ఏప్రిల్ 2026లో బీర్ అమ్మకాలు 31.44 శాతం పెరిగాయి. గత ఏడాది ఏప్రిల్‌లో 22.73 లక్షల కేసులు అమ్ముడవగా, ఈ ఏడాది అదే నెలలో 29.88 లక్షల కేసులు విక్రయమయ్యాయి. అలాగే మే నెలలో కూడా అమ్మకాలు భారీగా పెరిగాయి. మే 2025లో తొలి 22 రోజుల్లో 16.42 లక్షల కేసులు అమ్ముడవగా, మే 2026లో అదే కాలానికి 22.21 లక్షల కేసుల అమ్మకాలు నమోదయ్యాయి. ఇది 35.27 శాతం వృద్ధిని సూచిస్తోంది. తీవ్రమైన ఎండలు, అధిక ఉష్ణోగ్రతలు, వేసవి సీజన్ ప్రభావంతో బీర్‌కు డిమాండ్ పెరిగిందని వ్యాపార వర్గాలు చెబుతున్నాయి. సాయంత్రం వేళల్లో వైన్ షాపులు, బార్ల వద్ద వినియోగదారుల రద్దీ కూడా పెరిగినట్లు సమాచారం.



డి.సిఎం పవన్ కల్యాణ్‌తో పోలవరం ఎమ్మెల్యే చిర్రి బాలరాజు

# నాలుగు వారాల్లో పనితీరు చక్కదిద్దుకోండి

**పోలవరం ఎమ్మెల్యే చిర్రి బాలరాజుకు ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఆదేశం**

**విజయవాడ, మే 23,ప్రభాతవార్తప్రతినిధి:** పార్టీకి అప్రతిష్టను తీసుకుని వచ్చే అంశాలను సహించేది లేదనిఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ స్పష్టం చేసారు.వ్యక్తిగత విషయాలతో బజారున పడటం బాధ్యత యుతమైన ఎంఎల్ఏ స్థాయిలో ఉన్న వారికి తగదన్నారు. పోలవరం ఎమ్మెల్యే చిర్రి బాలరాజు శనివారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా.. పోలవరం ఎమ్మెల్యేగా ఆయన పని తీరుపై డిప్యూటీ సీఎం సమీక్ష నిర్వహించారు. పోలవరం నియోజకవర్గం పరిధికి సంబంధించి పార్టీ దృష్టికి వచ్చిన విషయాలు, ఆరోపణలపై ఎమ్మెల్యేను పవన్ వివరణ అడిగినట్లు తెలుస్తోంది. తన వ్యక్తిగత విషయాలను కుటుంబ సభ్యులతో కలిసి కూర్చొని చక్కదిద్దుకొనేందుకు కొంత గడువు ఇవ్వాలని ఎమ్మెల్యే కోరగా,నాలుగు వారాల్లోగా చక్కదిద్దుకోవాలని పవన్ సూచించినట్లు సమాచారం. పోలవరం నియోజకవర్గంలోని పంచాయతీల్లో అభివృద్ధి పనులకు ఇప్పటి వరకు రూ.147 కోట్లు కేటాయించారు. ఆ పనుల పురోగతిపైనా డిప్యూటీ సీఎం సమీక్ష చేశారు. పనుల సకాలంలో వేగంగా పూర్తి చేయకపోవడంపై పవన్ ప్రశ్నించారు. అధికారులను సమన్వయం చేసుకుంటూ పనులను వేగవంతం చేస్తానని, వ్యక్తిగత వ్యవహారాలు చక్కదిద్దుకుంటానని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌కు బాలరాజు చెప్పారు.

### తిరుపతిలో

# రోడ్డు ప్రమాదం

**- ఇద్దరు విద్యార్థులు దుర్మరణం**

**తిరుపతి(నారాయణవనం), మే 23 ప్రభాత వార్త ప్రతినిధి:** తిరుపతి జిల్లా పుత్తూరు-చెన్నై జాతీయ రహదారిలోని నారాయణవనం మండలం వెత్తలతడుకు పంచాయతీ రాళ్లకాలువ బ్రిడ్జి వద్ద శనివారం సాయంత్రం మోటారుసైకిల్‌ను కారు ఢీకొంది.ఈ ప్రమాదంలో ఇద్దరు విద్యార్థులు సంఘటనా స్థలంలోనే దుర్మరణం చెందారు. మృతి చెందిన వారిలో నారాయణవనం మండలం అరణ్యంకండ్రిగ పంచాయతీ గోవిందప్ప నాయుడుకండ్రిగ గ్రామానికి చెందిన ఎస్ యువరాజు(1'8), మరో విద్యార్థి ఎ యువరాజులుగా గుర్తించారు. అదే మోటారుసైకిల్‌పై ప్రయాణిస్తున్న మరో విద్యార్థికి తీవ్రగాయాలవడంతో పుత్తూరు ప్రభుత్వ ఆస్పత్రిలో ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం తిరుపతి రుయాకు తరలించారు. ఈ ప్రమాద సంఘటనకు సంబందించి నారాయణవనం ఎస్ఐ గిరిబాబు కథనం మేరకు వివరాలు..జిఎన్‌కండ్రిగ గ్రామానికి చెందిన హరిబాబు కుమారుడు ఎస్ యువరాజు(18) డిగ్రీ మొదటి సంవత్సరం తిరుపతి ఎస్‌జి ఆర్ట్ కళాశాలలో చదువుతున్నాడు. వెంకటేష్ కుమారుడు ఎ యువరాజు ఇంటర్ చదువుతున్నాడు. అదే గ్రామానికి చెందిన ఉదయ్ డిగ్రీ చదువుతున్నారు. వీరు ముగ్గురు శనివారం సాయంత్రం స్థానకంగా వున్న శింగిరికోన లక్ష్మీనరసింహస్వామి దర్శనానికి మోటారుసైకిల్‌లో వెళ్లారు. దర్శనం అనంతరం తిరుగు ప్రయాణంలో రాళ్ల కాలువ బ్రిడ్జి వద్దకు రాగానే ఎదురుగా వస్తున్న కారు మోటారు సైకిల్‌ను కొన్నది. ఈ ప్రమాదంలో ఇద్దరు అక్కడక్కడే దుర్మరణం చెందగా, మరోకరికి తీవ్రగాయాలు ఏర్పడినది. మృతదేహాలను పుత్తూరు ప్రభుత్వ ఆస్పత్రికి శవ పంచనామా కోసం తరలించారు. ప్రమాదానికి కారణమైన కారును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. స్థానిక ఎస్ఐ గిరిబాబు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# తిరుమల సమాచారం

### ముక్కోటి దేవతలకు ఆహ్వానంగా

# ధ్వజారోహణ మహోత్సవం



**తిరుమల,మే 23ప్రభాతవార్తప్రతినిధి:** వేద ఘోషలు, మంగళవాయిద్యాలు, భక్తుల గోవింద నామస్మరణల నడుమ తిరుపతి గోవిందరాజస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు శనివారం ఉదయం మిథున లగ్నంలో ధ్వజారోహణ మహోత్సవంతో వైభవంగా ప్రారంభమయ్యాయి. ఉదయం గరుడ చిత్రం తో అలంకరించిన ధ్వజపటాన్ని ధ్వజ స్తంభంపై ప్రతిష్ఠించి బ్రహ్మోత్సవాలకు శుభారంభం పలికారు. అనంతరం స్వామి వారి ఆస్థానం ఘనంగా నిర్వహించారు. శ్రీదేవి, భూదేవి సమేత గోవిందరాజస్వామి ధ్వజపటం, చక్రత్తాళ్వార్, పరివార దేవతలు వెండి తిరుచ్చిపై నాలుగు మాడ వీధుల్లో విహరించి భక్తులకు దివ్య దర్శనమిచ్చారు. ఈ దివ్య ఊరేగింపుతో బ్రహ్మోత్సవాల ఏర్పాట్లను స్వామివారే స్వయంగా పర్యవేక్షిస్తారనే ఆధ్యాత్మిక విశ్వాసం భక్తులను అలరించింది. అనంతరం అర్చకులు విష్వక్సేన ఆరాధన, వాస్తుహోమం, గరుడ లింగహోమం, గరుడ ప్రతిష్ఠ, రక్షాబంధనం తదితర వైదిక కార్యక్రమాలను నిర్వహించారు. మిథున లగ్నంలో ధ్వజారోహణం నిర్వహించి 18 గణాలు, ముక్కోటి దేవతలను బ్రహ్మోత్సవాలకు ఆహ్వానించారు. ఆ తరువాత ఉదయం 10.30 గంటలకు శ్రీదేవి, భూదేవి సమేత గోవిందరాజస్వామి ఉత్సవమూర్తులకు వైభవంగా స్నపన తిరుమంజనం నిర్వహించారు.

# వెంకన్నసేవలో విద్యాసాగరతీర్థస్వామి



**తిరుమల,మే 23ప్రభాతవార్తప్రతినిధి:** ఏడుకొండల వేంకటేశ్వరస్వామిని శనివారం ఉదయం ఉడిపి కృష్ణాపురమఠం పీఠాధిపతి విద్యాసాగర తీర్థ స్వామి శిష్యులతో కలసి దర్శనం చేసుకున్నారు. ఉదయం ఆలయం వద్దకు చేరుకున్న స్వామికి టిటిడి అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్య చౌదరి, ఆలయ డిప్యూటీ ఇఒ లోకనాథం, ఆలయ పేష్కార్‌రామకృష్ణ, పారుపత్తేదార్ హిమత్‌గిరి అర్చకులు ఇస్తికఫాల్‌తో స్వాగతం పలికారు. ఆలయంలోపల తొలుత ధ్వజస్తంభానికి నమస్కరించిన విద్యాసాగరతీర్థస్వామి శిష్యులతో కలసి శ్రీవారిని దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు వేదాశీర్వచనం చేశారు. టిటిడి అదనపు ఇఒ వెంకయ్యచౌదరి స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు. ప్రజలంతో భక్తితో ఉండాలని, స్వామినామస్మరణతోనే ముక్తికలుగుతుందని తెలిపారు.

# మే 24న కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం

**తిరుపతి,మే 23ప్రభాతవార్తప్రతినిధి:** టిటిడి అనుబంధంగా ఉన్న తిరుపతి జిల్లా నారాయణవనంలోని కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయ శుద్ధి మహోత్సవం ఈనెల 24న కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం వైభవంగా నిర్వహించనున్నారు. ఉదయం 8.15 గంటల నుండి మధ్యాహ్నం 12.45 గంటల వరకు ఈ పవిత్ర కార్యక్రమం జరుగనుంది. 28 నుండి జూన్ 5వ తేదీ వరకు జరగనున్న వార్షిక బ్రహ్మోత్సవాలకు ముందు ఆలయ పవిత్రత, శోభను మరింత పెంపొందించే ఉద్దేశంతో కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం నిర్వహించడం ఆలయ సంప్రదాయంగా కొనసాగుతోంది. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణం, గోడలు, పైకప్పు, పూజా సామగ్రి తదితరాలను శుద్ధి జలాలతో పరిశుభ్రం చేస్తారు. అనంతరం నామకోపు, శ్రీచూర్ణం, కస్తూరి పసుపు, పచ్చాకు, గడ్డకర్పూరం, గంధం పొడి, కుంకుమ, కిచిలీగడ్డ వంటి సుగంధ ద్రవ్యాలను కలిపిన పవిత్ర జలాన్ని ఆలయం అంతటా ప్రోక్షణం చేస్తారు. కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం అనంతరం మధ్యాహ్నం 2.30 గంటల నుండి భక్తులను సర్వదర్శనానికి అనుమతించనున్నారు.

# తిరుమల చరిత్రలో రికార్డు స్థాయి దర్శనాలు

## - 87,689 మంది భక్తులు పరవశం



**తిరుమల,మే 23ప్రభాతవార్తప్రతినిధి:** కలియుగప్రత్యక్షదైవం తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామిని శుక్రవారం అత్యంత ప్రాధాన్యమైన విశిష్టమైన అభిషేకసేవలో రికార్డుస్థాయిలో భక్తులు దర్శనం చేసుకున్నారు. తిరుమల చరిత్రలోనే శుక్రవారం రోజు 80వేలమందికి మించి దర్శనాలు కల్పించలేదు. అలాంటిది ఓ వైపు వేసవిసెలవులు కొనసాగుతుండటం...సాధారణ సర్వదర్శనాలకు 30గంటలు సమయం నిరీక్షిస్తున్నా శుక్రవారం వేకువజామున గోవిందుని అభిషేకసేవలోనూ సామాన్యభక్తులను సర్వదర్శనంలో అనుమతించి దేవుని దర్శనం చేయించడంలో టిటిడి అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి,ఆలయ డిప్యూటీ ఇఒ లోకనాథం,ఆలయవర్గాలు సఫలీకృతులయ్యారు. శుక్రవారం వేకువజామున నుండి అర్ధరాత్రి వరకు 87,689 మంది భక్తులు ఇష్టదైవాన్ని సంతృప్తికరంగా దర్శించుకోవడం విశేషం.మేనెలలోనే 1వతేదీ శుక్రవారం రోజు 71,008మంది భక్తులు, 8వతేదీ శుక్రవారం 67,222మంది భక్తులు, 15వతేదీ 75,688మంది భక్తులు మాత్రమే మహాలఘులో శ్రీవారిని దర్శించుకున్నారు. అలాంటిది 22వతేదీ శుక్రవారం ఏకంగా 87,689 మంది భక్తులు దర్శనం చేసుకోవడం రికార్డుగా నమోదైంది. కానుకల రూపంలో హుండీ ఆదాయం కూడా 4.29కోట్లు రూపాయలు చేకూరింది. వేసవిసెలవుల్లోనూ అనూహ్యంగా తిరుమలకు చేరుకుంటున్న భక్తులకు సాఫీగా, సంతోష దర్శనం చేయించడంలో అధికారులు ప్రణాళికాబద్ధంగా వ్యవహరిస్తున్నారు.

# వైభవంగా గోవిందరాజస్వామి బ్రహ్మోత్సవాలు



**తిరుమల,మే 23ప్రభాతవార్తప్రతినిధి:** టిటిడి ఆధ్వర్యంలో తిరుపతిలోని గోవిందరాజ స్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలు మొదలయ్యాయి. బ్రహ్మోత్సవాలు పురస్కరించుకుని ఆలయ పరిసరాలను దివ్య విద్యుత్ కాంతులతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. శ్రీహరి దశావతార మహిమను ప్రతిబింబించే ఈ ప్రత్యేక అలంకరణలు భక్తులకు ఆధ్యాత్మిక ఆనందాన్ని పంచుతూ బ్రహ్మోత్సవాల వైభవాన్ని మరింత రెట్టింపు చేస్తున్నాయి. అనంతపద్మనాభ స్వామి, మహావిష్ణువు దశావతార రూపాలను కళాత్మక విద్యుత్ కాంతులతో తీర్చిదిద్దారు. మత్స్యావతారం, కూర్మావతారం, వరాహస్వామి, నరసింహావతారం, వామనావతారం, పరశురామావతారం, బలరామావతారం, హనుమాన్ రూపాలు దర్శనమిచ్చేలా రూపొందించిన విద్యుత్ అలంకరణలు భక్తులను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. రైల్వే స్టేషన్ సమీపంలో వామనావతారం, రాయలచెరువు గేట్ జంక్షన్ వద్ద బలరామావతారం, బేరివీధిలో పరశురాముడు, పంచముఖ ఆంజనేయస్వామి ఆలయం వద్ద హనుమంతుని దివ్య రూపాలు ఆధ్యాత్మిక కాంతులను వెదజల్లుతున్నాయి. రామావతారం, కృష్ణావతారం, కల్కి అవతారం రూపాలు భక్తులకు భగవద్భక్తిని మరింతగా చాటుతున్నాయి. నాలుగు మాడవీధుల్లో విద్యుత్ ఆర్చ్‌లు, ఫ్లడ్‌లైట్లు, శోభాయమాన తోరణాలు, బాంబ్ స్టిక్స్, నడకదారుల వెంట ప్రత్యేక విద్యుత్ పందిళ్లు ఏర్పాటు చేశారు.

# పద్మావతి అమ్మవారి ఆశీస్సులందరిపై ఉండాలి

## - టిడిపి నేత దేవినేని ఉమా మహేశ్వరరావు



**తిరుపతి,మే 23ప్రభాతవార్తప్రతినిధి:** సిరుల తల్లి తిరుచానూరు పద్మావతి అమ్మవారి ఆశీస్సులు అందరిపై ఉండాలని, అమ్మవారి కరుణాకటాక్షాలతో రాష్ట్రం సుభిక్షంగా అభివృద్ధి చెందాలని మాజీమంత్రి, టిడిపి నేత దేవినేని ఉమా మహేశ్వరరావు ఆకాంక్షించారు. ఆయన కుటుంబంతో కలసి శనివారం ఉదయం తిరుచానూరుకు చేరుకున్నారు.ఆలయం వద్ద తుడ చైర్మన్ ,టిటిడి ఎక్స్ అఫిషియో మెంబర్ సి. దివాకర్ రెడ్డి దంపతులు ఉమా మహేశ్వరరావు దంపతులకు స్వాగతం పలికారు. ఆలయంలోపలకు చేరుకున్న వీరికి ఆలయ అర్చకులు అధికారులు సాంప్రదాయబద్ధంగా స్వాగతం పలికి అమ్మవారి దర్శనం చేయించారు. అమ్మవారి తీర్థప్రసాదాలు అందజేశారు.

24-5Pg7exHMNWJQE.qxd:24-5Pg7exHMNWJQE.qxd 1/1/02 6:24 AM Page 1



# 27 కాదు,, 28న బక్రీద్
## తెలుగు రాష్ట్రాల్లో మారిన పండుగ తేదీ

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్,మే23:** తెలుగు రాష్ట్రాల్లో బక్రీద్(ఈద్ అల్అధా) పండుగ తేదీ మారింది. దుల్ హిజ్జా నెలవంక దర్శనం ఆలస్యం కావడంతో మే 28న బక్రీద్ సెలవు దినంగా ప్రకటిస్తూ ప్రభుత్వాలు ఉత్తర్వులు జారీచేశాయి. దీంతో ఆ రోజున అన్ని ప్రభుత్వ కార్యాలయాలు సహా విద్యాసంస్థలు, బ్యాంకులకు సెలవు ఉండనుంది. అయితే.. చంద్రుని దర్శనం ఆధారంగా సౌదీ అరేబియా, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ లలో మాత్రం ఈ నెల 27న(బుధవారం) ఈ పండుగను జరుపుకోనున్నారు. తొలుత ప్రకటించిన దాని ప్రకారం.. మే 27న ఉండగా, దానిని మే 28(గురువారం) నాటికి మారుస్తూ ఇరు తెలుగు రాష్ట్రాలు అధికారిక ఉత్తర్వులు జారీచేశాయి. వాస్తవానికి ముస్లింలు ఎంతో భక్తిశ్రద్ధలతో జరుపుకునే పవిత్రమైన పండుగ బక్రీద్.. ఇస్లామిక్ క్యాలెండర్‌లోని చివరి నెల అయిన దుల్‌హిజ్జా 10వ రోజు వస్తుంది. ఆ ప్రకారం ముస్లిం పండుగలు చంద్రదర్శనంపై ఆధారపడి ఉంటాయి. అయితే.. ఈసారి దుల్ హిజ్జా నెలవంక దర్శనం ఒకరోజు ఆలస్యం కావడంతో పండుగ తేదీ మారినట్టు మతపెద్దలు ప్రకటించారు. మైనారిటీ సంక్షేమ శాఖల నుంచి వచ్చిన విజ్ఞప్తులు, సిఫార్సులను పరిశీలించిన ప్రభుత్వం పండుగ సెలవును 28కి మార్చింది. నెగోషియబుల్ ఇన్‌స్ట్రుమెంట్స్ యాక్ట్ 1881 ప్రకారం మే 28న సాధారణ సెలవు దినంగా ప్రకటిస్తూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు శనివారం ఉత్తర్వులు జారీచేశారు. మరోవైపు.. మే 28న సెలవు ఉంటుందని ఆంధ్రప్రదేశ్‌లోని చంద్రబాబు ప్రభుత్వం రెండు రోజుల క్రితమే ఉత్తర్వులు జారీచేసింది.

## డల్లాస్ టెక్నాలజీ సెంటర్‌కు అదనపు స్థలం కేటాయింపు

**విజయవాడ 23 ప్రభాతవార్త ప్రతినిధి:** విశాఖపట్నం జిల్లా మధురవాడ హిల్ నం-2 లోని నాన్ ఐటీ సెజ్ పరిధిలో డల్లాస్ టెక్నాలజీ సెంటర్‌కు అదనంగా కేటాయించిన 227088 చదరపు మీటర్ల స్థలాన్ని స్వాధీనం చేయడానికి ఏపీఐఐసీకి అనుమతిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు తగిన చర్యలు తీసుకోవాలని ఏపీఐఐసీ వీసీఎండీ, విశాఖజిల్లా కలెక్టర్‌ను ఆదేశించింది. ప్రస్తుతం అమలులో ఉన్న నిబంధనల ప్రకారం ఆక్యుపెన్సీ సర్టిఫికెట్ జారీ ప్రక్రియను వేగవంతం చేయడం ద్వారా విశాఖపట్నం ఐటీ హిల్ నం-2 లో నిర్మించిన సుమారు 2.15 లక్షల చదరపు అడుగుల ఐటీ స్పేస్ వినియోగంలోకి వచ్చేలా చర్యలు తీసుకోవాలని సూచించింది. తిరుపతి జిల్లా రేణిగుంట మండలంలో రూ.74.79 కోట్ల పెట్టుబడితో రోజుకు 60000 లీటర్ల సామర్థ్యం గల ఐస్ క్రీమ్ ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటుకు హాంగ్యో ఐస్‌క్రీమ్స్ ప్రైవేట్ లిమిటెడ్ ఎర్లీబర్డ్ నిబంధన కింద ప్రోత్సాహకాలు చెల్లించేందుకు అనుమతిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. గుంటూరు జిల్లా యడ్లపాడు మండలంలో రూ.51.65 కోట్లతో ఐటీసీ లిమిటెడ్ ఏర్పాటు చేస్తున్న స్పైసెస్ ప్రాసెసింగ్ ప్లాంటుకు ప్రోత్సాహకాలు చెల్లించేందుకు ప్రభుత్వం అనుమతించింది. కాకినాడలో రూ.171.52 కోట్లతో ఏఏకే సౌత్ ఈస్ట్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ ఏర్పాటు చేస్తోన్న ఎడిబుల్ ఆయిల్స్, ఫ్యాట్స్ తయారీ యూనిట్‌కు ప్రోత్సహాకాలు చెల్లించేందుకు ప్రభుత్వం ఆమోదించింది. ఎర్లీబర్డ్ స్కీం కింద స్థాపనకు అనుమతి పొందే కాలపరిమితిని మరో ఆరు నెలలు పొడిగిస్తూ ఏపీ ఇండస్ట్రీయల్ డెవలప్‌మెంట్ పాలసీ 4.0 ను ప్రభుత్వం సవరించింది.



# టిటిడికి రూ.30 లక్షలు విరాళం

**తిరుమల,మే 23ప్రభాతవార్తప్రతినిధి:** టిటిడి శ్రీ వేంకటేశ్వర అన్న ప్రసాదం ట్రస్టుకు శనివారం 30 లక్షలు విరాళంగా అందింది. తిరుపతికి చెందిన కోరా సౌమ్య 10,00,116, బిరుదాల సతీష్ కుమార్ రెడ్డి 10,00,116, పూరాబ్ సాయి 10 లక్షలు రూపాయలు ట్రస్టుకు అందజేశారు. దాతలు తిరుమలలో టిటిడి అదనపు ఇఒ చిరుమామిళ్ల వెంకయ్య చౌదరికి విరాళం డీడీ, చెక్కులను అందజేశారు.

### కోర్టుల్లో ఎలక్ట్రానిక్ ప్రాసెస్ వినియోగానికి నిబంధనలు ఖరారు

**విజయవాడ మే 23 ప్రభాతవార్త ప్రతినిధి:** దేశంలో 2024 జులైలో అమల్లోకి వచ్చిన మూడు నూతన చట్టాలకు అనుగుణంగా న్యాయస్థానాల విచారణ ప్రక్రయలో సాంకేతికతను వినియోగించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఏపీ ఎలక్ట్రానిక్ ప్రాసెస్సెస్ రూల్స్-2025ని నోటిఫై చేసింది . హోంశాఖ ముఖ్య కార్యదర్శి కుమార్ విశ్వజిత్ శుక్రవారం దీనిపై జీవో జారీచేశారు.తద్వారా సమన్లు, వారంట్లు, వాటి అమలుకు సాంకేతికతను వినియోగించి ఎలక్ట్రానిక్ పద్ధతిలో ఆదేశాలు జారీచేయొచ్చు. కోర్టు ద్వారా సమన్లు అందజేయడం సాధ్యంకాని పక్షంలో పోలీసులు సిబ్బందితో సదరు వ్యక్తి అధికారిక మెయిల్‌కు, ఇతర విధానాల ద్వారా డిజిటల్ సమన్లు పంపొచ్చు.

# విజయవాడలో 25న ఎంఎస్‌ఎంఇ గ్రోత్ సమ్మిట్ - 2026
### - రాష్ట్రంలో 38 ఎంఎస్‌ఎంఇ పార్కులకు శంకుస్థాపన చేయనున్న ముఖ్యమంత్రి చంద్రబాబు

**విజయవాడ,మే 23,ప్రభాతవార్తప్రతినిధి:** విజయవాడలో ఈ నెల 25 తేదీనఎంఎస్ఎంఈ గ్రోత్ సమిట్ 2026 నిర్వహిస్తోంది. ముఖ్యమంత్రి చంద్రబాబు ఈ సదస్సుకు హాజరై రాష్ట్రంలో 38 ఎంఎస్ఎంఈ పార్కులకు శంకుస్థాపన చేయనున్నారు. డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, ఎంఎస్ఎంఈల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్, పరిశ్రమల శాఖ మంత్రి టి.జి. భరత్ సహా పలువురు మంత్రులు పారిశ్రామిక వేత్తలు సదస్సు లో పాల్గొననున్నారు. రాష్ట్రవ్యాప్తంగా 1,500 మందికి పైగా ఎంఎస్ఎంఈ రంగానికి చెందిన పారిశ్రామికవేత్తలు, పీఎం విశ్వకర్మ లబ్ధిదారులు, విధానకర్తలు, ఆర్థిక సంస్థలు సాంకేతిక నిపుణులు హాజరుకానున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ప్రతీ నియోజక వర్గంలో 175 ఎంఎస్ఎంఈ పార్కులను ఏర్పాటు చేసే లక్ష్యం లో భాగంగా మూడో విడతలో ఈ 38 ఎంఎస్ఎంఈ పార్కులకు వర్చువల్ గా సీఎం శంకుస్థాపన చేయనున్నారు. ఇప్పటికే మొదటి రెండు దశల్లో 100 పారిశ్రామిక పార్కులకు శంకు స్థాపన తో పాటు కొన్ని ప్రారంభం అయ్యాయి. వీటిలో 761 యూనిట్లకు కేటాయింపులు జరిగాయి. ఈ పారిశ్రామిక యూనిట్ల ద్వారా రూ.1479 కోట్ల మేర పెట్టుబడులు వచ్చాయి. దాదాపు 24 వేల మంది కి ఉద్యోగ ఉపాధి అవకాశాలు లభించాయి. రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ ఆధ్వర్యంలో కుప్పం, మంగళగిరి, పిఠాపురంలో గ్రామీణ పారిశ్రామిక వేత్తలను ప్రోత్సహించేలా రూట్యాగ్ స్మార్ట్ విలేజ్ సెంటర్ ఎక్స్‌టెన్షన్ కేంద్రాలను సీఎం ప్రారంభించనున్నారు. రూ.200 కోట్ల వ్యయంతో రాష్ట్రంలోని 45 పారిశ్రామిక క్లస్టర్లలో ఉమ్మడి సౌకర్యాల కేంద్రాల ఏర్పాటుకు నిధులను కూడా ముఖ్యమంత్రి విడుదల చేయనున్నారు. ఈ సమ్మిట్ లో యువతకు, మహిళలకు అవగాహన కల్పించే అంశాలపై ప్రభుత్వం దృష్టి సారించనుంది. మొత్తంగా ఆంధ్రప్రదేశ్ పారిశ్రామిక ముఖచిత్రాన్ని మార్చేలా, అందరికీ సమాన అవకాశాలు కల్పించేలా ప్రణాళిక చేసిన ఈ ఎంఎస్ఎంఈ గ్రోత్ సమిట్ 2026ఖ రాష్ట్ర ఆర్థిక ప్రగతిలో ఒక మైలురాయిగా నిలిచే అవకాశం ఉంది. రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ ఆధ్వర్యంలో కుప్పం, మంగళగిరి, పిఠాపురంలో గ్రామీణ పారిశ్రామిక వేత్తలను ప్రోత్సహించేలా రూట్యాగ్ స్మార్ట్ విలేజ్ సెంటర్ ఎక్స్‌టెన్షన్ కేంద్రాలను సీఎం ప్రారంభించనున్నారు. రూ.200 కోట్ల వ్యయంతో రాష్ట్రంలోని 45 పారిశ్రామిక క్లస్టర్లలో ఉమ్మడి సౌకర్యాల కేంద్రాల ఏర్పాటుకు నిధులను కూడా ముఖ్యమంత్రి విడుదల చేయనున్నారు. ఈ సమ్మిట్ లో యువతకు, మహిళలకు అవగాహన కల్పించే అంశాలపై ప్రభుత్వం దృష్టి సారించనుంది. మొత్తంగా ఆంధ్రప్రదేశ్ పారిశ్రామిక ముఖచిత్రాన్ని మార్చేలా, అందరికీ సమాన అవకాశాలు కల్పించేలా ప్రణాళిక చేసిన ఈ ఎంఎస్ఎంఈ గ్రోత్ సమిట్ 2026ఖ రాష్ట్ర ఆర్థిక ప్రగతిలో ఒక మైలురాయిగా నిలిచే అవకాశం ఉంది.ప్రతి ఇంటికి ఒక పారిశ్రామిక వేత్తను తయారు చేయాలన్న గౌరవ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడి లక్ష్యం మేరకు ఎంఎస్ఎంఈ పని చేస్తుందని రాష్ట్ర సూక్ష్మ చిన్న, మధ్యతరహా పరిశ్రమలు, గ్రామీణ పేదరిక నిర్మూలన ప్రవాసాంధ్రుల సాధికారత సంబంధాల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ పేర్కొన్నారు. సోమవారం ముఖ్యమంత్రి అధ్యక్షతన విజయవాడ డాక్టర్ బీఆర్.అంబేద్కర్ కళావేదికల ఓజరిగే ఎంఎస్ఎంఈ గ్రోత్ సమ్మిట్ కార్యక్రమ ఏర్పాట్లను శనివారం మంత్రి పలు శాఖల అధికారులతో కలిసి పర్యవేక్షించారు. ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలను ప్రోత్సహించేందుకు ఎంఎస్ఎంఈ ద్వారా ఎన్నో వినూత్న కార్యక్రమాలను ప్రభుత్వం నిర్వహిస్తోందన్నారు. ఈ క్రమంలోనే సోమవారం ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకున్న గ్రోత్ సమ్మిట్‌ను అన్ని శాఖల అధికారులు విజయవంతం చేయాలని మంత్రి సూచించారు. ఎంఎస్ఎంఈ ఔత్సాహికులకు ఈ కార్యక్రమంలో ఎలా సమీకృతం చేస్తూ ముందుకు తీసుకువెళ్లాలనే అంశంపై మంత్రి చర్చించారు. గ్రోత్ సమ్మిట్ విషయంలో తీసుకోవాల్సి పలు జాగ్రత్తలను మంత్రి అధికారులకు సూచించారు. ట్రాఫిక్, పార్కింగ్, సీఎం షెడ్యూల్ గురించి సూచనలు చేశారు.

ఈ కార్యక్రమంలో ఏపీ పరిశ్రమల శాఖ సెక్రటరీ డాక్టర్ యువరాజ్, వీసీ ఎండీ ఏపీఐఐసీ దినేష్‌కుమార్, ఏపీఎంఎస్ఎంఈ డవలప్‌మెంట్ కార్పొరేషన్ సీఈవో విశ్వ, విజయవాడ ఆర్డీవో, ఐ పీఆర్ శాఖ, పోలీస్ శాఖ నుంచి ఏడీసీపీ మురళీకృష్ణ , డీఎస్పీ మానస, మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు పాల్గొన్నారు.

# భగ్గుమన్న రాజకీయ కక్షలు

**సూర్యాపేట మండలం యర్కారంలో బిఆర్ఎస్ నేత మధు దారుణ హత్య**

**గోనెసంచిలో కట్టి కల్వర్టు వద్ద పడేసిన మృతదేహం**

**ఓ హత్య కేసులో కీలక సాక్షిగా మధు**



చింతలపాటి మధు (ఫైల్)

**సూర్యాపేట బ్యూరో, ప్రభాతవార్త :** సూర్యాపేట మండలం యర్కారంలో మరోసారి రాజకీయ కక్షలు భగ్గుమన్నాయి. బిఆర్ఎస్ పార్టీ జిల్లా నాయకుడు, యర్కారం మాజీ సర్పంచ్ మోనిక భర్త చింతలపాటి మధు (42) దారుణ హత్యకు గురికావడం జిల్లాలో సంచలనంగా మారింది. పాత ఫ్యాక్షన్ విభేదాలు, రాజకీయ కక్షలే ఈ హత్యకు కారణమై ఉండవచ్చని పోలీసులు అనుమానిస్తున్నారు. శుక్రవారం ఉదయం 11 గంటల సమయంలో మధు సూర్యాపేటలోని తన నివాసం నుంచి పని నిమిత్తం బయటకు వెళ్లాడు. అనంతరం అతను ఫోన్ ఎత్తకపోవడంతో భార్య మోనిక పలుమార్లు సంప్రదించే ప్రయత్నం చేసింది. ఫోన్ అందుబాటులో లేకపోవడంతో ఆమె రూరల్ పోలీస్ స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేయడానికి ప్రయత్నించగా, ఘటన పట్టణ పరిధికి సంబంధించినదిగా భావించిన పోలీసులు టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని సూచించారు.మోనిక టౌన్ పోలీసులను ఆశ్రయించడంతో వారు వెంటనే రంగంలోకి దిగి ఫోన్ సిగ్నల్ ఆధారంగా గాలింపు చర్యలు చేపట్టారు.

ఇదిలా ఉండగా మధు శుక్రవారం సాయంత్రం వరకు పార్టీ కార్యాలయం వద్ద ఉన్నట్లు సమాచారం. అనంతరం సాయంత్రం 6:00 గంటల సమయంలో అతని స్నేహితుడు చింతా సైదులు ఫోన్‌చేసి తాళ్లగడ్డలో తాటిపాముల జానయ్య ఇంటికి రావాలని, కలిసి మద్యం సేవిద్దామని పిలిచినట్లు తెలిసింది. దీంతో మధు అక్కడికి వెళ్లగా, ఇద్దరూ కలిసి మద్యం సేవించినట్లు సమాచారం. కొద్దిసేపటి తర్వాత అక్కడికి చేరుకున్న ప్రత్యర్థులు పదునైన ఆయుధాలతో మధుపై కిరాతకంగా దాడిచేసి హత్య చేసినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. హత్య అనంతరం మృతదేహాన్ని గోనె సంచిలో కట్టి సూర్యాపేట-జనగాం రోడ్డులో యర్కారం గ్రామ శివారులోని కల్వర్ట్ వద్ద పడేసినట్లు గుర్తించారు. శనివారం అర్ధరాత్రి తర్వాత పోలీసులు గాలింపు చర్యల్లో భాగంగా కల్వర్ట్ సమీపంలో గోనె సంచిలో ఉన్న మృతదేహాన్ని గుర్తించారు. శనివారం రాత్రి రెండు గంటల సమయంలో పోలీసులు మధు భార్య మోనికకు సమాచారం అందించి సంఘటనా స్థలానికి తీసుకెళ్లారు. అక్కడ మృతదేహాన్ని చూసిన మోనిక అది తన భర్త మధుదేనని గుర్తించింది. అనంతరం పోలీసులు మృతదేహాన్ని సూర్యాపేట ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి తరలించి పోస్టుమార్టం నిమిత్తం మార్చురీలో భద్రపరిచారు. మార్చురీలో ఉన్న మధు మృతదేహాన్ని జిల్లా ఎస్పీ కొత్తపల్లి నరసింహ, మాజీమంత్రి సూర్యాపేట ఎమ్మెల్యే గుంతకల్ల జగదీశ్ రెడ్డి, బిఆర్ఎస్ పార్టీ నాయకులు కార్యకర్తలు పెద్ద ఎత్తున సందర్శించి కుటుంబసభ్యులకు ధైర్యం చెప్పారు. మృతుడు మధు గతంలో చనిపోయిన ఒంటెద్దు వెంకన్న హత్య కేసులో ప్రధాన సాక్షిగా ఉన్నాడు.

### మధు హత్య కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యం
### మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి

చింతలపాటి మధు హత్య ఘటనపై మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి తీవ్రఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వ ఆసుపత్రిలో మధు మృతదేహానికి నివాళులర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించిన అనంతరం ఆయన మీడియాతో మాట్లా డారు. మధు హత్య పూర్తిగా కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యమని, ఈ ఘటనలో పోలీసుల పాత్రపై కూడా అనుమానాలు ఉన్నాయని ఆరో పించారు.

### మధు హత్య కేసును సీరియస్‌గా తీసుకున్నాం : జిల్లా ఎస్పీ నరసింహా

సూర్యాపేట మండలం ఎర్కారం గ్రామానికి చెందిన చింతలపాటి మధు మృతదేహాన్ని ఏరియా ఆసుపత్రిలో జిల్లా ఎస్పీ కె. నరసింహ సందర్శించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ, మధు కనిపించడం లేదని ఆయన భార్య మోనిక టూ టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో వెంటనే కేసు నమోదు చేసి డీఎస్పీ ప్రసన్నకుమార్ ఆధ్వర్యంలో ప్రత్యేక బృందాలతో గాలింపు చేపట్టామని తెలిపారు.యల్కారం స్టేజి సమీపంలోని కల్వర్టు కింద గోనెసంచిలో మృతదేహాన్ని గుర్తించి, కుటుంబ సభ్యులతో ధృవీకరించిన అనంతరం హత్య కేసుగా నమోదు చేసినట్లు చెప్పారు. ఈ కేసును అత్యంత తీవ్రంగా పరిగణిస్తున్నామని, ఇప్పటికే ఐదు ప్రత్యేక బృందాలను రంగంలోకి దింపి సాంకేతిక ఆధారాలతో దర్యాప్తు కొనసాగిస్తున్నామని వెల్లడించారు.

# తెలంగాణ యాదగిరిగుట్ట అభివృద్ధికి రూ. 100 కోట్లు

### వేద పాఠశాల, దీక్షాపాల మండపం నిర్మాణాలకు శ్రీకారం
### కంచి కామకోటి పీఠాధిపతి సమక్షంలో వైభవంగా పూజలు
### హైఅలర్ట్, భారీ పోలీస్ బందోబస్తు

**యాదాద్రి భువనగిరి బ్యూరో, యాదగిరిగుట్ట, మే 23 ప్రభాతవార్త :** ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి శనివారం యాదగిరిగుట్టలోని శ్రీలక్ష్మీ నరసింహస్వామి దేవస్థానంలో అట్టహాసంగా నిర్వహించిన భూమి పూజ కార్యక్రమంలో పాల్గొని రూ.100 కోట్ల వ్యయంతో చేపట్టనున్న పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. వేద పాఠశాల, దీక్షాపాల మండపం, వాయువ్య దిశలో షెడ్లు, మెట్ల మార్గం పైకప్పు నిర్మాణం తదితర పనులకు సంబంధించి జరిగిన ఈ కార్యక్రమం ఆధ్యాత్మిక వైభవం, అధికారిక హంగులతో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. సిఎం రాక నేపథ్యంలో యాదగిరిగుట్ట మొత్తం ఉదయం నుంచే పోలీస్ ఆధీనంలోకి వెళ్లింది. ఉదయం 6.30 గంటల నుంచే భారీ సంఖ్యలో భద్రతా సిబ్బంది వైకుంఠద్వారం, పాత బస్టాండ్, తులసి కాటేజీ, కొండపైన టెంపుల్‌సిటీ, కొత్త బస్టాండ్, వాహన పార్కింగ్ ప్రాంతాలు, రింగ్‌రోడ్డు తదితర ప్రాంతాలను తమ నియంత్రణలోకి తీసుకున్నారు. ఉదయం 7 గంటల నుంచే యాదగిరి గుట్టలో హైఅలర్ట్ ప్రకటించి ప్రతి వాహనం, ప్రతివ్యక్తిని క్షుణ్ణంగా తనిఖీ చేశారు. సీఎం హెలి కాప్టర్ కొండపై హెలిప్యాడ్ వద్ద దిగుతారని భావించిన అధికారులు, భద్రతా సిబ్బంది ముందస్తు ఏర్పాట్లు చేశారు. అయితే సీఎం రేవంత్ రెడ్డి నేరుగా టెంపుల్‌సిటీకి చేరుకోవడంతో అధికారులు ఒక్కసారిగా అప్రమత్తమయ్యారు. కొండపై ఉన్న అధికారులు హుటాహుటిన టెంపుల్ సిటీకి చేరుకుని సిఎంకు ఘనస్వాగతం పలికారు. కొద్దిసేపు హెలిపాడ్ వద్దనే నిరీక్షించిన సిఎం అనంతరం భూమిపూజ జరిగే ప్రాంతానికి చేరుకున్నారు. భూమిపూజ కార్యక్రమం కోసం దేవస్థానం అధికారులు విస్తృత ఏర్పాట్లు చేశారు. 200 మంది కూర్చునేలా భారీ షెడ్డును నిర్మించి, వీఐపీలు, ప్రజాప్రతినిధులు, రాజకీయ నాయ కులు, భక్తులు, సామాన్య ప్రజల కోసం ప్రత్యేక గ్యాలరీలను ఏర్పాటు చేశారు.

ఎండ తీవ్రతను దృష్టిలో ఉంచుకుని తాగునీరు, కూర్చునే సదుపాయాలు, వైద్యసహాయం తదితర ఏర్పాట్లు చేశారు. ఉదయం నుంచే వేదపండితులు చతుర్వేద పారాయణాలతో ఆధ్యాత్మిక వాతా వరణాన్ని సృష్టించారు. వేదఘోషల మధ్య సిఎం రేవంత్‌రెడ్డి కార్య క్రమ ప్రాంగణానికి చేరుకోగా భక్తులు, ప్రజాప్రతినిధులు హర్షధ్వా నాలతో స్వాగతం పలికారు. ఉదయం 9 గంటల 37 నిమిషాలకు కర్కాటక లగ్న పుష్కరాంశ సుముహూర్తంలో భూమిపూజ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. సిఎం రేవంత్‌రెడ్డి, మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి సాంప్రదాయ దుస్తుల్లో పాల్గొనడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఈ కార్యక్రమంలో దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, డిప్యూటీ ఛైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, ఎంపిలు వేం నరేందర్‌రెడ్డి, చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య, భువనగిరి శాసనసభ్యుడు కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి, తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేలు, నకిరేకల్ శాసనసభ్యుడు వేముల వీరేశం, ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం, సిఎంఒ కార్యదర్శి శ్రీనివాసరాజు, దేవదాయ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజ రామ య్యర్, దేవాదాయ కమిషనర్ ఎం.హనుమంతరావు, జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి, ఎస్పీ అక్షాంశ్‌యాదవ్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కర్‌రావు, రెవెన్యూ అదనపు కలెక్టర్ వెంకారెడ్డి ఉన్నతాధి కారులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు. భూమిపూజ కార్యక్రమానికి విజయేంద్ర సరస్వతి స్వామీజీ ప్రత్యేకంగా హాజరై వేదమంత్రో చ్ఛారణల నడుమ పూజలు నిర్వహించారు. కంచి కామకోటి పీఠానికి చెందిన 200 మంది విద్యార్థులు వేదపారా యణాలతో కార్యక్రమానికి ప్రత్యేక ఆధ్యాత్మిక శోభను తీసుకు వచ్చారు. గణపతి పూజ, కలశ స్థాపన, శంకుస్థాపన, నవగ్రహ పూజలు మంగళవాయిద్యాల నడుమ గంటన్నరపాటు వైభవం గా సాగాయి. సిఎం రాకకు ముందుగానే భూమిపూజ జరిగే ప్రాంతంలో రెండు అడుగుల లోతువరకు తవ్వకాలు పూర్తిచేసి పూజాకార్యక్రమాలకు సిద్ధం చేశారు. అనంతరం చేపట్టనున్న నాలుగు ప్రధాన నిర్మాణాలకు సంబంధించి ప్రత్యేక శిలాఫలకాలను ఏర్పాటుచేశారు.

వాటికి విజయేంద్ర సరస్వతి స్వామీజీ చేతుల మీదుగా తిలకందిద్ది ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమం ముగిసిన అనంతరం సిఎం రేవంత్‌రెడ్డి ఆలయ అభివృద్ధి పనులపై అధికారులతో సమీక్ష నిర్వహించినట్లు సమాచారం. యాదగిరిగుట్టను దేశవ్యాప్తంగా ఆధ్యాత్మిక పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దే దిశగా ప్రభుత్వం కట్టుబడి ఉందని అధికారులు పేర్కొన్నారు. సిఎం పర్యటన నేపథ్యంలో యాదగిరిగుట్ట పరిసర ప్రాంతాల్లో ట్రాఫిక్ ఆంక్షలు అమలుచేయడంతో కొంతసేపు భక్తులకు ఇబ్బందులు ఎదురైనప్పటికీ, పోలీస్ శాఖ సమన్వయంతో పరిస్థితిని అదుపులో ఉంచింది.

మొత్తం కార్యక్రమం ఆధ్యాత్మిక, రాజకీయ, అధికారిక హంగులతో ఘనంగా ముగిసింది.



శనివారం యాదగిరిగుట్టలో వేదపాఠశాలకు శంకుస్థాపన దృశ్యం, చిత్రంలో కంచి పీఠాధిపతి విజయేంద్ర సరస్వతీస్వామి, తెలంగాణ సిఎం రేవంత్, మంత్రులు కోమటిరెడ్డి, కొండా సురేఖ

# యాదాద్రిలో హెలిపాడ్ గందరగోళంతో
# అధికార యంత్రాంగం పరుగులు

### కొండ కింద వేచిచూసిన అధికారులు
### గుట్టపై దిగిన సిఎం హెలికాప్టర్

**యాదాద్రి జిల్లా బ్యూరో, ప్రభాతవార్త:** యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయానికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పర్యటన సందర్భంగా చోటుచేసుకున్న సమన్వయలోపం జిల్లా వ్యాప్తంగా తీవ్ర చర్చనీ యాంశంగా మారింది. ముఖ్యమంత్రి పర్యటన కోసం భారీ స్థాయిలో ఏర్పాట్లు చేసినప్పటికీ, హెలిపాడ్ విషయంలో స్పష్టమైన సమాచారం అధికారులకు అందకపోవడంతో యాదాద్రిలో కొంతసేపు హైటెన్షన్ వాతావరణం నెలకొంది. ముఖ్యమంత్రి హెలికాప్టర్ ఎక్కడ దిగుతుందనే విషయంలో చివరి నిమిషంలో ఏర్పడిన గందరగోళం అధికార యంత్రాంగాన్ని పరుగులు పెట్టిం చింది. ముందస్తు ఏర్పాట్లు భారీగా.. సీఎం పర్యటన నేపథ్యంలో జిల్లా యంత్రాంగం రెండు రోజుల ముందుగానే విస్తృత ఏర్పాట్లు చేపట్టింది. కొండ కింద ఉన్న హెలిపాడ్ వద్ద భద్రతా తనిఖీలు నిర్వహించి, సీఎం కాన్వాయ్ కోసం ప్రత్యేక రూట్ మ్యాప్ సిద్ధం చేశారు. జిల్లా కలెక్టర్, ఎస్పీ పర్యవేక్షణలో వందలాది మంది పోలీసులతో బందోబస్తు ఏర్పాటు చేశారు. దేవస్థానం అధికారులు, రెవెన్యూ, పోలీసు, ఆర్టీసీ, విద్యుత్, వైద్య శాఖల అధికారులు అప్రమత్తంగా విధుల్లో నిమగ్నమయ్యారు. సీఎం రాక సందర్భంగా స్థానిక ప్రజాప్రతినిధులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు, అధికార పార్టీ నాయకులు కూడా కొండ కింద హెలిపాడ్ వద్దకు చేరుకుని స్వాగతం పలికేందుకు సిద్ధమయ్యారు. ప్రోటోకాల్ ప్రకారం సీఎం హెలికాప్టర్ అక్కడ దిగుతుందని అందరికీ సమాచారం అందడంతో అన్ని ఏర్పాట్లు అదే కేంద్రంగా జరిగాయి.

**ఒక్కసారిగా మారిన పరిస్థితి..**

అయితే నిర్ణీత సమయానికి యాదాద్రికి చేరుకున్న సీఎం హెలికాప్టర్ కొండ కింద కాకుండా టెంపుల్ సిటీపై ఉన్న హెలిపాడ్ వైపు మళ్లింది. కొద్ది సేపటికే అక్కడ ల్యాండ్ కావడంతో అధికారులు ఒక్కసారిగా షాక్‌కు గురయ్యారు. సీఎం హెలికాప్టర్ దిశ మారిందనే సమాచారం మొదట భద్రతా సిబ్బందికి కూడా స్పష్టంగా అందలేదని తెలిసింది. హెలికాప్టర్ పైభాగంలో దిగిందన్న విషయం తెలిసిన వెంటనే కొండ కింద ఉన్న అధికారులు పరస్పరం ఫోన్లు చేసుకుంటూ అసలు పరిస్థితిని తెలుసుకునే ప్రయత్నం చేశారు. కొంతసేపు సీఎం ఎక్కడ దిగారు..? అన్న సందిగ్ధ పరిస్థితి నెలకొంది. కొందరు అధికారులు హెలికాప్టర్ తిరిగి కిందకు వస్తుందని భావించగా, మరికొందరు పైభాగానికి వెళ్లేందుకు హుటాహుటిన ఏర్పాట్లు చేసినట్లు సమాచారం.

**హెలికాప్టర్‌లోనే సిఎం వేచి..**

టెంపుల్ సిటీ హెలిపాడ్ వద్ద సీఎంకు స్వాగతం పలికేందుకు ఎవరూ సిద్ధంగా లేకపోవడం పరిస్థితిని మరింత ఇబ్బందికరంగా మార్చింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఆయన వెంట వచ్చిన మంత్రులు, ఉన్నతాధికారులు దాదాపు పది నిమిషాలకు పైగా హెలికాప్టర్‌లోనే వేచి ఉండాల్సి వచ్చినట్లు సమాచారం. విషయం తెలుసుకున్న వెంటనే అధికారులు టెంపుల్ సిటీ వైపు పరుగులు తీశారు. కొండ కింద ఉన్న కాన్వాయ్ వాహనాలు, భద్రతా బలగాలు వేగంగా పైభాగానికి చేరుకున్నాయి. తర్వాత సీఎంకు అధికారిక స్వాగతం పలికి ఆలయ కార్యక్రమాలను ప్రారంభించారు.

# ఓటర్లను అక్రమంగా తొలగిస్తే అడ్డుకొంటాం

### కేబినెట్ విస్తరణలో నా జోక్యం ఉండదు
### సిఎంతో నేను కలిసి పనిచేయడం కొందరికి ఇష్టం లేదు
### మీడియాతో 'ఇష్టాగోష్టి'లో పిసిసి అధ్యక్షుడు మహేష్‌కుమార్

**హైదరాబాద్, మే 23, ప్రభాతవార్త:** ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణలో ఓటర్లను అక్రమంగా తొల గించడానికి ఏదైనా కుట్రలు చేస్తే అడ్డు కొంటామని ప్రతి వయోజనుడికి ఓటు హక్కును కలిగి ఉండేలా చూసేందుకు కాంగ్రెస్ కార్యకర్తను క్షేత్రస్థాయిలో అప్రమత్తతో ఉంటారని పిసిసి అధ్యక్షుడు బొమ్మ మహేష్‌కుమార్ అన్నారు.

గాంధీభవన్‌లో శని వారం విలేఖరులతో ఇష్టాగోష్టిగా ఆయన మాట్లా డుతూ పశ్చిమ బెంగాల్‌లో 31లక్షల ఓట్లు చేర్చి 93 లక్షల ఓట్లు తొలగించారనీ ఇటీవల ఆ రాష్ట్రంలో 30లక్షల ఓట్ల తేడాతో మమతబెనర్జీ పార్టీ ఓడిందని తెలిపారు. ఫ్యూచర్ సిటీ దేశానికే దిక్సూచిగా మారుతుందనీ బిఆర్ఎస్‌కు దూరదృష్టి లేదనీ ఆరోపించారు.

హైదరాబాద్ పరిధిని పెంచ లేదు సీటీ విస్తరిస్తే అభివృద్ధి జరుగుతుందనీ అన్నారు. హైదరాబాద్ అభివృద్ధి అవసరం లేదని హరీశ్‌రావు అంటున్నారా? అని ప్రశ్నించారు. తెలంగాణపై కేంద్రం సవితితల్లి ప్రేమ చూపి స్తోందనీ స్టాలిన్ లాగే మేము గత ప్రభుత్వ పథకాలను కొనసాగిస్తున్నామని తెలిపారు. వర్కింగ్ ప్రెసిడెంట్ల పేర్లను ఎఐసిసికి పంపించాం త్వరలోనే వర్కింగ్ ప్రెసిడెంట్లను ప్రకటిస్తామని తెలిపారు. కేబినెట్ విస్తరణ సీఎం చూసుకుం టారని విస్తరణలో నా జోక్యం ఏముండదనీ తెలిపారు. పిసిసి అధ్యక్షుడి మార్పు విషయంలో అధిష్ఠానానిదే తుది నిర్ణయం నేను సరైన వ్యక్తిని అనే నాకు పదవి ఇచ్చారనీ తెలి పారు. ఎఐసిసి దృష్టిలో నేను బెస్ట్, కెసి వేణుగోపాల్ నన్ను అనేకసార్లు అభినందిం చారని గుర్తించారు. నేను, సిఎం కలిసి పనిచేయడం కొందరికి మింగు డుపడడం లేదనీ ఆయన ఆవేదన చెందారు. నా పనితీరుని బేరీజు వేయాల్సిం ది మా ముఖ్య మంత్రి, నా కార్యకర్తలు అని అన్నారు.

## చంచల్‌గూడ జైలుకు డిప్యూటీ కలెక్టర్ వంశీమోహన్

**హైదరాబాద్, మే 23, ప్రభాతవార్త:** ఆదాయానికి మించి ఆస్తులు కలిగిన కేసులో ఎసిబికి పట్టుబడ్డ మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్ (అర్బన్ లాండ్ సీలింగ్) మర్రి వంశీమోహన్‌ను శనివారం ఉదయం రిమాండుకు తరలించారు. శుక్రవారం నాడు వంశీమోహన్ ను అక్రమాస్తుల కేసులో ఎసిబి అరెస్టు చేయడం తెలిసిందే. రాత్రి బాగా పొద్దుపోయే వరకు కొనసాగిన సోదాల్లో ఆరు కోట్ల 22 లక్షల రూపా యలకు పైగా ఆస్తులు వెలుగు చూడడం విదితమే. బహిరంగ మార్కెట్లో దీని విలువ 200 కోట్ల రూపాయల వరకు వుంటుందని అధికారులు చెబుతున్నారు. ఈ కేసులో శనివారం ఉదయం వంశీమోహన్‌ను ఎసిబి అధికారులు నాంపల్లి ఎసిబి కోర్టుల న్యాయమూర్తి ఇంట్లో హాజరు పర చగా నిందితుడికి రెండు వారాల రిమాండు విధించారు.

## 28 నుండి చర్లపల్లి-తిరుపతి మధ్య కొత్త ఎక్స్‌ప్రెస్ రైలు
### రెగ్యులర్ వీక్లీ ఎక్స్‌ప్రెస్ ప్రారంభిస్తున్నట్లు ప్రకటించిన దక్షిణ మధ్యరైల్వే

**హైదరాబాద్ మే 23, ప్రభాతవార్త :** హైదరాబాద్ నుంచి తిరుమల శ్రీవెంకటేశ్వ రస్వామి దర్శనానికి వెళ్లే భక్తులకు రైల్వే శాఖ శుభవార్త చెప్పింది. చర్లపల్లి-తిరుపతి మధ్య రెగ్యులర్ వీక్లీ ఎక్స్‌ప్రెస్ రైలును కొత్తగా ప్రారంభిస్తున్నట్లు దక్షి ణ మధ్య రైల్వే ప్రకటించింది. ఈ కొత్త రైలు నల్గొండ-కడప మార్గంలో ప్రయాణిస్తుందని తెలిపింది. దీంతో ఈ మార్గంలో ప్రయాణించే వారికి తిరుపతి చేరుకోవడం సులభమ వుతుంది. ఇప్పటివరకు హైదరాబాద్ నుంచి తిరుపతికి పద్మావతి ఎక్స్‌ప్రెస్ వరంగల్-విజయవాడ మార్గంలో, వెంకటాద్రి ఎక్స్‌ప్రెస్ మహబూబ్‌నగర్-గుత్తి మార్గంలో, నారాయణాద్రి ఎక్స్‌ప్రెస్, వందే భారత్ రైళ్లు నల్గొండ-గుంటూరు మార్గంలో నడుస్తున్నాయి. ఇప్పుడు ప్రవేశపెట్టిన కొత్తరైలు ప్రత్యామ్నాయ మార్గంలో అందుబాటులోకి రానుండటం గమనార్హం. ఈ సర్వీస్ ఈ నెల 28న ప్రారంభం కా నుంది. ఇప్పటివరకు చర్లపల్లి-తిరుపతి మార్గంలో ప్రత్యేక రైలుగా నడిచిన సర్వీసును ఇకనుంచి రెగ్యులర్ వీక్లీ ఎక్స్‌ప్రెస్‌గా కొన సాగిస్తారు. తిరుపతి నుంచి గురువారం సాయంత్రం నాలుగున్నర గంటలకు బయలుదేరి రేణిగుంట, రాజంపేట, కడప, ఎర్రగుంట్ల, ప్రొద్దుటూరు, నంద్యాల, గిద్ద లూరు, మార్కాపురం రోడ్, పిడుగురాళ్ల, నడికుడి, మిర్యాలగూడ, నల్గొండ మీదుగా మరుసటిరోజు ఉదయం 8.25 గంటలకు చర్లపల్లికి చేరుకుం టుంది.

24-5Pg5.qxd:24-5Pg5.qxd 1/1/02 6:13 AM Page 1



# ఇరాన్‌పై మళ్లీ అమెరికా దాడి!




## దౌత్యయత్నాలు విఫలమైతే సైనిక చర్యకు ట్రంప్ ప్రణాళిక

**వాషింగ్టన్, మే 23:** అమెరికా-ఇరాన్ మధ్య శాంతి ఒప్పందానికి సంబంధించి ఏ క్షణంలోనైనా ప్రకటన రావొచ్చని వార్తలు వస్తుండగా మరోవైపు ఇరాన్‌పై మరోసారి దాడులకు అమెరికా సన్నద్ధమవుతుందని నివేదికలు వెలువడుతున్నాయి. చివరి నిమిషంలో దౌత్య ప్రయత్నాలు విఫలమైతే సైనిక చర్యకు దిగే విషయాన్ని అధ్యక్షుడు ట్రంప్ తీవ్రంగా పరిశీలిస్తున్నట్లు తెలుస్తోంది. ఈ మేరకు అమెరికా అధికారులను ఉటంకిస్తూ అక్కడి మీడియాలో కథనాలు వస్తున్నాయి. ఉపాధ్యక్షుడు జెడి వాన్స్, రక్షణమంత్రి పీట్ హెగ్సెత్‌తోపాటు కీలక అధికారులతో ట్రంప్ శుక్రవారం ఉన్నతస్థాయి సమావేశాన్ని నిర్వహించారు. ఇందులో ఇరాన్‌పై తదుపరి తీసుకోవాల్సిన చర్యల గురించి అధ్యక్షుడు వారితో చర్చించినట్లు తెలుస్తోంది. ఇరాన్‌తో చర్చలు విఫలమైతే వెంటనే సైన్యాన్ని రంగంలోకి దించే విషయం గురించి వారు మాట్లాడుకున్నారని అధికార వర్గాలు తెలిపాయి. అయితే, దాడులకు సంబంధించి ఇంకా తుది నిర్ణయం తీసుకోలేదని వెల్లడించాయి. ఈ సమావేశం తర్వాత వైట్‌హౌస్ అధ్యక్షుడి కార్యక్రమాలకు సంబంధించి కీలక మార్పులు చేసినట్లు తెలుస్తోంది. మెమోరియల్ డే సందర్భంగా న్యూజెర్సీకి వెళ్లాలని ట్రంప్ తొలుత నిర్ణయించుకున్నారు. అయితే, దాన్ని రద్దు చేసుకున్న ఆయన వైట్‌హౌస్‌లోనే ఉండనున్నారు. ఇక, అమెరికాకు చెందిన పలువురు సైనిక, నిఘా అధికారులు కూడా తమ ప్రణాళికలను రద్దు చేసుకున్నారు.

**నా కుమారుడి పెళ్లి వెళ్లడం లేదు : ట్రంప్**

ఇరాన్‌పై దాడులకు అమెరికా సన్నద్ధమవుతుందనే వార్తల నేపథ్యంలో ట్రంప్ కీలక ప్రకటన చేశారు. తన కుమారుడు డొనాల్డ్ ట్రంప్ జూనియర్ వివాహానికి హాజరుకావడం లేదన్నారు. ట్రంప్ జూనియర్, బెట్టినా ఆండర్సన్ పెళ్లి చూడాలని తనకు ఎంతో ఆశగా ఉందంటూ అధ్యక్షుడు ట్రూత్ సోషల్‌లో పోస్టు పెట్టారు. అయితే, ప్రభుత్వ కార్యక్రమాల వల్ల తాను అక్కడికి వెళ్లలేకపోతున్నానని తెలిపారు. ఈ కీలక సమయంలో తాను వైట్‌హౌస్‌లోనే ఉండటం అత్యంత ముఖ్యమని భావిస్తున్నట్లు వెల్లడించారు.



## సింధుజలాల వినియోగానికి రూ.22వేల కోట్లతో రెండు భారీప్రాజెక్టులు

**శ్రీనగర్, మే 23:** పహల్గాంవ్ ఉగ్రదాడి అనంతరం ఆపరేషన్‌సింధూర్‌చేపట్టిన భారత్ సింధుజలాల నిలిపివేతను కూడా అమలుచేసి పాక్‌ను చిక్కుల్లోకి నెట్టినసంగతి తెలిసిందే. పహల్గామ్ ఉగ్రదాడికి ప్రతీకారంగా భారత్ పాకిస్థాన్ తో ఉన్న 1960 నాటి సింధు జలాల ఒప్పందాన్ని భారత్ తాత్కాలికంగా నిలిపివేసింది. పాకిస్థాన్ లో ఉగ్రవాదం పూర్తిగా అణిచివేసేంత వరకూ ఈ ఒప్పందాన్ని పునరుద్ధరించలేమని భారత్ స్పష్టం చేసింది. పశ్చిమ నదులపై ముఖ్యంగా చీనాబ్ నదిపై హక్కులను పూర్తిగా వినియోగించుకోవడానికి భారత్ భారీ ప్రాజెక్టులను వేగవంతం చేసింది. కేంద్ర ప్రభుత్వం జమ్మూ కాశ్మీర్ లోని చీనాబ్ నదిపై సుమారు రూ. 3,200 కోట్ల అంచనా వ్యయంతో నిర్మించ తలపెట్టిన దుల్హస్తీ స్టేజ్2 జలవిద్యుత్ ప్రాజెక్ట్‌కు పర్యావరణ అనుమతులు లభించాయి. ఇది గతంలో ఉన్న 390 మెగావాట్ల దుల్హస్తీ స్టేజ్ 1 ప్రాజెక్ట్ కు పొడిగింపుగాఉంది. చీనాబ్ నదిపై అత్యంత కీలకమైన, దశాబ్దాలుగా పెండింగ్ లో ఉన్న 1,856మెగావాట్ల సవాల్ కోట్ ప్రాజెక్ట్ పనులకు కేంద్రం వేగవంతం చేసింది. ఈ మేరకు నేషనల్ హైడ్రో ఎలక్ట్రిక్ పవర్ కార్పొరేషన్ ఈ డ్యామ్, టన్నెల్స్ నిర్మాణానికి అంతర్జాతీయ టెండర్లను ఆహ్వానించింది. ఈమొత్తం ప్రాజెక్ట్ వ్యయం సుమారు రూ.22,700 కోట్లు ఉంటుందని అంచనా. ఇక ప్రస్తుతం సింధూ నది జలాలా ఒప్పందం నిలిపివేత నేపథ్యంలో దశాబ్దాలుగా పాకిస్థాన్ అభ్యంతరాల వల్ల ఆగిపోయిన సవాల్ కోట్, పాకల్ దుల్, రాతల్, కిరు వంటి మెగా ప్రాజెక్టులను వేగంగా పూర్తి చేసి జమ్మూ కాశ్మీర్ ఇంధన అవసరాలను తీర్చాలని భారత్ నిర్ణయం తీసుకుంది.

# పశ్చిమాసియాలో ముసిరిన యుద్ధమేఘాలు

## గగనతలం మూసివేసిన ఇరాన్



**టెహ్రాన్, మే 23:** అమెరికా, ఇరాన్ మధ్య ఉద్రిక్తతలు మరోసారి తీవ్ర స్థాయికి చేరాయి. ఇరాన్‌పై కొత్త దాడులు చేసేందుకు అమెరికా సన్నద్ధమవుతోందన్న వార్తల నేపథ్యంలో ఇరు దేశాల మధ్య యుద్ధ వాతావరణం నెలకొంది. ఈ పరిణామాల నేపథ్యంలో ముందుజాగ్రత్త చర్యగా ఇరాన్ తమ గగనతలాన్ని పూర్తిగా మూసివేస్తున్నట్లు ప్రకటించింది. ఇరు దేశాల మధ్య శాంతి చర్చలు నిలిచిపోవడంతో పరిస్థితి మరింత సంక్లిష్టంగా మారింది. రాబోయే 24 గంటల్లో దౌత్యపరంగా కీలక పురోగతి లేకపోతే ఇరాన్‌పై భారీ సైనిక చర్యలకు ఆమోదం తెలిపేందుకు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మొగ్గు చూపుతున్నారు. దాడులపై ఇంకా తుది నిర్ణయం తీసుకోలేదని కూడా తెలుస్తోంది. ఈ ఉద్రిక్తతల కారణంగా అమెరికా సైనిక, నిఘా వర్గాలకు చెందిన పలువురు అధికారులు తమ మెమోరియల్ డే వారాంతపు ప్రణాళికలను రద్దు చేసుకున్నట్లు తెలిసింది. శనివారం పరిస్థితులు తీవ్రరూపం దాల్చడంతో న్యూజెర్సీలో తన వారాంతపు పర్యటనను రద్దు చేసుకున్న ట్రంప్ హుటాహుటిన వాషింగ్టన్‌కు తిరిగి వచ్చారు. ఈ సంక్షోభం తీవ్రతకు అద్దం పట్టేలా తన కుమారుడు డొనాల్డ్ ట్రంప్ జూనియర్ వివాహానికి కూడా తాను హాజరుకాలేనని ట్రంప్ స్వయంగా ప్రకటించారు. ప్రభుత్వానికి సంబంధించిన పరిస్థితుల దృష్ట్యా నేను వాషింగ్టన్‌లోనే ఉండటం ముఖ్యమని ఆయన తన ట్రూత్ సోషల్ ఖాతాలో పోస్ట్ చేశారు. ఇది ప్రస్తుతం నెలకొన్న గంభీర స్థితిని తెలియజేస్తోంది. గత ఏప్రిల్‌లో ట్రంప్ ప్రకటించిన తాత్కాలిక కాల్పుల విరమణ ఒప్పందం ఇప్పటివరకు కొనసాగినప్పటికీ, ఇరు దేశాల మధ్య చర్చలు ముందుకు సాగడం లేదు. ఇరాన్ శుద్ధి చేసిన యురేనియం నిల్వలపై నెలకొన్న ప్రతిష్టంభనే దీనికి ప్రధాన కారణంగా కనిపిస్తోంది. ఇరాన్‌ను అణ్వాయుధం కలిగి ఉండటానికి అనుమతించబోమని, శుద్ధి చేసిన యురేనియం నిల్వలను దేశం విడిచి తరలించాలని అమెరికా పట్టుబడుతోంది. మరోవైపు తమ యురేనియం నిల్వలను విదేశాలకు తరలించే ప్రసక్తే లేదని ఇరాన్ స్పష్టం చేస్తోంది. ఈ నేపథ్యంలో పశ్చిమాసియాలో మరోసారి యుద్ధ మేఘాలు కమ్ముకుంటున్నాయి.

# భారత్ పర్యాటకులకు థాయిలాండ్ వీసా ఆన్ అరైవల్



**బ్యాంకాక్, మే 23:** భారతీయ పర్యాటకులకు అత్యంత ఇష్టమైన విహారయాత్ర గమ్యస్థానాల్లో ఒకటైన థాయ్‌లాండ్, తన వీసా నిబంధనల్లో సంచలన మార్పులు చేసింది. పర్యాటకాన్ని ప్రోత్స హించేందుకు గతంలో ప్రవేశపెట్టిన 60 రోజుల ఉచిత వీసా పథకాన్ని భారత్ సహా 93 దేశాలకు రద్దు చేస్తున్నట్లు ప్రకటించింది. వీసా కేటగిరీలను క్రమబద్ధీకరించి, సులభతరం చేయడంలో భాగంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు థాయ్‌లాండ్ ప్రభుత్వం స్పష్టం చేసింది. థాయ్‌లాండ్ విదేశాంగ మంత్రిత్వ శాఖ పరిధిలోని డిపార్ట్‌మెంట్ ఆఫ్ కాన్సులర్ అఫైర్స్ ప్రకారం ఈ నెల 19న జరిగిన కేబినెట్ సమావేశంలో ఈ కొత్త వీసా విధానాలకు ఆమోదం లభించింది. ఒక దేశం, ఒక వీసా మినహాయింపు హక్కుఅనే కొత్త మార్గదర్శక సూత్రం ఆధారంగా ఈ మార్పులు చేసినట్లు ప్రభుత్వం తెలిపింది. ఈ కొత్త నిబంధనలు రాయల్ గెజిట్‌లో ప్రచురించిన 15 రోజుల తర్వాత అమల్లోకి వస్తాయి. ఈ మార్పులతో భారత పర్యాటకులకు ఇప్పటివరకు లభించిన వీసా రహిత ప్రవేశ సౌకర్యం దూరమవుతుంది. జులై 2024లో భారత్‌కు 60 రోజుల ఉచిత వీసా పథకాన్ని థాయ్‌లాండ్ వర్తింపజేసింది. దీని ద్వారా ఎక్కువ రోజులు విహారయాత్రకు ప్లాన్ చేసుకునే వారికి థాయ్‌లాండ్ మరింత ఆకర్షణీయంగా మారింది. తాజా నిబంధనల ప్రకారం, భారతదేశాన్ని వీసా ఆన్ అరైవల్ (వీఓఏ) కేటగిరీకి మార్చారు. ఇకపై భారత పర్యాటకులు థాయ్‌లాండ్ చేరుకున్నాక అక్కడి ఇమ్మిగ్రేషన్ చెక్‌పాయింట్ల వద్ద అవసరమైన పత్రాలు సమర్పించి వీసా పొందాల్సి ఉంటుంది. ఈ కేటగిరీ కింద కేవలం 15 రోజులు మాత్రమే దేశంలో ఉండేందుకు అనుమతి లభిస్తుంది. సుదీర్ఘ సెలవులకు బదులుగా చిన్న పర్యటనలకు మాత్రమే ఇది అనుకూలంగా ఉంటుంది. మొదట పర్యాటకాన్ని, ఆర్థిక వ్యవస్థను గాడిన పెట్టేందుకు 60 రోజుల ఉచిత వీసా పథకాన్ని ప్రవేశపెట్టారు. ఈ విధానం వల్ల భద్రతాపరమైన ఆందోళనలు పెరిగాయని థాయ్‌లాండ్ ప్రభుత్వం గుర్తించింది. ముఖ్యంగా అక్రమ ఉపాధి, బినామీ వ్యాపారాలు, అంత ర్జాతీయ నేరాలు పెరిగాయనే ఆరోపణలు వెల్లు వెత్తాయి. పర్యాటకుల సంఖ్య కంటే నాణ్యమైన పర్యాటకులను ఆకర్షించడంపైనే ఇప్పుడు దృష్టి సారిస్తున్నామని, ఆర్థిక ప్రయోజనాలు, దేశ భద్ర తను సమన్వయం చేయడమే తమ లక్ష్యమని థాయ్‌లాండ్ పర్యాటక, క్రీడల శాఖ మంత్రి సురసక్ ఫంచరోయెన్‌వొరాకుల్ గతంలోనే సూచనప్రాయంగా తెలిపారు. వీసా ఆన్ అరైవల్ (వీఓఏ) కేవలం 4 దేశాలకు అజర్‌బైజాన్, బెలారస్, సెర్బియా, భారత్‌లకే పరిమితం. వీరికి 15 రోజుల బసకు అనుమతి ఉంటుంది.

# తమిళనాడులో పదేళ్ల బాలిక కిడ్నాప్, హత్య

### నేరాలు పెరిగాయంటూ డిఎంకె ధ్వజం

### నిందితులను అరెస్టు చేశాం, కఠిన చర్యలు తప్పవు: సిఎం విజయ్



**కోయంబత్తూరు, మే 23:** తమిళనాడులోని కోయంబత్తూరు నగరంలోని సూలూరు ఏరియాలో కిరాణా సామాన్లు తేవడానికి వెళ్లిన పదేళ్ల బాలిక కిడ్నాప్‌కు గురైంది. ఆపై ఆ చిన్నారిని దుండగులు దారుణంగా హత్య చేశారు. చెరువు సమీపంలో మృతదేహం దొరికింది. ఈ ఘటనపై తమిళనాడు కొత్త సీఎం విజయ్ తీవ్రంగా స్పందించారు. ఇలాంటి అమానవీయ చర్యలను అస్సలు సహించబోమని స్పష్టం చేశారు. ఈ ఘోర ఘటన దిగ్భ్రాంతిని, వేదనను కలిగించింది. ఇలాంటి అమానవీయ నేరాలను సహించబోం. కుటుంబ సభ్యులకు నా సానుభూతి. ఈ కేసుకు సంబంధించి ఇద్దరు నిందితులను ఇప్పటికే అరెస్ట్ చేశారు. సమగ్రంగా విచారణ జరిపి తక్షణమే చార్జ్‌షీట్ దాఖలు చేయాలని పోలీసులను ఆదేశించాం. మహిళలు, పిల్లలపై ఇలాంటి ఘోరాలకు ఒడిగట్టే వారికి చట్టప్రకారం కఠిన శిక్ష పడేలా తమిళనాడు ప్రభుత్వం కచ్చితంగా చర్యలు తీసుకుంటుందని విజయ్ స్పందించారు. ఈ హత్య రాష్ట్రంలో పెద్ద రాజకీయ దుమారం రేపింది. కొత్త ప్రభుత్వంపై ప్రతిపక్ష డీఎంకే తీవ్ర విమర్శలు చేసింది. సీఎం విజయ్ పదవి చేపట్టిన 12 రోజుల్లోనే నేరాలు పెరిగాయని ఉదయనిధి స్టాలిన్ ఆరోపించారు. రాష్ట్రంలో శాంతిభద్రతలు క్షీణించాయని మండిపడ్డారు. మరోవైపు గత డీఎంకే ప్రభుత్వమే వ్యవస్థను నాశనం చేసిందని బీజేపీ విమర్శించింది. ఈ కేసులో కార్తీక్, మోహన్ రాజ్ అనే ఇద్దరు నిందితులను పోలీసులు అరెస్ట్ చేశారు. విచారణను వేగవంతం చేయడానికి తమిళనాడు డీజీపీ స్వయంగా కోయంబత్తూర్ వెళ్లారు. సీఎం నుంచి స్పష్టమైన హామీ వచ్చే వరకు మృతదేహాన్ని తీసుకోబోమని కుటుంబ సభ్యులు ఆందోళన చేశారు. దీంతో మంత్రులు, ఎమ్మెల్యేలు ఆసుపత్రికి వెళ్లి బాధితులకు న్యాయం చేస్తామని భరోసా ఇచ్చారు.

# ఉగ్రవాది అంత్యక్రియలకు టాప్ ఉగ్రవాదనేతలు హాజరు..

**ఇస్లామాబాద్, మే 23:** ఉగ్రవాదానికి తమ దేశం కేంద్రం కాదని పాకిస్థాన్ చెప్పే మాటలు మరో సారి నీటిమూటలయ్యాయి. ప్రపంచంలోనే మోస్ట్ వాంటెడ్ టెర్రరిస్టులకు పాకిస్థాన్ సురక్షితమైన అడ్డాగా మారిందన్న ఆరోపణలకు బలం చేకూరుస్తూ, ఇస్లామాబాద్‌లోనే ఓ కీలక పరిణామం చోటుచేసుకుంది. హత్యకు గురయిన ఓ ఉగ్రవాది అంత్యక్రియలకు అనేక మంది టాప్ టెర్రరిస్టులు బహిరంగంగా హాజరై, పాకిస్థాన్ అసలు స్వరూపాన్ని ప్రపంచానికి చూపించారు. నిషేధిత అల్‌బద్ర్ ఉగ్రవాద సంస్థకు చెందిన టాప్ కమాండర్, డాక్టర్ అనే కోడ్‌నేమ్‌తో పనిచేసిన అర్జుమంద్ గుల్జార్ దార్ అలియాస్ హంజా బుర్హాన్, పాక్ ఆక్రమిత కశ్మీర్‌లో గుర్తుతెలియని వ్యక్తుల కాల్పుల్లో మరణించాడు. శుక్రవారం అతని మృతదేహానికి ఇస్లామాబాద్‌లో అంత్యక్రియలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అమెరికాచే ఉగ్రవాదిగా ప్రకటించబడిన హిజ్బుల్ ముజాహిదీన్ చీఫ్ సయ్యద్ సలావుద్దీన్‌తో పాటు అల్ బద్ర్ చీఫ్ బఖ్త్ జమీన్ ఖాన్ వంటి కీలక ఉగ్రవాదులు హాజరయ్యారు. సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న ఫొటోలు, వీడియోలలో ఈ దృశ్యాలు స్పష్టంగా కనిపించాయి. ముఖ్యంగా బఖ్త్ జమీన్ ఖాన్ చుట్టూ ఏకే47 వంటి ఆధునిక ఆయుధాలతో ఉగ్రవాదులు కట్టుదిట్టమైన భద్రతా వలయాన్ని ఏర్పాటు చేయడం గమనార్హం. జమ్మూకశ్మీర్‌లోని పుల్వామా జిల్లా రత్నిపొరకు చెందిన బుర్హాన్, చట్టబద్ధమైన పత్రాలతో పాకిస్థాన్‌కు ప్రయాణించి అల్‌బద్ర్ సంస్థలో చేరాడు.

2019లో 40 మంది సీఆర్ పీఎఫ్ జవాన్లను పొట్టనపెట్టుకున్న పుల్వామా దాడిలో ఇతని పేరు తొలిసారిగా తెరపైకి వచ్చింది. కశ్మీర్‌లోని యువతను ఉగ్రవాదం వైపు మళ్లించడం, నియామకాలు చేపట్టడం, పాకిస్థాన్ నుంచి నిధులు సమకూర్చడంలో బుర్హాన్ కీలక పాత్ర పోషించాడని భారత భద్రతా ఏజెన్సీలు చెబుతున్నాయి. 2022లో భారత్ ఇతడిని ఉగ్రవాదిగా ప్రకటించింది.

## త్రిసూరులో ఏనుగు భీబత్సం: అనేక వాహనాలు ధ్వంసం



**త్రిస్సూర్, మే 23:** కేరళలోని త్రిస్సూర్‌లో ఒక దేవాలయంలో జరిగే ఉత్సవం కోసం తీసుకు వచ్చిన ఏనుగు కట్టడినుంచి తప్పించుకుని రెండు కిలోమీటర్లు పెరుగెత్తింది. అంతేకాకుండా అడ్డుగా ఉన్న అన్నింటిని కూల్చివేస్తూ విధ్వంసం సృష్టించింది. రెండుకిలోమీటర్లమేర పరుగులుపెట్టిన ఈ ఏనుగు వాహనాలు, ప్రహరీగోడలు, వాటి గేట్లు నివాసిత ప్రాంతాల్లో ఆస్తులను కూడా ధ్వంసంచేసింది. ఆలయవేడుకల కోసం శివమ్ లక్ష్మీ అయ్యప్పన్ అనే ఏనుగును కొల్లంనుంచి తీసుకునివచ్చారు. ఉదయం వేడుకలకు ముందే 9.15 గంటలకు చెంబుక్కవు టౌన్‌హాల్‌ప్రాంతంలో ఏనుగు భీభత్సం సృష్టించింది. ప్రతిరోజులాగా ఉదయం ఏనుగును స్నానంచేసేందుకు ఉపక్రమిస్తుండగా మావటిలనుంచి తప్పించుకుని ఒక్కసారిగా ఆవేశపూరితంగా మారింది. అక్కడినుంచి పరారవుతూ పార్కింగ్‌చేసి ఉన్న కార్లు, ఆటోరిక్షాలు, మోటారు సైకిళ్లను ధ్వంసంచేసి వాటిని తిరగబెడుతూ వెళ్లింది. చెంబుక్కవు పోస్టాఫీసు ఆవరణలో కూడా విధ్వంసం సృష్టించింది. చేవురు గాంధీనగర్ హౌసింగ్ కాలనీలో కూడా ప్రవేశించి నివాసితులను భయభ్రాంతులకు గురిచేసింది. ఎవ్వరికీ ప్రాణాపాయం లేనప్పటికీ ఏనుగు భారీ విధ్వంసం సృష్టించిందని, ఆస్తినష్టం రిగిందని అధికారులు చెపుతున్నారు. సంగీత అనే ఒక మహిళతోపాటు కారులోప్రయాణిస్తున్న ఒక బాలికకు కూడా ఏనుగుదాడిలో గాయాలయ్యాయి. పోలీసులు, అటవీ అధికారులు, ఏనుగును కట్టడిచేసే స్క్వాడ్ బృందసభ్యులు, స్థానిక అధికారులు స్పాట్‌కువెళ్లి సుదీర్ఘ కసరత్తులు తర్వాత ఏనుగును తమ అధీనంలోకి తీసుకున్నారు. కాళ్లకు చైన్లు వేయడంద్వారా ఏనుగు ఆవేశాన్ని కట్టడిచేసారు.



# నల్లకోటు న్యాయవాదుల్లో 40% మంది నకిలీలే!

### బార్ కౌన్సిల్ ఛైర్మన్ సిజెఐకి నివేదిక

**న్యూఢిల్లీ, మే 23:** దేశంలో నల్ల కోట్లు వేసుకుని కోర్టుల్లో తిరుగుతున్న న్యాయవాదుల్లో దాదాపు 35 నుంచి 40 శాతం మంది నకిలీలేనని బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (బీసీఐ) ఛైర్మన్, సీనియర్ అడ్వకేట్ మనన్ కుమార్ మిశ్రా సంచలన నివేదిక ఇచ్చారు. వీరంతా నకిలీ సర్టిఫికెట్లు కొనుగోలు చేసి లేదా సృష్టించి కోర్టుల్లో ప్రాక్టీస్ చేస్తున్నారని పేర్కొన్నారు. ఈ వ్యవహారం తమ దృష్టికి వచ్చిందని, దీనిపై చర్యలు తీసుకుంటున్నామని వెల్లడించారు. ఈ నకిలీ డిగ్రీల వ్యవహారాన్ని అడ్డుకోవడానికి బీసీఐ కసరత్తు ప్రారంభించింది. అడ్వొకేట్ల డిగ్రీ సర్టిఫికెట్లను పరిశీలించే ప్రక్రియను బీసీఐ మొదలుపెట్టగా దాదాపు 40 శాతం మంది తమ వెరిఫికేషన్ ఫారాలను పూరించలేదు. ఫారాలు నింపని వీరంతా నకిలీ న్యాయవాదులేనని బీసీఐ అనుమానిస్తోంది. ఈ విషయాన్ని ఇప్పటికే భారత ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) దృష్టికి తీసుకెళ్లినట్లు మనన్ మిశ్రా వెల్లడించారు. సోషల్ మీడియాలో సంచలనంగా మారిన కాక్రోచ్ జనతా పార్టీ ఉద్యమం వెనుక ఉన్న నేపథ్యాన్ని కూడా బీసీఐ మనన్ కుమార్ వివరించారు. గత వారం ఒక పిటిషన్‌ను విచారిస్తున్న సమయంలో సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ లాయర్ల డిగ్రీలపై అనుమానం వ్యక్తం చేశారు. నకిలీ డిగ్రీలతో కోర్టుల్లోకి వస్తున్న యువతను ఉద్దేశించే ఆయన కాక్రోచ్ వ్యాఖ్యలు చేశారని, దీనిపై సీబీఐ విచారణ కోరాలని భావిస్తున్నట్లు సీజేఐ చెప్పారని మిశ్రా స్పష్టం చేశారు.




# అమెరికా 'గ్రీన్‌కార్డ్'కు స్వదేశం నుంచి దరఖాస్తు!

### నిబంధనల్లో మార్పులు చేసిన ట్రంప్ ప్రభుత్వం

### కొందరిని మినహాయిస్తున్నట్లు వెల్లడి

**వాషింగ్టన్, మే 23:** అమెరికాలో శాశ్వత నివాస హక్కు (గ్రీన్‌కార్డు) కోరే తాత్కాలిక వలసదారులు ఇకపై దరఖాస్తులు సమర్పించడానికి స్వదేశానికి వెళ్లాల్సి ఉంటుందని అమెరికా పౌరసత్వ, వలస సేవల సంస్థ (యుఎస్‌సిఐఎస్) స్పష్టం చేసిన సంగతి తెలిసిందే. అయితే ఈ రూల్ అందరికీ కాదని తెలుస్తోంది. తాజాగా అగ్రరాజ్యం ఇందులో కొన్ని మినహాయింపులు ప్రకటించింది. 'అమెరికా జాతీయ ప్రయోజనాలు లేక ఆర్థిక ప్రయోజనాలు ముఖ్యం అనుకునే వలసదారులకు ఈ రూల్స్ నుంచి మినహాయింపులు ఇస్తాం. గ్రీన్‌కార్డు ఆశావహులు సమర్పించిన దరఖాస్తుల ఆధారంగా మా దేశానికి ప్రయోజనం ఉందని భావిస్తే.. వాటిని మేం పరిగణనలోకి తీసుకుంటాం. దాంతో వారు ప్రస్తుతం నిబంధనల ప్రకారమే కొనసాగే అవకాశం ఉంటుంది. మిగతా వారిని వారి మాతృదేశానికి వెళ్లి దరఖాస్తు చేసుకోమని సూచిస్తాం' అని యుఎస్‌సిఐఎస్ ప్రతినిధి జాక్ కహ్లర్ వెల్లడించారు. అవి తమ దేశానికి ప్రయోజనం కలిగించే వ్యక్తుల నుంచి వచ్చిన దరఖాస్తులు అని ఎలా నిర్ణయిస్తారో మాత్రం వెల్లడించలేదు. ముందురోజు వెలువరించిన గ్రీన్‌కార్డు నిబంధనల ప్రకారం అసాధారణ పరిస్థితుల్లోనే ఇందుకు మినహాయింపు ఉంటుందని జాక్ కహ్లర్ వెల్లడించిన సంగతి తెలిసిందే. అలాంటి మినహాయింపు కోరుతూ దరఖాస్తు చేసుకొనే వారి విషయంలో అధికారులు అన్ని పత్రాలను క్షుణ్ణంగా పరిశీలించి, తగిన నిర్ణయం తీసుకుంటారని చెప్పారు. కొత్త నిబంధనలతో చట్టంలోని లోపాలను ఉపయోగించుకుంటూ ఈ వ్యవస్థను దుర్వినియోగం చేసే అవకాశాలు తగ్గిపోతాయని పేర్కొన్నారు.

### మేజర్ అభిలాషబార్‌కు ఐక్యరాజ్యసమితి అరుదైన గౌరవం

# మిలిటరీ జెండర్ అడ్వకేట్ అవార్డుకు ఎంపిక



**న్యూయార్కు, మే 23:** భారత రక్షణరంగంలో పనిచేసి యుఎన్ పీస్ కీపింగ్ ఫోర్స్ లో పనిచేసిన మేజర్ అభిలాష బరాక్‌కు అరుదైన గౌరవం దక్కింది. లెబనాన్‌లో ఐక్యరాజ్యసమితి శాంతి పరిరక్షక మిషన్‌లో పాల్గొన్న మేజర్ అభిలాషను ప్రతిష్టాత్మక మిలిటరీ జెండర్ అడ్వకేట్ అవార్డుకు సమితి ఎంపిక చేసింది. 2025 యునైటెడ్ నేషనల్ మిలిటరీ జెండర్ అడ్వకేడ్ ఆఫ్ ద ఇయర్ అవార్డును గెలుచుకున్నట్లు యుఎన్ భారత విభాగం తెలిపింది. పశ్చిమ ఆసియా దేశా ల్లోని మహిళలు, టీనేజీ అమ్మాయిల్లో జెండర్ అంశాల్లో చైతన్యం కలిగించిన నేపథ్యంలో అభిలాషకు ఆ గుర్తింపు వచ్చినట్లు యూఎన్‌లోని ఇండియన్ పర్మినెంట్ మిషన్ తన ఎక్స్ అకౌంట్‌లో పేర్కొన్నది. లెబనాన్‌లో ఉన్న భారత బెటాలియన్‌లోని ఫిమేల్ ఎంగేజ్మెంట్ టీమ్‌కు ఆమె కమాండర్‌గా ఉన్నారు. లెబనాన్‌లోని యూఎన్ ఇంటీరియం ఫోర్స్‌లో ఆమె సేవలు అందిస్తోంది. భారతీయ ఆర్మీకి చెందిన మహిళా యుద్ధ హెలికాప్టర్ పైలట్‌గా ఆమెకు రికార్డు ఉన్నది. యూఎన్ పీస్‌కీపర్స్ అంతర్జాయతీ దినోత్సవం సందర్భంగా ఈనెల 29వ తేదీన ఐక్యరాజ్యసమితి ప్రధాన కార్యాలయంలో జరిగే ఈవెంట్‌లో అభిలాషను అవార్డుతో సత్కరించనున్నారు. యూఎన్ పీస్‌కీపర్స్ అవార్డు అందుకున్న మూడవ భారతీయ మహిళగా ఆమె గుర్తింపు పొందారు. గతంలో మేజర్ సుమన్ గవాని, మేజర్ రాధికా సేన్ కూడా యూఎన్ పీస్‌కీపర్స్ అవార్డు గెలుచుకున్నారు.



## లడక్‌లో కుప్పకూలిన హెలికాప్టర్

**లేహ్, మే 23:** లడఖ్ లోని లేహ్ ప్రాంతంలో శనివారం భారత ఆర్మీకి చెందిన ఒక చీతా హెలికాప్టర్ ప్రమాదానికి గురైంది. సాంకేతిక లోపం కారణంగా అది కూలిపోయినట్లు తెలుస్తోంది. అయితే ఈ ప్రమాదంలో ఆర్మీ అధికారులు ముగ్గురు త్రుటిలో ప్రాణాలతో బయటపడడం విశేషం. హెలికాప్టర్ పూర్తిగా ధ్వంసమైనప్పటికీ అధికారులు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. మృత్యుంజయుల సెల్ఫీ తీసుకుని విడుదలచేసిన వైనం అన్ని వర్గాలను ఆకర్షించింది. ప్రమాదం నుంచి సురక్షితంగా బయటపడ్డ తర్వాత కూలిపోయిన హెలికాప్టర్ శిథిలాల ముందు నిలబడి అధికారులు చిరునవ్వుతో సెల్ఫీ క్లిక్‌మనిపించారు.

## సంక్షిప్తంగా..

### ఇవాంకా ట్రంప్ హత్యకు కుట్ర?



**వాషింగ్టన్, మే 23:** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పెద్ద కుమార్తె ఇవాంకా ట్రంప్ హత్యకు కుట్ర జరిగినట్లు తెలుస్తోంది. ఐఆర్‌జిసితో సంబంధాలున్న ఓ ఉగ్రవాది ఈ కుట్ర పన్నినట్లు అంతర్జాతీయ మీడియా కథనం వెల్లడించింది. 2020లో ఇరాన్ అగ్రశ్రేణి కమాండర్ ఖాసీం సులేమాని హత్యకు ప్రతీ కారంగా ఆమెను హతమార్చేందుకు ఈ పథక రచన చేశాడని పేర్కొంది. కానీ, అతడు ప్లాన్ అమలు చేసేలోపే అరెస్టు అయ్యాడని తెలియజేసింది. 32 యేళ్ల మహమ్మద్ బాఖర్ సాద్ దావూద్ అల్ సాదీ కొంతకాలం క్రితం తుర్కియేలో అరెస్టు అయ్యాడు. ఆ తర్వాత అతడిని అమెరికాకు తరలించారు. అతడిని విచారించిన దర్యాప్తు అధికారులు కీలక విషయాలను గుర్తించారు. మహమ్మద్ వద్ద ఇవాంక కుటుంబం నివసిస్తోన్న ఇంటి బ్లూప్రింట్ ఉందని వెల్లడించారు. ఫ్లోరిడాలోని ఆమె నివాసం ఫొటోను సామాజిక మాధ్యమాల్లో షేర్ చేసినట్లు తెలుస్తోంది.

### రోడ్లపై నమాజ్ నిషేధానికి కేంద్ర మంత్రి మద్దతు



**లక్నో, మే 23:** బహిరంగ ప్రదేశాలు, రోడ్లపై నమాజ్ చేయడాన్ని నిషేధిస్తూ ఉత్తరాఖండ్ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయానికి కేంద్ర మంత్రి గిరిరాజ్ సింగ్ శనివారం పూర్తి మద్దతు ప్రకటించారు. మత పరమైన పండుగల సమయంలో శాంతిభద్రతలను కాపాడటానికే అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని పేర్కొ న్నారు. ఈ మేరకు ఉత్తరాఖండ్ ముఖ్యమంత్రి పుష్కర్ సింగ్ ధామీని ఆయన ప్రత్యేకంగా అభినం దించారు. కొందరు వ్యక్తులు కావాలనే దేశంలో వాతావరణాన్ని పాడు చేయడానికి ప్రయత్నిస్తున్నారని గిరిరాజ్ సింగ్ మండిపడ్డారు. శాంతిభద్రతల దృష్ట్యా ఇటువంటి నిబంధనలు తెచ్చిన ముఖ్య మంత్రులందరికీ ఆయన ధన్యవాదాలు తెలిపారు.

### బొగ్గుగనిలో గ్యాస్ పేలుడు: 82 మంది కార్మికులు మృతి



**బీజింగ్, మే 23:** చైనాలోని ఓ బొగ్గు గనిలో గ్యాస్ పేలుడు సంభవించడంతో పెద్ద ఎత్తున ప్రాణనష్టం వాటిల్లింది. ఉత్తర చైనా ప్రాంతంలో జరిగిన ఈ ప్రమాదంలో ఇప్పటివరకు 82 మంది కార్మికులు ప్రాణాలు కోల్పోయారు. మరో తొమ్మిది మంది ఆచూకీ ఇంకా లభించలేదని అక్కడి ప్రభుత్వ అధికారిక మీడియా శనివారం వెల్లడించింది. షాంక్సీ ప్రావిన్స్‌లోని లూషెన్యు బొగ్గు గనిలో ఈ ఘోర ప్రమాదం జరిగింది. గనిలో ఒక్కసారిగా ప్రమాదకరమైన కార్బన్ మోనాక్సైడ్ గ్యాస్ లీకైంది. ఆ విషవాయువు పరిమితికి మించి వేగంగా వ్యాపించడంతో పేలుడు సంభవించింది. ప్రమాదం జరిగిన సమయంలో గని లోపల వందల సంఖ్యలో కార్మికులు పని చేస్తున్నట్లు సమాచారం.

### గ్యాంగ్‌స్టర్ ఉజైర్‌బలోచ్ విందులో క్రికెటర్ ఆఫ్రిది



**కరాచి, మే 23:** పాకిస్థాన్ మాజీ క్రికెట్ కెప్టెన్ షాహిద్ అఫ్రిదీ మరోసారి వివాదంలో చిక్కుకున్నారు. కరాచీకి చెందిన కరడుగట్టిన గ్యాంగ్‌స్టర్ రహమాన్‌డకైట్ సోదరుడు ఉజైర్ బలోచ్‌తో కలిసి ఆయన విందులో పాల్గొన్న పాత ఫొటో ఒకటి సోషల్ మీడియాలో వైరల్ కావడంతో తీవ్ర దుమారం రేగు తోంది. ఈ ఫోటోపై నెటిజన్ల నుంచి తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఈ ఫోటో 2013లో కరాచీలో తీసినట్లు తెలుస్తోంది. ఇందులో అఫ్రిదీ, ఉజైర్ బలోచ్ మరికొందరితో కలిసి డిన్నర్ చేస్తూ కన్పిస్తున్నారు. ఉజైర్ బలోచ్ కరాచీలోని లియారీ గ్యాంగ్‌కు నాయకుడిగా పేరుగాంచాడు. హత్యలు, దోపి డీలు, బెదిరింపులు వంటి అనేక నేరారోపణలు ఎదుర్కొంటున్న అతడిని 2016లో పాక్ అధికారులు అరెస్ట్ చేశారు.

### తులసి గబ్బర్డ్ రాజీనామాకు ట్రంప్ ఆమోదం



**వాషింగ్టన్, మే 23:** అమెరికా జాతీయ నిఘా సంస్థ (డిఎన్ఐ) డైరెక్టర్, భారత సంతతి మహిళ తులసి గబార్డ్ రాజీనామాను ఆమోదిస్తున్నట్లు ట్రంప్ ప్రకటించారు. తులసి రాజీనామాను ఆమోదించిన అధ్యక్షుడు ట్రంప్, ఆమె సేవలను ప్రశంసించారు. తులసి అద్భుతంగా పనిచేశారు, ఆమె లేని లోటు మాకు తెలుస్తుందని ఆయన వ్యాఖ్యానించారు. ప్రిన్సిపల్ డిప్యూటీ డైరెక్టర్ ఆరోన్ లూకాస్ తాత్కాలిక డైరెక్టర్‌గా బాధ్యతలు స్వీకరిస్తారని వైట్‌హౌస్ ప్రకటించింది. తన భర్త అబ్రహం విలియమ్స్‌కు అరుదైన బోన్ క్యాన్సర్ సోకినందున, ఆయనకు తోడుగా ఉండేందుకు ఈ కఠిన నిర్ణయం తీసుకున్నట్లు ఆమె వెల్లడించారు. అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌కు పంపిన తన రాజీనామా లేఖను సోషల్ మీడియాలో పంచుకున్నారు.

24-5Pg6exHMNWJQE.qxd:24-5Pg6exHMNWJQE.qxd 1/1/02 6:14 AM Page 1



# విజయవాడలో అర్ధరాత్రి కార్లతో బీభత్సం సృష్టించిన ఇద్దరు యువకులు అరెస్టు

**విజయవాడ,మే 23,ప్రభాతవార్తప్రతినిధి:** విజయవాడలో అర్ధరాత్రి రాత్రి కార్ల(థార్ వెహికల్స్)తో బీభత్సం సృష్టించిన ఇద్దరు యువకులను అరెస్టు చేసినట్లు పోలీసులు ప్రకటించారు.. అరెస్టయిన వారిలో యువకుడు బొల్లా ఓంకు డ్రగ్ టెస్ట్ లో పాజిటివ్ ఉన్నట్లుగా గుర్తించినట్లు వెల్లడించారు.పాజిటివ్ రావడంతో బొల్లా ఓంపై మరో కేసు నమోదుచేసినట్లు వివరించారు.విజయవాడ పటమటలో గతరాత్రి వాహనాలతో యువకులు హల్ చల్ చేసారు. థార్ వాహనాలతో పరస్పరం ఢీకొట్టారు.. స్థానికులను భయభ్రాంతులకు గురిచేసారు. యువతి విషయంలో ఈ ఇద్దరు యువకులు నడిరోడ్డుపై థార్ వెహికల్స్‌తో ఢీకొట్టుకుని బీభత్సం సృష్టించారు. వేకువజాము నుంచి వాట్సాప్, ఫోన్‌లో రెచ్చగొట్టుకున్న వీరి గొడవ ఆర్‌ఆర్ గార్డెన్ వద్ద తీవ్ర ఉద్రిక్తత దారితీసింది. రెండేళ్ల కిందట పరిచయమైన వీరిద్దరూ సన్నిహితంగా ఉండేవారు. బీటెక్ పూర్తి చేసిన ఓమ్ తండ్రి బొల్లా జితేంద్రకు చెందిన రియల్ ఎస్టేట్ సంస్థ చూస్తున్నారు. రోహిత్ తాడేపల్లిలో బీటెక్ మొదటి ఏడాది చదువుతున్నారు. అతని తండ్రికి ట్రాన్స్‌పోర్టు సంస్థ ఉంది. ఘటన సమయంలో రోహిత్ కారులో మరో స్నేహితుడు ఉన్నాడు అతను వారిస్తున్నా వినకుండా రోహిత్ ఆవేశంతో దాడికి దిగాడు. ఈ నిందితులను పోలీసులు అదుపులోకి తీసుకున్న క్రమంలో డ్రగ్స్ పరీక్షల్లో ఒకరికి పాజిటివ్ రాగా, మరో జీపులో సిరంజ్, ఈ సిగరెట్ కిట్ లభించాయి. శుక్రవారం రాత్రి పటమట పోలీసులు ఇద్దరి ఇళ్లల్లో సోదాలు చేశారు. గంజాయి, డ్రగ్స్ లభించలేదు. కుటుంబ సభ్యులకు కౌన్సెలింగ్ ఇచ్చారు. బీఎన్ఎస్ 285, 281, 292, 351(2) రెడ్ విత్ 3(5) సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. ఏ1గా బొల్లా ఓమ్, ఏ2గా లింగమనేని రోహిత్‌లను చేర్చారు.



లింగాలలో నూతనంగా నిర్మించిన రహదారిని ప్రారంభిస్తున్న కలెక్టర్ ఇతర ప్రజాప్రతినిధులు

# గ్రామీణ ప్రాంతాల్లో రహదారుల అభివృద్ధికి కృషి :కలెక్టర్ డాక్టర్ లక్ష్మీశా

**విజయవాడ, మే 23, ప్రభాతవార్త :** రాష్ట్రంలోని గ్రామీణ ప్రాంతాల్లో అధ్వాన్నంగా ఉన్న రహదారుల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషిచేస్తుందని కెడిసిసి ఛైర్మన్ నెట్టెం రఘురామ్, మాజీ ఎమ్మెల్సీ టిడి.జనార్ధన్‌లు పేర్కొన్నారు. ఎన్‌టిఆర్ జిల్లా వత్సవాయి మండలం లింగాల గ్రామంలో రూ.1.19కోట్లతో నూతనంగా నిర్మించిన మెటల్‌రోడ్‌ను శనివారం జిల్లాకలెక్టర్ డాక్టర్ లక్ష్మీశా, జగ్గయ్యపేట ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్యలతో కలిసి ప్రారంభించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ వైసిపి హయాంలో రహదారులు అన్ని ఛిద్రం అయిపోయినా అప్పటి పాలకులు వాటికి కనీసం మరమత్తులు కూడా నిర్వహించలేదని ఆరోపించారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే రహదారు అభివృద్ధిపై దృష్టిసారించామని, ముందుగా రహదారులకు మరమత్తులు చేపట్టామన్నారు. గ్రామాల అభివృద్ధిలో రహదారులు ఎంతో కీలక భూమిక పోషిస్తాయని అభిప్రాయం వ్యక్తం చేసారు. ఈకార్యక్రమంలో డ్వామా పిడి ఏ.రాము, నందిగామ ఆర్డీఓ అనీల్‌కుమార్, స్థానిక నాయకులు, అదికారులు పాల్గొన్నారు.వత్సవాయి మండలం బీమవరం, మక్కపేట గ్రామాల్లో శనివారం ఉదయం ఎన్‌టిఆర్ కలెక్టర్ డాక్టర్ లక్ష్మీశా బడిపిలుస్తోంది కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈసందర్భంగా భీమవరం గ్రామంలో ఇంటింటి అవగాహన కార్యక్రమంలో పాల్గొని తల్లిదండ్రులతో మాట్లాడారు. బడిఈడు పిల్లలను బడిలో చేర్చి వారికి విద్యాబుద్దులు నేర్పించాలని, ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యను అందిస్తున్నట్లు చెప్పారు. ప్రభుత్వ పాఠశాలల్లో అన్ని రకాల సౌకర్యాలు, వసతులు అందుబాటులో ఉన్నాయని, విద్యార్డులకు ప్రభుత్వం ఎంతో ప్రోత్సాహం ఇస్తుందని ప్రభుత్వ ప్రోత్సాహన్ని సద్వినియోగం చేసుకుని ఉన్నత స్థానాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు. ప్రయివేటు పాఠశాలల నుండి ప్రభుత్వ పాఠశాలల్లో చేరిన 26మంది విద్యార్డులను వారి తల్లిదండ్రులను కలెక్టర్ అభినందించారు.

## జాతీయ స్థాయిలో ప్రతిభ కనబరిచిన ఆటగాళ్లకు కదిరి ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ ఘన సన్మానం



ప్రతిభ కనబర్చిన ఆటగాళ్లను సన్మానిస్తున్న కదిరి ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్

**అనంతపురం, మే 23, (ప్రభాతవార్త బ్యూరో)** జాతీయ స్థాయిలో అద్భుత ప్రతిభ కనబరిచి, తమ కృషి, పట్టుదల, క్రమశిక్షణతో శ్రీ సత్యసాయి జిల్లా కదిరి ప్రాంతానికి, మన రాష్ట్రానికి, మన దేశానికే గౌరవం తీసుకొచ్చిన జూనియర్ క్రీడాకారులను కదిరి ఎమ్మెల్యే కందికుంట వెంకట ప్రసాద్ శనివారం సన్మానించారు. అంతే కాకుండా ముగ్గురు క్రీడాకారులకు ఒక్కొక్కరికి ఎమ్మెల్యే గారు తన స్వంత నిధులతో 50వేల రూపాయలు విలువ చేసే కిట్ ను అందజేశారు. ఈ కార్యక్రమంలో సిఆర్ సి సభ్యులు కదిరి డియస్పీ శివ నారాయణస్వామి, కదిరి ఆర్డీవో తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కదిరి ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ మాట్లాడుతూ క్రీడలు అనేవి కేవలం గెలుపోటములకే పరిమితం కావు. అవి మనిషిలో ధైర్యాన్ని, ఆత్మవిశ్వాసాన్ని, క్రమశిక్షణను, జట్టు భావనను పెంపొందిస్తాయి. ప్రతి విజయానికి వెనుక ఎన్నో గంటల సాధన, ఎన్నో త్యాగాలు, ఎన్నో కష్టాలు దాగి ఉంటాయి. ఆ కష్టాన్ని జయించి జాతీయ స్థాయిలో నిలవడం చిన్న విషయం కాదన్నారు.మన క్రీడాకారులు సాధించిన విజయాలు మరెందరో పిల్లలకు , యువతకు స్ఫూర్తిదాయకం. మీ పట్టుదల, మీ కృషి చూసి ఇంకా ఎంతో మంది పిల్లలు క్రీడల వైపు అడుగులు వేస్తారని తాను నమ్ముతున్నానని ఎమ్మెల్యే కందికుంట వెంకట ప్రసాద్ ఆశాభావం వ్యక్తంచేశారు.ఈ సందర్భంగా క్రీడాకారులకు కిట్ బ్యాగులను బహుకరించడం కేవలం ఒక బహుమతి మాత్రమే కాదు ,ఇది మీ ప్రతిభకు గుర్తింపు, మీ భవిష్యత్ ప్రయాణానికి ప్రోత్సాహం, ఇంకా మరిన్ని విజయాలను సాధించాలనే ఆశీస్సుల ప్రతీక. జాతీయ స్థాయిని దాటి అంతర్జాతీయ స్థాయిలో కూడా భారతదేశ జెండాను ఎగురవేయాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను అని కందికుంట వెంకట ప్రసాద్ పిల్లలకు ఆశీర్వాదాలు అందించారు. మీ విజయ ప్రయాణంలో మీ కుటుంబ సభ్యులు, సి ఆర్ సి సభ్యులు అందించిన సహకారం కూడా ఎంతో గొప్పదని వారికి ప్రత్యేక అభినందనలు తెలిపారు.

## వివాహేతర సంబంధం నేపథ్యంలో దారుణ హత్య

### - ముగ్గురు నిందితులు అరెస్టు

**వింజమూరు (నెల్లూరు), మే 23, ప్రభాతవార్త :** వింజమూరు పంచాయతీ పరిధిలోని వింజెటమ్మ కొండ ఆలయ సమీపంలో పాలవాగు వద్ద మే 16న జరిగిన మేదరమెట్ల శ్రీకాంత్ (32) హత్య కేసును పోలీసులు ఛేధించారు. వివాహేతర సంబంధమే ఈ హత్యకు కారణమని కలిగిరి సీఐ పి.సుబ్బారావు వెల్లడించారు. శనివారం స్థానిక పోలీసు స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో సీఐ మాట్లాడుతూ హత్యకు కారకులైన వాకాటి హరిబాబు, మూలి వెంగమ్మ ప్రదీప్‌లను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. సీఐ తెలిపిన వివరాల ప్రకారం నాగిరెడ్డిపాలెంకు చెందిన వెంగమ్మ వీర్నకల్లు గ్రామానికి చెందిన మేదరమెట్ల శ్రీకాంత్‌ను వింజెటమ్మ కొండ సమీపానికి రమ్మని ఫోన్ చేసి పిలిచింది. అక్కడ ముందుగానే వేచి ఉన్న వీర్నకల్లు గ్రామానికి చెందిన హరిబాబు, ఏఎస్‌పేట మండలం కాకర్లపాడుకు చెందిన ప్రదీప్‌లు శ్రీకాంత్‌పై దాడి చేసి కత్తితో పొడిచి హత్య చేశారు. అనంతరం అనుమానం రాకుండా మృతదేహాన్ని ముళ్ళపొదల్లో పడేసి అక్కడి నుంచి పరారయ్యారు. నాగిరెడ్డిపాలెంకు చెందిన వెంగమ్మతో మృతుడు శ్రీకాంత్‌కు గత మూడేళ్లుగా సన్నిహిత సంబంధాలు ఉన్నాయి. అదే సమయంలో వెంగమ్మకు వీర్నకల్లు గ్రామానికి చెందిన వాకాటి హరిబాబు, ఏఎస్‌పేట మండలం కాకర్లపాడుకు చెందిన ప్రదీప్‌తోనూ సన్నిహిత సంబంధాలు కొనసాగుతున్నాయి. ఈ వివాహేతర సంబంధాల నేపథ్యంలో తలెత్తిన విభేధాలతోనే పథకం ప్రకారం హత్య చేసినట్లు విచారణలో తేలిందన్నారు. జిల్లా ఎస్పీ అజితా వేజెండ్ల ఆదేశాల మేరకు, కావలి డీఎస్పీ సూచనల మేరకు వింజమూరు ఎస్సై మాదాల ఉమామహేశ్వరరావు, కలిగిరి ఎస్సై ఉమాశంకర్ ఆధ్వర్యంలో రెండు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు.

అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానం, క్లూసన టీం సహాయంతో సమగ్రంగా దర్యాప్తు చేపట్టి నిందితులను గుర్తించి అరెస్టు చేశామని సీఐ వెల్లడించారు. ఈ కేసును ఛేధించడంలో వింజమూరు ఎస్సై మాదాల ఉమా మహేశ్వరరావు, కలిగిరి ఎస్సై ఉమాశంకర్, సిబ్బంది కీలకంగా వ్యవహారించారని సీఐ అభినందించారు. వింజమూరు ఎస్సైగా నూతనంగా బాధ్యతలు చేపట్టిన ఉమా మహేశ్వరరావు ఎంతో బాధ్యతాయుతంగా పని చేసి నిందితులను పట్టుకోవడంలో కీలక పాత్ర పోషించారని ప్రశంసించారు.



# నేరంచేస్తే పోలీస్ చట్టం పవర్ చూపిస్తా

## - నేరస్థుల్లో భయం సృష్టించేలా కఠిన చర్యలు

### రౌడీషీటర్లకు కౌన్సిలింగ్‌లో ఎస్పీ సుబ్బరాయుడు

**తిరుపతి,మే 23ప్రభాతవార్తప్రతినిధి:** తిరుపతి జిల్లా ప్రశాంతత,పవిత్రతను నిలుపుతూ, ఇక్కడ ప్రజలు యాత్రికులకు పూర్తిభద్రత కల్పించడమే పోలీసు ధ్యేయమని తిరుపతి జిల్లా ఎస్పీ ఎల్ సుబ్బరాయుడు స్పష్టం చేశారు. పోలీస్ చట్టం పవర్, దాన్ని కఠినంగా అమలు చేస్తే ఎలా ఉంటుందో వివరిస్తూ అవగాహన కల్పించారు. సమాజంలో శాంతిభద్రతలను పరిరక్షించడం, ప్రజల్లో భద్రతా భావన పెంపొందించడం, నేరస్తుల్లో మార్పు తీసుకురావడమే ఈ కార్యక్రమ ప్రధాన ఉద్దేశమని జిల్లా ఎస్పీ తెలిపారు. ఈ కార్యక్రమానికి సుమారు 450 మంది హాజరయ్యారు. వారిలో రౌడీ షీటర్లు, గంజాయి విక్రేతలు, వినియోగదారులు, దొంగతనాలకు పాల్పడే వ్యక్తులు, ముఖ్యంగా మైనర్ బాలికలపై అఘాయిత్యాలకు పాల్పడిన పోక్సో నిందితులు ఉన్నారు. శనివారం మధ్యాహ్నం తిరుపతి జిల్లా కేంద్రంలోని ఎంఆర్‌పల్లి పోలీస్ పరేడ్ మైదానంలో జిల్లా వ్యాప్తంగా ఉన్న రౌడీ షీటర్లు, గంజాయి కేసుల్లో నిందితులు, దొంగతనాలకు పాల్పడే వ్యక్తులు, పోక్సో కేసు ముద్దాయిలకు ప్రత్యేక మెగా కౌన్సెలింగ్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ సుబ్బరాయుడు స్వయంగా పాల్గొని రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ చేశారు. ఇప్పటివరకు జిల్లాలో 257 ఎన్.డీపీఎస్ షీట్లు, 184 పోక్సో షీట్లు ఓపెన్ చేసినట్లు ఎస్పీ వెల్లడించారు. అలాగే 13 మంది రౌడీ షీటర్ల పై పీడీ యాక్ట్ , గంజాయి..డ్రగ్స్ సరఫరా చేస్తున్న 17 మందిపై పీఐటీ ఎన్.డీపీఎస్ యాక్ట్ నమోదు చేసి జైలుకు పంపినట్లు తెలిపారు. "తిరుపతి వంటి పవిత్ర పుణ్యక్షేత్రంలో రౌడీయిజం, గంజాయి, మహిళలపై నేరాలు, ప్రజలను భయభ్రాంతులకు గురిచేసే చర్యలను ఎట్టి పరిస్థితుల్లోనూ సహించేది లేదన్నారు. ఒకసారి రౌడీ షీట్ ఓపెన్ అయితే ప్రతి కదలికపై పోలీసుల నిఘా ఉంటుంది. మళ్లీ నేరాలకు పాల్పడితే పీడీ యాక్ట్, ఎక్స్‌టర్న్‌మెంట్ వంటి కఠిన చర్యలు తప్పవు" అని హెచ్చరించారు. అలాగే "మార్పు చెందితే పోలీస్ శాఖ మీకు అండగా ఉంటుంది. కానీ ప్రజల ప్రశాంతతకు భంగం కలిగించే వారిని చట్టం ముందు నిలబెట్టి కఠినంగా శిక్షించేందుకు వెనకాడం" అని స్పష్టం చేశారు. కార్యక్రమంలో గంజాయి వినియోగాన్ని గుర్తించే ఆధునిక యూరిన్ టెస్ట్ విధానంపై అవగాహన కల్పించారు. ఆధునిక టెక్నాలజీని అందుబాటులోకి తీసుకురావడం ద్వారా కేవలం ఐదు నిమిషాల్లో యూరిన్ టెస్ట్ ద్వారా గంజాయి వినియోగాన్ని గుర్తించవచ్చని, గత 30 రోజుల వరకు వినియోగ చరిత్ర బయటపడుతుందని చెప్పారు. పరీక్షల్లో పాజిటివ్ వచ్చిన వారి ద్వారా గంజాయి సరఫరా గొలుసును గుర్తించి మూలాలను పూర్తిగా అణచివేస్తామని హెచ్చరించారు. తిరుపతి జిల్లా పోలీస్ శాఖ ప్రజల భద్రత, మహిళలు... చిన్నారుల రక్షణ, నేర నియంత్రణ విషయంలో అత్యంత కట్టుదిట్టంగా వ్యవహరిస్తోందని, ప్రజలు ఎలాంటి భయాందోళనలకు గురికాకుండా ప్రశాంత వాతావరణం కల్పించడం తమ బాధ్యత అని ఎస్పీ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ వెంకట్రావు,అదనపు ఎస్పీ రవిమనోహరచారి, శ్రీనివాస్ (క్రైమ్స్), డియస్పీలు భక్త వత్సలం, గీతా కుమారి, శ్రీలత, సిఐలు, ఎస్సైలు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# పిఎం ఇబస్ సేవా పథకం - గ్రీన్ మొబిలిటీ వేగవంతం

## - ఎలక్ట్రిసిటీ ప్రజా రవాణాలో దేశానికి ఆదర్శంగా ఆంధ్రప్రదేశ్: ప్రధాన కార్యదర్శి కె. విజయానంద్



పిఎం ఇ బస్ సేవా పథకం కింద గ్రీన్ మొబిలిటీ వేగవంతం అంశంపై జరిగిన సమావేశంలో ముఖ్యమంత్రి ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె. విజయానంద్

**విజయవాడ, మే23, ప్రభాతవార్తప్రతినిధి:** భారత ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న పీఎం ఈబస్ సేవా పథకం కింద విద్యుత్ మొబిలిటీ మౌలిక సదుపాయాల ఏర్పాటులో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (ఏపీఎస్ఆర్టీసీ) వేగంగా ముందుకు సాగుతున్నదని గౌరవ ముఖ్యమంత్రి ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె. విజయానంద్ తెలిపారు. ప్రధాన మంత్రి ఈ బస్ సేవా పథకం లో భాగంగా రాష్ట్రంలో ఏపీఎస్ఆర్టీసీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేస్తున్న ఈ ఛార్జింగ్ స్టేషన్ల ఏర్పాటుకు అవసరమైన విద్యుత్ సౌకర్యాలకు మౌలిక వసతుల కల్పనకు సంబందించిన పనుల పురోగతిపై శనివారం స్థానిక విద్యుత్ సౌధలో ఏపీఎస్ఆర్టీసీఇంచార్జి ఎండి యం.టి. కృష్ణ బాబు తో కలిసి డిస్కంల సీఎండీలు శివశంకర్ లోతేటి, పృథ్వి తేజ్ ఇమ్మడి, పి. పుల్లా రెడ్డి, ఏపీట్రాన్స్కో, డిస్కంల సి ఈ లు , ఎస్ ఈ లు ఏపీఎస్ఆర్టీసీజోనల్ స్థాయి అధికారులతో వర్చువల్ గా సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సంధర్భంగా ఆయన మాట్లాడుతూ, ఈ కార్యక్రమం రాష్ట్రంలో సుస్థిర పట్టణ రవాణా వ్యవస్థల అభివృద్ధి, పర్యావరణ పరిరక్షణ, ఆధునిక ప్రజా రవాణా సేవల విస్తరణకు కీలక మైలురాయిగా నిలుస్తుందని ఆయన పేర్కొన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయిడు నాయకత్వంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం హరిత రవాణా కార్యక్రమాలకు అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. కాలుష్య నియంత్రణ, స్వచ్ఛ ఇంధన వినియోగం, ప్రజలకు మెరుగైన రవాణా సేవలు అందించడం లక్ష్యంగా విద్యుత్ ఆధారిత ప్రజా రవాణా వ్యవస్థలను రాష్ట్రవ్యాప్తంగా విస్తరించనున్నామని ఆయన వివరించారు. పీఎం ఈబస్ సేవా పథకం టెండర్11 కింద కేంద్ర గృహనిర్మాణ, పట్టణ వ్యవహారాల మంత్రిత్వ శాఖ ఆంధ్రప్రదేశ్‌కు 11 నగరాలు, 12 డిపోలను కలుపుకుని మొత్తం 750 విద్యుత్ బస్సులను మంజూరు చేసిందన్నారు. అదనంగా సి ఈ ఎస్ ఎల్ టెండర్III కింద ప్రత్యేక కేటాయింపుగా తిరుపతికి మరో 300 విద్యుత్ బస్సులు మంజూరైనట్లు తెలిపారు. దీంతో విద్యుత్ మొబిలిటీ రంగంలో దేశంలో ముందంజలో నిలిచే రాష్ట్రాలలో ఆంధ్రప్రదేశ్ కూడా అగ్రగామిగా అవతరిస్తోందన్నారు.

మంజూరైన 750 బస్సుల్లో 621 బస్సులు 12 మీటర్ల విభాగానికి, 129 బస్సులు 9 మీటర్ల విభాగానికి చెందినవని తెలిపారు. విశాఖపట్నం, విజయవాడ, గుం టూరు, నెల్లూరు, కర్నూ లు, కాకినాడ, రాజమ హేంద్రవరం, కడప, అమరావతి, తిరుపతి, అనంతపురం వంటి ప్రధాన పట్టణాల్లో ఈ బస్సులను ప్రవేశపెట్ట నున్నట్లు తెలిపారు. దీని ద్వారా రాష్ట్రవ్యాప్తంగా పర్యావరణహిత, ఆధునిక ప్రజా రవాణా సేవలు మరింత బలోపేతం అవుతాయని పేర్కొన్నారు. విద్యుత్ బస్సుల నిరంతరాయ కార్యకలాపాలకు అవసరమైన బిహైండ్‌దిమీటర్ ఛార్జింగ్ మౌలిక సదుపాయాలను అన్ని డిపోల్లో సమాంతరంగా ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. ఈ పనులకు కేంద్ర సాంక్షనింగ్ అండ్ స్టీరింగ్ కమిటీ గణనీయమైన ఆర్థిక సహాయాన్ని ఆమోదించిందన్నారు. మొత్తం రూ.89.99 కోట్ల అంచనాకు గాను రూ.79.98 కోట్లను సి ఎస్ ఎస్ సి మంజూరు చేసిందని తెలిపారు. ఈ పనుల్లో హైటెన్షన్ విద్యుత్ కనెక్టివిటీ వ్యవస్థలు, ఛార్జింగ్ స్టేషన్లు, విద్యుత్ నెట్వర్క్‌లు, డిపో స్థాయి పవర్ మేనేజ్‌మెంట్ సదుపాయాల అభివృద్ధి వంటి కీలక అంశాలు ఉంటాయని పేర్కొన్నారు. ఏపీ ట్రాన్స్‌కో, డిస్కంలతో సమన్వయం ద్వారా హైటెన్షన్ విద్యుత్ కనెక్టివిటీ పనుల్లో గణనీయమైన పురోగతి సాధించామని కె. విజయానంద్ తెలిపారు.

సింహపురి, గాజువాక, కాకినాడ, కర్నూలు, అనంతపురం ప్రాంతాల్లో బీటీఎం మౌలిక సదుపాయాల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం రూ.17.86 కోట్లను విడుదల చేసిందన్నారు. ఈ నిధులను 2026 మార్చి 16న ఏపీ ట్రాన్స్‌కోతో పాటు ఈపీడీసీఎల్, ఎస్పీడీసీఎల్ వంటి సంబంధిత డిస్కంలకు బదిలీ చేశామని తెలిపారు. ఈ ప్రాంతాల్లో బీటీఎం పనుల అమలుకు లెటర్స్ ఆఫ్ అక్సెప్టెన్స్ కూడా జారీ చేయడం జరిగిందన్నారు.

విద్యుత్ బస్సులు ప్రవేశపెట్టే షెడ్యూల్‌కు అనుగుణంగా ఛార్జింగ్ స్టేషన్లు సిద్ధంగా ఉండేలా 12 డిపోలలో ఎల్‌టీ వైపు మౌలిక సదుపాయాల పనులను కూడా సమాంతరంగా చేపట్టినట్లు తెలిపారు.

# సత్యవరంలో ఈదురు గాలుల భీభత్సం

## కొబ్బరి చెట్టు కూలి ఇద్దరు కూలీలు దుర్మరణం

**పాయకరావుపేట రూరల్, మే 23, ప్రభాతవార్త** మండలంలోని సత్యవరంలో శనివారం సాయంత్రం ఈదురు గాలులు భీభత్సం సృష్టించాయి. పెద్ద ఎత్తున వీచిన ఈ పెనుగాలులకు సత్యవరంలోని తమలపాకులు తోటలో కూలీ పనులు చేస్తోన్న అరట్లకోట గ్రామానికి చెందిన ఇద్దరు నిరుపేద కూలీలు దుర్మరణం చెందారు. దీంతో అరట్లకోట గ్రామంలో తీవ్ర విషాదచాయలు అలుముకున్నాయి. ఈ దుర్ఘటనకు సంబంధించి పోలీసులు తెలిపిన పూర్తి వివరాలు ఇలా ఉన్నాయి... మండలంలోని అరట్లకోట గ్రామానికి చెందిన గర్లంక ఎరకయ్య అలియాస్ ఓం శాంతి దొరబాబు (41), గెడ్డమూరి శంకర్ (55) లు శనివారం ఉదయం తమ తోటి కూలీలైన గెడ్డమూరి సన్యాసిరావు, వేముల రాంబాబు, చిట్టిపల్ల రమణలతో కలసి తమ ప్రక్క గ్రామమైన సత్యవరంలోని సఖిలేటి కృష్ణ అనే రైతుకు చెందిన తమలపాకు తోటలో కూలి పని చేయడానికి వెళ్లారు. వీరు తమలపాకు తోటలో పని చేస్తూ ఉండగా సాయంత్రం నాలుగు గంటల సమయంలో సత్యవరం గ్రామంలో పెద్ద ఎత్తున వీచిన ఈదురు గాలులు భీబత్సం సృష్టించాయి. బలంగా వీచిన పెను గాలులకు కొబ్బరి చెట్టు కూలి వీరిపై పడటంతో అరట్లకోట గ్రామానికి చెందిన నిరుపేద కూలీలు గర్లంక ఎరకయ్య అలియాస్ ఓం శాంతి దొరబాబు, గెడ్డమూరి శంకర్ సంఘటనా స్థలంలోనే దుర్మరణం చెందారు. ప్రమాద విషయం తెలుసుకున్న వెంటనే సిఐ సాకేటి శంకరరావు, ఎస్ఐ మహమ్మద్ అలీ తమ సిబ్బందితో కలసి సంఘటనా స్థలానికి చేరుకున్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు ప్రారంభించారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం తుని ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి తరలించామని ఏఎస్ఐ జెర్రిపోతుల గోవిందరావు తెలిపారు.బాధిత కుటుంబ సభ్యులను ఓదార్చిన జనసేన నాయకులు గెడ్డం బుజ్జి : పెను గాలులు భీభత్సానికి కొబ్బరి చెట్టు కూలి మృతి చెందిన గర్లంక ఎరకయ్య (ఓం శాంతి దొరబాబు), గెడ్డమూరి శంకర్ కుటుంబ సభ్యులను జనసేన పార్టీ పాయకరావుపేట నియోజకవర్గ ఇంచార్జ్ గెడ్డం బుజ్జి ఓదార్చారు. ప్రమాదం జరిగిన సంగతి తెలుసుకున్న గెడ్డం బుజ్జి సంఘటనా స్థలానికి చేరుకున్నారు. ప్రమాదం జరిగిన తీరును పోలీసులు, అధికారులను అడిగి తెలుసుకున్నారు.

మృతుల కుటుంబాలకు అండగా నిలిచి అన్నివిధాలా ఆదుకుంటామని బాధిత కుటుంబాలకు హామీ ఇచ్చారు. ప్రమాదం జరిగిన సంగతి తెలిసిన వెంటనే తెలుగుదేశం పార్టీ అరట్లకోట గ్రామ శాఖ అధ్యక్షులు కట్టా శ్రీను, జనసేన పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు తుమ్మల గణేష్ వెంటనే సంఘటనా స్థలానికి చేరుకొని కుటుంబ సభ్యులను పరామర్శించారు.

## విత్తనాల బంతులతో సామాజిక వనాలు

**గుంటూరు, మే 23 ప్రభాత వార్త ప్రతినిధి :** విత్తనాల బంతులతో సామాజిక వనాలు పెంచుదామని తిరుపతి సర్కిల్ చీఫ్ కన్సర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ శ్రీనివాస్ రెడ్డి పిలుపునిచ్చారు. గుంటూరు అటవీశాఖ కార్యాలయంలో తిరుపతి, గుంటూరు సర్కిల్స్ పరిధిలోని బాపట్ల, ప్రకాశం, గుంటూరు, రాయచోటి, అన్నమయ్య, నెల్లూరు, తిరుపతి జిల్లాల డిఎఫ్ఒలు, సోషల్ ఫారెస్ట్రీ అధికారులతో గ్రీన్ క్లైమేట్ టీం ఎన్జిఒ వ్యవస్థాపక కార్యదర్శి జెవి రత్నంతో విత్తనాల బంతులు తయారు చేయడంపై అవగాహన కార్యక్రమం శనివారం జరిగింది. ప్రభుత్వ ఆదేశాల మేరకు రాష్ట్రంలో ప్రభుత్వం 2.5 కోట్ల విత్తనాల బంతులు తయారు చేయడం జరుగుతుందని వివరించారు. దేశీయ అడవి విత్తనాలు సేకరించుదామని పిలుపునిచ్చారు. ఇందుకుగాను గ్రీన్ క్లైమేట్ టీం సూచించిన అన్ని ప్రాంతాలలోనూ సోమవారం ఉదయం నుంచి విత్తనాలు సేకరించడం అవసరమని గమనించాలని అన్నారు. ఔషధ గుణాలు కలిగిన విత్తనాలు సేకరించడం అవసరమని, అలాగే పక్షులు గూళ్ళు పెట్టే చెట్లు విత్తనాలు సేకరించుదామని అన్నారు. ఈ సమావేశంలో బాపట్ల డిఎఫ్ఒ రవిశంకర్, ప్రకాశం జిల్లా డిఎఫ్ఒ వినోద్ కుమార్, గుంటూరు జిల్లా డిఎఫ్ఒ హిమ శైలజ పాల్గొన్నారు.

## ప్రజలకు ముఖ్యమంత్రి సహాయనిధి కొండంత అండ

### - సిఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ చేసిన కోవూరు ఎమ్మెల్యే



**కోవూరు (నెల్లూరు), మే 23, ప్రభాతవార్త :** రాష్ట్రంలో సంక్షేమం, అభివృద్ధి కాకుండా మానవతా దృక్పథంతో కూడా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పాలన సాగిస్తున్నారని కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి అన్నారు. శనివారం ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను లబ్దిదారులకు నెల్లూరు నగరంలోని విపిఆర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పంపిణీ చేశారు. ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టినప్పటి నుండి కోవూ రు నియోజకవర్గంలో 24 విడతలుగా ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులు అందజేశామ న్నారు..అనారోగ్య కారణాలతో బాధపడి ఆర్థిక ఇబ్బందులు కలిగిన వారికి మానవతా దృక్పథం తో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఇంటి పెద్దలాగా ఆత్మ బంధువు లాగా ముఖ్యమంత్రి సహాయనిధితో సపోర్ట్ చేయడం అభినందనీయమన్నారు..కోవూరు నియోజకవర్గంలో దాదాపు 900 మందికి దాదాపు రూ. 9 కోట్ల మేర సీఎం సహాయనిది అందజేశామన్నారు.నెల్లూరు పార్లమెంటు నియోజకవర్గం పరిధిలో ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి గారి ద్వారా 130 మందికి రూ.1.7 కోట్లు ముఖ్యమంత్రి సహాయ నిధి అందజేయడం జరిగిందన్నారు. ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా అత్యవసర సహాయం అందిస్తూ సీఎం చంద్రబాబు నాయుడు నిరు పేదలకు ఆపన్నహస్తం అందజేస్తున్నారని అన్నారు.అనారోగ్యాల బారిన పడి ఆర్థికంగా ఇబ్బందుల పడుతున్న కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయనిధి కొండంత అండగా నిలుస్తుందన్నారు.పేదల పట్ల సిఎం చంద్రబాబు చేస్తున్న సహాయానికి కోవూరు నియోజకవర్గ ప్రజల తరపున ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుతున్నామన్నారు. తమకు కష్టకాలంలో ప్రభుత్వం నుండి ఈ సహాయం అందేలా కృషి చేసినందుకు వేమిరెడ్డి దంపతులకు లబ్ధిదారులు, వారి కుటుంబ సభ్యులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.కార్యక్రమంలో కూటమి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## 25న తాలీం-ఎ-హునూర్ ఫలితాలు

**విజయవాడ, మే 23, ప్రభాతవార్త :**ముస్లిం విద్యార్థులకు కార్పొరేట్ కళాశాలల్లో వసతితో పాటు, ఇంటర్ మీడియట్ విద్యను ఉచితంగా అందించేందుకు ఆంధ్రప్రదేశ్ వక్ఫ్‌బోర్డు ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించిన తాలీం-ఏ-హునూర్ టాలెంట్ టెస్ట్ ఫలితాలను ఈనెల 25వతేదీ రాష్ట్రమైనార్టీశాఖా మంత్రి ఎన్.యం.డి.ఫరూఖ్ చేతులమీదుగా విడుదల చేయనున్నట్లు వక్ఫ్‌బోర్డు ఛైర్మన్ అబ్దుల్ అజీజ్ తెలిపారు. టాలెంట్ టెస్ట్ ప్రాధమికి కీని ఇప్పటికే సంబందిత వెబ్‌సైట్‌లో విడుదల చేసినట్లు చెప్పారు. పరీక్షను అత్యంత పారదర్శకత, కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్ల మద్య రాష్ట్రవ్యాప్తంగా 27కేంద్రాల్లో నిర్వహించామని వివరించారు. విద్యార్డుల ఎంపిక పూర్తిగా మెరిట్ ఆధారంగానే జరుగుతుందని, ఫలితాలు విడుదలయిన అనంతరం తదుపరి ప్రక్రియకు సంబందించిన పూర్తి వివరాలను తెలియచేస్తామని అజీజ్ చెప్పారు.



రీసర్వేను పరిశీలిస్తున్న కూర్మనాథ్

## రీసర్వేతో భూముల సమస్యలకు పరిష్కారం :

### ల్యాండ్ రికార్డ్స్ డైరెక్టర్ రోణంకి కూర్మనాథ్

**హనుమాన్‌జంక్షన్(కృష్ణా), మే 23, ప్రభాతవార్త :** రాష్ట్రప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రీసర్వే కార్యక్రమం సక్రమంగా అమలు చేస్తే భూముల సమస్యలకు పరిష్కారం లభిస్తుందని రాష్ట్రసర్వే సెటిల్ మెంట్ అండ్ ల్యాండ్ రికార్డ్స్ డైరెక్టర్ రోణంకి కూర్మనాథ్ పేర్కొన్నారు. కృష్ణాజిల్లా బాపులపాడు మండలం వేలేరు, మల్లవల్లి, వీరవల్లి గ్రామాల్లో శనివారం ఆయన పర్యటించి క్షేత్రస్థాయిలో రీసర్వే పనులను పరిశీలించారు. ఈసందర్భంగా గ్రౌండు ట్రూతింగ్, సర్వేయర్ లాగిన్‌లో జరుగుతున్న డేటా ఎం ట్రిలను డైరెక్టర్ పరిశీలించారు. మల్లవల్లి గ్రామంలో రైతుల సమక్షంలో సర్వే సిబ్బంది భూకమతాలను సర్వేచేసి డేటాను సేకరించారు. ఈసందర్భంగా సర్వేసిబ్బందితోనూ, రైతులతోనూముఖాముఖి మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. భూరికార్డుల ప్రక్షాళన, రైతులకు ఖచ్చితమైన భూహక్కులు కల్పించటమే లక్ష్యంగా రాత్రింబవళ్ళు శ్రమిస్తున్న సర్వేసిబ్బందిని అభినందించారు. రీసర్వేలో రైతుల సందేహాలను అక్కడికక్కడే నివృత్తిచేయాలని కూర్మనాథ్ ఆదేశించారు. ఈకార్యక్రమంలో మల్టీజోన్-1 ఆర్జేడి కూమార్, ఏడి లక్ష్మణరావు, తాహసీల్దార్ బి.మురళీకృష్ణ, తదితరులు సిబ్బంది పాల్గొన్నారు.

## అబద్ధం.. అరాచకం.. జగన్ సిద్ధాంతం

### రాష్ట్ర టిడిపి అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు

**గాజువాక,మే 23,ప్రభాతవార్త** అబద్ధాలే ఆయుధంగా, అరాచకాలే రాజకీయంగా జగన్ మోహన్ రెడ్డి ముందుకు సాగుతున్నారని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు తీవ్రస్థాయిలో విమర్శించారు. కూటమి ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధిపై ప్రజల్లో వస్తున్న సానుకూల స్పందనను మళ్లించేందుకే జగన్ మూడు నెలలకోసారి ప్రెస్‌మీట్లు పెడుతున్నారని మండిపడ్డారు. గడిచిన మూడు నెలల్లోనే రాష్ట్రానికి క్యారియర్, రాయల్ ఎన్‌ఫీల్డ్, ఎ ఎం సి ఎ వంటి ప్రతిష్మాత్మక పెట్టుబడులు వచ్చాయని, జాబ్ క్యాలెండర్ విడుదల చేశామని గుర్తుచేశారు. రాయలసీమకు రూ. లక్ష కోట్లతో ఉద్యానవన హబ్ ప్రకటించామన్నారు. రాష్ట్రం అభివృద్ధి బాటలో దూసుకుపోతుంటే ఓర్వలేక జగన్ అసత్య ప్రచారాలు చేసి బెంగళూరుకు పారిపోతున్నారని ఎద్దేవా చేశారు. ఐదేళ్ల ఫ్యాక్షన్, శవ రాజకీయాలకు ప్రజలు ఇచ్చిన తీర్పే 11 సీట్లని పల్లా పేర్కొన్నారు.బాబాయి వివేకా హత్య కేసుపై జగన్ వైఖరిలో తడబాటు స్పష్టంగా కనిపిస్తోందని,

నిజం బయట పడుతుందనే భయమే దీనికి కారణమని విమర్శించారు. రాష్ట్రంలో నడుస్తోంది రాజారెడ్డి రాజ్యాంగం కాదని, అంబేద్కర్ రాజ్యాంగమని స్పష్టం చేశారు.



# అబద్ధం...ఆరాచకం...జగన్ సిద్ధాంతం

**ఏపీటీడీపి అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు**

గాజువాక, మే 23,ప్రభాతవార్త

అబద్ధాలే ఆయుధంగా, అరాచకాలే రాజకీయంగా జగన్ మోహన్ రెడ్డి ముందుకు సాగుతున్నారని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు తీవ్రస్థాయిలో విమర్శించారు. కూటమి ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధిపై ప్రజల్లో వస్తున్న సానుకూల స్పందనను మళ్లించేందుకే జగన్ మూడు నెలలకోసారి ప్రెస్‌మీట్లు పెడుతున్నారని మండిపడ్డారు. గడిచిన మూడు నెలల్లోనే రాష్ట్రానికి క్యారియర్, రాయల్ ఎన్‌ఫీల్డ్, ఎఎంసిఎ వంటి ప్రతిష్ఠాత్మక పెట్టుబడులు వచ్చాయని, జాబ్ క్యాలెండర్ విడుదల చేశామని గుర్తుచేశారు. రాయలసీమకు రూ.లక్ష కోట్లతో ఉద్యానవన హబ్ ప్రకటించామన్నారు. రాష్ట్రం అభివృద్ధి బాటలో దూసుకుపోతుంటే 8వ పేజీలో

విశాఖలో ఆకాశాన్ని అలరించనున్న

# సూర్యకిరణ్ వైమానిక విన్యాసాలు

**మూడు దశాబ్దాల అద్భుత ప్రదర్శనలకు భారత వైమానిక దళ గర్వకారణం**



(ప్రభాతవార్త-విశాఖపట్నం)

విశాఖపట్నంలో భారత వైమానిక దళానికి చెందిన ప్రతిష్ఠాత్మక "సూర్య కిరణ్ ఏరోబాటిక్ టీమ్" వైమానిక విన్యా సాలు నిర్వహించనున్న నేపథ్యంలో రక్షణ మంత్రిత్వ శాఖ ప్రెస్ ఇన్ఫర్మేషన్ బ్యూరో ప్రత్యేక వివరాలను విడుదల చేసింది. 1996లో స్థాపించబడిన ఈ బృందం భారత వైమానిక దళం క్రమశిక్షణ, సాంకేతిక నైపుణ్యం, సమన్వయ సామ ర్థ్యాలను ప్రపంచానికి చాటుతూ మూడు దశాబ్దాలుగా అద్భుత వైమానిక ప్రదర్శన లతో ప్రేక్షకులను ఆకట్టుకుంటోంది. సూర్యకిరణ్ బృందం ప్రారంభంలో "కిరణ్ ఎమ్‌కే-2" విమానాలను ఉప యోగించేది. ఈ విమానాల పేరునుంచే "సూర్య కిరణ్" అనే పేరు వచ్చింది. "సూర్యుని కిరణాలు" అనే అర్థాన్ని సూచించే ఈ పేరు దేశభక్తి, శక్తి, క్రమ శిక్షణకు ప్రతీకగా నిలిచింది. దేశవ్యాప్తంగా అనేక ప్రదర్శనలు నిర్వహిస్తూ భారత వైమానిక దళానికి గుర్తింపుగా ఈ బృందం ఎదిగింది. 2006లో ఈ బృందాన్ని అధికారికంగా "52 స్క్వాడ్రన్ - షార్క్స్"గా గుర్తించారు. అనంతరం 2015లో మరింత ఆధునిక సాంకేతికత కలిగిన "హాక్ ఎమ్‌కే-132" విమానాలను ప్రవేశపెట్టారు. హిందుస్థాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్ తయారు చేసిన ఈ విమానాలు ఆధునిక అవియానిక్స్ వ్యవస్థలు, అధిక వేగ సామర్థ్యం, రంగురంగుల పొగ విడుదల సాంకేతికతతో వైమానిక విన్యాసాలను మరింత ఆకర్షణీయంగా మార్చాయి. గత మూడుదశాబ్దాల్లో సూర్యకిరణ్ బృందం దేశీయంగా మాత్రమే కాకుండా అంతర్జాతీయ వేదికలపై కూడా భారత ప్రతిష్టను చాటింది. శ్రీలంక, మయన్మార్, థాయ్‌లాండ్, సింగపూర్, చైనా, యూఏఈ తదితర దేశాలలో నిర్వహించిన ఎయిర్ షోల్లో ఈ బృందం పాల్గొని ప్రశంసలు అందుకుంది. ముఖ్యంగా చెన్నై తీరప్రాంతంలో నిర్వహించిన వైమానిక 8వ పేజీలో

మాచ్‌ఖండ్ జల విద్యుత్ కేంద్రంలో

# భారీ అగ్నిప్రమాదం..





**కోట్లల్లో ఆస్తి నష్టం..**
**వ్యాక్యూమ్ సర్క్యూట్ బ్రేకర్‌లో షార్ట్ సర్క్యూట్.. పూర్తిగా ఖాళీ బూడిదైన కేబుల్ వైర్లు.. పూర్తిగా నిలిచిపోయిన విద్యుత్ ఉత్పత్తి...**

ముంచంగిపుట్టు, మే 25, ప్రభాతవార్త

ఆంధ్ర ఒడిస్సా రాష్ట్రాలు సంయుక్తంగా నిర్వహిస్తున్న మాచ్ ఖండ్ జలవిద్యుత్ కేంద్రంలో శనివారం మధ్యాహ్నం 12.30 గంటల సమయంలో భారీ అగ్ని ప్రమాదం చోటు చేసుకోవడంతో ప్రాజెక్టుకు కోట్లల్లో ఆస్తి నష్టం సంభవించింది. అందుకు సంబంధించిన వివరాలు ఈ విధంగా ఉన్నాయి. ఆంధ్ర ఒడిస్సా రాష్ట్రాలు సంయుక్తంగా నిర్వహిస్తున్న మాచ్‌ఖండ్ జల విద్యుత్ కేంద్రంలో ఆరు జనరేటర్ల సహాయంతో 120 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తిని నిర్వహిస్తున్నారు. అయితే 1,2,3,4,5, నెంబర్ల జనరేటర్ల సహాయంతో 110 మెగా వాట్ల విద్యుత్ ఉత్పత్తిని చేస్తూ ఆరవ నెంబర్ జనరేటర్ చిన్నపాటి మరమ్మత్తులు చేస్తూ వినియోగంలోకి తెచ్చేందుకు సిబ్బంది 8వ పేజీలో



ఆరిలోవ, ప్రభాతవార్త

ఆరిలోవ ప్రజలకు మెరుగైన తాగునీటి సౌకర్యాల కోసం

# రూ.4 కోట్ల అభివృద్ధి పనులకు శ్రీకారం

**విశాఖ తూర్పు ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబుతో కలిసి శంకుస్థాపన చేసిన విశాఖపట్నం ఎంపీ శ్రీభరత్**

విశాఖపట్నం తూర్పు జోన్ పరిధిలోని అరిలోవ వార్డు నెం.12లో చినగదిలి-దీనదయాళపురం ప్రాంత ప్రజలకు మెరుగైన తాగునీటి సౌకర్యాలు కల్పించే లక్ష్యంతో రూ.4 కోట్ల అంచనా వ్యయంతో చేపడుతున్న కీలక తాగునీటి మౌలిక సదుపాయాల అభివృద్ధి పనులకు విశాఖపట్నం పార్లమెంట్ సభ్యులు మతుకుమిల్లి శ్రీభరత్, విశాఖ తూర్పు ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణ బాబుతో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎంపీ శ్రీభరత్ మాట్లాడుతూ, ముడసర్లోవ రిజర్వాయర్ నుంచి వచ్చే నీటిని పంప్ హౌస్ ద్వారా పైభాగంలో నిర్మించనున్న 700 కిలోలీటర్ల సామర్థ్యంతో కూడిన రిజర్వాయర్‌లో నిల్వ చేసి, అక్కడి నుంచి గ్రావిటీ విధానంలో ప్రజలకు నీటి సరఫరా చేయనున్నట్లు తెలిపారు. ఈ ప్రాజెక్ట్ ద్వారా దీనదయాళపురం, చిన్నగదిలి, సాలిపేట, నేతాజీ కాలనీ, నావల్ హాస్పిటల్ పరిసరాలు, సిద్ధార్థ బీసీ కాలనీతో పాటు అరిలోవ ప్రాంతంలోని సుమారు 5,200 గృహాలకు చెందిన దాదాపు 21 వేల మంది ప్రజలకు నాణ్యమైన తాగునీరు మెరుగైన ఒత్తిడితో అందుబాటులోకి రానుందని పేర్కొన్నారు. రిజర్వాయర్, పంప్ హౌస్ నిర్మాణానికి రూ.4 కోట్లు ఖర్చు అవుతుండగా, పైప్‌లైన్ పనులతో కలిపి మొత్తం ప్రాజెక్ట్ వ్యయం 8వ పేజీలో

# విశాఖలో ఐటీ రంగానికి కొత్త ఊపు..

**కొత్తగా డల్లాస్ టెక్నాలజీ సెంటర్ రాక -డల్లాస్ సహా పలు సాఫ్ట్‌వేర్ కంపెనీలకు ప్రభుత్వం ప్రోత్సాహం -ఏపీ బీజేపీ అధ్యక్షులు పీవీయన్ మాధవ్**



విశాఖపట్నం, ప్రభాతవార్త

విశాఖపట్నం నగరాన్ని అంతర్జాతీయ స్థాయి ఐటీ హబ్‌గా అభివృద్ధి చేయాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగుతోందని ఏపీ బీజేపీ అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్సీ పీవీయన్ మాధవ్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన విడుదల చేసిన ఒక ప్రకటనలో ప్రముఖ "డల్లాస్ టెక్నాలజీ" సాఫ్ట్‌వేర్ సంస్థ విశాఖలో కార్యకలాపాలు ప్రారంభించేందుకు ఆసక్తి వ్యక్తం చేసిందని వెల్లడించారు. సంస్థ ఏర్పాటుకు అవసరమైన భూమి కేటాయింపుపై ప్రభుత్వం ఇప్పటికే అధికారులకు ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయకత్వంలో రాష్ట్రానికి పెట్టుబడులను ఆకర్షించేందుకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నామని, విశాఖను ఐటీ, ఫిన్‌టెక్ మరియు డిజిటల్ సేవల ప్రధాన కేంద్రంగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. డల్లాస్ టెక్నాలజీ వంటి ప్రముఖ సంస్థలు విశాఖకు రావడం ద్వారా స్థానిక యువతకు భారీ స్థాయిలో ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని తెలిపారు. ప్రత్యక్షంగా మరియు పరోక్షంగా వేలాది మందికి ఉపాధి అవకాశాలు ఏర్పడనున్నాయని చెప్పారు. ఐటీ రంగ విస్తరణతో రియల్ ఎస్టేట్, హాస్పిటాలిటీ, ట్రాన్స్‌పోర్ట్, రిటైల్ వంటి అనుబంధ రంగాలు కూడా అభివృద్ధి చెందనున్నాయని ఆయన పేర్కొన్నారు. విశాఖలో ఇప్పటికే ఉన్న మౌలిక సదుపాయాలు, సముద్రతీర నగరంగా ఉన్న ప్రత్యేకత, అనుకూల వాతావరణం పెట్టుబడిదారులను ఆకర్షిస్తున్నాయని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం పరిశ్రమలకు అనుకూల విధానాలతో ముందుకు సాగుతోందని, భవిష్యత్తులో మరిన్ని జాతీయ, అంతర్జాతీయ సంస్థలు విశాఖలో పెట్టుబడులు పెట్టే అవకాశాలు ఉన్నాయని పీవీయన్ మాధవ్ ఆశాభావం వ్యక్తం చేశారు.

**వేల కోట్ల పెట్టుబడులతో భారీ ఉపాధి అవకాశాలు...**

కాగా, విశాఖపట్నం దేశంలో వేగంగా ఎదుగుతున్న ఐటీ గమ్యస్థానంగా మారుతోందని, ప్రముఖ ఐటీ సంస్థలు, టెక్నాలజీ పార్కులు, ఆధునిక మౌలిక వసతుల అభివృద్ధితో నగరానికి భారీ స్థాయిలో పెట్టుబడులు ఆకర్షితమవుతున్నాయన్నారు. రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న ఐటీ హిల్ నం.3 అభివృద్ధి, కాపులుప్పాడ ఐటీ జోన్, రుషికొండ ఐటీ కారిడార్ వంటి ప్రాజెక్టులు విశాఖను అంతర్జాతీయ స్థాయి టెక్నాలజీ కేంద్రంగా తీర్చిదిద్దుతున్నాయని పేర్కొన్నారు.

**ప్రధాన సంస్థలు- పెట్టుబడులు-ఉద్యోగ అవకాశాలు**

**కాగ్నిజెంట్ టెక్నాలజీ సర్వీసెస్...**

కాపులుప్పాడలో సుమారు 22 ఎకరాల విస్తీర్ణంలో కొత్త ఐటీ క్యాంపస్ ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. దాదాపు ?1,500 కోట్ల పెట్టుబడితో రూపొందనున్న ఈ ప్రాజెక్టు ద్వారా 8వ పేజీలో

# పారదర్శక పాలనతో మెరుగైన ఫలితాలు సాధించాలి..



8లో

# సత్యవరంలో ఈదురు గాలుల బీభత్సం



8లో

# చిట్టెంపాడు పంచాయితీలో విజృంభిస్తున్న విష జ్వరాలు

**43 మలేరియా డెంగు కేసులు నమోదు -అప్రమత్తమైన వైద్య సిబ్బంది**



8లో

# పరిశుభ్ర విశాఖే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ కలిసి రావాలి..

**ఆపరేషన్ క్లీన్ స్వీప్ ప్రారంభంలో జిల్లా కలెక్టర్ ఎం.అభిషిక్త్ కిశోర్ -భాగస్వామ్యమైన జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్, ఇతర అధికారులు**

8లో



# సత్యవరంలో ఈదురు గాలులు భీభత్సం

## కొబ్బరి చెట్టు కూలి అరట్లకోట గ్రామానికి చెందిన ఇద్దరు నిరుపేద కూలీలు దుర్మరణం



పాయకరావుపేట, మే 23, ప్రభాతవార్త

మండలంలోని సత్యవరంలో శనివారం సాయంత్రం ఈదురు గాలులు భీభత్సం సృష్టించాయి. పెద్ద ఎత్తున వీచిన ఈ పెనుగాలులకు సత్యవరంలోని తమలపాకులు తోటలో కూలీ పనులు చేస్తోన్న అరట్ల కోట గ్రామానికి చెందిన ఇద్దరు నిరుపేద కూలీలు దుర్మరణం చెందారు. దీంతో అరట్లకోట గ్రామంలో తీవ్ర విషాదచాయలు అలుముకున్నాయి. ఈ దుర్ఘటన కు సంబంధించి పోలీసులు తెలిపిన పూర్తి వివరాలు ఇలా ఉన్నాయి... మండలంలోని అరట్లకోట గ్రామానికి చెందిన గర్లంక ఎరకయ్య అలియాస్ ఓం శాంతి దొరబాబు (41), గెడ్డమూరి శంకర్ (55) లు శనివారం ఉదయం తమ తోటి కూలీలైన గెడ్డమూరి సన్యాసిరావు, వేములు రాంబాబు, చిట్టిపళ్ల రమణలతో కలసి తమ ప్రక్క గ్రామమైన సత్యవరంలోని సఖిలేటి కృష్ణ అనే రైతుకు చెందిన తమలపాకు తోటలో కూలి పని చేయ డానికి వెళ్లారు. వీరు తమలపాకు తోటలో పని చేస్తూ ఉండగా సాయంత్రం నాలుగు గంటల సమయంలో సత్యవరం గ్రామంలో పెద్దఎత్తున వీచిన ఈదురు గాలులు భీబత్సం సృష్టించాయి. బలంగా వీచిన పెను గాలులకు కొబ్బరి చెట్టు కూలి వీరిపై పడటంతో అరట్లకోట గ్రామానికి చెందిన నిరుపేద కూలీలు గర్లంక ఎరకయ్య అలియాస్ ఓం శాంతి దొరబాబు, గెడ్డమూరి శంకర్ సంఘటనా స్థలంలోనే దుర్మరణం చెందారు. ప్రమాద విషయం తెలుసుకున్న వెంటనే సిఐ సాకేటి శంకరరావు, ఎస్ఐ మహమ్మద్ అలీ తమ సిబ్బందితో కలసి సంఘటనా స్థలానికి చేరుకున్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు ప్రారంభించారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం తుని ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి తరలించామని ఏఎస్ఐ జెర్రిపోతుల గోవిందరావు తెలిపారు. బాధిత కుటుంబ సభ్యులను ఓదార్చిన జనసేన నాయకులు గెడ్డం బుజ్జి : పెను గాలులు భీభత్సానికి కొబ్బరి చెట్టు కూలి మృతి చెందిన గర్లంక ఎరకయ్య (ఓం శాంతి దొరబాబు), గెడ్డమూరి శంకర్ కుటుంబ సభ్యులను జనసేన పార్టీ పాయకరావుపేట నియోజకవర్గ ఇంచార్జ్ గెడ్డం బుజ్జి ఓదార్చారు. ప్రమాదం జరిగిన సంగతి తెలుసుకున్న గెడ్డం బుజ్జి సంఘటనా స్థలానికి చేరు కున్నారు. ప్రమాదం జరిగిన తీరును పోలీసులు, అధికారులను అడిగి తెలుసుకున్నారు. మృతుల కుటుం బాలకు అండగా నిలిచి అన్నివిధాలా ఆదుకుంటామని బాధిత కుటుంబాలకు హామీ ఇచ్చారు. ప్రమాదం జరిగిన సంగతి తెలిసిన వెంటనే తెలుగుదేశం పార్టీ అరట్లకోట గ్రామ శాఖ అధ్యక్షులు కట్టా శ్రీను, జనసేన పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు తుమ్మల గణేష్ వెంటనే సంఘటనా స్థలానికి చేరుకొని కుటుంబ సభ్యులను పరామర్శించారు. బాధిత కుటుంబాలను ప్రభుత్వపరంగా అన్నివిధాలా ఆదుకుంటామని తెలిపారు.

# పరిశుభ్ర విశాఖే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ కలిసి రావాలి..

విశాఖపట్నం, మే 23, ప్రభాతవార్త

పరిశుభ్ర విశాఖే లక్ష్యంగా నిర్వహించే ఆపరేషన్ క్లీన్ స్వీప్ కార్యక్రమాల్లో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావాలని జిల్లా కలెక్టర్ ఎం.అభిషిక్త కిశోర్ పిలుపునిచ్చారు. నగరంలో "ఆపరేషన్ క్లీన్ స్వీప్" కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ ఎం. అభిషిక్త కిశోర్, జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్ శనివారం ప్రారంభించారు. ఆర్.కె.బీచ్ పరిధిలోని లుంబినీ పార్కు వద్ద నిర్వహించిన కార్యక్రమంలో అధికారులు, పారిశుధ్య సిబ్బంది పాల్గొని శు భ్రతా చర్యలు చేపట్టారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ సాలిడ్ వేస్ట్ మేనేజ్మెంట్ రూల్స్–2026 అమలుపై సుప్రీంకోర్టు కీలక ఆదేశాల జారీ చేసిందని, దానికనుగుణంగా రాష్ట్ర ప్రభుత్వం పరిశుభ్రత, శాస్త్రీయ వ్యర్థాల నిర్వహణపై మార్గదర్శకాలు అమలు చేస్తున్నట్లు గుర్తు చేశారు. ముఖ్యమంత్రి సూచనల మేరకు నగరంలో సాలిడ్ వేస్ట్ మేనేజ్మెంట్ నిబంధనలను 100 శాతం అమలు చేయడమే లక్ష్యంగా చర్యలు చేపడుతున్నామని పేర్కొన్నారు. రోడ్లు, డ్రైన్లు, ప్రజా ప్రదేశాలు గార్బేజ్ ఫ్రీగా ఉండేలా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు వెల్లడించారు. "ఆపరేషన్ క్లీన్ స్వీప్" పేరుతో ప్రభుత్వం నెల రోజుల ప్రత్యేక ప్రచార కార్యక్రమాన్ని చేపట్టిందని, తొలి వారంలో ఎల్లో పాయింట్స్, రెడ్ పాయింట్స్, గార్బేజ్ డంప్స్ తొలగింపుపై ప్రత్యేక దృష్టి సారించనున్నట్లు తెలిపారు. జిల్లాస్థాయి అధికారుల నుంచి పారిశుధ్య కార్మికుల వరకు అందరినీ భాగస్వామ్యం చేయాలని పిలుపునిచ్చారు. ప్రజల్లో సాలిడ్ వేస్ట్ మేనేజ్మెంట్ నిబంధనలపై అవగాహన కల్పించడం ప్రధాన ఉద్దేశమని చెప్పారు. విశాఖలో ఇప్పటికే వ్యర్థాల నిర్వహణను సమర్థ వంతంగా అమలు చేస్తున్నామని పేర్కొన్న కలెక్టర్ మెర్జ్ విలేజెస్‌లో కనిపిస్తున్న చెత్త కుప్పలను పూర్తిగా తొలగించేందుకు జీవీఎంసీ ప్రత్యేక కార్యాచరణతో ముందుకు సాగుతోందన్నారు. నాలుగు వారాల పాటు "ఆపరేషన్ క్లీన్ స్వీప్" కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహిస్తామని, విశాఖను మరింత పరిశుభ్రమైన నగరంగా తీర్చిదిద్దేందుకు కట్టుబడి ఉన్నామని స్పష్టం చేశారు. స్వచ్ఛ సర్వేక్షణ్–2026 మూల్యాంకనం ఇప్పటికే ప్రారంభమైందని, కేంద్ర గృహ, పట్టణ వ్యవహారాల మంత్రిత్వ శాఖ తరఫున థర్డ్ పార్టీ సర్వేలు కొనసాగుతున్నాయని తెలిపిన ఆయన విశాఖకు మంచి ఫీడ్‌బ్యాక్ ఇచ్చి దేశంలోనే అత్యుత్తమ పరిశుభ్ర నగరంగా నిలబెట్టాలని ప్రజలను కోరారు. స్వచ్ఛ సర్వేక్షణ్‌లో విశాఖకు ఫస్ట్ ర్యాంక్ సాధించేందుకు ప్రజల సహకారం అత్యంత అవసరమని కలెక్టర్ ఈ సందర్భంగా పిలుపునిచ్చారు. జీవీఎంసీ అదనపు కమిషనర్ నల్లనయ్య, సీఎంవో నరేష్ కుమార్, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ డైరెక్టర్లు రామిరెడ్డి, నాగలక్ష్మి పాల్గొన్నారు.

# వర్చువల్ మహానాడులో భాగస్వామ్యులు కావాలి



విశాఖపట్నం, మే 23, ప్రభాతవార్త

వర్చువల్‌గా జరగనున్న మహానాడులో పార్టీ నాయకులు, కార్యకర్తలు భాగస్వామ్యులు కావాలని భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు అన్నారు. ఎంవీపీ కాలనీ క్యాంప్ కార్యాలయంలో శనివారం జరిగిన టీడీపీ క్లస్టర్, కో క్లస్టర్ ఇంచార్జీల సమావేశంలో ఆయన మాట్లాడుతూ నేరుగా పాల్గొనకపోయినా మహానాడులో జరిగే ప్రతి అంశాన్ని వీక్షించడానికి భీమిలి కార్యాలయం సహా నియోజకవర్గంలోని 12 క్లస్టర్లలో తగిన ఏర్పాట్లు చేస్తున్నామని వివరించారు. ఈనెల 27, 28 తేదీల్లో జరిగే మహానాడులో పెద్దఎత్తున వర్చువల్‌గా పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఏయే క్లస్టర్లలో ఎలాంటి ఏర్పాట్లు చేస్తున్నదీ నాయకులను అడిగి తెలుసుకున్నారు. సమావేశంలో పార్టీ నాయకులు చిక్కాల విజయ్ బాబు, సరగడ అప్పారావు, తాట్రాజు అప్పారావు, గంటా నూకరాజు, నాగోతి వెంకట సత్యనారాయణ, పంచదార్ల శ్రీనివాస్, గాడు చిన్ని కుమారి లక్ష్మి, కోరాడ రమణ, కసిరెడ్డి దామోదరరావు, మొల్లి లక్ష్మణరావు, చెట్టుపల్లి సన్యాసిరావు, పాసి త్రినాథ్, మీసాల సత్యనారాయణ, లొడగల వెంకట్రావు, పిల్లా వెంకట్రావు, రామరాజు, జీరు సత్యం, లొడగల జానకిరామ్, పోలిశెట్టి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.


## వార్త CLASSIFIEDS

## CHANGE OF NAME

★ I, MUKALA APARNA W/O MUKALA RAVI KUMAR previously called CHINTAKAYALA VENKATA NARASIMHA SATYAVATHI APARNA R/O 69-17-15B, S2, TEJASWI RESIDENCY, SBI COLONY, GAIGOLUPADU, KAKINADA, now changed my name from CHINTAKAYALA VENKATA NARASIMHA SATYAVATHI APARNA to MUKALA APARNA. Henceforth I will be called as MUKALA APARNA for all purposes. (Ro.No.7645)

★ I, GODE LAKSHMEE NARAYANA S/O GODE SURYANARAYANA, previously called GODE LAKSHMI NARAYANA R/O 6-52-15, SREENIVASA NAGAR, OLD GAJUWAKA, VISAKHAPATNAM, now changed my name from GODE LAKSHMI NARAYANA to GODE LAKSHMEE NARAYANA. Hence forth I will be called as GODE LAKSHMEE NARAYANA for all purposes. (Ro.No.7642)

★ I, KOMMA SOWJANYA W/O GODE LAKSHMEE NARAYANA previously called GODE SEETHA VENKATA SOJANYA R/O 6-52-15, SREENIVASA NAGAR, OLD GAJUWAKA, VISAKHAPATNAM, now changed my name from GODE SEETHA VENKATA SOJANYA to KOMMA SOWJANYA. Henceforth I will be called as KOMMA SOWJANYA for all purposes. (Ro.No.7640)

★ I, BILKISH BHANU W/O SHAIK IBRAHIM BASHA, previously called BILKISH BANU MOHAMMAD R/O 24-57-1, AMBUSARANG STREET, KOTA VEEDHI, VISAKHAPATNAM, now changed my name from BILKISH BANU MOHAMMAD to BILKISH BHANU. Henceforth I will be called as BILKISH BHANU for all purposes. (Ro.No.7639)

★ I, SUBASH GOKIDI S/O RAJESWARA RAO GOKIDI previously called GOKIDI SUBASH RAJESWARA RAO R/O 7-4-299-2, SRISAYANA STREET, BARUVA,SRIKAKULAM, now changed my name from GOKIDI SUBASH RAJESWARA RAO to SUBASH GOKIDI. Henceforth I will be called as SUBASH GOKIDI for all purposes. (Ro.No.7638)

### గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగినరీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో "వార్త" దినపత్రికకు ఏ విధమైన సంబంధం లేదు.


# అబద్ధం...అరాచకం...జగన్ సిద్ధాంతం

7వ పేజీ తరువాయి ..

ఓర్వలేక జగన్ అసత్య ప్రచారాలు చేసి బెంగళూరుకు పారిపోతున్నారని ఎద్దేవా చేశారు. ఐదేళ్ల ఫ్యాక్షన్, శవ రాజకీయాలకు ప్రజలు ఇచ్చిన తీర్పే 11 సీట్లని పల్లా పేర్కొన్నారు. బాబాయి వివేకా హత్య కేసుపై జగన్ వైఖరిలో తడబాటు స్పష్టంగా కనిపిస్తోందని, నిజం బయటపడుతుందనే భయమే దీనికి కారణమని విమర్శించారు. రాష్ట్రంలో నడుస్తోంది రాజారెడ్డి రాజ్యాంగం కాదని, అంబేద్కర్ రాజ్యాంగమని స్పష్టం చేశారు. ఫ్యూడల్ రాజకీయాలను ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరని, 2029లో జగన్‌కు శాశ్వత రాజకీయ సన్యాసం ఖాయమని పల్లా శ్రీనివాసరావు హెచ్చరించారు.

# విశాఖలో ఐటీ రంగానికి కొత్త ఊపు..

7వ పేజీ తరువాయి ..

ప్రారంభ దశలోనే 8,000 మందికి పైగా ఉద్యోగ అవకాశాలు లభించనున్నాయని తెలిపారు.

### టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ (టీసీఎస్)...

విశాఖలో కార్యకలాపాలను మరింత విస్తరించేందుకు 30 ఎకరాల విస్తీర్ణంలో క్యాంపస్ అభివృద్ధికి సుమారు 1,370 కోట్ల పెట్టుబడితో ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు. ఈ ప్రాజెక్టు ద్వారా ప్రత్యక్షంగా 10,000 మందికి పైగా ఉపాధి అవకాశాలు కల్పించనున్నారని పేర్కొన్నారు.

### కె.రహేజా కార్పొరేషన్ ఐటీ పార్క్

రుషికొండలో మల్టీ–టవర్ ఐటీ పార్క్ నిర్మాణం కొనసాగుతోందని తెలిపారు. ఈ ప్రాజెక్టు ద్వారా అంతర్జాతీయ ఐటీ, ఫిన్‌టెక్ సంస్థలను ఆకర్షించే లక్ష్యంతో సుమారు కోట్లకు పైగా పెట్టుబడులు రానున్నాయని చెప్పారు. దశలవారీగా 15,000 మందికి ఉపాధి అవకాశాలు కల్పించే అవకాశం ఉందన్నారు.

### డల్లాస్ టెక్నాలజీ సెంటర్

విశాఖలో త్వరలో కార్యకలాపాలు ప్రారంభించేందుకు సంస్థ సన్నాహాలు చేస్తోందని తెలిపారు. తొలి దశలో సాఫ్ట్‌వేర్ డెవలప్‌మెంట్ మరియు సపోర్ట్ సెంటర్ ఏర్పాటు చేసి సుమారు 2,000 మందికి ఉపాధి అవకాశాలు కల్పించే అవకాశం ఉందన్నారు. విశాఖలో జరుగుతున్న ఐటీ పెట్టుబడులు నగర ఆర్థికాభివృద్ధికి దోహదం చేస్తాయని పీవీయన్ మాధవ్ పేర్కొన్నారు. ఐటీ రంగ విస్తరణతో పాటు రియల్ ఎస్టేట్, రవాణా, హాస్పిటాలిటీ, విద్య వంటి రంగాలు కూడా మరింత వృద్ధి చెందనున్నాయని తెలిపారు. ఐటీ సంస్థలకు అవసరమైన రోడ్లు, విద్యుత్, డేటా కనెక్టివిటీ, స్కిల్ డెవలప్‌మెంట్ వంటి మౌలిక సదుపాయాలను ప్రభుత్వం మరింత బలోపేతం చేస్తోందన్నారు. త్వరలోనే విశాఖపట్నం హైదరాబాద్, బెంగళూరు, చెన్నై, పూణే నగరాలకు ప్రత్యామ్నాయ ఐటీ కేంద్రంగా ఎదుగుతుందని పీవీయన్ మాధవ్ ఆశాభావం వ్యక్తం చేశారు.

# ఆరిలోవ ప్రజలకు మెరుగైన తాగునీటి సౌకర్యాల కోసం

7వ పేజీ తరువాయి ..

సుమారు రూ.5 కోట్లకు చేరుకుంటుందని తెలిపారు. ఎన్నో సంవత్సరాలుగా పరిష్కారం కాని తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపే దిశగా ఈ ప్రాజెక్ట్ కీలక ముందడుగని అన్నారు. భవిష్యత్తులో అర్బన్ ఛాలెంజ్ ఫండ్ కింద అమలు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్న 24/7 నిరంతర తాగునీటి సరఫరా ప్రాజెక్ట్‌లో ఈ ప్రాజెక్ట్‌ను అనుసంధానం చేసి, అరిలోవ ప్రాంత ప్రజలకు నిరంతరాయంగా తాగునీరు అందించే విధంగా చర్యలు తీసుకుంటామని ఎంపీ స్పష్టం చేశారు. ప్రాజెక్ట్ పూర్తయిన అనంతరం ప్రజలకు స్థిరమైన నీటి నిల్వ సదుపాయాలు అందుబాటులోకి రావడంతో పాటు, తాగునీటి సరఫరా మరింత విశ్వసనీయంగా మారనుందని అధికారులు తెలిపారు..విశాఖ తూర్పు ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు మాట్లాడుతూ నియోజకవర్గంలోని కొండవాల్ ప్రాంత ప్రజలు ఎన్నో ఏళ్ళుగా ఎదుర్కొంటున్న తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం లభించబోతోందన్నారు.. పనులు మూడు నెలల్లో పూర్తి చేసి ప్రతి ఇంటికి తాగునీటి సరఫరా అందించనున్నట్లు పేర్కొన్నారు. ప్రస్తుతం గ్రావిటీ ఆధారంగా నీటి సరఫరా వ్యవస్థను అభివృద్ధి చేస్తున్నామని, కొత్త పైప్‌లైన్ల నిర్మాణంతో కొండవాల్ ప్రాంత ప్రజలకు గణనీయమైన ఉపశమనం కలుగుతుందని తెలిపారు. స్థానిక ప్రజలు ఎదుర్కొంటున్న నీటి ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టిందన్నారు. అలాగే విశాఖపట్నం నగరానికి అండర్‌గ్రౌండ్ డ్రైనేజ్, తాగునీటి సరఫరా అభివృద్ధి కోసం అర్బన్ ఛాలెంజ్ ఫండ్ కింద భారీగా నిధులు మంజూరైనట్లు వెల్లడించారు. కార్యక్రమంలో విశాఖ తూర్పు నియోజకవర్గ టిడిపి పార్టీ శ్రేణులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

# పారదర్శక పాలనతో మెరుగైన ఫలితాలు సాధించాలి..

విశాఖపట్నం–ప్రభాతవార్త

పారదర్శక పాలనతో మెరుగైన ఫలితాలు సాధించాలని వీఎంఆర్ డిఎ చైర్మన్ ఎంవి ప్రణవ్ గోపాల్ అధికారులను ఆదేశించారు. ప్రస్తుతం ఉత్తరాంధ్ర అభివృద్ధిలో వుడా అత్యంత కీలక భూమికను పోషిస్తోందని, ప్రజలందరూ సంస్థ చేపడుతున్న ప్రతిఒక్క అభివృద్ధి కార్యక్రమాన్ని నిశితంగా గమనిస్తున్నందున, అదేవిధంగా గ్రామీణ ప్రాంతల అభివృద్ధిపై కూడా ప్రత్యేక దృష్టిసారించామని కాబట్టి నిబంధనల ప్రకారమే ప్రాజెక్టులు పూర్తి చేయాలని సూచించారు. శనివారం సాయంత్రం వి ఎం ఆర్ డిఎ మెట్రోపాలిటన్ కమిషనర్ ఎన్.తేజ్ భరత్‌తో కలిసి విభాగాదిపతులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విఎంఆర్‌డిఎ అధికారులు ఎంతో నిబద్ధతతో పని చేస్తున్నారని, అంతే వేగంగా పనులు పూర్తి చేయాలని సూచించారు. విఎంఆర్‌డిఎ లేఅవుట్‌లలో స్థలాలు కొనుగోలు చేసిన వారికి వెంటనే రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తి చేయాలని ఆదేశించారు. ప్రజల నుంచి వచ్చిన వినతుల పరిష్కారంలో ఎలాంటి అలసత్వం లేకుండా చూడాలని ఆదేశించారు. పార్కుల నిర్వహణ మెరుగుపడాలని సూచించారు. రహదారుల నిర్మాణ పనులు సకాలంలో పూర్తి చేయాలని ఆదేశించారు. విఎంఆర్‌డిఎ మెట్రోపాలిటన్ కమిషనర్ ఎన్.తేజ్ భరత్, మాట్లాడుతూ విఎంఆర్‌డి ఎ పరిధిలో ఉన్న అన్ని నియోజకవర్గాల్లో, మున్సిపాలిటీల్లో అభివృద్ధి పనుల కోసం నిధులు కేటాయించామని, ఆయా పనుల ప్రగతి పై ఎప్పటికప్పుడు సమీక్షించాలని ఆదేశించారు. రానున్న రోజుల్లో అధునాతన సాంకేతికను ఉపయోగించుకొని ప్రతీ విభాగం ద్వారా సమర్థవంతమైన పాలన అందించటం జరుగుతుందని పేర్కొన్నారు. ప్రతిపాదించిన ప్రాజెక్టుల అమలు చేయడం పై దృష్టి సారించాలని సూచించారు. కార్యక్రమంలో కార్యదర్శి మురళీ కృష్ణ, ప్రధాన ఇంజనీర్ వినయ్ కుమార్, పర్యవేక్షక ఇంజనీర్లు మధుసూదనరావు, రాంబాబు, ప్రధాన ప్రణాళికా అధికారిణి శ్రీమతి దివ్యలత, డిఎఫ్ఓ శిరీష, ముఖ్య గణాంకాధికారి హరి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# చిట్టెంపాడు పంచాయితీలో విజృంభిస్తున్న విష జ్వరాలు

విశాఖపట్నం, మే 23, ప్రభాతవార్త

అల్లూరి సీతారామరాజు జిల్లా కొయ్యూరు మండలం చిట్టెంపాడు పంచాయతీలో విష జ్వరాలువిజృంభిస్తుడడం గ్రామస్థులను భయాందోళనల కు గురిచేస్తుంది. రోజుకు సగటున 10 మంది వరకు మలేరియా టైఫాయిడ్ డెంగీ, జ్వరాలు కేసులు నమోదవుతున్నాయి. జ్వర పీడితుల్లో ప్లేట్లెట్స్ సంఖ్య తగ్గిపోవడం వంటి లక్షణాలతో ఆసుపత్రుల్లో చేరు తున్న వారి సంఖ్య రోజురోజుకి పెరిగిపోతుండడం గ్రామస్తులుల్లో గుబులు రేపుతోంది. ఇప్పటికే 43 కేసులు నమోదైనట్లు విశ్వసనీయ సమాచారం బట్టి తెలుస్తుంది పరిస్థితిని గమనించిన వైద్య ఆరోగ్యశాఖ అధికారులు అప్రమత్తం అయి ప్రత్యేక మెడికల్ క్యాంపులు నిర్వహించి, దోమల నివారణ కోసం ఇంటింటికి ఫోగింగ్ స్ప్రేయింగ్ వంటి శుభ్రతా చర్యలు చేపడుతున్నారు. అదేవిధంగా బావులు మంచినీటి వనరుల్లో క్లోరైనేషన్ అపరి శుభ్రతా గల ప్రాంతల్లో బ్లీచింగ్ పౌడర్ చల్లడం వంటి పరిశుభ్రతా కార్యక్రమాలు చేపడుతున్నట్టు వైద్య ఆరోగ్యశాఖ అధికారులు తెలిపారు. తాగునీరు కలుషితమవడం వల్లే విష జ్వరాలు ఎక్కువగా వ్యాపిస్తున్నాయని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. ఈ నేపథ్యంలో తాగునీటి నమూనాలను పరీక్షించి, శుద్ధి చర్యలు చేపట్టాలని ప్రభుత్వం మండల అధికారులను ప్రజలు కోరుతున్నారు.

# మాచ్‌ఖండ్ జల విద్యుత్ కేంద్రంలో ..

7వ పేజీ తరువాయి ..

అంతా పనుల్లో నిమగ్నమై ఉన్నారు. ఆ సమయంలో ప్రాజెక్టులోని వాక్యూమ్ సర్క్యూట్ బ్రేకర్లో ఒక్కసారిగా షార్ట్ సర్క్యూట్ జరగడంతో మంటలు చెల్లరేగాయి. అయితే ఆ సమయంలో ప్రాజెక్టులో విధుల్లో సుమారు 20 మందికి పైగా ఉద్యోగులు, కార్మికులు విధుల్లో ఉన్నారు. మధ్యాహ్నం 12:30 కావడంతో షిఫ్టులు మారే క్రమంలో ఉద్యోగులు కొంతమంది బయటకు వరాగా కొంతమంది లోపలికి వెళ్తున్నారు. అదే సమయంలో ఒక్కసారిగా బ్రేకర్లో షార్ట్ సర్క్యూట్ అయి మంటలు చెలరేగడంతో. కొంతమంది బయటకు పరుగులు తీశారు. కొంతమంది ప్రాజెక్టు లోపల చిక్కుకుపోయారు. క్షణాల్లో మంటలు ప్రాజెక్టునంత చుట్టేయడంతో ఏమి చేయాలో ప్రాజెక్టు కార్మికులకు అధికారులకు తెలియక రక్షించండి అంటూ అందరూ అహంకారాలు చేశారు అయితే బయట ఉన్న మరి కొంత మంది ఉద్యోగులు వారిని రక్షించే ప్రయత్నం చేశారు అయితే పూర్తిగా ప్రాజెక్ట్ అంతా పొగలు కమ్మేయడంతో లోపల కొంతమంది తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. విషయం తెలియడంతో ప్రాజెక్టు వర్గాలు హుటాహుటిన అక్కడికి చేరుకొని లోపల మంటల్లో చిక్కుకున్న కార్మికులను ఉద్యోగులను అతి కష్టం మీద బయటకు తీసుకు రాగలిగారు. ఈ ఘటనలో ఐదుగురు ఉద్యోగులకు గాయాలు అవ్వడంతో పాటు అస్వస్థతకు గురి కావడంతో వారిని హుటాహుటిన ప్రత్యేక అంబులెన్స్ లో వైద్య సేవ నిమిత్తం లమతా పుట్టు ఆసుపత్రికి తరలించారు. అనంతరం అగ్నిమాపక సిబ్బంది ప్రాజెక్టు సిబ్బంది అతి కష్టం మీద మూడు గంటల పాటు శ్రమించి ప్రాజెక్టులో చెలరేగిన మంటలను పొగను అదుపు చేశారు. మార్చ్ కండి ప్రాజెక్టుకు అనుకొని ఉన్న విద్యుత్ యార్డులో ఉన్న 11 కె.వి వాక్యూమ్ సర్క్యూట్ బ్రేకర్ వద్ద భారీ శబ్దంతో పేలుడు సంభవించడంతో ఒక్కసారిగా మంటలు యార్డును చుట్టుముట్టడంతో అది గమనించిన ప్రాజెక్టు సిబ్బంది ట్రాన్స్ఫార్మర్ నుండి ఎగిసిపడుతున్న మంటలను ఆర్పేందుకు ప్రయత్నం చేసినప్పటికీ ఫలితం లేకపోయింది. ఆ మంటలు కాస్త కేబుల్ ద్వారా ప్రాజెక్టులోకి చేరడంతో ప్రాజెక్టులో ఉన్న ప్యానల్ బోర్డులు సైతం షార్ట్ సర్క్యూట్ అయి తీవ్రమైన మంటలు చెలరేగి కేబుల్ మొత్తం పూర్తిగా దగ్ధమయ్యాయి. ఆ సమయంలో ప్రాజెక్టులో అండర్ గ్రౌండ్ భాగంలో ఆరవ నెంబర్ జనరేటర్ మరమ్మత్తులు చేస్తున్న ఉద్యోగులు అందులో చిక్కుకుపోయారు. టర్బైన్ ఫ్లోర్లో చిక్కుకున్న నలుగురు ఉద్యోగులను అక్కడే ఉన్న సెక్యూరిటీ గార్డులు కార్మికులు ప్రాణాలకు తెగించి వారిని ప్రాణాలతో బయటకు తీసుకువచ్చారు. ఘటన విషయాలను ప్రాజెక్టు ఉన్నత అధికారులకు సమాచారం అందించడంతో సంబంధిత ప్రాజెక్ట్ అధికారులు హుటాహుటిన సంఘటన స్థలానికి చేరుకుని సహాయక చర్యలను ముమ్మరం చేశారు. ఈ సంఘటన కారణంగా మాచ్ ఖండ్ జల విద్యుత్ కేంద్రంలో నాలుగు జనరేటర్ల సహాయంతో ఉత్పత్తి జరుగుతున్న 110 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి ఒక్కసారిగా నిలిచిపోయింది. దీంతో ప్రాజెక్టు షట్ డౌన్ అయింది. సంఘటన విషయం తెలుసుకున్న లమతా పుట్టు, నంద పూర్ నుండి అగ్నిమాపక సిబ్బంది హుటాహుటిన సంఘట స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేశారు. ప్రాజెక్టులో 5, 6 వ నెంబర్ జనరేటర్లు విచక్షణ కోల్పోయి వేగంగా తిరగడంతో నీటి ప్రవాహం పెరిగిపోయింది. ఈ విషయం తెలుసుకున్న ప్రాజెక్ట్ ఎస్ ఈ సిహెచ్. అప్పాజీ హుటాహుటిన అక్కడికి చేరుకుని మంటల్లో ఉన్న ప్రాజెక్టును పరిశీలించారు. గాయాల పాలైన వారి వివరాలను తెలుసుకొని వారికి మెరుగైన వైద్య సేవలు అందించాలని ప్రాజెక్ట్ అధికారులకు సూచించారు. జరిగిన సంఘటనపై ప్రాజెక్టు అధికారులను వివరాలను అడిగి తెలుసుకున్నారు. సుమారు 6 గంటల పాటు అగ్నిమాపక సిబ్బంది శ్రమించి మంటలను అదుపు చేశారు. ఈ ఘటనతో ప్రాజెక్టుకు కోట్లల్లో భారీ ఆస్తి నష్టం సంభవించింది. జల విద్యుత్ కేంద్రంలో కంట్రోల్ ప్యానెల్ బోర్డులు పూర్తిగా దగ్ధమైపోయాయి. ప్రాజెక్టు పునరుద్ధరణకు చర్యలు చర్యలు చేపడుతున్నామని. ప్రాజెక్టుకు జరిగిన నష్టాన్ని అంచనా వేయడం జరుగుతుందని. త్వరలోనే ప్యానెల్ బోర్డులను కేబుల్ లను మరమ్మతులు చేసి ప్రాజెక్టును మరల పునరుద్ధరించేందుకు చర్యలు చేపడుతున్నామని ఎస్ ఈ సిహెచ్. అప్పాజీ తెలిపారు. అయితే ఈ సంఘటనలో ఎవరికి ఏమి జరగకపోవడం ప్రాణనష్టం సంభవించకపోవడంతో అందరితో పాటు ప్రాజెక్టు వర్గాలు సైతం ఊపిరి పీల్చుకున్నాయి.

# విశాఖలో ఆకాశాన్ని అలరించనున్న ..

7వ పేజీ తరువాయి ..

ప్రదర్శనను సుమారు 17 లక్షల మంది వీక్షించడం ఒక విశేష ఘట్టంగా నిలిచింది. అలాగే 2026లో హిమాలయ ప్రాంతంపై నిర్వహించిన తొలి వైమానిక విన్యాసం మరో చారిత్రాత్మక ఘట్టంగా గుర్తింపు పొందింది. ప్రస్తుతం ఈ బృందానికి అనుభవజ్ఞుడైన సూ–30 పైలట్ గ్రూప్ కెప్టెన్ అజయ్ దశరథి నాయకత్వం వహిస్తున్నారు. ఆయన మార్గదర్శకత్వంలో సూర్యకిరణ్ బృందం మరింత ప్రతిష్టాత్మక ప్రదర్శనలకు సిద్ధమవుతోంది. విశాఖలో జరగనున్న ఈ వైమానిక విన్యాసాలపై నగర ప్రజల్లో ఆసక్తి నెలకొంది. ఆకాశంలో రంగురంగుల పొగల మధ్య సమన్వయంతో సాగే విమాన విన్యాసాలు ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేయనున్నాయి.

# మహానాడుపై లోకేష్ జూమ్ కాల్‌లో పాల్గొన్న గంటా

విశాఖపట్నం, మే 24, ప్రభాతవార్త



మహానాడు వీక్షణ కార్యక్రమ నిర్వహణలో ఎలాంటి లోటుపాట్లు తలెత్త కుండా చూడాలని విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ కోరారు. రాష్ట్ర వ్యాప్తంగా క్లస్టర్, కో క్లస్టర్ ఇంచార్జుల తో శనివారం ఆయన నిర్వహించిన జూమ్ కాల్‌లో భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు పాల్గొన్నారు. భీమిలిలో 12 క్లస్టర్లు ఉండగా.. ప్రతి క్లస్టర్‌లో నాయకులకు హాజరు తప్పనిసరని స్పష్టం చేశారు. వేదిక మ్యాపింగ్ చేసి.. ఇద్దరు సాంకేతిక నిపుణులను సిద్ధం చేయాలన్నారు. మే 26వ తేదీ సాయంత్రం 4 గంటలకు వీక్షణ కార్యక్ర మాన్ని టెస్టింగ్ చేస్తారు. ఈనెల 27, 28 తేదీల్లో జరిగే మహానాడు వీక్షణ కార్యక్రమ పరిశీలన బాధ్యతను ఎమ్మెల్యేలు తీసుకోవాలని సూచించారు. సీనియర్ పార్టీ నాయకులను, కార్యకర్తలను సన్మానించాలని నిర్ణయిం చారు. వైసీపీ హయాంలో వేధింపులకు గురైన టీడీపీ కుటుంబాలను ఈ సమావేశాలకు ప్రత్యేకంగా ఆహ్వానించాలన్నారు. ఎల్లో బ్రాండింగ్ జోన్ ఏర్పాటు చేసి, క్లస్టర్ స్థాయి సమావేశాలను నిర్వహించాల్సిందిగా చెప్పారు.

# శ్రీ విష్ణు సహస్రనామ పారాయణం

విశాఖపట్నం, మే 24, ప్రభాతవార్త



వన్ టౌన్ రాజప్ప నాయుడు వీధిలో గల శ్రీ గీతా ప్రచార సమితి వారి ఆధ్వర్యంలో శ్రీ గీతా భవనంలో గల శ్రీ గీతా మందిరంలో సుదర్శన హోమ సహిత కోటి విష్ణు సహస్రనామ పారాయణం మంగళధ్వని వేదమంత్రములతో సాంప్రదాయ రీతిలో ఘనంగా నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా అర్చకులు శ్రీకృష్ణార్జున సహిత విశ్వరూప భగవానునికి, లలితాదేవి అమ్మవారికి, నవగ్రహాలకు, అర్చనలు, ప్రత్యేక పూజలు, కుంకుమార్చనలు, హోమములు, పరమేశ్వరునికి అభిషేకములు సాంప్రదాయ రీతిలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ ఆధ్యాత్మికవేత్త ఎంవి రాజశేఖర్, శ్రీ గీతా ప్రచార సమితి అధ్యక్షులు సిహెచ్ విశ్వేశ్వరరావు, కార్యదర్శి ఎం వనజా దేవి, కోశాధికారి జివిఆర్ ప్రసాద్, జి.లక్ష్మీనరసింహ వివిధ ఆధ్యాత్మిక సంస్థల ప్రతినిధులు, సంస్థ మహిళా సభ్యులు స్థానికులు, పరిసర ప్రాంత వాసులు, వివిధ ప్రాంతాల నుండి భక్తులు అధిక సంఖ్యలో విచ్చేసి శ్రీ విష్ణు సహస్రనామం పారాయణ చేస్తున్నారు. విచ్చేసిన వారందరికీ తీర్థ ప్రసాదములు అన్న ప్రసాదము వితరణ చేయడమైనది.















## 26,27 తేదీల్లో గురుకులం ఇంటర్ ప్రవేశానికి అభ్యర్థులకు పాడేరులో కౌన్సిలింగ్

పాడేరు,మే23,ప్రభాతవార్త

అల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరు ఐటిడిఏ పరిధిలో ఉన్న 5 బాలుర, 3 బాలికల గురుకుల కళాశాలల్లో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం ప్రవేశం నిమిత్తం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు కౌన్సిలింగ్ నిర్వహించనున్నట్లు పాడేరు ఐటిడిఏ ప్రాజెక్ట్ అధికారి ఆదిత్య వర్మ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు తమ ఒరిజినల్ ధ్రువపత్రాలతో బాలురు 26 వ తేదీన, 27వ తేదీన బాలికలు పాడేరు ఐటిడిఏ సమావేశ మందిరం నందు హాజరు కావాలని ఆయన తెలియజేశారు. ఇతర వివరముల కొరకు కన్వీనర్ ప్రిన్సిపాల్ 9492929375, గురుకులం సెల్ ఓయస్‌డి 9493758072లను సంప్రదించాలని పీఓ సూచించారు.

## రిటైర్డ్ తెలుగు టీచర్ ప్రభాకర్ రావు అకాల మరణం

పాడేరు,మే23, ప్రభాతవార్త



పాడేరు శ్రీ మోద కొండమ్మ అమ్మవారి ఆలయం ప్రధాన అర్చకులు సుబ్రమణ్యం శాస్త్రి మామ తెలుగు రిటైర్డ్ టీచర్ ప్రభాకరావు శనివారం సాయంత్రం అకాల మరణం చెందారు. కావునా ఆలయ కమిటీ నిర్ణయం మేరకు ఆదివారం అన్న సమారాధన రద్దు చేశామని కావునా భక్తులు గమనించ వలసిందిగా ఆలయ కమిటీ ప్రధాన కార్యదర్శి కోటి బాబు, నిర్వాహకులు కోరారు.

## ముగిసిన సమ్మర్ క్యాంప్....
### విజేతలకు బహుమతుల ప్రధానం

గాజువాక,మే 23,ప్రభాతవార్త



జీవీఎంసీ వుడా కాలనీ వినాయక నగర్ ఓం శాంతి సెంటర్‌లో మూడు రోజులుగా జరిగిన వేసవి శిబిరం (సమ్మర్ క్యాంప్) శనివారంతో ముగిసింది. ఈ శిబిరంలో పిల్లలకు మైండ్ గేమ్స్, పాటలు, డాన్స్, డ్రాయింగ్ పోటీలు నిర్వహించారు. ముగింపు వేడుకలకు ముఖ్య అతిథులుగా హైకోర్టు న్యాయవాది, గాజువాక బార్ అసోసియేషన్ మహిళా ప్రతినిధి అండిబోయిన లక్ష్మి, జిల్లా యాత విభాగ అధ్యక్షులు అండిబోయిన అప్పారావు హాజరై విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా అండిబోయిన లక్ష్మి మాట్లాడుతూ ఓం శాంతి విశ్వ విద్యాలయం వారు పిల్లలకు మెడిటేషన్, దైవభక్తి నేర్పిస్తూ, పోటీల ద్వారా వారిలో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందిం చడం అభినంద నీయమన్నారు. పిల్లలు మంచి మార్గంలో నడుస్తూ ప్రతిభ చాటాలని కోరారు. కార్యక్రమంలో నూకరాజు, ఓం శాంతి అక్కయ్యలు శాంతి, అనురాధ, పిల్లలు తల్లిదండ్రులు పాల్గొన్నారు.


















## ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా పనిచేయాలి : జన సైనికులకు వంపూరు గంగులయ్య పిలుపు

కొయ్యూరు, మే 23, ప్రభాతవార్త



ప్రజల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా జనసైనికులు పనిచేయాలని జనసేన పార్టీ పాడేరు నియోజకవర్గ ఇన్చార్జ్, రాష్ట్ర జానపద కళలు, సృజనాత్మక అకాడమీ ఛైర్మన్ డాక్టర్ వంపూరి గంగులయ్య పిలుపు నిచ్చారు. శనివారం ఆయన మండలంలో పర్యటించారు. ఈ సందర్భం గా గంగులయ్యకు మండల జనసైనికులు భారీగా స్వాగతం పలికారు. అనంతరం ఏర్పాటు చేసిన విస్తృత స్థాయి సమావేశంలో గంగులయ్య మాట్లాడుతూ ప్రజల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా, జనసేన సిద్ధాంతాలను ప్రతి గ్రామానికి చేరవేయాలన్నారు. ఏజెన్సీ ప్రాంతంలో ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ చొరవతో రోడ్లు వేయడం జరిగిందన్నారు. రానున్న రోజుల్లో మరింత అభివృద్ధి జరుగుతుందన్నారు. జనసేన పార్టీ బలోపేతమే లక్ష్యంగా జనసైనికులు పని చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి ఉల్లి సీతారామ్, సీనియర్ నాయకులు వంతల సుబ్బారావు, పార్లమెంట్ ఎగ్జిక్యూటివ్ మెంబర్ గొర్లె వీరవెంకట్, సీనియర్ నాయకులు సీదరి రామ్మూర్తి, మొట్టడం బాలరాజు, గూడెం మండల అధ్యక్షులు బాలు, మాజీ సర్పంచ్ పీటా సింహాద్రి, కొయ్యూరు మండల అధ్యక్షులు గూడెం లక్ష్మణరావు, గౌరవ అధ్యక్షులు సాగిన బుజ్జిబాబు, ప్రధాన కార్యదర్శి గూడెపు శేషుబాబు, వీర మహిళ సెగ్గె సాయిభావన, జుర్రా సూర్యప్రకాష్, సీహెచ్.సిద్దు, రాజేష్, నాగేంద్ర, సువర్ణ, పవన్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## బీజేపీ గిరిజన మోర్చా బలోపేతం చేద్దాం : రాష్ట్ర అధ్యక్షులు పాంగి రాజారావు

పాడేరు,మే23, ప్రభాతవార్త



ఆంధ్రప్రదేశ్‌లో గిరిజన మోర్చా బలోపేతం చెయ్యడానికి గిరిజన మోర్చా జిల్లా నాయకులు కృషి చెయ్యాలి అని రాష్ట్ర గిరిజన మోర్చా అధ్యక్షులు పాంగి రాజారావు పిలునిచ్చారు శనివారం బీజేపీ గిరిజన మోర్చా ఎఎస్సార్ జిల్లా కార్యవర్గ సమావేశం బీజేపీ గిరిజన మోర్చా జిల్లా అధ్యక్షులు లకే అబ్బాయి దొర ఆధ్వర్యంలో పాడేరు బీజేపీ కర్యాలయంలో ఘనంగా నిర్వహించారు. జిల్లా అధ్యక్షులు మఠం శాంతకుమారి మాట్లాడుతూ బీజేపీ గిరిజన మోర్చా జిల్లాలో 11 మండలాలలో బలోపేతం చెయ్యాలి అని పిలుపునిచ్చారు. రాష్ట్ర గిరిజన మోర్చా అధ్యక్షులు పాంగి రాజారావు మాట్లాడుతూ గిరిజన సమస్యలపై గిరిజన మోర్చా పనిచెయ్యాలని రాష్ట్రంలో గిరిజన మోర్చా బలోపేతం చెయ్యాలి అని అన్నారు. ఈ కార్యక్రమంలో జాతీయ కౌన్సెల్ సభ్యులు కురుసా ఉమామహేశ్వరరావు బీజేపీ మైనారిటీ మోర్చా రాష్ట్ర కార్యదర్శి రవికుమార్ పెనుమాక, సర్ కన్వీనర్ సల్లా రామకృష్ణ, జిల్లా ప్రధాన కార్యదర్శి నందోలి ఉమా మహేష్, గిరిజన మోర్చా రాష్ట్ర కార్యదర్శి ఆచూత్, గిరిజన మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి లక్ష్మయ్య, సింహచలం, మైనారిటీ మోర్చా జిల్లా అధ్యక్షులు రాస పాపిటి రాజు గిరిజన మోర్చా జిల్లా పద్ధతికారులు తదితరులు పాల్గొన్నారు.




## 50,51 జంట వార్డులలో అందని ద్రాక్షగా మారిన సమస్యలు
### ప్రజల సమస్యలను పక్కనపెట్టి ఫోటోలకు ఫోజులిస్తున్న నేతలు

మాధవధార, మే 23, ప్రభాతవార్త

జీవీఎంసీ పరిధిలో ఉత్తర నియోజకవర్గంలో ఉన్న 50,51వ వార్డులు జంట వార్డులుగా ఉన్నాయి. ఈ జంట వార్డులలో రోజురోజుకీ సమస్యలు పెరిగిపోతూ అవి అందని ద్రాక్షల్లాగా మారుతున్నాయి. ప్రజల సమస్యలను పట్టించుకునే నాథుడే కరువయ్యాడని ఈ వార్డులలో ప్రజలు వాపోతున్నారు. ప్రజా సమస్యలను పరిష్కరించడం పక్కన పెట్టి ఫోటోలకు ఫోజులివ్వడమే మొదటి ప్రాధాన్యతగా నేతలు ముందుకు వెళ్తున్నారు. అయితే మరోవైపు జీవీఎంసీ వార్డుల పునర్విభజన జరుగుతున్న నేపథ్యంలో నా వార్డు కాదంటే నా వార్డు కాదు అని నేతలు ప్రజల సమస్యలను దీర్ఘకాలికంగా వెనక్కి నెట్టేందుకే చూస్తున్నారు తప్ప వాటిపై చర్చించి సమస్యను పరిష్కారించే దిశగా ముందుకు పోవడం లేదని రాజకీయ వర్గాలలో చర్చానియంశమయింది.

### రోడ్డు దాటితే గాని దొరకని కూరగాయలు ..



50,51 వ వార్డులో ఎన్నో సంవత్సరాల నుంచి రైతు బజార్ ఏర్పాటు చేయాలని ప్రజలు ఎన్నిసార్లు వినతులు ఇచ్చినా వాటిని కింద స్థాయి నాయకులు నామమాత్రంగా తీసుకొని తూత్రమంతంగా ఉన్నత అధికారులకు, నాయకులకు వినతి పత్రాలు అందజేసి ఫోటోలకు పోజు ఇవ్వడమే కనిపిస్తుంది తప్ప సమస్య పరిష్కారం ఎక్కడా కనిపించడం లేదు. మాధవధార,మురళి నగర్,కళింగ నగర్ వాసులు అతి తక్కువ ధరలకు కాయగూరలు కొనుక్కోవాలంటే జాతీయ రహదారి దాటుకుని అటు కంచరపాలెం,ఇటు మరిపాలెం వెళ్లాల్సి ఉంటుంది. జాతీయ రహదారి దాటుకొని వెళ్లే సమయంలో చాలావరకు ప్రమాదాలు జరుగుతున్నాయని జంట వార్డులలో రైతు బజార్ ఏర్పాటు చేయాలని ప్రజలు ఇచ్చిన వినతులు పరిష్కారం కావడంలేదని స్థానికులు వాపోతున్నారు.

### శుభకార్యాలలో సంక్షోభం..

మాధవధార చుట్టుపక్కల ప్రాంతాలలో ఎక్కడ శుభకార్యం జరిగిన సుమారు 2000 మంది జనాభాకు సరిపడేలా మాధవస్వామి కళ్యాణమండపం జీవీఎంసీ ఆధ్వర్యంలో అతి తక్కువకు ప్రజలకు దొరికేది. అయితే ఇప్పుడు ఈ మండపం మరమ్మత్తులకు గురి అయ్యి శుభకార్యాలకు దూరంగా ఉంటుంది. ఒకవేళ శుభకార్యాలకు ఈ భవనం తీసుకున్నప్పటికీ లక్షల రూపాయలలో లైటింగ్ ఇతర పరికరాలు ఏర్పాటు చేసుకోవాల్సి వస్తుంది. మరమ్మత్తులకు గురైన మండపం ఎవరికీ పనికిరాకుండా నిరుపయోగంగా ఉండడం వలన ఇటీవల కాలంలో శుభకార్యాల నిమిత్తం పేద ప్రజలు లక్షల రూపాయలను ఖర్చుపెట్టి ప్రైవేట్ కళ్యాణ మండపాలలో శుభకార్యాలు జరుపుకొని సంక్షోభానికి గురి అయిన సంఘటనలు ఎన్నో ఉన్నాయి. నోటి మాటలే తప్ప మండపాన్నికి పూర్వ వైభవం తీసుకువచ్చే పరిస్థితులు ఎక్కడ కనిపించట్లేదని స్థానికులు వాపోతున్నారు.

### తీర్థం కన్నా ముందు మద్యం దర్శనం..

మాధవధార జలదార వద్ద దారిలో మాధవస్వామి ఆలయం, సింహాచలం దేవస్థానం ఉప ఆలయాలు వేణుగోపాలస్వామి,భైరవ స్వామి,భ్రమరాంబిక మల్లికార్జున స్వామి ఆలయాలు ఉన్నాయి. అయితే మాధవధార 48 బస్టాప్ వద్ద ఇటీవల ఏర్పాటు చేసిన మద్యం దుకాణం వలన బస్టాప్ నుంచి మాధవ స్వామి ఆలయానికి వెళ్లే వరకు ఇరువైపులా రోజు సాయంత్రం చీకటి పడిన తర్వాత మందుబాబులు బహిరంగంగా మద్యం సేవించి బాటిల్స్ ఇష్టానుసారంగా వదిలేస్తున్నారు. దీంతో ఉదయం పూట దేవాలయాలకు వెళ్లే భక్తులకు స్వామి దర్శనం కన్నా,స్వామి తీర్థం కన్నా ముందు రోడ్డుపై మద్యం సీసాలు దర్శనం ఎక్కువగా కనిపించడంతో భక్తులలో భక్తి భావం కోల్పోయి నిరుత్సాహపడు తున్నారు. చుట్టూ కొండ ప్రాంతం, ఆధ్యాత్మిక వాతావరణం కలిగిన దేవాలయాలు, నిత్యం ప్రవహించే జలధారతో మాధవధార ప్రాంతాన్ని పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దాలని ప్రజలు ఎంత కోరుతున్నప్పటికీ ఇక్కడ నాయకులలో కనీసం ఆ ఆలోచన లేదని ప్రజలు అపోతున్నారు.

### మందుబాబులకు అడ్డాగా మారుతున్న ఇసుక స్టాక్ పాయింట్లు

మాధవధార 48 బస్ స్టాప్ నుండి జలధారకు, కళింగ నగర్‌కు వెళ్లే రహదారిలో సుమారు ఐదు ఇసుక స్టాక్ పాయింట్లు ఉన్నాయి. ప్రతిరోజు చీకటి పడిన తరువాత ఈ ఇసుక స్టాప్ పాయింట్ వద్ద నిర్మానుష ప్రదేశం ఉండడంతో అక్కడ మందుబాబులకు అడ్డాగా మారుతుంది. చీకటి పడిన తర్వాత నుంచి అర్ధరాత్రి వరకు ముందు బాబులు ఈ ఇసుక స్టాప్ పాయింట్ల వద్ద కూర్చుని ఫుల్లుగా మద్యం సేవించి ఆ మందు సీసాలను అక్కడే చెట్ల మధ్యలో పడి వేస్తున్నారు. అంతేకాకుండా మాధవ స్వామి కళ్యాణ మండపం చుట్టుపక్కల ప్రదేశంలో,జలదారికి వెళ్లే రహదారిలో రోడ్డుకు ఇరువైపులా చీకటి పడిన తర్వాత నిర్మానుష ప్రదేశంలో రోడ్లపై ఎక్కడపడితే అక్కడ మద్యం,గంజాయి సేవించి బాటిల్స్ వదిలేస్తున్నారు. ఉదయం పూట వాకింగ్ కు వచ్చే వాకర్స్, బాక్సింగ్ కు వచ్చే క్రీడాకారులు రోడ్లపై విరిగిపోయిన మద్యం సీసాలతో పలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

## బొత్స జగదీష్‌కు భాజపా ఓబీసీ మోర్చా జిల్లా బాధ్యతలు



గాజువాక, మే 23,ప్రభాతవార్త

విశాఖ జిల్లా భాజపా ఓబీసీ మోర్చా జిల్లా కార్యదర్శిగా బొత్స జగదీశ్, గాజువాక నియోజకవర్గ లీగల్ సెల్ ఇంచార్జిగా పతివాడ జయకృష్ణ నియమితులయ్యారు. శనివారం గాజువాక పార్టీ కార్యాలయంలో నియోజకవర్గ కన్వీనర్ కరణంరెడ్డి నరసింగరావు (కేఎన్నార్) అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు రోనంకి విజయచంద్రుడు వీరికి నియామక పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా నేతలు మాట్లాడుతూ.. భాజపాకు ఓబీసీలే మూలస్తంభా లని, పార్టీ బలోపేతంలో కీలక పాత్ర పోషించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఒమ్మి రంగనాయకులు, కొల్లి మనోహర్, పేర్ల సత్యారావు తదితరులు పాల్గొన్నారు.

## విశాఖలో ఘనంగా 19వ రోజ్‌గార్ మేళా
### 190 మందికి కేంద్ర ప్రభుత్వ నియామక పత్రాల పంపిణీ

విశాఖపట్నం, మే 23,ప్రభాతవార్త



విశాఖపట్నంలో 19వ జాతీయ రోజ్‌గార్ మేళా శనివారం ఘనంగా నిర్వహించారు. రైల్వే శాఖ ఆధ్వర్యంలో నగరంలో వున్న ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్మెంట్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో కేంద్ర ప్రభుత్వ వివిధ శాఖల్లో ఎంపికైన 190 మంది అభ్యర్థులకు నియామక పత్రాలు అంద జేశారు. దేశవ్యాప్తంగా వీడియో కాన్ఫరెన్స్ ద్వారా నిర్వహించిన ఈ కార్యక్రమంలో ప్రధానమంత్రి నరేంద్ర మోడీ పాల్గొని, దేశవ్యాప్తంగా 51 వేల మందికి పైగా యువతకు నియామక పత్రాలు పంపిణీ చేశారు. వాల్తేరు డివిజన్ డివిజనల్ రైల్వే మేనేజర్ లలిత్ బోహ్రా అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఐఐఎం విశాఖపట్నం డైరెక్టర్ ఎం.చంద్రశేఖర్, డైరెక్టర్ (పీ అండ్ ఎల్) ఎస్.ఎస్.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు. రైల్వేలు, తపాలా శాఖ, విద్యా శాఖ, ఆరోగ్య శాఖ, హోం వ్యవహారాల శాఖ, ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా తదితర విభాగాలలో ఎంపికైన అభ్యర్థులకు నియామక పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ప్రసంగించిన ప్రధాన మంత్రి యువత "వికసిత భారత్-2047" లక్ష్య సాధనలో కీలక పాత్ర పోషించాలని పిలుపునిచ్చారు. ప్రజాసేవలో నిజాయితీ, క్రమశిక్షణ, సేవాభావం పాటించాలని కొత్త ఉద్యోగులకు సూచించారు.

## విశాఖ-అనకాపల్లి జోన్ -1 తెలుగుదేశం పార్టీ కో-ఆర్డినేటర్‌గా బాధ్యతలు చేపట్టిన ప్రభుత్వ విప్
### ఇచ్ఛాపురం ఎమ్మెల్యే బేందాళం అశోక్‌కి ఘనంగా స్వాగతం పలికిన జిల్లా నాయకులు



విశాఖపట్నం, మే 23,ప్రభాతవార్త

విశాఖ-అనకాపల్లి జోన్-1 కోఆర్డినేటర్‌గా బాధ్యతలు స్వీకరించి మొదటి సారి తెలుగుదేశం పార్టీ విశాఖ పార్టీ కార్యాలయంనకు విచ్చేసిన బెందాలం అశోక్‌కి తెలుగుదేశం పార్టీ ఘన స్వాగతం పలికి అయనను సత్కరించారు. ఇచ్ఛాపురం ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ అశోక్ నూతనంగా విశాఖపట్నం అనకాపల్లి పార్లమెంటు కో-ఆర్డినేటర్‌గా మొదటిసారిగా జిల్లా పార్టీ కార్యాలయానికి విచ్చేశారు. ముఖ్యంగా దండాల అశోక్ క్రింద స్థాయి నుంచి రాష్ట్రస్థాయి వరకు క్యాడర్‌ను సమాయత్తం చేసి జీవీఎంసీ ఎలక్షన్లో గాని భవిష్యత్తు ఎమ్మెల్యే ఎలక్షన్స్‌లో గాని పార్టీ విజయానికి కృషి చేస్తానని తెలియజేశారు. అలాగే తెలుగుదేశం పార్టీకి పండుగ అయిన ఎన్టీఆర్ జయంతి సందర్భంగా ఏర్పాటు చేసుకోబోతున్న మహా నాడు మొట్టమొదటిసారిగా వెర్చువల్లా జరగబోతుంది. క్లస్టర్ స్థాయిలో ప్రతి ఒక్కరు కూడా ఎవరు వారి పరిధిలో ఘనంగా నిర్వహించాలని పిలుపునిచ్చారు. ఎవరికి ఎటువంటి ఎవరికి సమస్య వచ్చినా అలగకుండా కక్షలు పెంచుకోకుండా నేరుగా నాకు తెలియజేస్తే సమస్యను పరిష్కరిస్తానని తెలియజేసారు. ఈ కార్యక్రమంలో విశాఖ పార్లమెంటు అధ్యక్షులు చోడే వెంకట పట్టాభిరామ్, విశాఖ తూర్పు శాసనసభ్యులు వెలగపూడి రామకృష్ణ బాబు, విశాఖ దక్షిణ నియోజకవర్గ ఇన్చార్జ్ సీతమ్మరాజు సుధాకర్,మాజీ మేయర్ పీలా శ్రీనివాసరావు, జాతీయ తెలుగుదేశం పార్టీ ఉపాధ్యక్షులు మహమ్మద్ నజీర్, విశాఖ పార్లమెంటు ప్రధాన కార్యదర్శి లోడగల కృష్ణ, రాష్ట్ర పార్టీ కార్యనిర్వ కార్యదర్శిలు కోరాడ రాజబాబు, పుచ్చా విజయ్ కుమార్, రాష్ట్ర పార్టీ కార్యదర్శి ఈతలపాక సుజాత, సర్వసిద్ధి అనంతలక్ష్మి, వానపల్లిగాయత్రి పని కుమారి, మాజీ కార్పొరేటర్లు లేళ్ళ కోటేశ్వరరావు, గంధం శ్రీనివాసరావు, పల్లా శ్రీనివాసరావు, గొల్ల గాని వీరారావు బుజ్జి, ఒమ్మి పోలరావు,మొల్లి లక్ష్మణరావు, ఆళ్ల శ్రీనివాసరావు, కోడూరు అప్పలనరసమ్మ, జిల్లా పార్టీ నాయకులు కరణం సత్య రావు, కోట నరేష్, బమ్మిడిఉమా, గరికిన ఎల్లయ్య, అబ్దుల్ అనీఫ్, విల్లూరి భాస్కరరావు, పిడుగు మంగ లక్ష్మి, పాత్ర ధర్మారావు, నక్కరాజు చిన్న రాము, నక్క కనకరాజు, గనగళ్ళ సత్య, కెడేపల్లివరలక్ష్మి,కార్పొరేషన్ డైరెక్టర్లు సీఎం రమణ, అనసూరి మధు, బుడిమూరి గోవింద్, విల్లురి చక్రవర్తి, దాసరి సత్యనారాయణ, పి జయరాజ్ జాన్, ఒమ్మి పోలరావు, మహమ్మద్ గౌస్, ఎర్నాగుల జగదీష్, మొల్లేటి కుమారస్వామి, తోట శ్రీదేవి, దాసరి శివశంకర్, తాడి వేణుకుమారి,అను సుమిత్ర, తదితరులు పాల్గొన్నారు.

## రేపటి నుంచి 12 రోజులు పాటు వేసవి క్రీడా శిక్షణ శిబిరాలు

మాధవధార, మే 23, ప్రభాతవార్త



జీవీఎంసీ ఆధ్వర్యంలో రేపటి నుంచి జూన్ 6 వరకు 12 రోజులు పాటు వేసవి క్రీడా శిక్షణ శిబిరాలు నిర్వహించనున్నారు. ఇందులో భాగంగా మాధవధారలో గల భారతీయ వ్యాయామ మండలి ఆధ్వర్యంలో కళ్యాణ్ ఫంక్షన్ హాల్ పక్కన వేసవి శిక్షణ శిబిరం ఏర్పాటు చేస్తున్నట్టు జాతీయ వెయిట్ లిఫ్టింగ్ ఫెడరేషన్ ఉపాధ్యక్షుడు కంచరాన సూర్య నారాయణ శనివారం తెలిపారు. రోజు ఉదయం 6 గంటల నుంచి 8 గంటల వరకు వెయిట్ లిఫ్టింగ్, బాడీ బిల్డింగ్, పవర్ లిఫ్టింగ్, జనరల్ ఫిట్నెస్ లలో శిక్షణ ఇవ్వనున్నారు. ఈ శిబిరంలో శిక్షణకు హాజరయ్యే క్రీడాకారులకు ఉడికిన కోడి గుడ్డు, బిస్కెట్ ప్యాకెట్, పప్పు చెక్కి, టీ షర్టుతో పాటు శీతల పానీయాలు ఇవ్వ నున్నట్లు సూర్యనారాయణ పేర్కొన్నారు. ఆసక్తి గల క్రీడాకారులు 986625 1112కు ఫోన్ చేసి తమ పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. శిక్షణ ఈఅనంతరం ముగింపు రోజున మెరిట్ సర్టిఫికెట్లు కూడా అందజేయనున్నట్లు పేర్కొన్నారు. శిక్షణ శిబిరంలో అసిస్టెంట్ కోచ్‌లుగా డి.నారాయణ,బి.సంతోష్‌లు వ్యవహరించనున్నారు.

## జీవీఎంసీ 60వ వార్డులో 'ఆపరేషన్ క్లీన్ స్వీప్'



గాజువాక,మే 23,ప్రభాతవార్త

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న "ఆపరేషన్ క్లీన్ స్వీప్" కార్యక్రమం శనివారం 60వ వార్డు పరిధిలో ఘనంగా జరిగింది. రాష్ట్ర ముఖ్యమంత్రి దూరదృష్టితో, స్వచ్ఛమైన ఆరోగ్యకరమైన ఆంధ్రప్రదేశ్ నిర్మాణ లక్ష్యంగా ఈ పారిశుధ్య డ్రైవ్ నిర్వహించ బడింది. వార్డులో తడి-పొడి చెత్త వేరు చేయడం పారిశుధ్యంపై ప్రజల్లో అవగాహన కల్పించారు. 60వ వార్డు టీడీపీ ప్రెసిడెంట్ మాత శ్రీను మాట్లాడుతూ స్వచ్ఛమైన నగర నిర్మాణానికి ప్రజల భాగస్వామ్యం ఎంతో అవసరమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి కొమ్మోజు కుమార్, నాయకులు కోలాట రామ్ శంకర్, పి.లక్ష్మి నారాయణరావు, వి.కనకరాజు, ఎంఐ జి.శంకర్, జి అప్పల నాయుడు, శానిటరీ ఇన్స్పెక్టర్ ఊరుకోటి సతీష్ కుమార్ సూపర్‌వైజర్లు శ్రీరాములు, వీరబాబు, భారతి, వసంత, సెక్రటరీలు సత్తిబాబు, కుమార్ శానిటరీ వర్కర్లు రమణ, రాజు, సూరిబాబు, లావణ్య, భీముడు శానిటరీ సిబ్బంది పాల్గొన్నారు.

## భైరవవాక క్లీన్ స్వీప్‌లో పాల్గొన్న గంటా, నాగబాబు



సింహాచలం, మే 23, ప్రభాతవార్త

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకునే దిశగా ప్రజలను చైతన్యం చేయాలని భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాస రావు పిలుపునిచ్చారు. సింహాచలం సమీపంలోని భైరవవాక ఆలయ పరిసరాల్లో క్లీన్ స్వీప్ స్వచ్ఛత కార్యక్రమంలో ఎమ్మెల్సీ కొణిదల నాగబాబు తో కలిసి శనివారం ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్లాస్టిక్ వినియోగం ఎంత ప్రమాదకరమో పాఠశాల దశ నుంచే విద్యార్థులందరికీ తెలియజెప్పాల్సిన అవసరం ఉందన్నారు. వెయిటేజీ మార్కులిస్తే మరింత చైతన్యం తీసుకురావడానికి అవకాశం ఉంటుందని,క్లీన్ స్వీప్‌ను విజయవంతం చేయాలని కోరారు. ప్రతి రోజు వేలాది మంది భక్తులు భైరవవాక ఆలయ దర్శనానికి వస్తున్న నేపథ్యంలో వారికి కనీస సౌకర్యాలు కల్పించాల్సిన అవసరముందని నాగబాబు పేర్కొన్నారు. అటవీ శాఖ నిబంధనల కారణంగా ఆలయ పరిసరాల్లో ఎలాంటి పనులు చేసే అవకాశం లేదని గంటా తెలిపారు. డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని నాగబాబు చెప్పారు. ప్లాస్టిక్ సంచుల స్థానంలో గుడ్డ సంచులు వాడాలన్నారు. పారిశుధ్య కార్మికులతో కలిసి చీపుర్లతో ఆలయ పరిసరాల్లో ఉన్న చెత్తను గంటా, నాగబాబులు శుభ్రం చేశారు. జోనల్ కమిషనర్ అయ్యప్ప నాయుడు, కూటమి నేతలు చిక్కాల విజయ్ బాబు, పంచకర్ల సందీప్, ఘట్టమనేని సుభాష్ చంద్రబోస్, శాఖారి శ్రీనివాస్, పంచదార్ల శ్రీనివాస్, చెట్టుపల్లి గోపీ, గాడు చిన్ని కుమారి లక్ష్మి, కసిరెడ్డి దామోదరరావు, కృష్ణయ్య, లొడగల వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.










## పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి : ఎంపీడీవో




(ఎస్ రాయవరం, మే 23, ప్రభాతవార్త ): మండలం భీమవరం గ్రామ పంచాయతీలో స్వర్ణ ఆంధ్ర,స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం ఎం పి డి ఓ పి. మీనా కుమారి ఆధ్వర్యంలో ఓ డి ఎఫ్ ప్లస్ మోడల్ గ్రామంలో గల సంపద తయారీ కేంద్రం.వ్యక్తి గత మరుగు దొడ్ల నిర్మాణం, శానిటేషన్ కార్యక్రమాలు మొదలైన వాటిని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రతీ ఒక్కరూ పరిసరాలను శుభ్రంగా ఉంచడం తమ బాధ్యతగా భావించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో బంగారు సత్యనారాయణ, పంచాయతీ కార్యదర్శి నాగమణి, ఆర్డబ్ల్యూఎస్, శ్రీనివాసు. డ్వాక్రా సిబ్బంది. గ్రామ పెద్దలు, పంచాయతీ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## నూకాంబికను దర్శించుకున్న ఇచ్ఛాపురం ఎమ్మెల్యే



అనకాపల్లి, మే 23 (ప్రభాతవార్త): శ్రీకాకుళం జిల్లా ఇచ్ఛాపురం నియోజకవర్గం ఎమ్మెల్యే (ప్రభుత్వ విప్) బెందాలం అశోక్ ఇటీవల విశాఖపట్నం , అనకాపల్లి జిల్లాల పార్టీ జోనల్ కో–ఆర్డినేటర్ గా నియమితులైన సందర్భంగా తొలిసారి అనకాపల్లి విచ్చేసిన సందర్భంగా వారికీ అనకాపల్లి పార్లమెంట్ టీడీపీ అధ్యక్షులు , రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ బత్తుల తాతయ్య బాబు , రాష్ట్ర అర్బన్ ఫైనాన్స్ , ఇన్ఫ్రాస్ట్రక్చర్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ పీలా గోవింద సత్యనారాయణ పుష్పగుచ్ఛం అందజేసి ఘన స్వాగతం పలికారు. ముందుగా ఉత్తరాంధ్ర ఇలవేల్పు శ్రీ నూకాంబిక అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు వారికి అమ్మవారి చిత్రపటాన్ని బహూకరించారు. అనంతరం తెలుగుదేశం పార్టీ పార్లమెంట్ కార్యాలయంలో పార్టీ వ్యవస్థాపకులు స్వర్గీయ నందమూరి తారక రామారావు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. నూతనంగా నిర్మితమవుతున్న అనకాపల్లి జిల్లా తెలుగుదేశం పార్టీ పార్లమెంట్ కార్యాలయాన్ని, నిర్మాణ పనులను వారు సందర్శించారు.అనంతరం పార్లమెంటూ టీడీపీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో బెందాళం అశోక్ మాట్లాడుతూ ఈ నెలలో 27,28 తేదీల్లో నిర్వహించే వర్చువల్ మహానాడు కార్యక్రమాలను విజయవంతం చేయాలి. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలలో కూటమి అభ్యర్థులను అత్యధిక మెజార్టీతో గెలిపించుకోవాలని పిలుపునిచ్చారు. జిల్లా అధ్యక్షులకు పార్లమెంట్ పరిధిలో ఉన్న నియోజకవర్గాల ఎమ్మెల్యేలకు ఇన్చార్జిలకు పార్టీ నాయకులకు అందరికీ అందుబాటులో ఉంటానని అన్నారు. ఈ కార్యక్రమంలో వారితో పాటు టీడీపీ పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి లాలం కాశీనాయుడు , కార్పొరేషన్ చైర్మన్లు మళ్ళ సురేంద్ర , పివిజి కుమార్ , మాజీ ఎమ్మెల్సీ బుద్ధ నాగ జగదీశ్వరరావు , మాజీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి దాడి రత్నాకర్ , ఉమ్మడి విశాఖ డీసీఎంఎస్ చైర్మన్ కోట్ని బాలాజీ , రాష్ట్ర కార్యదర్శి కొణతాల రత్నకుమారి అనకాపల్లి జిల్లా తెలుగుదేశం పార్టీ కమిటీ సభ్యులు, టీడీపీ నాయకులు కార్యకర్తలు మహిళలు పాల్గొన్నారు.

## 32 కేజీల గంజాయి పట్టివేత



నర్సీపట్నం,మే 23,ప్రభాతవార్త: నర్సీపట్నం ఆటోలో అక్రమంగా తరలిస్తున్న 32 కేజీల గంజాయిని పట్టుకున్నామని నర్సీపట్నం డీఎస్పీ పీ.శ్రీనివాసరావు తెలిపారు. శనివారం ఈ గంజాయి కేసు వివరాలను వెల్లడించారు. ఎస్పీకి ముందుగా వచ్చిన సమాచారం మేరకు నర్సీపట్నం రూరల్ సీఐ ఎల్. రేవతమ్మ, గొలుగొండ ఎస్సై రామారావు, కృష్ణదేవిపేట ఎస్సై రుషికేశ్వరరావు ఆధ్వర్యంలో పోలీస్ సిబ్బంది మండలంలోని చిన్నయ్యపాలెం జంక్షన్ వద్ద వాహన తనిఖీలు నిర్వహించారన్నారు. ఈ నేపథ్యంలో ఏపీ 31 టీసీ 0658 నెంబరు గల ఆటోను తనిఖీ చేయగా ఆటోలో రహస్య అర తయారు చేసి అందులో 32 కేజీల గంజాయిని అమర్చినట్లు గుర్తించారన్నారు. దీంతో ఆటో నడుపుతున్న పాంగి రామమూర్తిని పట్టుకోగా మిగిలిన ఇద్దరు తప్పించుకొని పారిపోయారన్నారు. ఏఓబి ప్రాంతంలో గంజాయిని కొనుగోలు చేసి పప్పులూరు, పినపాడు, లోతుగెడ్డ, బూదరాళ్ల, రింతాడ, కృష్ణదేవిపేట, చిన్నయ్యపాలెం, నాతవరం, కోటనందూరు గ్రామాల మీదుగా తుని రైల్వేస్టేషన్‌కు తరలించే క్రమంలో ఇక్కడ పట్టుబడ్డారన్నారు. పరారీలో ఉన్న వారిని కూడా పట్టుకుంటామని చెప్పారు. గంజాయిని స్వాధీనం చేసుకొని ఆటో, ఒక మొబైల్ ఫోన్ సీజ్ చేశామన్నారు. సమావేశంలో రూరల్ సీఐ రేవతమ్మ, ఎస్సై రామారావు పాల్గొన్నారు.

## తక్షణమే వైద్య కళాశాల నిర్మాణం పూర్తి చేయాలి



### తెలుగు శక్తి అధ్యక్షుడు బివి.రామ్

నర్సీపట్నం,మే 23,ప్రభాతవార్త: ప్రభుత్వాలు ఏవైనా ప్రజా సంక్షేమం కోసమే పాటు పడాల్సిన అవసరం ఉందని తెలుగు శక్తి అధ్యక్షుడు బి.వి.రామ్ వ్యాఖ్యానించారు. 2022లో అప్పటి వైసిపి ప్రభుత్వం నిర్మాణం ప్రారంభించిన నర్సీపట్నం మండలం మాకవరపాలెంలోని వైద్య కళాశాల నిర్మాణాలను శనివారం పరిశీలించారు. క్షేత్ర స్థాయి పర్యటన అనంతరం రామ్ మీడియాతో మాట్లాడుతూ.. జగన్ ప్రభుత్వం నిర్మాణాలు ప్రారంభించిన కొద్ది కాలం తర్వాత ప్రజలు వైసీపీని గద్దె దించిన సంగతి తెలిసిందేన్నారు. అయితే ప్రజలు ఎంతో విశ్వాసంతో కూటమి ప్రభుత్వాన్ని గెలిపిస్తే ప్రజలకు మౌలిక వసతులలో ఒకటైన వైద్యానికి ప్రాధాన్యత ఇవ్వకపోవడం దారుణమన్నారు. నర్సీపట్నంలో ఇప్పటికీ నిర్మాణం పూర్తికాని వైద్య కళాశాల భవనాలే కూటమి ప్రభుత్వం అనుసరిస్తున్న వైఖరికి ఒక ప్రత్యక్ష ఉదాహరణ అని అన్నారు. స్థానిక ఎమ్మెల్యే, శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు ప్రాతినిధ్యం వహిస్తున్న నర్సీపట్నం ప్రాంతంలోనే పరిస్థితి ఇలా ఉండడం విచారకరమని పేర్కొన్నారు. వైద్య కళాశాల అందుబాటులోకి వస్తే ముఖ్యంగా స్థానికంగా ఉన్న ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. వంద లాది మంది నర్సీపట్నం వైద్య కళాశాల కేంద్రంగా మంచి నైపుణ్యం గల వైద్యులుగా సమాజానికి ఉపయోగపడతారన్నారు.అంతేకాకుండా వైద్య కళాశాల చుట్టుపక్కల ప్రత్యక్షంగా పరోక్షంగా ఉపాధి అవకాశాలు కూడా లభిస్తాయని, ఈ సందర్భంగా రామ్ అంచనా వేశారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం తక్షణమే స్పందించాలని, శాసనసభ స్పీకర్, ఎమ్మెల్యే చింతకా యల అయ్యన్నపాత్రుడు కూడా వైద్య కళాశాల నిర్మాణం పూర్తయ్యాలే చూడాలని కోరారు.కార్యక్రమంలో చిందాడ నూకేశ్వరరావు, బొల్లినేని వెంకటేశ్వరరావు, కే.వినోద్, కే.వెంకట్రావు, తదితరులు పాల్గొన్నారు.

## రోగుల కోసం వాటర్ కూలర్ ప్రారంభం



అగనంపూడి, ప్రభాతవార్త: అగనంపూడి ఏరియా హాస్పిటల్ లో రోగులు కోసం వాటర్ కూలర్ శనివారం హాస్పటల్ సూపరింటెంట్ డాక్టర్ గోపికృష్ణ ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రోజు వందల మంది హాస్పిటల్ కి వస్తుంటారని, ఇన్ పేషెంట్, వాడు బంధువులు కూడా ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని ఆయన అన్నారు. కార్యక్రమంలో ఏవో రవి రాజు, హాస్పిటల్ డైరెక్టర్లు డొక్కా రమేష్, దాసరి త్రినాథ్, హోసూర్ తాతారావు, కోసూరు తాతారావు, తదితరులు పాల్గొన్నారు.

## ఉత్సాహంగా వేసవి శిక్షణ శిబిరం



నర్సీపట్నం,మే 23,ప్రభాతవార్త: నర్సీపట్నం శాఖా గ్రంథాలయంలో వేసవి శిక్షణ శిబిరాన్ని గ్రంథాలయాధికారి పీ.దమయంతి ఆధ్వర్యంలో ఉత్సాహంగా నిర్వహిస్తున్నారు. ఈ మేరకు శనివారం జరిగిన ఈ శిబిరంలో విద్యార్థులచే కొంతసేపు నీతి కథలను చదివించారు. రిసోర్స్ పర్సన్ బిఎస్.ప్రసాద్ మాస్టర్ చదరంగంలో పావులను కదిపే పద్ధతిని ఏ విధంగా రాసుకోవాలో రాసి చూపించారు. పెద్ద పెద్ద టోర్నమెంట్స్ ఆడినప్పుడు ఈ పద్ధతిని ఉపయోగిస్తారని వివరించారు. యోగా శిక్షకుడు ఎల్.రాజుబాబు ఈరోజు యోగాలో ధారణ పద్ధతి ద్వారా శ్వాస మీద ధ్యాస ఎలా ఉంచాలో వివరించారు. ఈ సందర్భంగా 10 నిమిషాలు విద్యార్థులచేత చేయించారు. విశ్రాంత వ్యాయామ ఉపాధ్యాయుడు పీ.ప్రభాకర్ మనకు మేలు చేసిన వానికి ఎన్నడు హాని తలపెట్టకూడదని కథ ద్వారా వివరించారు. గ్రంథాలయాధికారిని విద్యార్థులందరి చేత డ్రాయింగ్ వేయించారు. విద్యార్థులంతా ఉత్సాహంగా పాల్గొన్నారు.

## మురుగు కాలువులపై ఆక్రమణల తొలగింపు



(ఎస్. రాయవరం,మే 23, ప్రభాతవార్త ): మండలంలోని అడ్డురోడ్డు తిమ్మాపురం గ్రామంలో మురుకు కాలు పై ఆక్రమణలు తొలగించడం ప్రారంభించారు . స్థానిక పంచాయతీవారి ఆధ్వర్యంలో కాలువపై ఉన్న చిన్న చిన్న షాపులతోపాటు, సిమెంటు పలకలు తొలగించి, కాలువలో ఉన్న చెత్తను తీయించారు. కాలువలో ఎప్పటినుండో చెత్త నిలవ ఉండడంతో దుర్వాసన నిండుకొని ఉండేదని, ఈ పూడిక తీయడం పట్ల గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు . ట్రాఫిక్ అంతరాయం లేకుండా ఎస్సై రమేష్ ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటు చేశారు . కార్యక్రమం పంచాయతీ కార్యదర్శి ప్రసాద్, సిబ్బంది ఆధ్వర్యంలో నిర్వహించారు.

## ప్రళయం సృష్టించిన ఈదురు గాలులు

**అంధకారంలో మెరక గ్రామాలు.. ఒకరు మృతి.! ముగ్గురుకి తీవ్రగాయాలు.. నేలకొరిగిన వందలాది విద్యుత్ స్తంభాలు.. నేలకొరిగిన మామిడి, బొప్పాయి, అరటి చెట్లు... లక్షల్లో నష్టం.. సహాయ కార్యక్రమాల్లో పోలీసులు ,టోల్ ప్లాజా సిబ్బంది.!**







(నక్కపల్లి/నక్కపల్లి రూరల్/ అడ్డురోడ్డు, ప్రభాతవార్త): మండలం లోని ఉదయం నుంచి భానుడు భగభగ ను చూసి రోడ్లపైకి రాకుండా ఉన్న ప్రజలకు మధ్యాహ్నం నాలుగు గంటలకు ఊహించిన విధంగా హుదూత్ తుఫాన్ లాగా పెద్ద ఎత్తున గాలులు చుట్టుముట్టి మెరక గ్రామాలతో పాటు జాతీయ రహదారిపైప్రళయం సృష్టించింది. ఈ సృష్టించిన ప్రళయం గాలికి పాయకరావుపేట మండలం సత్యవరం గ్రామంలో ఇరువురు వ్యవసాయ కూలీ పాటు నక్కపల్లి మండలం లో ఒక వ్యవసాయ కూలీలు మృతి చెందగా ఇళ్ల వద్దన్న ముగ్గురు వ్యక్తులు తీవ్రంగా గాయపడ్డారు. ప్రళయం సృష్టించిన గాలికి జి. జగన్నాధపురం, ముకుందరాజుపేట, రమణయ్యపేట, డొంకాడ, గొడిచర్ల, చీలిక కొత్తూరు తోపాటు మెరక గ్రామాల్లో వందలాది విద్యుత్ స్తంభాలు నేల వరగడమే కాకుండా మామిడి ,బొప్పాయి, అరటి ,తోటలు పెద్ద ఎత్తున నష్టం వాటిల్లింది .మెరక గ్రామాల్లో సృష్టించిన ప్రళయానికి అటు రైతులకు ,ఇటు గ్రామాల ప్రజలకు ఎంత నష్టం జరిగిందనేది అంచనా వేయలేని పరిస్థితి.! ఎన్నడూ ఊహించని విధంగా విద్యుత్ స్తంభాలు ఒక్కసారిగా నేలకొరకడంతో మెరక గ్రామాల లో అంధకారం నెలకుంది. నక్కపల్లి జాతీయ రహదారి తో పాటు దిగువ ప్రాంతాలు, మెరక గ్రామాల అన్నిచోట్ల ఎక్కడకక్కడ పెద్దపెద్ద చెట్లు ఇరుగు పడిపోవడమే కాకుండా గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. పెద్దపెద్ద మామిడి చెట్లు విరిగిపోవడమే కాకుండా ఉన్న మామిడి చెట్లకు ఉన్న మామిడి కాయలు రాలిపోయే తీవ్రమైన నష్టం వాటిల్లింది. మెరక గ్రామాల ప్రజలతోపాటు మామిడి, అరటి, బొప్పాయి రైతులు కన్నీరు పెడుతున్నారు. ఇదిలా ఉండగా చిన్న రాంభద్రపురం గ్రామానికి చెందిన పులి రంగబాబు వీచును గాలులకు మృతి చెందగా ముకుంద రాజు పేటకు చెందిన దార్ల సూర్య కుమారి పై రేకుపడి చెయ్యి విరిగింది. అదే గ్రామానికి చెందిన వియ్యపు తలుపులు, వరలక్ష్మి పైన వారి నివసిస్తున్న పాక పడిపోవడంతో తీవ్రంగా గాయపడ్డారు. చిన్న రాంబద్రపురం గ్రామంలో వీచిన గాలులకు మృతి చెందిన పులి రంగబాబు విషయం తెలుసుకున్న తాసిల్దార్ చిన్ని కృష్ణ సంఘటన స్థలానికి వెళ్లి పరిస్థితి అడిగి తెలుసుకున్నారు. అంధకారంలో ఉన్న గ్రామాల పరిస్థితులు తెలుసుకున్న విద్యుత్ అధికారు లతో పాటు రాకపోకలు నిలిచిపోయిన ప్రాంతాల్లో నేలకొరిగిన చెట్లను తొలగించేందుకు సీఐ మురళితో పాటు రెవిన్యూ సిబ్బంది, పంచాయతీ అధికారులు అప్రమత్తమయ్యారు. యుద్ధ ప్రాతిపదికన చర్యలు చేపట్టిన అధికారులు తోపాటు పోలీసులు జాతీయ రహదారిపై చెట్లను తొలగించి ట్రాఫిక్ నియంత్రించారు. విద్యుత్ అధికారులు ,ఏఈ సత్యనారాయణ ఆధ్వర్యంలో గ్రామాల్లోఎక్కడెక్కడ విద్యుత్ స్తంభాలు దెబ్బతిన్నాయి అనేది తెలుసుకొని విద్యుత్ సౌకర్యాన్ని పునరుద్ధరణ చేసేందుకు పనుల్లో నిమగ్నమయ్యారు. గ్రామాల ప్రజలు సహకరించాలని విద్యుత్ అధికారులు కోరారు. తక్షణమే మృతి చెందిన కుటుంబాలతోపాటు నష్టపోయిన మామిడి ,బొప్పాయి, అరటి రైతులను ప్రత్యేక బృందాలతో నష్టాన్ని అంచనా వేసి ఆదుకోవాలని వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి వీసం రామకృష్ణ ప్రభుత్వాన్ని జిల్లా అధికారులు కోరారు.



## గ్రామాలను పట్టించుకోండి .. లేకపోతే ఉద్యమిస్తాం : వైసీపీ



(నక్కపల్లి, ప్రభాతవార్త ) పంచాయతీల పదవీకాలం ముగిసిన తర్వాత కూటమి ప్రభుత్వం గ్రామాలను ఆ గ్రామాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పట్టించుకోవడంలో పూర్తిస్థాయిలో విఫలమయ్యారని రాష్ట్ర వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కార్యదర్శి వీసం రామకృష్ణ అన్నారు. స్థానిక పార్టీ కార్యాలయంలో శనివారం విలేకరులతో మాట్లాడుతూ మండలంలోని వేసవి కాలంలో మంచినీటి సమస్య రాకుండా చర్యలు తీసుకునేవారని కానీ గత రెండు నెలల నుంచి సుమారు 22 గ్రామాల్లో తీవ్రమైన మంచినీటి ఎద్దడి ఉందని, అధికారులు గాని కూటమి ప్రభుత్వ గాని పట్టించుకోకుండా వ్యవహరిస్తున్నారని, ఇదే కాకుండా విద్యుత్ సమస్య కూడా అదే విధంగా ఉందని రామకృష్ణ అన్నారు. తక్షణమే గ్రామాల్లో ఉన్న మంచినీటి సమస్యను పరిష్కరించాలని అవసరమైతే ప్రజలకు త్రాగునీటి సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం స్పందించకపోతే వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఉద్యమించక తప్పదని హెచ్చరించారు. ఆయనతోపాటు మండల పరిషత్ అదనపు ఉపాధ్యక్షులు వెలగ ఈశ్వరరావు, మండల వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గొర్ల గోవిందు, వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ విద్యార్థి విభాగం నియోజకవర్గ కన్వీనర్ ఎలమంచిలి చందు ,వాణిజ్య విభాగం నియోజకవర్గ కన్వీనర్ ఎల్లేటి సత్యనారాయణ, మాజీ ఉప సర్పంచ్ వీసం రాజు, ముద్ద శ్రీను, ఎంపీటీసీ గంట తిరుపతిరావు, తదితరులు ఉన్నారు.

## బాధిత కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలి



పాయకరావుపేట రూరల్, మే 23, ప్రభాత వార్త : పాయకరావుపేట మండలం అరట్లకోట గ్రామానికి చెందిన నిరుపేద వ్యవసాయ కూలీలు శనివారం సత్యవరంలో కూలి పనులకు వెళ్ళగా ఈదురు గాలులు బలంగా వీచి గర్లంక ఎరకయ్య (ఓం శాంతి దొరబాబు), గెడ్డమూరి శంకర్ లపై కొబ్బరి చెట్టు కూలి అక్కడికక్కడే మరణించారు. ఈ దుర్ఘటనపై ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం, అనకాపల్లి జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం. అప్పలరాజు తీవ్ర విచారం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా అప్పలరాజు మాట్లాడుతూ... పొట్ట కూటి కోసం కూలీ పనులకు వెళ్లిన కూలీలపై ఈదురు గాలులు కారణంగా కొబ్బరి చెట్టు విరిగి పడి మరణించిన కూలీల కుటుంబాలను ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలని, ఆ కుటుంబాలలో ఒక్కొక్కరికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని అప్పలరాజు కోరారు.

## వ్యవసాయ కూలీలు మృతి చాలా బాధాకరం : హోం మంత్రి

(నక్కపల్లి, ప్రభాతవార్త): పాయకరావుపేట నియోజకవర్గంలో ప్రళయం సృష్టించిన గాలులతో పాయక రావుపేట మండలం అరట్లకోటలో కొబ్బరిచెట్టు కూలి ఇద్దరు కూలీలు మృతి చెందగా, నక్కపల్లి మండలం చిన్న రాంబద్రపురంలో ఒకరు మృతి చెందడం బాధాకరమని హోంమంత్రి అనిత అన్నారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.మృతుల కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుందని, ఆ విధంగా ఆదుకుంటామని ఫోన్ ద్వారా స్థానిక నాయకులకు తెలిపారు.ఈదురుగాలులతో వర్షాలు పడే సమయంలో చెట్లు, విద్యుత్ పోల్స్, హోర్డింగ్స్ వద్ద ఉండొద్దని సూచన చేశారు.తీవ్ర ఎండలతోపాటు, పిడుగులతో కూడిన వర్షాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హోంమంత్రి అనిత సూచించారు.

## ప్రభుత్వ పాఠశాలలో పిల్లలను చేర్పించండి : దెందుకూరి



(నక్కపల్లి రూరల్ ప్రభాతవార్త): ప్రభుత్వ పాఠశాలల్లో మీ పిల్లలను చేర్పించండి, ప్రభుత్వం అన్ని సౌకర్యాలు కల్పిస్తోంది అంటూ ఇన్చార్జ్ ఎంపీడీవో దెందుకూరు సీతారామరాజు అన్నారు. శనివారం ఉపమాకలో విద్యాశాఖ అధికారులు ఎన్. నరేష్, దొరతో పాటు ఉపాధ్యాయులు డివి సన్యాసిరావుతో కలిసి ఇంటింటికి వెళ్లి చిన్నారుల తల్లిదండ్రులు కలిసి ప్రభుత్వ పాఠశాలల విద్యా బోధన విషయమై పూర్తిస్థాయి వివరాలను తెలియజేశారు. అధికారులు చెప్పిన మాటలకు స్పందించిన తల్లిదండ్రులు ప్రభుత్వ పాఠశాలలో చేర్పించేందుకు ముందుకు వచ్చారు. ఇదిలా ఉండగా ఇన్చార్జ్ ఎంపీడీవో ఎందుకు సీతారామరాజు ఉపమాక గ్రామంలో చెత్త సంపద కేంద్రాన్ని, జలధార జలహారతి కార్యక్రమాన్ని పరిశీలించిన సందర్భంలో స్వచ్ఛరథం ద్వారా జరుగుతున్న పారిశుద్ధ్య నిర్మూలన కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. ఆయనతో పాటు కార్యదర్శి జయప్రకాష్, చిన్నమనాయుడు, తదితరులు ఉన్నారు.

## తప్పిన ప్రమాదం .. అప్రమత్తమైన పోలీసులు

**ముమ్మర సహాయక చర్యల్లో నిమగ్నమైన అధికారులు, టోల్ ప్లాజా సిబ్బంది**







(నక్కపల్లి, ప్రభాతవార్త): ఓ పక్క బోరున వీచిన గాలుల్లో నేలకొరిగిన చెట్లను కటౌట్లను తొలగించే పనుల్లో నిమగ్నమైన పోలీసు రెవెన్యూ పంచాయతీరాజ్ టోల్ ప్లాజా సిబ్బంది ఆ చెట్లను తొలగించే పనులు ఉన్నారు. అదే సమయంలో జాతీయ రహదారిపై అమ్మోనియం గ్యాస్ సిలిండర్ తరలిస్తున్నకు బొలెరో వాహనం లో గ్యాస్ లీక్ కావడంతో తృటిలో ప్రమాదం తప్పింది. అచ్చుతాపురం నుంచి తాడేపల్లిగూడెం వైపు వెళుతున్న వ్యాన్లో ఈ గ్యాస్ లీకైన విషయం తెలుసుకున్న సీఐ జూ రెడ్డి మురళి, ఎస్సై సన్నీ బాబు తన సిబ్బంది చేరుకొని ఒక్కసారిగా అప్రమత్తమయ్యారు. దగ్గరలో ఉన్న ఫైర్ సిబ్బంది రప్పించి హైవేపై ఎటువంటి ప్రమాదం జరగకుండా చర్యలు చేపట్టారు సంబంధిత కంపెనీ యజమానులకు సమాచారం అందించి వారిని రప్పించి ఇక్కడి నుంచి వాహనాన్ని సురక్షితంగా తీసుకెళ్లే విధంగా చర్యలు యుద్ధ ప్రాతిపదిక చేపట్టారు. టోల్ ప్లాజా మేనేజర్ కృష్ణ తోపాటు టోల్ ప్లాజా అధికారులు, ఎన్ హెచ్ సిబ్బంది జాతీయ రహదారిపై చెట్లను తొలగించే పనిలో నిమగ్నం అయ్యారు .హుటా హుటిన స్పందించడంతో జాతీయ రహదారిపై ట్రాఫిక్ అంతరాయం లేకుండా చర్యలు తీసుకున్నారు. స్థానిక విద్యుత్ అధికారులు నక్కపల్లి పట్నం తో పాటు మిగతా గ్రామాల్లో రెండు గంటల వ్యవధిలో విద్యుత్ సౌకర్యాన్ని అందించేందుకు చర్యలు చేపట్టారు. మేరక ప్రాంతాల్లో విద్యుత్ సౌకర్యం అందించేందుకు శ్రమిస్తున్నారు.

## పిజిఆర్ఎస్ వేదికగా సత్వర న్యాయం

### నగర సీపీకి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపిన భీమిలికి చెందిన మహిళ



విశాఖపట్నం, మే 23 ప్రభాతవార్త :తనకు జరిగిన అన్యాయాన్ని పిజిఆర్ఎస్ ద్వారా పోలీసులకు తెలియజేయడంతో సత్వర న్యాయం జరిగిందని భీమిలికి చెందిన ఓ మహిళ పోలీస్ కమిషనర్ డా.శంఖబ్రత బాగ్చికి కృతజ్ఞతలు తెలియజేశారు. పోలీస్ కమిషనర్ డా.శంఖబ్రత బాగ్చి సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పి జి ఆర్ ఎస్ )లో ఒక మహిళ తన నివాసం ఉంటున్న ఊరిలో దసరా చీటీ పేరున, ప్రతి నెల డబ్బులు కట్టిన తర్వాత ఆ డబ్బులు ఇవ్వమంటే ఇవ్వకపోవడంతో, తనకి ఏమి చేయాలో తెలియని స్థితిలో పి జి ఆర్ ఎస్ లో సిపి కి ఫిర్యాదు చేశారు. దీనిపై తక్షణమే స్పందించిన సీపీ కేసును ఏసిపి విజయ్ కుమార్ కి అప్పగించగా, ఏసిపి సంబంధించిన వ్యక్తులను పిలిపించి సమస్యను పరిష్కరించి, ఆ మహిళ కు రావలిసిన డబ్బులు అందేలా చర్యలు చేపట్టారు. సత్వర స్పందనతో న్యాయం అందించినందుకు ఆ మహిళ విశాఖ నగర సీపీ కి, ఏసిపికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

## మద్యం సీసాలతో లారీ బోల్తా



విశాఖపట్నం, మే 23 ప్రభాతవార్త: మద్యం సీసాలతో వెళ్తున్న లారీ ప్రమాదవశాత్తు బోల్తా పడింది. పెందుర్తి పోలీస్‌స్టేషన్ పరిధిలోని రాయవరపువాని పాలెం గ్రామ సమీపంలో, నేషనల్ హైవే ప్రక్కన రణస్థలం నుండి గుడివాడ వైపు నిండు బీరు బాటిళ్లతో వెళ్తున్న ఒక లారీ ప్రమాదవశాత్తు అదుపుతప్పి రోడ్డు ప్రక్కన బోల్తా పడింది. లారీలో మద్యం సీసాలు ఉండటంతో, సమాచారం తెలుసు కున్న చుట్టుపక్కల ప్రజలు అక్కడికి పెద్ద సంఖ్యలో చేరుకున్నారు. సమాచారం అందుకున్న వెంటనే పెందుర్తి పోలీస్ స్టేషన్ ఇన్స్పెక్టర్ కె.వి. సతీష్ కుమార్ తక్షణమే స్పందించి, పోలీసు సిబ్బందిని సంఘటనా స్థలానికి పంపించి పరిస్థితిని అదుపులోకి తీసుకొచ్చారు. పోలీసులు వేగంగా చర్యలు చేపట్టి, అక్కడ ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా బీరు బాటిళ్ల లోడును సురక్షితంగా మరో లారీలోకి తరలించారు. పోలీసుల అప్రమత్తత, సమయోచిత చర్యల వలన శాంతిభద్రతలకు ఎటువంటి భంగం కలగకుండా పరిస్థితిని సమర్థవంతంగా నియంత్రించారు. ఈ సందర్భంగా స్థానిక ప్రజలు పెందుర్తి పోలీసుల తక్షణ స్పందనను, విధి నిర్వహణను అభినందించారు.

## విద్యార్థినుల్లో భద్రతా చైతన్యం

### అవగాహన కార్యక్రమం నిర్వహించిన నగర పోలీసులు



విశాఖపట్నం, మే 23 ప్రభాతవార్త: మహిళ పోలీస్ స్టేషన్ సీఐతో పాటు సిబ్బంది పలు ఇన్స్టిట్యూట్ లోని విద్యార్థులకు కోసం మహిళల భద్రత, చిన్నారుల రక్షణ, సైబర్ నేరాల నివారణపై ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో శక్తి యాప్ డౌన్‌లోడ్ విధానం, యాప్ ఉపయోగాలు, మహిళలు చిన్నారులపై జరుగుతున్న నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం గురించి వివరించారు. అదేవిధంగా సోషల్ మీడియా వినియోగంలో జాగ్రత్తలు, తెలియని వ్యక్తులతో పరిచయాల వల్ల కలిగే ప్రమాదాలు, ఫోటో మార్ఫింగ్ ద్వారా బ్లాక్‌మెయిలింగ్, ఫేక్ ఫోన్ కాల్స్, ఓటీపీ మోసాలు, ఏటీఎం , సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. అదనంగా డ్రగ్స్ దుష్ప్రభావాలు, పోక్సో చట్టం, అత్యవసర సహాయ నంబర్లు (112, 1098, 181, 1930), సెల్ఫ్ డిఫెన్స్ పద్ధతులు, శక్తి యాప్‌లోని నైట్ షెల్టర్ వంటి భద్రతా ఫీచర్ల వినియోగంపై విద్యార్థినులకు వివరించారు. ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థినుల్లో భద్రతపై చైతన్యం పెంపొందించి, స్వీయ రక్షణపై అవగాహన కల్పించారు.

## ' స్మూత్ థాయ్ స్పా ' సెంటర్‌లో వ్యభిచారం..!



విశాఖపట్నం, మే 23 ప్రభాతవార్త : గుట్టు చప్పుడు కాకుండా వ్యభిచారం నిర్వహిస్తున్న స్పా సెంటర్ పై టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడులు నిర్వహించారు.పోలీసు కమిషనర్ శంఖబ్రతబాగ్చి ఆదేశాలతో తాజాగా ద్వారకా పోలీస్ స్టేషన్ పరిధిలోని రామటాకీస్ ప్రాంతంలో స్మూత్ థాయ్ స్పా ముసుగులో అనైతిక కార్యకలాపాలు నిర్వహిస్తున్నట్లు గుర్తించిన పోలీసులు, ఇద్దరు నిర్వాహకులను ,ఒక విటుడును అదుపులోకి తీసుకున్నారు. అక్కడ ఉన్న ఇద్దరు బాధిత మహిళలను రక్షించి హోమ్‌కు తరలించారు. పక్కా సమాచారం ఆధారంగా నిర్వహించిన ఈ దాడిలో స్పా కేంద్రంలో అనుమానాస్పద కార్యకలాపాలు జరుగుతున్నట్లు పోలీసులు గుర్తించారు. పట్టుబడిన వారిపై సంబంధిత సెక్షన్ల కింద కేసులు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. నగరంలో ఉన్న స్పా సెంటర్ల ముసుగులో వ్యభిచార కార్యకలాపాలు నిర్వహిస్తే ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించేది లేదని టాస్క్ ఫోర్స్ సీఐ భాస్కర్ హెచ్చరించారు.

## పోలీసుల ఆధ్వర్యంలో కార్డన్ అండ్ సెర్చ్



విశాఖపట్నం, మే 23 ప్రభాతవార్త : పోలీసు ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పెందుర్తి పోలీసులుకార్డన్ అండ్ సెర్చ్ శనివారం నిర్వహించారు. పెందుర్తి పోలీస్ స్టేషన్ ఇన్స్పెక్టర్ కె.వి. సతీష్ కుమార్ ఆదేశాల మేరకు, సబ్ ఇన్స్పెక్టర్ పి. లక్ష్మి ఆధ్వర్యంలో పెందుర్తి పోలీస్ పరిధిలోని జేఎన్ఎన్‌యూఆర్ఎం కాలనీ, రాజు చెరువు ప్రాంతంలోని బ్లాక్ నెం. 11, 12 వద్ద ఉదయం 05.30 గంటల నుండి 07.00 గంటల వరకు కార్డన్ అండ్ సెర్చ్ కార్యక్రమం నిర్వహించబడినది. కార్యక్రమంలో భాగంగా అనుమానాస్పద వ్యక్తులు, వాహనాలు మరియు రౌడీ షీటర్ల నివాసాలను తనిఖీ చేయగా, సరైన పత్రాలు లేని 05 మోటార్ సైకిళ్లను స్వాధీనం చేసుకున్నారు. అదేవిధంగా, 02 మంది రౌడీ షీటర్ల ఇళ్లను తనిఖీ చేసి వారి కార్యకలాపాలపై వివరాలు సేకరించబడినవి. ఈ సందర్భంగా ప్రజలు శాంతిభద్రతల పరిరక్షణలో పోలీసు శాఖకు సహకరించాలని, అనుమానాస్పద వ్యక్తులు లేదా చట్టవ్యతిరేక కార్యకలాపాలపై వెంటనే సమీప పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించాలని పోలీసులు కోరారు.

## నార్త్ జోన్‌లో 26న బహిరంగ వేలం : జడ్‌సీ



విశాఖపట్నం, మే 23, ప్రభాతవార్త: జీవీఎంసీ నార్త్ జోన్ పరిధిలోని కళ్యాణ మండపాలు, సామాజిక భవనాలు, షాపులు, మార్కెట్ల గుత్త హక్కుల కేటాయింపునకు ఈ నెల 26న బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు నార్త్ జోన్ జోనల్ కమిషనర్ బి. రాము ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జీవీఎంసీ ఉన్నతాధికారుల ఆదేశాలు, 2026-27 గెజిట్ నోటిఫికేషన్ నెం.18/2026, తేదీ 17-03-2026 ప్రకారం ఈ వేలం ప్రక్రియ చేపడుతున్నట్లు పేర్కొన్నారు. నార్త్ జోన్ పరిధిలోని కళ్యాణ మండపాలు, సామాజిక భవనాలు, షాపులు ఒక సంవత్సరం కాలానికి, అలాగే మార్కెట్లను 01-04-2026 తేదీ నుండి లేదా కేటాయించిన తేదీ నుండి మూడు సంవత్సరాల కాలానికి గుత్తకు ఇవ్వనున్నట్లు వెల్లడించారు.ఈ బహిరంగ వేలం మే 26న ఉదయం 11 గంటలకు మాధవధారలోని నార్త్ జోన్ జోనల్ కార్యాలయంలో నిర్వహించబడుతుందని తెలిపారు. ఆసక్తి గల వ్యక్తులు వేలం పాటలో పాల్గొనే ముందు ధరావత్తు సొమ్ము, రిజిస్ట్రేషన్ ఫీజు, ఇతర నిబంధనలు మరియు వేలం వివరాలకు సంబంధించిన గెజిట్ నోటిఫికేషన్ ప్రతులను రూ.300 చెల్లించి నార్త్ జోన్ కార్యాలయం నుండి పొందవచ్చని పేర్కొన్నారు. వేలానికి సంబంధించిన పూర్తి వివరాలు, ఐటమ్స్ జాబితా, ఇతర సమాచారం కోసం కార్యాలయ పనివేళల్లో నార్త్ జోన్ కార్యాలయంలోని జోనల్ కమిషనర్ లేదా రెవెన్యూ అధికారులను సంప్రదించాలని సూచించారు. అనివార్య కారణాల వల్ల వేలం ప్రక్రియ వాయిదా పడిన పక్షంలో తదుపరి పని దినం లేదా నిర్ణయించబడిన మరొక తేదీన నిర్వహించబడుతుందని జోనల్ కమిషనర్ తెలిపారు.

24skl13:24skl13.qxd 23-05-2026 22:59 Page 1



## ప్రభుత్వం నిషేధించిన మందులు వాడితే కఠిన చర్యలు : ఏవో



ఆమదాలవలస, మే 23 ప్రభాతవార్త : ప్రభుత్వం నిషేధించిన మందులను ఎరువుల దుకాణ యజమానులు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని ఏవో మెట్ట మోహన్‌రావు హెచ్చరించారు. శనివారం ప్రభుత్వ ఆదేశాలు జి.ఓ.421 మేరకు మండలంలోని వ్యవసాయ పురుగు మందుల దుకాణాలలో పారాక్వాట్ డైక్లోరైడ్ గడ్డి మందు స్టాకులను ప్రత్యేకంగా తనిఖీలు చేసినట్లు ఏవో మెట్ట మోహనరావు తెలిపారు. ఇన్సక్టిసైడ్స్ యాక్ట్ 1968 నిబంధనల ప్రకారం పారాక్వాట్ డిక్లోరైడ్‌కు సంబంధించిన సుమారు 700 లీటర్ల అమ్మకాలను తాత్కాలికంగా నిలిపి వేస్తూ సంబంధిత దుకాణాలకు ఉత్తర్వులు జారీ చేసినట్లు చెప్పారు. ప్రభుత్వం జారీ చేసిన మార్గదర్శకాలు, చట్టపరమైన నిబంధనల ప్రకారం ప్రతి పురుగుమందుల వ్యాపారి తప్పనిసరిగా నిబంధనలు పాటించాలని సూచించారు. నిబంధనలు ఉల్లంఘించిన పక్షంలో చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని యజమానులకు ఏవో మోహన్ రావు హెచ్చరించారు. కార్యక్రమంలో వ్యవసాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

## చిక్కోలు చీటాస్‌పై ఇచ్ఛాపురం జట్టు గెలుపు



ఆమదాలవలస, మే 23 ప్రభాతవార్త: ఆమదాలవలస ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో చిరంజీవి మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో జరుగుతున్న జిల్లా స్థాయి క్రికెట్ పోటీలు హోరా హోరీగా సాగుతున్నాయి. ఈ పోటీల్లో భాగంగా శనివారం చిక్కోలు చీటాస్, ఎఫ్ సి సి ఇచ్ఛాపురం జట్ల మధ్య పోటీ జరిగింది. ముందుగా టాస్ గెలిచిన చిక్కోలు చీటాస్ బ్యాటింగ్ తీసుకుని 16 ఓవర్లకు 101 పరుగులు చేశారు. తర్వాత బ్యాటింగ్ తీసుకుని ఇచ్ఛాపురం జట్టు 10 ఓవర్లలో 102 పరుగులు చేయడంతో ఈ పోటీల్లో ఇచ్ఛాపురం జట్టు గెలుపొందింది. ఈ పోటీల్లో సెమీఫైనల్స్ ఈ నెల 29వ తేదీన ఎఫ్ సి సి ఇచ్ఛాపురం జట్టు, శ్రీకాకుళం జట్ల మధ్య మొదటి మ్యాచ్, 30వ తేదీన మకరపురం, నరసన్నపేట జట్ల మధ్య రెండో మ్యాచ్ జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో టోర్నమెంట్ నిర్వాహకులు తమ్మినేని విద్యాసాగర్, అంపైర్‌గా కిల్లి సుదర్శన్ రావు, అనౌన్సర్‌గా నారా ఈశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

## చెత్తసేకరణ రిక్షాలు పంపిణీ



సంతబొమ్మాళి, మే 23, ప్రభాతవార్త: స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమం లో భాగంగా ప్రభుత్వం మంజూరు చేసిన చెత్త సేకరణ రిక్షాలను శనివారం పంపిణీ చేశారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ నుంచి మంజూరైన 34 రిక్షాలను మండలంలో పంచాయతీలకు ఒకటి చొప్పున అందించారు. ఎంపీడీఓ జయంత్ ప్రసాద్ ఆధ్వర్యంలో జరిగిన పంపిణీ కార్యక్రమంలో ఎంపీపీ ప్రతినిధి మెరుగు అప్పారావు, మాజీ ఎంపీపీ చిదపాన ధర్మార్జున్ రెడ్డి, పిఎసిఎస్ అధ్యక్షుడు కూచెట్టి కాంతారావు, మాజీ పిఎసిఎస్ అధ్యక్షులు అట్టాడ రాంప్రసాద్, తెలుగుదేశం పార్టీ మండల అధ్య క్షులు సుగ్గు శాంతి స్వరూప్ రెడ్డి తెలుగుదేశం సీనియర్ నాయకులు రెడ్డి అప్పన్న, ధూపాన రమణా రెడ్డి, పుక్కళ్ల శ్రీనివాస్, లమ్మత చక్రవర్తి, అట్టాడ తిరుపతిరావు, ఆరంగి వసంతరావు, అల్లు రమేష్ కుమార్, వై.రామరాజు, డెప్యూటీ ఎంపీడీఓ శ్రీనివాసరావు పంచాయతీ కార్యదర్శులు, తదితరులు పాల్గొన్నారు.

## విత్తన గుళికలపై అవగాహన



కంచిలి, మే 23 ప్రభాతవార్త : బూరగాంలో విత్తన గుళికలపై అవగాహన కల్పిస్తూ రైతులు చిన్నారావు ఢిల్లీరావు కవిత బైరాగి భువనేశ్వరరావు సమక్షంలో విత్తన గుళికలు తయారు చేసి కాంపెక్ట్ బ్లాకు ఐదు ఎకరాలలో లైన్స్ షోయింగ్ పద్ధతిలో ఐదు మంది రైతులతో ఈ విత్తన గుళికలు వేయించడం జరిగింది. ఈ విధంగా విత్తన గుళికలు చేసి వేయడం వలన సాధారణ వర్షపాతం కంటే తక్కువ వర్షపాతం పడిన విత్తనం మొలకలు వస్తాయి. ఈ విత్తనాలు ఎలాంటి ఎండ టైంలో వేసిన విత్తనం పాడవకుండా భూమిలో నిక్షేపంగా ఉంటాయి, వర్షాలు పడినప్పుడు మొలకశాతం బాగా వస్తుం దని ఎటువంటి చీడ పీడలకు విత్తనాలు పాడవకుండా కాపాడడం జరుగుతుంది, భూమిలో సూక్ష్మజీవు లు ఎండబారిన పడకుండా కాపాడుతుందని మరియు తక్కువ వర్షపాతం వలన రైతుకు ఏదో ఒక పంట వలన ఆదాయం వస్తుందని నిరంతరం భూమిని పచ్చని పంటలతో కప్పి ఉంటుందని భూమిలో తేమ శాతం ఉంటుందని, భూమిలో జీవవైవిధ్యం పెరుగుతుందని రైతులకు కామరాజు వివరించడం జరిగింది. ఐసీర్ పీ ప్రమీల కల్పనా ఢిల్లమ్మ నారాయణ రేవతి మహతి రోహిణి హాజరయ్యారు.

## జిల్లా క్రికెట్ కార్యవర్గంలో ఇచ్ఛాపురం యువత హవా

**జాయింట్ సెక్రటరీగా ఎన్.జీ. బెనర్జీ.. ఎగ్జిక్యూటివ్ మెంబర్లుగా ప్రవీణ్ సాగర్, అలీమ్ ఖాన్**



కంచిలి, మే 23 ప్రభాతవార్త : శ్రీకాకుళం జిల్లా క్రికెట్ అసోసియేషన్ నూతన కార్యవర్గంలో ఇచ్ఛాపురం నియోజకవర్గానికి విశేష ప్రాధాన్యం లభించింది. నియోజకవర్గానికి చెందిన ముగ్గురు యువ క్రీడాకారులకు కీలక పదవులు దక్కడంతో స్థానిక క్రీడా వర్గాల్లో ఆనందోత్సాహాలు వెల్లి విరుస్తున్నాయి. సోంపేటకు చెందిన రిటైర్డ్ ఉపాధ్యాయుడు క్రీడాకారుడు ఎన్.జీ.బెనర్జీని జిల్లా క్రికెట్ అసోసియేషన్ జాయింట్ సెక్రటరీగా నియమించగా, కంచిలి మండలం మకరాంపురం గ్రామానికి వజ్జ మృత్యుంజయం కుమారుడు వజ్జ ప్రవీణ్ సాగర్, ఇచ్ఛాపురానికి చెందిన అలీమ్ ఖాన్‌కు ఎగ్జిక్యూటివ్ మెంబర్లుగా ఎంపిక చేశారు. యువతకు ప్రాధాన్యం ఇస్తూ ఈ నియామకాలు చేపట్టడం విశేషంగా మారింది. తమపై నమ్మకం ఉంచి బాధ్యతలు అప్పగించిన జిల్లా క్రికెట్ సంఘం అధ్యక్షులు, రాష్ట్ర పీయూసీ చైర్మన్, ఆముదాలవలస ఎమ్మెల్యే కూన రవికుమార్‌కు, వైస్ ప్రెసిడెంట్ తర్లాడ బాలమురళీకృష్ణకు, కార్యదర్శి షేక్ హసన్ రాజాకు, కార్యవర్గ సభ్యులకు వారు కృతజ్ఞతలు తెలిపారు. నూతన కార్యవర్గం ఆధ్వర్యంలో జిల్లాలో క్రికెట్‌కు మరింత ప్రోత్సాహం లభించి గ్రామీణ యువతకు మెరుగైన అవకాశాలు అందుబాటులోకి వస్తాయని క్రీడాభిమానులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

## పరిశుభ్రత, పర్యావరణ పరిరక్షణకు ప్రభుత్వం ప్రాధాన్యత : కూన



ఆమదాలవలస, మే 23 ప్రభాతవార్త : పట్టణ పరిశుభ్రత, పర్యావరణ పరిరక్షణకు కూటమి ప్రభుత్వం అధిక ప్రాధాన్యత నిస్తుందని ఎమ్మెల్యే, పియుసి కమిటీ చైర్మన్ రవికుమార్ తెలిపారు. శనివారం 1వ వార్డు జగ్గుశాస్త్రులపేట సమీపంలో ఒక కోటి 62 లక్షల రూపాయల వ్యయంతో నిర్మించ బోయే ఆధునిక కంపోస్టింగ్ యూనిట్‌కు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రవికుమార్ మాట్లాడుతూ పట్టణ పరిశుభ్రత, పర్యావరణ పరిరక్షణకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోం దన్నారు. మున్సిపాలిటీలో రోజూ ఉత్పత్తి అవుతున్న చెత్తను శాస్త్రీయ పద్ధతుల్లో నిర్వహించి, వ్యర్థాలను ఉపయోగకరమైన సేంద్రియ ఎరువులుగా మార్చేందుకు ఈ కంపోస్టింగ్ యూనిట్ ఉపయోగపడు తుందని తెలిపారు. ప్రస్తుతం డంపింగ్ యార్డ్‌ల నిర్వహణలో ఎదురవుతున్న సమస్యలను తగ్గిస్తూ, చెత్త నిర్వహణలో ఆధునిక విధానాలను ప్రవేశపెట్టడం ద్వారా ప్రజలకు పరిశుభ్రమైన వాతావరణాన్ని అందించడమే లక్ష్యమని అన్నారు. ఈ యూనిట్ పూర్తయిన తర్వాత మున్సిపాలిటీ పరిధిలో చెత్త నిల్వలు తగ్గి, దుర్వాసన మరియు కాలుష్య సమస్యలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ తమ్మినేని గీత, మాజీ వైస్ చైర్మన్ కె.వి.రాజ్యలక్ష్మి, పిఎసిఎస్ అధ్యక్షులు సిమ్మా మాధవి, పట్టణ పార్టీ అధ్యక్షులు సంపదరావు మురళీధర్, డాక్టర్ సి.సుధాకర్, కూన ఆంజనేయులు, ఎన్ని శ్రీదేవి, నాగళ్ళ మురళీధర్, చింతాడ నారాయణరావు, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

## సామాజిక అంశాలపై అవగాహన ఉండాలి



వీరఘట్టం, మే 23 ప్రభాతవార్త : సామాజిక అంశాలపై ప్రజల్లో చైతన్యం కల్పించడమే ధ్యేయంగా పోలీస్ శాఖ కార్యాచరణ ప్రణాళికను రూపొందించింది. ఇందులో భాగంగా శనివారం మండలంలోని కంబరవలస గ్రామంలో ఎస్ఐ షణ్ముఖరావు ఆధ్వర్యంలో ఉపాధి కూలీలకు అవగాహన కల్పించారు. అందరూ తప్పనిసరిగా రహదారి నిబంధనలను పాటించి తీరాలన్నారు. మితిమీరిన వేగం, అజాగ్రత్త వల్ల జరిగే ప్రమాదాల గురించి ప్రజలను అప్రమత్తం చేశారు. అలాగే ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, అది ప్రాణ రక్షణ కవచమని ఎస్ఐ ప్రజలకు వివరించారు. ప్రమాద సమయంలో తలకు తగిలే గాయాల నుండి హెల్మెట్ ఎలా కాపాడుతుందో తెలిపారు. బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని, దీనివల్ల ముఖ్యంగా ఆడపిల్లల ఆరోగ్యం మరియు భవిష్యత్తు ఎలా దెబ్బతింటుందో గ్రామస్తులకు వివరించారు. పిల్లలకు చదువు చెప్పించాల్సిన బాధ్యతను ఈ సందర్భంగా గుర్తు చేశారు. ప్రస్తుత కాలంలో పెరుగుతున్న ఆన్‌లైన్ మోసాల గురించి అవగాహనతోపాటు, అపరిచిత వ్యక్తులకు ఓటిపిలు చెప్పకూడదని, నకిలీ లింకులను క్లిక్ చేయవద్దని సూచించారు. మత్తు పదార్థాల వల్ల కలిగే అనర్థాలను వారికి తెలియజేసారు. యువత వ్యసనాల బారిన పడకుండా జాగ్రత్త వహించాలని, గ్రామంలో ఎవరైనా డ్రగ్స్ విక్రయించినా లేదా వాడినా వెంటనే సమాచారం అందించాలని ఎస్ఐ షణ్ముఖరావు కోరారు.

## మన్యం డీఆర్‌డీఏ పీడీగా ప్రభావతి



వీరఘట్టం, మే 23 ప్రభాతవార్త : పార్వతీపురం మన్యం జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ (డీఆర్‌డీఏ) ప్రాజెక్ట్ డైరెక్టర్‌గా సిహెచ్ ప్రభావతి శనివారం బాధ్యతలు చేపట్టారు. అనంతరం జిల్లా కలెక్టర్ డా. ఎన్.ప్రభాకర రెడ్డిని జియమ్మవలస ఎంపీడీవో కార్యాల యంలో మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. జిల్లా పరిపాలన, గ్రామీణాభివృద్ధి కార్యక్రమాలు, ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు తదితర అంశాలపై కలెక్టర్ పీడీకి పలు సూచనలు చేశారు. జిల్లాలో గ్రామీణాభివృద్ధి కార్యక్రమాలను మరింత సమర్థవంతంగా అమలు చేసి, ప్రజలకు ప్రభుత్వ సేవలు చేరేలా కృషి చేయాలని జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు. ప్రభుత్వ లక్ష్యాల సాధనలో అన్ని శాఖలు సమన్వయంతో పని చేయాలని పేర్కొన్నారు. జిల్లాకు మెరుగైన సేవలు అందిస్తానని పీడీ తెలిపారు.

## క్రీడా పాఠశాలలో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానం

**జిల్లా క్రీడా అభివృద్ధి అధికారి డా. కె.శ్రీధర్ రావు**



వీరఘట్టం, మే 23 ప్రభాతవార్త : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కడప డా.వైయస్ఆర్ క్రీడా పాఠశాల 2026-27 విద్యా సంవత్సరానికి సంబంధించి 4,5,6 తరగతుల్లో ప్రవేశాల కోసం అర్హులైన విద్యార్థుల నుండి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా క్రీడా అభివృద్ధి అధికారి డా. కె.శ్రీధర్ రావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. అలాగే 7 నుండి 9 వ తరగతుల ప్రవేశాలకు వారి రాష్ట్ర, జాతీయ స్థాయి క్రీడా ప్రతిభ ఆధారంగా నిర్వహించడం జరుగుతుందన్నారు. అభ్యర్థులు తమ వయస్సు, అర్హతలకు అనుగుణంగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. పూర్తి వివరాలకు మొబైల్ నెంబర్లు 9866805716, 7396423490 ను సంప్రదించాలని ఆయన ఆ ప్రకటనలో తెలిపారు.

## డీఎస్‌టీలోకి రెడ్డిక సామాజిక వర్గం



ఇచ్ఛాపురం, మే 23 ప్రభాతవార్త : రెడ్డిక సామాజిక వర్గం డి నోటి ఫైడ్ ట్రైబల్ విభాగంలోకి చేర్చబడ్డారని ఇది కూటమి ప్రభుత్వం ఘన విజయం అని రాష్ట్ర రెడ్డిక కార్పొరేషన్ చైర్మన్ కొండ శంకర్ రెడ్డి అన్నారు. ఈ మేరకు తన ఛాంబర్‌లో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. సామాజికంగా, ఆర్థికంగా, రాజకీయంగా వెనుక బడిన రెడ్డిక సామాజిక వర్గం 1871లో బ్రిటిష్ ప్రభుత్వంపై పోరాడుతున్న సందర్భంగా సంచార జాతుల కింద నిషేధం విధించారని చెప్పారు. 1952 లో బి ఏ గా గుర్తించారని అన్నారు. గతంలో కొంత మంది రెడ్డిక కులాన్ని వెనుకబడిన జాబితాలో నుంచి తొలగిస్తారని భయభ్రాంతులకు గురి చేసారని అన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు రాష్ట్ర మంత్రులు కొల్లు రవీంద్ర సవిత, నారా లోకేష్‌లకు ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే బెందాళం అశోక్‌లకు కృతజ్ఞతలు తెలియజేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఏ ఎం సి చైర్మన్ మణి ప్రకాశ్ రెడ్డి, పి ఏ సి ఎస్ అధ్యక్షుడు పెదిని బాబ్జి, దక్కత ఢిల్లీరావు, సాడి సహదేవ్‌రెడ్డి, ఆశి లీలారాణి, నందికి జానీ, దక్కత కామేశ్వరరావు, ఆశి సత్యం, ఆశి ధర్మరాజు, పెదిని దుర్యోధన, సూర్యనారాయణ, రమేష్, పీతాంబర్, ఉగ్రపల్లి శంకర్ నారాయణ ఆచారి తదితరులు పాల్గొన్నారు.

## రానున్న ఎన్నికలకు కార్యకర్తలు సిద్ధం కండి : కూన



ఆముదాలవలస, మే 23 ప్రభాతవార్త : కార్యకర్తలు రానున్న ఎన్నికలకు సిద్ధంగా ఉండాలని ఎమ్మెల్యే, పియుసి కమిటీ చైర్మన్ కూన రవికుమార్ అన్నారు. శనివారం ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీసులో క్లస్టర్ ఇన్చార్జ్‌లతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే, రవికుమార్ మాట్లాడుతూ ఈనెల 27,28 తేదీలలో నిర్వహించనున్న తెలుగుదేశం పార్టీ వర్చువల్ మహానాడుకు కార్యకర్తలందరూ విజయవంతం చేయాలని అన్నారు. టిడిపి ప్రవేశపెడుతున్న పలు సంక్షేమ పథకాలను గ్రామాల్లో తీసుకుని వెళ్లి ప్రజలకు వివరించాలని కోరారు. రాష్ట్ర అభివృద్ధి కోసం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అహర్నిశలు కృషి చేస్తున్నారని అన్నారు. నిరుద్యోగ యువత కోసం రాష్ట్రానికి పరిశ్రమలను రప్పించి నిరుద్యోగ సమస్య లేకుండా చూస్తున్నారని అన్నారు. మీ క్లస్టర్ పరిధిలో నిర్వహించిన మహానాడును ప్రతి కార్యకర్త విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జిల్లా పార్టీ అధ్యక్షులు మొదలవలస రమేష్, డిసిసిబి చైర్మన్ శివాల సూర్యనారాయణ, రాష్ట్ర లీగల్ సెల్ కార్యదర్శి తమ్మినేని విద్యాసాగర్, మార్క్ఫెడ్ డైరెక్టర్ ఏ.రామకృష్ణ, రాష్ట్ర కాళింగ కార్పొరేషన్ డైరెక్టర్ తమ్మినేని చంద్రశేఖర్, మండల పార్టీ నాయకులు నూకరాజు, కిల్లి సిద్ధార్థ, ఎండ భీష్మ, సిమ్మ మాధవి, అన్నెపు భాస్కరరావు, కె.వి రాజ్యలక్ష్మి, కూన ఆంజనేయులు, నాగళ్ళ మురళీధర్, తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో డ్రైవర్ మృతి



కోటబొమ్మాళి, మే 23 ప్రభాతవార్త : మండలం జాతీయ రహదారి జర్జంగి గ్రామ సమీపంలో శనివారం తెల్లవారు జామున జరిగిన రోడ్డు ప్రమాదంలో ఈస్ట్ గోదావరి జిల్లా పాలకొల్లు గ్రామానికి చెందిన వ్యాన్ డ్రైవర్ కేశవరపు శరన్ సతీష్ నాగేంద్ర(34) మృతి చెందాడు. మృతుడు సతీష్ వ్యాన్‌లో కటక్ నుంచి పాలకొల్లు వెళుతుండగా మండలం జర్జంగి గ్రామ సమీపంలోని గరీబిల గడ్డ వంతెన వద్దకు వచ్చేసరికి నిద్రలోకి జారుకోవడంతో వ్యాన్ అదుపుతప్పి కల్వర్టుకు బలంగా ఢీకొనడంతో డ్రైవర్ సతీష్‌కు తలకు బలమైన గాయాలు తగలడంతో స్థానికులు గుర్తించి 108 సహాయంతో స్థానిక ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందాడు. సతీష్ మొబైల్ సహాయంతో అతని కుటుంబ సభ్యులకు సమాచారం అందజేసి పోస్ట్ మార్టం కోసం మృత దేహాన్ని స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై సత్యనారాయణ తెలిపారు.

## జీఎంఆర్ తనయుడు కిరణ్‌ను సత్కరించిన ఎమ్మెల్యే కోండ్రు



రాజాం, మే 23 ప్రభాతవార్త : ప్రముఖ పారిశ్రామిక వేత్త, జీఎంఆర్ గ్రూప్ సంస్థల అధినేత గ్రంధి మల్లిఖార్జున రావు కుమారుడు గ్రంధి కిరణ్ కుమార్‌ను రాజాం జీఎంఆర్ ఐటీలో మాజీ మంత్రి, రాజాం నియోజకవర్గ ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్ మర్యాదపూర్వకంగా కలిసి ఆయనను దుశ్శాలువతో ఘనంగా సత్కరించారు. అన్నంనాయుడు, డా.రాజేంద్ర, కూటమి నాయకులు గురవాణ నారాయణరావు, తదితరులు పాల్గొన్నారు.

## సామాజిక బాధ్యతతోనే వర్చువల్ విధానంలో మహానాడు : అచ్చెన్న



కోటబొమ్మాళి, మే 23 ప్రభాతవార్త : తెలుగుదేశం పార్టీ అత్యంత ప్రతిష్ఠాత్మకంగా ఈ నెల 27, 28 తేదీల్లో నిర్వహించే మహానాడు కార్యక్రమాన్ని ఈసారి సామాజిక బాధ్యత, ఇంధన పొదుపు, పర్యావరణ పరిరక్షణ లక్ష్యాలతో సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తూ వర్చువల్ విధానంలో నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తెలిపారు. పార్టీ నాయకులు, కార్యకర్తలకు మహానాడు నిర్వహణపై కీలక దిశానిర్దేశం చేశారు. దేశవ్యాప్తంగా ఇంధన సంరక్షణపై ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఇచ్చిన పిలుపు మేరకు, లక్షలాది మంది కార్యకర్తలు ఒకే చోటికి ప్రయాణించే పరిస్థితిని తగ్గిస్తూ, పర్యావరణ హిత దృక్పథంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. నెల్లూరులో భారీ స్థాయిలో మహానాడు నిర్వహణకు ఇప్పటికే ఏర్పాట్లు చేసినప్పటికీ, ప్రజా ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని పార్టీ అధినేత, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మార్గదర్శకత్వంలో హైబ్రిడ్ విధానాన్ని అమలు చేస్తున్నామని చెప్పారు.రాష్ట్రవ్యాప్తంగా 1,848 క్లస్టర్లలో భారీ ఎల్ఈడీ స్క్రీన్‌లు ఏర్పాటు చేసి, అమరావతిలోని తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి జరిగే మహానాడు కార్యక్రమాన్ని ప్రత్యక్ష ప్రసారం చేయనున్నట్లు వెల్లడించారు. ప్రతి నియోజకవర్గంలో నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొని మహానాడును పసుపు పండుగలా విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.ప్రతి క్లస్టర్ కేంద్రం పండుగ వాతావరణంలో కనిపించాలి.. పసుపు జెండాలు, ఫ్లెక్సీలు, పార్టీ ఆత్మగౌరవాన్ని ప్రతిబింబించేలా ఏర్పాట్లు చేయాలి. కార్యకర్తల్లో కొత్త ఉత్సాహం నింపేలా మహానాడు నిర్వహించాలి" అని అచ్చెన్నాయుడు సూచించారు. మహానాడులో పార్టీ భవిష్యత్ కార్యాచరణ, రాష్ట్ర పునర్నిర్మాణం, అభివృద్ధి, యువతకు ఉపాధి అవకాశాలు, రైతు సంక్షేమం, సాంకేతిక అభివృద్ధి, దేశ ప్రగతి వంటి కీలక అంశాలపై చర్చలు జరుగుతాయని తెలిపారు. మహానాడులో ప్రవేశపెట్టే 19 కీలక తీర్మానాలకు పార్టీ పొలిట్‌బ్యూరో ఇప్పటికే ఆమోదం తెలిపిందన్నారు. ప్రతి వక్త తనకు కేటాయించిన అంశంపై స్పష్టంగా, సంక్షిప్తంగా మాట్లాడాలని సీఎం చంద్రబాబు సూచించినట్లు తెలిపారు. పార్టీ సిద్ధాంతాలు, ప్రజా సంక్షేమం, రాష్ట్ర అభివృద్ధి లక్ష్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లే వేదికగా ఈ మహానాడు నిలవబోతుందని పేర్కొన్నారు.

## కన్నంనాయుడు మృతిపై ఎమ్మెల్యే విచారం



రాజాం, మే 23, ప్రభాతవార్త : తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు, రాజాం టౌన్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ టంకాల కన్నం నాయుడు (70) గుండెపోటుతో మృతి చెందారు. ఆయన అకాల మరణం పట్ల మాజీ మంత్రి, తెలుగుదేశం పార్టీ రాజాం నియోజకవర్గం ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్ తీవ్ర విచారం వ్యక్తం చేశారు. తెలుగుదేశం పార్టీ జెండాను మృతదేహంపై వేసి ఘన వీడ్కోలు పలికారు. పార్టీకి విధేయుడిగా ఉంటూ పార్టీకోసం ఆయన చేసిన సేవలు గుర్తుచేసుకున్నారు. ప్రతీ సారి పార్టీ కార్యాలయానికి వెళ్లినప్పుడు ముందుగా ఎదురొచ్చి ఆప్యాయంగా స్వాగతం పలికే కన్నం నాయుడు ఇక లేరనే విషయం ఎంతో బాధ కలిగిస్తోందని ఎమ్మెల్యే భావోద్వేగంగా పేర్కొన్నారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తూ, ఆయన కుటుంబ సభ్యులకు ఈ కఠిన సమయంలో దేవుడు ధైర్యాన్ని ఇవ్వాలని ఎమ్మెల్యే ఆకాంక్షించారు. అలాగే ఆయన మృతి వార్త తెలియగానే నియోజక వర్గం చెందిన కూటమి నేతలు కార్యకర్తలు భారీ సంఖ్యలో సారథికి చేరుకున్నారు. ఆయన భౌతిక కాయానికి పూలమాలలు వేసి ఘనానివాలులు అర్పించారు. ఆయన మరణం తెలుగుదేశం పార్టీకి తీరని లోటని నేతలు పేర్కొన్నారు.అతనికి భార్య కళావతి, ముగ్గురు పిల్లలు ,కుమార్తె శ్రావణి,కుమారులు బాబీ,నానీలు ఉన్నారు.

## సిక్కోలు కుర్రాడు గిన్నిస్ రికార్డు



సంతబొమ్మాళి, మే 23 ప్రభాతవార్త : శ్రీకాకుళం జిల్లాకు చెందిన యువకుడు గిన్నిస్ రికార్డు సాధించాడు. ఇతడు ప్రపంచంలో ఎత్తయిన 19024 ఉమింగ్లా శిఖరాన్ని అధిరోహించాడు.మండల కేంద్రం సంతబొమ్మాళి గ్రామానికి చెందిన సర్పంచ్ కళింగపట్నం లక్ష్మి అప్పారావు కుమారుడైన ప్రభు కుమార్ సంతబొమ్మాళి నుంచి లే లాడాక్ వరకు ఇటీవల సాహస యాత్ర చేసాడు. ఇందులో భాగంగా ఉమింగ్లా శిఖరాన్ని అధిరోహించి రికార్డ్ సృష్టించారు. ఇది ప్రపంచంలోనే ఎత్తైనది 19024 అడుగుల్లో ఉంటుంది. మోటార్ వెహికల్‌లో మాత్రమే తిరగలే ప్రదేశం ఇది లడకలో ఉంది ఇతను మే 5న మొదలుపెట్టి 16 రోజులలో పూర్తి చేశాడు. ఈ సాహస యాత్ర చేసినందుకు గుర్తించి గిన్నిస్ వరల్డ్ రికార్డ్ వాళ్ల గుర్తింపు పత్రం అందజేశారు. ఈ సాహస యాత్ర తమ గ్రామమైనటువంటి సంతబొమ్మాళి ప్రజలకు అంకితమని ప్రభు కుమార్ ఈ సందర్భంగా పేర్కొన్నారు.

# శ్రీకాకుళం వార్త



## పేదల సొంతింటి కల నెరవేర్చడమే ప్రభుత్వ లక్ష్యం : అచ్చెన్న



కోటబొమ్మాళి, మే 23 ప్రభాతవార్త : రాష్ట్రంలో గూడు లేని పేదలందరికీ సొంతింటి కల నెరవేర్చడమే ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వ ముఖ్య ఆశయమని రాష్ట్ర మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు స్పష్టం చేశారు. శనివారం నిమ్మాడలోని క్యాంప్ కార్యాలయంలో కోటబొమ్మాళి మండలం దంత గ్రామానికి చెందిన 39 మంది లబ్ధిదారులకు మంత్రి అచ్చెన్నాయుడు చేతుల మీదుగా ఇళ్ల పట్టాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రతి పేదవానికి సొంత ఇల్లు ఉండాలనేది ముఖ్యమంత్రి చంద్రబాబు సంకల్పమని, అందుకు అనుగుణంగానే ప్రభుత్వం శరవేగంగా చర్యలు చేపడుతోందని తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇళ్ల పట్టాలు అందజేస్తామని భరోసా ఇచ్చారు. గత ఐదేళ్లు మాయ మాటలే.. గత వైకాపా ప్రభుత్వం ఐదేళ్ల కాలంలో ఇళ్లు కాదు.. ఊళ్లు నిర్మిస్తున్నాం అంటూ మాయమాటలతో కాలయాపన చేసిందని మంత్రి అచ్చెన్నాయుడు ధ్వజమెత్తారు. జగనన్న కాలనీల పేరుతో ఆ పార్టీ నేతలు పెద్ద ఎత్తున దందాలకు, దోపిడీకి పాల్పడ్డారని ఆరోపించారు. స్వచ్ఛందంగా ఇళ్లు నిర్మించుకోవడానికి ముందుకు వచ్చిన వారికి కూడా సకాలంలో బిల్లులు చెల్లించకుండా వేధించారని మండిపడ్డారు. సొంతింటి కోసం పేదలు కళ్లు కాయలు కాసేలా నిరీక్షించేలా చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. గత ప్రభుత్వ వైఫల్యాల వల్ల పేదలు పడిన ఇబ్బందులను గమనించిన కూటమి ప్రభుత్వం ప్రస్తుతం ఇళ్ల నిర్మాణ ప్రక్రియపై ప్రత్యేక దృష్టి సారించిందని మంత్రి వివరించారు. కార్యక్రమంలో టెక్కలి ఆర్డీవో కృష్ణమూర్తి, పీఏసీఎస్ మాజీ అధ్యక్షులు కింజరాపు హరివర ప్రసాద్, తెలుగు దేశం పార్టీ నాయకులు ఉన్నారు.

## రాజాం మున్సిపాలిటీలో ఆపరేషన్ క్లీన్‌స్వీప్



రాజాం, మే 23 ప్రభాతవార్త : ఒక రాష్ట్రం ఒక పరిశుభ్రత లక్ష్యంలో భాగంగా ప్రభుత్వ ఆదేశాల మేరకు మే 23 నుండి జూన్ 20 వరకు పరిశుభ్రత కార్యక్రమాలు పట్టణంలో చేపడుతున్న సందర్భంగా రాజాం పురపాలక సంఘ పరిధిలో పాత బస్టాండ్ ఏరియాలో స్పెషల్ ఆఫీసర్ సుధారాణి హాజరు కాగా రాజాం పురపాలక సంఘ కమిషనర్ రామచంద్రరావు ఆధ్వర్యంలో ఆపరేషన్ క్లీన్ స్వీప్ కార్యక్రమం చేయడం జరిగింది.పాత బస్టాండ్‌లో స్వీపింగ్, బ్రషింగ్ చేసి చెత్తను ఎత్తించి బ్లీచింగ్ సున్నము కలిపిన మిశ్రమాన్ని చల్లించడం జరిగింది. అనంతరం స్పెషల్ ఆఫీసర్ మాట్లాడుతూ పట్టణంలో ప్రజలందరూ కూడా సామాజిక బాధ్యత కలిగి ఉండాలని పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని తెలియజేశారు. ప్రజారోగ్యం ప్రకారం ఏ సమస్యను తలెత్తిన సమీపంలో ఉన్న సచివాలయ సెక్రెటరీలకు తెలియజేయాలని 24 గంటల్లోపు సదరు సమస్యను పరిష్కరించగలరని కమిషనర్ తెలియజేశారు. స్పెషల్ ఆఫీసర్, కమిషనర్, సానిటరీ ఇన్‌స్పెక్టర్, మున్సిపల్ సిబ్బంది, స్వచ్ఛంద సంస్థ చైర్మన్ కొత్త సాయి ప్రశాంత్ కుమార్, రెడ్ క్రాస్ ప్రతినిధి పెంకి చైతన్య, శానిటేషన్ సెక్రటరీలు పారిశుద్ధ కార్మికులు, ప్రజలు పాల్గొన్నారు.

## సీఎంఆర్‌ఎఫ్ చెక్కులతో పేదలకు భరోసా



శ్రీకాకుళం, మే 23 ప్రభాతవార్త : బాధిత కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయ నిధి కొండంత అండగా నిలుస్తుందని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు పేర్కొన్నారు. శనివారం నిమ్మాడలోని క్యాంప్ కార్యాలయం లో మంత్రి అచ్చెన్నాయుడు లబ్ధిదారులకు సీఎం సహాయ నిధి చెక్కులను పంపిణీ చేశారు. కార్పొరేట్ ఆసుపత్రిలో వైద్యం తీసుకునే పేద వారికి సైతం తిరిగి డబ్బులు అందించి వారికి చేయూత నివ్వాలనే ఉద్దేశంతో సీఎం సహాయనిధి చెక్కులను పంపిణీ చేస్తున్నామని అన్నారు. నందిగాం మండలం, కోటబొమ్మాళి మండలానికి చెందిన 9 మందికి రూ.2,77,510 లబ్ధిదారునికి మంజూరైన ఆర్థిక సహాయం చెక్కును ఈ సందర్భంగా మంత్రి చేతుల మీదుగా అందజేశారు. ఆరోగ్య, ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న ప్రతి పేదవానికీ ప్రభుత్వం ఎల్లప్పుడూ తోడుగా ఉంటుందని మంత్రి ఈ సందర్భంగా భరోసానిచ్చారు.చెక్కుల పంపిణీ కార్యక్రమానికి ముందు నందిగాం మండలం నలుమూలల నుండి వచ్చిన ప్రజలను మంత్రి అచ్చెన్నాయుడు స్వయంగా కలుసుకున్నారు. స్థానిక సమస్యలపై ప్రజల నుంచి వినతి పత్రాలను స్వీకరించిన మంత్రి వినతులు పరిశీలించి త్వరిత గతిన పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో నందిగాం మండలానికి చెందిన పలువురు ముఖ్య నాయకులు, ప్రజాప్రతినిధులు, కూటమి కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## నగర పాలక సంస్థ ప్రక్షాళనే ధ్యేయం

**నగరపాలక సంస్థ కమిషనర్ హనుమంతు కూర్మారావు**



శ్రీకాకుళం, మే 23 ప్రభాతవార్త : శ్రీకాకుళం నగరపాలక సంస్థను అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో నిలిపి, నగర ప్రక్షాళన చేయడమే తమ ప్రధాన ధ్యేయమని కమిషనర్ హనుమంతు కూర్మారావు స్పష్టం చేశారు. శనివారం సాయంత్రం తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నగర పరిధిలోని 50 వార్డుల్లో నిరంతరం పర్యవేక్షిస్తూ, నిత్యం 20 గంటల పాటు శ్రమిస్తూ ఆపరేషన్ క్లీన్ స్వీప్, స్వచ్ఛ సర్వేక్షణ్ కార్యక్రమాలను ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రత్యేక అధికారి, జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ సూచనలు, పర్యవేక్షణలో కార్యాలయ ప్రక్షాళనకు శ్రీకారం చుట్టామన్నారు. పారదర్శకత, జవాబుదారీతనమే లక్ష్యంగా సాంకేతికతను జోడించి ఈఫైలింగ్ విధానాన్ని అమలు చేస్తున్నామని, దీని ద్వారా సమస్యలకు వెనువెంటనే శాశ్వత పరిష్కారం లభిస్తుందని వివరించారు. నగరంలో వీధి కుక్కల సమస్య నివారణకు బృహత్తర కార్యక్రమాన్ని చేపట్టామని కమిషనర్ వెల్లడించారు. స్నేహ స్వచ్ఛంద సేవా సంస్థ సౌజన్యంతో వీధి కుక్కలను బంధించి, వాటికి కుటుంబ నియంత్రణ శస్త్రచికిత్సలు చేయిస్తున్నట్లు తెలిపారు. నగరంలో జనాభా గణన ప్రక్రియ ముమ్మరంగా సాగుతోందని కమిషనర్ తెలిపారు. శనివారం ఉదయం 11 గంటల నాటికి నగరంలో 99.6 శాతం ఇళ్ల లెక్కింపు పూర్తయిందని, 82.93 శాతం జనాభా నమోదు ముగిసిందని చెప్పారు. జనగణనలో ఎవరికైనా ఇబ్బందులు ఉంటే 1855 అనే టోల్ ఫ్రీ నెంబర్‌ను సంప్రదించాలని కోరారు. సమావేశంలో నగరపాలక సంస్థ అసిస్టెంట్ కమిషనర్ శివకుమార్, ఏసీపీ జానకి, మేనేజర్ నాగరాజు, తదితర అధికారులు పాల్గొన్నారు.

## కమ్యూనికేషన్ సిబ్బందికి ఎస్పీ ప్రశంస



శ్రీకాకుళం, మే 23 ప్రభాతవార్త : జిల్లా వ్యాప్తంగా నిర్వహించిన వీఐపీ, వీవీఐపీ పర్యటనలు, ప్రముఖ ఆధ్యాత్మిక ఉత్సవాలు, జాతరలు, గ్రామోత్సవాల సందర్భంగా పోలీసు శాఖకు అత్యంత కీలకమైన కమ్యూనికేషన్ వ్యవస్థను సమర్థవంతంగా నిర్వహించి విధి నిర్వహణలో ప్రతిభ కనబరిచిన పోలీసు కమ్యూనికేషన్ అధికారులు, సిబ్బందిని జిల్లా ఎస్పీ కె.వి. మహేశ్వర రెడ్డి అభినందించారు. శనివారం జిల్లా పోలీసు కార్యాలయం లో నిర్వహించిన నెలవారీ నేర సమీక్ష సమావేశంలో విశిష్ట సేవలు అందించిన కమ్యూనికేషన్ విభాగ ఇన్‌స్పెక్టర్ షేక్ జబీరుద్దీన్ సాబిర్, సిబ్బందికి జిల్లా ఎస్పీ ప్రశంసాపత్రాలను అందజేసి వారి సేవలను కొనియాడారు. అదనపు ఎస్పీ కెవి రమణ, డీఎస్పీలు పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## ఐఓలు, పీపీ మధ్య సమన్వయంతో కేసుల దర్యాప్తు.. విచారణ వేగం



శ్రీకాకుళం, మే 23 ప్రభాతవార్త : ఐఓలు (దర్యాప్తు అధికారులు) మరియు పబ్లిక్ ప్రాసిక్యూటర్ల మధ్య సమన్వయం పెంపొందించి కేసుల దర్యాప్తు, విచారణలను వేగవంతం చేయాలని జిల్లా ఎస్పీ కె.వి. మహేశ్వర రెడ్డి పోలీసు అధికారులకు దిశానిర్దేశం చేశారు. శనివారం జిల్లా పోలీసు కార్యాలయం లో నిర్వహించిన నెలవారీ నేర సమీక్ష సమావేశంలో జిల్లా ఎస్పీ పోలీసు అధికారులతో పాటు పబ్లిక్ ప్రాసిక్యూటర్లతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా పోక్సో కేసుల దర్యాప్తు, అభియోగ పత్రాల (చార్జిషీట్ల) దాఖలులో పాటించాల్సిన జాగ్రత్తలు, కోర్టు సమన్ల సకాల అమలు, గ్రేవ్ కేసులు, నాన్ బెయిలబుల్ వారెంట్ల అమలుపై ప్రత్యేకంగా సమీక్ష నిర్వహించారు. అదనపు ఎస్పీలు కె.వి. రమణ, పి.శ్రీనివాసరావు, డీఎస్పీలు వివేకానంద, లక్ష్మణరావు, భాస్కర్ రెడ్డి, గోవిందరావు, పబ్లిక్ ప్రాసిక్యూటర్ అచ్చెం నాయు డు,అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్లు విశాలాక్షి, శ్రీనివాసరావు,అనిల్ కుమార్, తేజేశ్వరరావు, దువ్వ జగన్నాయకులు, సీనియర్ అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ సుశీల, అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్లు రఘునందనరావు, నాగభూషణం,శాంతి సంతోషి, సుధారాణి, గిరిజారాణి, జిల్లా పోలీసు న్యాయ సలహాదారు యామిని,జిల్లా వ్యాప్తంగా ఉన్న పోలీసు ఇన్‌స్పెక్టర్లు, సబ్‌ఇన్‌స్పెక్టర్లు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

24 -5Pg9th cheli.qxd:24 -5Pg9th cheli.qxd 1/1/02 6:22 AM Page 1



రుచి

# సమోసా రుచులెన్నో..

### ఆలూతో...



కావాల్సినవి: తగిన ఉల్లిపాయ- ఒకటి, తరిగిన పచ్చిమిర్చి-మూడు, అల్లం తరుగు-చెంచా, ఆలూ-ఆరు, బఠాణీలు-పావు కప్పు, జీలకర్ర-అర చెంచా, కాజూ-గుప్పెడు, కిస్‌మిస్-ఏడెనిమిది, గరం మసాలా, చాట్ మసాలా-చెంచా చొప్పున, ఉప్పు-తగినంత, నూనె-వేయించడానికి సరిపడా.

**తయారీ :** ఆలుగడ్డలను శుభ్రంగా కడిగి కుక్కర్‌లో వేయాలి. ఇందులోనే బఠానీలను వేసి నాలుగైదు కూతలు వచ్చేవరకు ఉడికించాలి. ఇప్పుడు వీటిని చల్లార్చి పొట్టుతీసి మెదిపి పక్కన పెట్టుకోవాలి. పొయ్యి వెలిగించి పాన్ పెట్టి నూనె పోయాలి. అది వేడయ్యాక జీలకర్ర, కాజూ కిస్‌మిస్ వేసి వేయించాలి. ఇప్పుడు ఉల్లిపాయ, పచ్చిమిర్చి ముక్కలు, అల్లం తరుగు కూడా కలిపి మరికాసేపు వేయిస్తేసరి. ఉల్లిపాయలు కాస్త గోధుమ రంగులోకి వచ్చిన తర్వాత ఉడికించిన ఆలూ, బఠాణీలు కూడా వేసి కలపాలి. దీంట్లో గరంమసాలా, చాట్ మసాలా, ఉప్పు వేసి బాగా కలపాలి. అంతే సమోసాలకు మసాలా కూర సిద్ధమైనట్లే. ఈ కూరను త్రికోణాకారంలో చుట్టుకున్న చపాతీలో పెట్టి అంచులు మూసే యాలి. వీటిని కాగే నూనెలో వేసి బాగా వేయించు కోవాలి. గ్రీన్ చట్నీ టొమాటో సాస్‌తో తీసుకుంటే బాగుంటాయి.

### చికెన్‌తో...

**కావాల్సినవి :** చికెన్ ముద్ద-200గ్రా, నూనె-మూడు చెంచాలు, తరిగిన ఉల్లిపాయలు, పచ్చిమిర్చి ముక్కలు- రెండు చొప్పున, అల్లంవెల్లుల్లి ముద్ద- చెంచా, పసుపు-పావు చెంచా, కారం-చెంచాన్నర, గరంమసాలా, ధనియాల పొడి, జీలకర్ర పొడి-అరచెంచా చొప్పున, ఉప్పు- తగినంత, కొత్తిమీర తరుగు- కాస్తంత, నిమ్మ రసం- రెండు చెంచాలు. **తయారీ:** పాన్‌లో నూనె పోసి వేడయ్యాక ఉల్లిపాయ, పచ్చిమిర్చి ముక్కలు వేసి వేయించాలి. అల్లం వెల్లుల్లి ముద్ద జత చేయాలి. ఆ తర్వాత చికెన్ వేసి కలపాలి. దీంట్లో కారం, పసుపు, ధనియాల పొడి, గరంమసాలా, జీలకర్ర పొడి, తగినంత ఉప్పు, నిమ్మరసం వేసి బాగా కలపాలి. చికెన్ ఉడికిన తర్వాత చివరగా కొత్తిమీర తరుగు వేసి కలిపేయాలి. ఈ మిశ్రమాన్ని వేరొక గిన్నెలోకి తీసుకుని చల్లార్చాలి. ఇప్పుడు చపాతీ పిండిని తీసుకుని కోడిగుడ్డు ఆకారంలో కాస్త మందంగా పూరీలా చేసుకోవాలి. దీంట్లో చికెన్ మిశ్రమాన్ని కూర్చి సమోసాలా చేయాలి. ఇలా తయారుచేసి పెట్టుకున్న సమోసాలను వేడి నూనెలో మంటను మధ్యస్థంగా పెట్టి బంగారు రంగు వచ్చేవరకు వేయించాలి. వీటిని టొమాటో కెచప్‌తో తీసుకుంటే చాలా రుచిగ ఉంటాయి.





### చీజ్‌తో ..

**కావాల్సినవి :** ఉడికించిన బంగాళాదుంపలు-రెండు, ఉడికించిన స్వీట్‌కార్న్-కప్పు, చీజ్ తురుము-100 గ్రా, అల్లం తరుగు-చెంచా, తరిగిన పచ్చిమిర్చి-మూడు, కారం, జీలకర్రపొడి, చాట్ మసాలా-చెంచా చొప్పున, ఉప్పు-తగినంత, నిమ్మరసం-రెండు చెంచాలు కొత్తిమీర తరుగు-కొద్దిగా.

**తయారీ :** పెద్ద గిన్నె తీసుకుని పై పదార్థాలన్నింటినీ ఒకదాని తర్వాత మరొకటి వేసుకుంటూ బాగా కలిపి పక్కన పెట్టుకోవాలి. ఇప్పుడు ఈ మిశ్రమాన్ని సమోసా ఆకారంలోచేసిన చపాతీలో పెట్టి అంచుటు మూసేయాలి. దీన్ని వేడి వేడి నూనెలో మంటను మధ్యస్థంగా పెట్టి లోపలి పదార్థాలనీ ఉడికేలా చేయించుకోవాలి.

**చిట్కా :** మొక్కలకు ఉదయం సాయంత్రపూట మాత్రమే నీరు పోయవలయును. ఎండ వేళలలో పోయరాదు.

# మేని ఛాయ మెరిసేట్టు.. !



ఆరోగ్యానికి పంచదార వగరు అయితే అందానికి మాత్రం మధురమవుతుంది. అదెలాగంటే

**ఎసెన్షియల్ ఆయిల్‌తో..** చర్మం పొడిబారి నిర్జీవంగా మారినప్పుడు చక్కెరని ఉపయోగించి తిరిగి దాన్ని సాధారణ స్థితికి తీసుకు రావచ్చు. దీనికోసం కొద్దిగా చక్కెర తీసుకుని అందులో మీకు నచ్చిన ఎసెన్షియల్ ఆయిల్ కొన్ని చుక్కలు వేసి బాగా కలపాలి. ఆ మిశ్రమాన్ని ముఖానికి రాసుకుని కాసేపు మృదువుగా మర్దన చేసుకోవాలి. తర్వాత చల్లని నీటితో ముఖం శుభ్రం చేసు కోవాలి. ఇలా చేయడం వల్ల చర్మం మళ్లీ కొత్త కళను సంతరించుకుంటుంది.

**లేలేత అధరాలకు....** సాధారణంగానే పెదవుల మీద కొద్దిగా చక్కెర రాస్తే మృతకణాలు తొలగిపోయి మృదువుగా మారతాయి. కొద్దిగా చక్కెర తీసుకుని అందులో పాలు, తేనె వేసి బాగా కలపాలి. ఈ మిశ్రమంతో రోజూ రాత్రి పూట పడుకొనే ముందు పెదవులకు మెల్లగా మర్దన చేసుకుంటే గులాబీ ల్లాంటి లేలేత అధరాలు సొంతమవుతాయి. అయితే ఈ చిట్కా ఎప్పుడో ఓసారి కాకుండా రెండు లేదా మూడు రోజులకోసారి పాటిస్తేనే సత్ఫలితాలు పొందవచ్చు.



**వృద్ధాప్య ఛాయలు రానీయకుండా...** చర్మం ముడతలు పడటం, సన్నని గీతలు కనిపించడం. వంటి లక్షణాలు ద్వారానే వయసు పైబుతోందన్న విషయం పైకి తెలుస్తుంది. చక్కెరని ఉపయోగించడం వల్ల చర్మం ముడతలు పడకుండా కాపాడుకోవచ్చు. అలాగే చక్కెర సన్నని గీతలు కూడా కనిపించకుండా చేస్తుంది. దీనికోసం కొద్దిగా చక్కెర తీసుకుని అందులో నిమ్మరసం వేసి ముఖానికి రాసుకోవాలి. ఆరిన తర్వాత తడి గుడ్డతో తుడుచు కోవాలి. ఇది సూర్యరశ్మిలో ఎక్కువ సమయం ఉండటం వల్ల ఎదురయ్యే ట్యానింగ్, పిగ్మెంటేషన్ వంటి సమస్యలకు కూడా చక్కని పరిష్కారంగా ఉపయోగపడు తుంది.



చర్మం రంగుని పెంచుకోవాలను కునేవారు కొద్దిగా గంధం తీసుకుని అందులో రోజ్‌వాటర్, చక్కెర చెంచా చొప్పున వేసి బాగా కలుపుకోవాలి. ఈ మిశ్రమాన్ని ముఖానికి ప్యాక్‌లా అప్లై చేసుకోవాలి. 15 నుంచి 20 నిమిషాలు ఆరనిచ్చి తర్వాత చల్లని నీటితో శుభ్రం చేసుకోవాలి.

అంతర్వాణి

# ప్రేమతో ఆరాధిద్దాం !

జానీ హఠాత్తుగా ఇంగ్లీషు భాషను నేర్చుకోవాలనే తపన పుట్టింది. అదికూడా చాలాకొద్ది సమయంలోనే ఇంగ్లీషు మొత్తాన్ని నేర్చు కోవాలని ఆశించాడు. దీంతో ఇంగ్లీషు బాగా తెలిసిన వ్యక్తివద్దకు వెళ్లి తన కోరికను తెలిపాడు జానీ. అందుకు ఆవ్యక్తి జానీతో 'నేర్పిస్తాను అందుకు పదివేలు ఖర్చవుతుంది' అన్నాడు. అంతేకాదు ఒక నెలరోజులు నేర్చుకుంటే నీకు వస్తుంది అన్నాడు. కానీ జానీ 'నాకు వెంటనే రావాలి, నెలరోజులు నేను ఆగలేను' అన్నాడు. వీరిద్దరి సంభాషణలను దూరంగా నిలబడి ఓవ్యక్తి గమనించి, దగ్గరకు వచ్చి అడిగాడు. 'ఏంకావాలి?' అని, జానీ చెప్పాడు తనకు ఇంగ్లీషు నేర్చుకోవాలని ఉందని. వెంటనే ఆవ్యక్తి నేను నీకు రెండునిమిషాల్లో ఇంగ్లీషు నేర్పిస్తాను, అందుకు ఐదువేల రూపాయలు అవుతుంది అన్నాడు. వెంటనే జానీ ఐదువేల రూపాయల్ని ఇచ్చి, నేర్పించమన్నాడు. 'ఎస్', 'నో', 'ఆల్‌రైట్' అనే మూడు పదాలను నేర్పించి, ఈ మూడుపదాలను నేర్చుకుంటే ఇంగ్లీషు నీకు వచ్చినట్లే! అన్నాడు. 'ఇంత సులభమా!' అన్నాడు జానీ.ఇక జానీ తనకు ఇంగ్లీషు అంతా వచ్చేసింది అనే సంభరంలో రోడ్డుపై నడుస్తుంటే, పక్కన ఓ శవం కనిపించించి. ఆ శవాన్ని జానీ తదేకంగా చూస్తూ నిలబడ్డాడు. ఇంతలో ఓ పోలీసు అక్కడి వచ్చి 'నువ్వేనా ఈ హత్య చేసింది?' అని ప్రశ్నించాడు. అందుకు జానీ తనకు ఇంగ్లీషు మాట్లాడే అవకాశం దక్కిందని ఆనందంలో 'ఎస్' అన్నాడు. వెంటనే పోలీసు జానీని జడ్జి వద్దకు తీసుకెళ్లాడు. జడ్జి'నువ్వు చంపుతున్నప్పుడు ఎవరైనా చూశారా?' అని అడిగాడు. అందుకు జానీ 'నో' అన్నాడు. వెంటనే జడ్జి ఆయనను జైల్లో ఉంచమని ఆజ్ఞాపించాడు. అందుకు జానీ 'ఆల్‌రైట్' అన్నాడు. ఇంకేమీ ఉంది, బాధతో జానీ జైల్లో ఊచలు లెక్కించ సాగాడు. ఇదిచదువుతుంటే నవ్వు అనిపిస్తుంది **దేవుడి గురించి ఏదో కొద్దికొద్దిగా తెలుసుకుని, ఆయనను ఆరాధించలేం, పూజించలేం. దేవుడి ప్రేమను లోతుగా అర్థం చేసుకున్నప్పుడే ఆయనను మనస్ఫూర్తిగా ఆరాధించగలం. లేకపోతే దేవుడిని వెంబడించడం భారంగా అనిపిస్తుంది. దేవా, మేము నీకు కృతజ్ఞతాస్తుతులు చెల్లించుచున్నాము, నీవు సమీపముగా నున్నావని కృతజ్ఞతాస్తుతులు చెల్లించుచున్నాము, నరులు నీ ఆశ్చర్యకార్యములను వివరించుదురు**

**(కీర్తన 75:1).** దేవుడి ప్రేమను చూసేది కాదు, వినేదిఅంతకన్నా కాదు, హృదయపూర్వకంగా అనుభవించేదిగా ఉండాలి. అప్పుడే మనం దేవుడిని నిజంగా ఆరాధించగలం.

**- పి.వాణిపుష్ప**

# ఎసి వాడుతున్నారా?



భానుడి భగభగల నుంచి తప్పించుకోవ డానికి ఎసిల వినియోగం ఎక్కువై పోయింది. మరి చిన్నపిల్లలు ఉండే ఇళ్లలో వీటిని వాడొచ్చా... వాడితే ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి? ..

ఎసి ఉష్ణోగ్రత 24 డిగ్రీల నుంచి 26 మధ్యలోనే ఉండేట్లు చూసుకోవాలి. ఇదే పిల్లలకు ఆరోగ్య, సురక్షి తం కూడా. ఇంతకు మించి చల్లదనం ఎక్కువైతే... ఊపిరి తీసుకోవడంలో సమస్యలు ఎదురయ్యే అవకాశాలు ఎక్కువ. ఎయిర్ కూలర్ నుంచి వచ్చే గాలి... నేరుగా పిల్లలపై పడకూడదు. ఎసి వాడాలనుకున్నప్పుడు... ముందుగానే ఆన్ చేసి, గది వాతావరణం చల్లబడిన తర్వాతే పిల్లల్ని అక్కడికి తీసుకెళ్లాలి. ఒక్కసారిగా వాతావరణంలో వచ్చిన మార్పుల్ని తట్టుకోలేరు. ఎసిని ఎక్కువసేపు ఉపయోగిస్తే... గదిలో తేమ తగ్గిపోతుంది. దానివల్ల శ్వాసకోశ సమస్యలు వస్తాయి. హ్యూమిడిఫయర్‌ను వాడటం ద్వారా గాలిలో తేమను నియంత్రించ`వచ్చు. ఎసి ఫిల్టర్లను ఎప్పటికప్పుడు శుభ్రం చేస్తూ ఉండాలి. లేదంటే దుమ్ము, శస్త్ర చికిత్స చేరి... పిల్లల్లో అలజడి, ఇన్ఫెక్షన్లకు కారణమవుతుంది.

**చెలి** సామాజిక పరిణామ క్రమంలో మహిళల పాత్ర ఎంతో అనిర్వచనీయమైనది. దానికి అందం చేకూర్చా లంటే స్త్రీ పాత్ర ఉండాల్సిందే! అందుకే మీ రచనలు పరిచయం చేయాలని 'వార్త' సంకల్పించింది. మహిళ సంబంధిత అంశాలపై వ్యాసాలు ఆహ్వానిస్తున్నాం. మీరు అనుసరించే జాగ్రత్తలు పాటించే చిట్కాలు, ఇతర ఏ అంశాలైనా మీ పేరుతో ప్రచురిస్తాం. ఈ మెయిల్: Cheli@vaartha.com

## కె 'పేట్రియాట్' జూన్ 5 నుంచి స్ట్రీమింగ్

జీ5 లో మలయాళ పొలిటికల్ థ్రిల్లర్ మూవీ`పేట్రియాట్ జూన్ 5 నుంచి స్ట్రీమింగ్ కానుంది. ప్రముఖ దర్శకుడు మహేష్ నారాయయణన్ తెరకెక్కించారు. 18 ఏళ్ల తర్వాత మలయాళ సినీ దిగ్గజాలు మమ్ముట్టి, మోహన్‌లాల్ ఈ చిత్రంలో కలిసి నటించారు. నయనతార, ఫహాద్ ఫాజిల్, కున్‌చాకో బొబన్ తదితరులు ఇతర కీలక పాత్రల్లో నటించారు. పేట్రియాట్ మూవీ మలయాళంతో పాటు హిందీ, తెలుగు, తమిళం, కన్నడ భాషల్లో స్ట్రీమింగ్ కానుంది. దర్శకుడు మహేష్ నారాయణన్ మాట్లాడుతూ, 'పేట్రియాట్' మూవీ మనం ప్రస్తుత పరిస్థితుల ఆధారంగా తెరకెక్కించిన సినిమా. ప్రజలను రక్షి ంచడానికి రూపొం దించిన టెక్నాలజీనే చివరకు భయం, నియంత్రణకు ఆయుధంగా మారే పరిస్థితులను ఈ సినిమాలో చూపించాం. మమ్ముట్టి మాట్లాడుతూ 'పేట్రియాట్' మూవీ ఎంతో ప్రత్యేకమైన సినిమా. భారీ రేంజ్‌లో చేసిన మూవీ. రాజకీయ ఉత్కంఠ అనే అంశం మాత్రమే కాకుండా.. ఇది మనసాక్షి , బాధ్యత, ధైర్యం గురించి చెప్పే బలమైన మానవీయ కథ. Lo ok i got unn మోహన్ లాల్ మాట్లాడుతూ 'పేట్రియాట్' ప్రస్తుతం మనం జీవిస్తున్న ప్రపంచం గురించి మాట్లాడే సినిమా. నిజం, అధికారం మధ్య జరిగే నిరంతర సంఘర్షణను ఆవిష్కరిస్తుంది.



## 'లెనిన్' జూన్ 26న విడుదల

టాలీవుడ్‌లో కింగ్ నాగార్జున 40 ఏళ్ల పూర్తి చేసుకున్న సందర్భంగా అఖిల్ అక్కినేని ..టాలీవుడ్‌లో కింగ్ నాగార్జున 40 ఏళ్ల పూర్తి చేసుకున్న సందర్భంగా అఖిల్ అక్కినేని 'లెనిన్' టీజర్.. జూన్ 26న మనోడు వస్తున్నాడు. మనం ఎంటర్‌ప్రైజెస్ ఎల్‌ఎల్‌పి, సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్లపై అక్కినేని నాగార్జున, సూర్యదేవర నాగ వంశీ నిర్మిస్తున్న చిత్రం 'లెనిన్' . అఖిల్ అక్కినేని, భాగ్యశ్రీ బోర్సే జంటగా నటిస్తున్న ఈ సినిమాకు మురళీ కిషోర్ అబ్బూరు దర్శకత్వం వహిం చారు. ఈ చిత్రం జూన్ 26న థియేటర్లలో ఘనంగా విడుదల కానుంది. ఇప్పటివరకు విడుదలైన పోస్టర్లు, పాటలు, గ్లింప్స్ అన్నీ కూడా ప్రేక్షకులలో ఆసక్తిని పెంచేశాయి. కింగ్ నాగార్జున సినీ జర్నీ ప్రారంభించి, టాలీవుడ్‌లో అడుగు పెట్టి నలభై ఏళ్ల పూర్తి చేసుకున్న సందర్భంగా 'లెనిన్' నుంచి టీజర్‌ను విడుదల చేశారు. 'మనోడు వస్తున్నాడు' అనే డైలాగ్‌తో`లెనిన్ టీజర్ మీద హైప్ పెరిగింది. నేను తప్పిపోయి రాలేదు మచ్చా.. మీ అందరినీ వెతుక్కుంటూ వచ్చిన అని చెప్పిన డైలాగ్‌తో హీరో పాత్రలోని ఇంటెన్సిటీని చూపించారు. స్టేజ్ మీద నాటకాల్లో భాగంగా సీనియర్ ఎన్టీఆర్ శక్తివంతమైన డైలాగ్‌లను భాగ్యశ్రీ బోర్సే చెప్పిన తీరు బాగుంది. అఖిల్, భాగ్యశ్రీల మధ్య కెమిస్ట్రీ చాలా ఫ్రెష్‌గా అనిపిస్తుంది. చిత్తూరు యాసలో అఖిల్ చెప్పిన డైలాగ్స్, ఆయన బాడీ లాంగ్వేజ్, రగ్డ్ లుక్ అన్నీ కూడా హైలెట్‌గా నిలిచాయి.అఖిల్ గత చిత్రాలతో పోలిస్తే ఈ`లెనిన్‌లో పూర్తి డిఫరెంట్ లుక్‌లో కనిపిస్తున్నారు. అఖిల్ డైలాగ్ డెలివరి, చిత్తూరు యాసను పలికించిన తీరు, మాస్ రగ్డ్ లుక్ ఇలా అన్నీ కూడా ఆడియెన్స్‌ని కట్టి పడేసేలా ఉన్నాయి. అద్భుతమైన విజువల్స్, తమన్ అందించిన ఆర్‌ఆర్ ప్రతీ ఒక్కరినీ ఆకట్టుకునేలా ఉన్నాయి. 'లెనిన్' ఇంటెన్స్ ఎమోషన్స్‌తో పీరియాడిక్ విలేజ్ డ్రామాగా రాబోతోందని టీజర్ చూస్తే తెలుస్తోంది.



తెర

## విజయ్ ఆంటోనీ 'నాన్న కుట్టి'

ఫాదర్ అండ్ డాటర్ సెంటి మెంట్‌తో ము. మారన్ దర్శకత్వంలో విజయ్ ఆంటోనీ హీరోగా చేస్తున్న చిత్రం 'నాన్న కుట్టి' యాక్షన్, కుటుంబ భావోద్వేగాలు, ఇంటెన్స్ డ్రామాగా ఈ మూవీని రూపొందిస్తున్నారు. విజయ్ ఆంటోని ఫిల్మ్ కార్పొరేషన్ బ్యానర్ మీద మీరా విజయ్ ఆంటోని నిర్మాతగా ఈ సినిమా తెరకెక్కింది. ఈ మూవీకి సర్వంత్ రామ్ క్రియేషన్స్ బ్యానర్ అధినేత రామంజనేయులు జవ్వాజీ సహ నిర్మాతగా వ్యవహరిస్తున్నారు. ప్రస్తుతం ఈ మూవీకి సంబంధించిన షూటింగ్ విజయవంతంగా పూర్తయింది.ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. చిత్ర బృందం ఆగస్టులో ఈ చిత్రాన్ని ఘనంగా థియేటర్లలో విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తోంది. ఫుల్ ఇంటెన్స్ ఎమోషనల్ యాక్షన్ పాత్రలో విజయ్ ఆంటోనీ కనిపించనున్నారు. ఈ కథ తండ్రీ కూతుళ్ల మధ్య ఉండే బంధాన్ని హైలైట్ చేస్తూ యాక్షన్ ప్రధానంగా ఈ మూవీని తెరకెక్కించారు. తాజాగా రిలీజ్ చేసిన పోస్టర్‌లో విజయ్ ఆంటోని కనిపిస్తున్న తీరు, రక్తంతో ఉన్న ఆ విధానం, ఆయన ఇంటెన్స్ లుక్స్ ఇవన్నీ కథ ఎంత డెప్త్‌గా ఉండబోతోందో చెప్పే ప్రయత్నం చేశారు.ఈ చిత్రంలో ప్రీతి అస్రాని, లిథన్య, భగవతి పెరుమాళ్, మధన్, చిత్ర లక్ష్మణన్, శ్రీజ రవి, వెట్టై ముత్తుకుమార్, జెన్సన్ దివాకర్, మురుగా నందం, మున్నార్ రమేష్, లిస్సీ ఆంటోని, కుమార్ నటరాజన్, విజయన్, ప్రవీణ, హరిత, హరిప్రియ తదితరులు ముఖ్య పాత్రల్ని పోషించారు.



## 'సందిగ్ధం' ట్రైలర్ లాంచ్



తీర్థ క్రియేషన్స్ బ్యానర్ పై సంధ్య తిరువీధుల నిర్మాణంలో పార్థసారధి కొమ్మోజు దర్శకత్వంలో 'సందిగ్ధం' సినిమా తెరకెక్కింది. ఈ చిత్రంలో నిహాల్, ప్రియా దేశ్ పాగ్, అర్జున్ సిహెచ్, కాజల్ తివారి మెయిన్ లీడ్స్‌లో నటించగా, విలన్ రోల్ లో తెర చేప ఫేమ్ నవీన్ సంకరపు నటించారు. ఈ మూవీని మే 29న రిలీజ్ చేయబోతోన్నారు. ..దర్శకుడు పార్థసారథి మాట్లాడుతూ.. 'సందిగ్ధం' ప్రయాణంలో నా భార్య సంధ్య ఎంతో సపోర్ట్ చేశారు. ప్రతీ ఒక్క ఆర్టిస్ట్ మా కోసం ఎంతో కష్టపడ్డారు. అందరూ సపోర్ట్ చేశారు. ఆర్టిస్టులు, టెక్నీషియన్లంతా కలిసి సపోర్ట్ చేయడం వల్లే సినిమాని ఇంత బాగా తీయగలిగాం. నిహాల్ మాట్లాడుతూ.. 'సందిగ్ధం' చిత్రీకరణలో నాకు దర్శక, నిర్మాతలు ఎంతో సపోర్ట్ చేశారు. వారిద్దరూ ఎన్నో కష్టాలను దాటుకుని మూవీని ఇక్కడి వరకు తీసుకు వచ్చారు. కాజల్ తివారి మాట్లాడుతూ..నాకు తెలుగు అంతగా రాదు. సెట్‌లో ప్రతీ ఒక్కరూ నాకు సపోర్ట్ చేశారు. అర్జున్ మాట్లాడుతూ.. 'సందిగ్ధం'లో సత్య అనే మంచి పాత్రను ఇచ్చిన దర్శకుడు పార్థుకి థాంక్స్. సంగీత దర్శకుడు గౌతమ్ రవిరామ్ మాట్లాడుతూ..'సందిగ్ధం' సినిమాలో మ్యూజిక్, ఆర్‌ఆర్ అద్భుతంగా ఉంటుంది. నటుడు ఆనంద్ మాట్లాడుతూ.. 'సందిగ్ధం' మూవీని అందరం కలిసి ఎంజాయ్ చేస్తూ షూటింగ్ చేశాం. నటుడు నవీన్ రాజ్ మాట్లాడుతూ.. 'సందిగ్ధం'లో నేను విలన్‌గా నటించాను. ఈ మూవీ చాలా బాగా వచ్చింది.

## 'రావు బహదూర్' నుంచి 'ది వరల్డ్ ఆఫ్ రావు బహదూర్' రిలీజ్



సూపర్‌స్టార్ మహేష్ బాబు, నమ్రతా శిరోద్కర్ జిఎంబి ఎంటర్‌టైన్‌మెంట్, ప్రముఖ దర్శకుడు వెంకటేష్ మహా దర్శకత్వంలో, వెర్సటైల్ యాక్టర్ సత్యదేవ్ కథా నాయకుడిగా నటిస్తున్న మోస్ట్ అవైటెడ్ సైకాలజికల్ థ్రిల్లర్ 'రావు బహదూర్' చిత్రాన్ని సగర్వంగా సమర్పిస్తు న్నారు. వెంకటేష్ మహా ఈ చిత్రానికి దర్శకత్వం వహించడమే కాకుండా కథ, ఎడిటింగ్ బాధ్యతలు కూడా నిర్వహిస్తున్నారు. ఈ చిత్రాన్ని ఏ+ఎస్ మూవీస్, శ్రీచక్రాస్ ఎంటర్‌టైన్‌మెంట్స్ సంయుక్తంగా నిర్మించాయి. ఇప్పటికే విడుదలైన ఫస్ట్ గ్లింప్స్, అలాగే ప్రేక్షకుల ప్రశంసలు అందుకున్న 'ఓ సుందరి' పాట సినిమాపై ఆసక్తిని మరింత పెంచాయి. తాజాగా మేకర్స్ ఇంటూ 'ది వరల్డ్ అఫ్ రావు బహదూర్' పేరుతో ఓ బీటీఎస్ వీడియోను విడుదల చేశారు. ఈ వీడియోలో చిత్ర నిర్మాణ వైభవం, ప్రీప్రొడక్షన్ పనులు, ప్రోస్తెటిక్ మేకప్, భారీ సెట్స్, షూటింగ్ విశేషాలను చూపిస్తూ సినిమా స్కేల్‌ను పరిచయం చేశారు. విజువల్‌గా అద్భుతంగా, పాత్రల ఆధారంగా నడిచే ఓ విభిన్నమైన సినిమాటిక్ అనుభవాన్ని ఈ చిత్రం అందించ బోతోందనే సంకేతాలు ఈ వీడియోలో కనిపిస్తున్నాయి.ఈ వీడియోలో ప్రధాన ఆకర్షణ సత్యదేవ్ చేసిన అద్భుతమైన ఫిజికల్ ట్రాన్స్‌ఫర్మేషన్. సెట్స్‌కు వచ్చిన తర్వాత ఆయన ప్రత్యేక మేకప్, స్టైలింగ్ ప్రక్రియలో పాల్గొనే విధానాన్ని ఇందులో చూపించారు. ఈ వీడియోలో ప్రధాన ఆకర్షణ సత్యదేవ్ చేసిన అద్భుతమైన ఫిజికల్ ట్రాన్స్‌ఫర్మేషన్. సెట్స్‌కు వచ్చిన తర్వాత ఆయన ప్రత్యేక మేకప్, స్టైలింగ్ ప్రక్రియలో పాల్గొనే విధానాన్ని ఇందులో చూపించారు.

## 'ఇట్లు అర్జున' ఫస్ట్ సింగిల్ మే 28న రిలీజ్



స్టార్ డైరెక్టర్ వెంకీ కుడుముల తన నిర్మాణ సంస్థ వాట్ నెక్స్ట్ ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌పై నిర్మిస్తున్న తొలి చిత్రం 'ఇట్లు అర్జున', న్యూ గై ఇన్ టౌన్" అనీష్ హీరోగా పరిచయం అవు తుండగా, మహేష్ ఉప్పల దర్శకుడిగా అరంగేట్రం చేస్తున్నారు. అనస్వర రాజన్ కథానాయికగా నటిస్తున్న ఈ చిత్రం టైటిల్ గ్లింప్స్‌తోనే మంచి బజ్ క్రియేట్ చేసింది. అక్కినేని నాగార్జున ఇచ్చిన పవర్‌ఫుల్ వాయిస్ ఓవర్ గ్లింప్స్‌కు ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. అనంతరం విడుదలైన పోస్టర్లు, 'ఫైండింగ్ అర్జున' అనే స్పెషల్ వీడియో సినిమాపై మరింత ఆసక్తిని పెంచాయి.తాజాగా చిత్ర బృందం మ్యూజికల్ జర్నీకి శ్రీకారం చుడుతూ ఓ సరదా ప్రోమోను విడుదల చేసింది. పియానోపై ఓ ట్యూన్ వాయించేందుకు అనీష్ ప్రయత్నిస్తుండగా, మ్యూజిక్ సెన్సేషన్ 'ఓజీ' థమన్ ఎస్ కాఫీ మగ్ చేతిలో పట్టుకుని అతన్ని ఆసక్తిగా గమనిస్తుం టారు.ఆ తర్వాత ఇద్దరి మధ్య జరిగే ఫన్నీ సంభాషణ ఆకట్టుకుంటుంది. అనీష్ వాయిస్తున్న ట్యూన్‌ను చూసి సరదాగా ఆటపట్టించిన థమన్, అనంతరం తనదైన శైలిలో మ్యూజికల్ మ్యాజిక్‌ను రివిల్ చేశారు. ఆయన అందించిన సాఫ్ట్ మెలోడీ ఆకట్టుకుంటుంది. ఫస్ట్ సింగిల్‌ను మే 28న విడుదల చేయనున్నట్లు మేకర్స్ ప్రకటించారు.ఈ చిత్రంలో హీరో పాత్ర చెవిటి, మూగ యువకుడు కావడంతో సంగీతం కథలో మరింత కీలక పాత్ర పోషించనుంది. థమన్ సంగీతంలో రూపొందుతున్న ఈ ఆల్బమ్ సినిమా భావోద్వేగా లను మరింత బలంగా ప్రేక్షకులకు చేరవేయనుంది.

# వినేశ్ కుస్తీకి గ్రీన్ సిగ్నల్

## ఢిల్లీ హైకోర్టులో ఊరట




**న్యూఢిల్లీ:** భారత రెజ్లింగ్ సమాఖ్యతో కుస్తీపట్లలో వినేశ్ ఫోగట్ విజయం సాధించింది. ఢిల్లీ హైకోర్టులో ఆమెకు ఊరట లభించింది. ఆసియా క్రీడల సెలెక్షన్ ట్రయల్స్‌లో పాల్గొనేందుకు న్యాయస్థానం రూట్ క్లియర్ చేసింది. ప్రధాన న్యాయమూర్తి డి.కె. ఉపాధ్యాయ, జస్టిస్ తేజస్ కరియాలతో కూడిన ద్విసభ్య బెంచ్.. వినేశ్‌ను ఆసియా క్రీడల ట్రయల్స్‌లో పాల్గొనేందుకు అనుమతించింది. కుస్తీ గోదాలోకి తిరిగి రీఎంట్రీ ఇవ్వాలనుకున్న వినేశ్ ఫోగట్... యూపీలోని గోండాలో జరిగిన జాతీయ ఓపెన్ రెజ్లింగ్ పోటీల్లో పాల్గొనేందుకు రెడీ అయింది. పోటీల కోసం యూపీకి సైతం వెళ్లింది. అయితే రెజ్లింగ్ సమాఖ్య వినేష్‌ను అడ్డుకుంది. పారిస్ ఒలింపిక్స్ ఫైనల్లో డిస్‌క్వాలిఫై అయిన వినేష్... రెజ్లింగ్ సమాఖ్య విధివిధానాలను పాటించలేదని నేపాన్ని నెగ్గి ఆమెపై వేటు వేసింది. దీని వెనక రెజ్లింగ్ సమాఖ్య మాజీ అధ్యక్షుడు బ్రిజ్ భూషన్ ఉన్నాడని ఆరోపించిన వినేశ్‌కు మద్దతుగా పలువురు మాజీ రెజ్లర్లు నిలిచారు.

**రెజ్లింగ్ సమాఖ్యకు చెంపదెబ్బ**

రెజ్లింగ్ సమాఖ్య తీరుపై ఢిల్లీ హైకోర్టును వినేశ్ ఫోగట్ ఆశ్రయించింది. దీనిపై ప్రధాన న్యాయమూర్తి డి.కె. ఉపాధ్యాయ, జస్టిస్ తేజస్ కరియాలతో కూడిన ద్విసభ్య బెంచ్ ముందు వాదనలు జరిగాయి. తల్లైన రెజ్లర్ల విషయంలో డబ్ల్యుఎఫ్ఐ నిబంధనలు అనుచితంగా ఉన్నాయని పేర్కొన్న ధర్మాసనం వినేశ్‌కు గ్రీన్ సిగ్నల్ ఇస్తూ తీర్పునిచ్చింది. ఎంపిక ప్రక్రియను వీడియో రికార్డు చేయాలని రెజ్లింగ్ సమాఖ్యను కోర్టు ఆదేశించింది. భారత స్పోర్ట్స్ అథారిటీ, భారత ఒలంపిక్ సంఘానికి చెందిన స్వతంత్ర ప్రతినిధులు ట్రయల్స్‌ను పర్యవేక్షి ంచాలని పేర్కొంది. మే 30, 31 తేదీల్లో ఆసియా క్రీడల సెలెక్షన్ ట్రయల్స్ జరుగనున్నాయి. ఆసియా క్రీడలతో పునరాగమనం చేయాలనుకున్న వినేశ్ ఫోగాట్ కల నిజమవ్వనుంది.

**ఫోగట్ కుస్తీమే సవాల్**

మహిళా రెజ్లింగ్‌కు పేరు తెచ్చిన వినేశ్ ఫోగట్...రెండుసార్లు ప్రపంచ ఛాంపియన్‌షిప్ మెడలిస్ట్. ఆసియా క్రీడల్లో స్వర్ణం, సిల్వర్ మెడల్స్.. కామన్‌వెల్త్ క్రీడల్లో మూడు స్వర్ణాలు, ఏషియన్ ఛాంపియన్ షిప్‌లో మెడల్స్‌తో మెరిశారు. 2024 పారిస్ ఒలింపిక్స్‌లో ఏకంగా ఫైనల్ చేరింది. అయితే ఫైనల్‌కు ముందు నిర్వహించిన వెయిట్‌లో వంద గ్రాములు ఎక్కువగా ఉందని వినేశ్ ఫోగట్‌పై అనర్హత వేటు పడింది. దీన్ని ఛాలెంజ్ చేసిన ఫోగట్... అదే ఏడాది అగస్టులో రెజ్లింగ్‌కు గుడ్‌బై చెప్పింది. రాజకీయాల్లోకి ఎంట్రీ ఇచ్చి 2024లో హర్యానాలోని జులానా నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా గెలుపొందారు. 2023లో డబ్ల్యుఎఫ్ఐ అప్పటి అధ్యక్షుడు భూషణ్‌పై లైంగిక వేధింపుల ఆరోపణలపై మహిళారెజర్లకు మద్దతుగా ఫోగట్ నిలిచింది.

# వైభవ్‌పైనే ఫోకస్

## నాలుగో బెర్త్ కోసం ముంబైతో రాజస్థాన్ కీలక పోరు



*ఇండియన్ ప్రీమియర్ లీగ్‌లో నేడు రెండు మ్యాచ్‌లు జరగనున్నాయి. వాంఖడే స్టేడియం వేదికగా జరిగే తొలి మ్యాచ్‌లో రాజస్థాన్ రాయల్స్, ముంబై ఇండియన్స్ తలపడనుండగా.. ఈడెన్ గార్డెన్స్ వేదికగా జరిగే రెండో మ్యాచ్‌లో కోల్‌కతా నైట్ రైడర్స్, ఢిల్లీ క్యాపిటల్స్ పోటీ పడతాయి. ప్లే ఆఫ్‌లోని నాలుగో బెర్త్ ఎవరిదిన్నది ఈ మ్యాచ్‌లు తేల్చనున్నాయి. రాజస్థాన్, ముంబై మ్యాచ్‌తో ఇది తేలనుంది. దీంతో ఈ మ్యాచ్ తీవ్ర ఆసక్తి రేపుతున్నా.. అందరి చూపు 15 ఏళ్ల కుర్రాడి పైనే.*

**ముంబై:** రాజస్థాన్ రాయల్స్ నాలుగో బెర్త్ అందుకుంటుందా? లేదా? అన్నది ముంబై ఇండియన్స్ తేల్చనుంది. ఇప్పటికే టోర్నీ నుంచి నిష్క్రమించిన ముంబై... సొంతగడ్డపై రాజస్థాన్‌రాయల్స్‌తో తలపడనుంది. ఈమ్యాచ్ గెలుపు ఓటములు ముంబైకు నామమాత్రమే. అదే రాజస్థాన్‌కు వస్తే ఈ మ్యాచ్‌లో గెలిస్తే 16 పాయింట్లతో నాలుగో జట్టుగా ముందంజ వేస్తుంది. లేదంటే కోల్‌కతా నైట్‌రైడర్స్–ఢిల్లీ మ్యాచ్ డిసైడ్ చేస్తుంది.

ఐపీఎల్ మొదటి దశ లీగ్ స్టేజ్‌లో చక్కని విజయాలు అందుకున్న రాజస్థాన్ రాయల్స్ వరుసగా హ్యాట్రిక్ ఓటములతో ప్లే ఆఫ్ అవకాశాలను క్లిష్టం చేసుకుంది. తప్పక గెలవాల్సి న లక్నోను ఓడించి రేసులో నిలిచింది. లక్నో ఉంచిన 220 పరుగుల భారీ లక్ష్యాన్ని కూడా రాజస్థాన్ అలవోకగా చేధించింది. ఈ క్రెడిట్ వైభవ్ సూర్యవంశీకే దక్కుతుంది. దీంతో మరోసారి వైభవ్ గెలిపిస్తాడన్న ధీమా రాజస్థాన్ ఫ్యాన్స్‌లో ఉంది.

రాజస్థాన్ బ్యాటింగ్‌కు ప్రధాన బలం ఓపెనర్లు యశస్వీ జైస్వాల్, వైభవ్ సూర్యవంశీలే. వీరు క్రీజ్‌లో ఓ పది ఓవర్లు ఉన్నా రాయల్స్‌కు తిరుగుండదు. గత మ్యాచ్‌లో స్వభావానికి భిన్నంగా వైభవ్ క్రీజ్‌లో నిలిచేందుకు ప్రాధాన్యత ఇచ్చాడు. ఈ ఆలోచన దొరణే బిగ్ ఇన్నింగ్స్ ఆడేందుకు ఉపయోగపడింది. ముంబైపై మ్యాచ్‌లోనూ వైభవ్ క్రీజ్‌లో నిలబడితే ముంబై బౌలర్లకు చక్కలే. ఇక యశస్వీ జైస్వాల్, ధ్రువ్ జురెల్ మరోసారి బ్యాటింగ్‌లో మెరవాల్సి ఉంటుంది. రియాన్ పరాగ్ చక్కని ఫామ్‌లో ఉండడం, సీనియర్ ఆల్‌రౌండర్ రవీంద్ర జడేజా అనుభవం ప్లస్ కానుంది. ఇక అర్చర్ రూపంలో ఆరంభంలోనే వికెట్లు తీయగల బౌలర్ ఉన్నాడు. అతనికి తోడు పెరేరా, సందీప్, యష్ రాజ్...ప్రత్యర్థి జట్టును కట్టడిచేయాల్సి ఉంటుంది. గత మ్యాచ్‌లో ముంబై ఇండియన్స్‌పై 27 పరుగుల తేడాతో నెగ్గిన రాజస్థాన్ రాయల్స్.. దాన్ని రిపీట్ చేసి ప్లే ఆఫ్‌లో ప్రవేశించడంపై ఫోకస్ పెట్టింది.

**హెడ్ టు హెడ్**

ఇరు జట్లలో ముంబై ఇండియన్స్‌దే కాస్తంత పైచేయి. 32 మ్యాచ్‌ల్లో తలపడగా ముంబై 16 మ్యాచ్‌ల్లో, రాజస్థాన్ 15 మ్యాచ్‌ల్లో గెలుపొందాయి. అయితే వాంఖడేలో తలపడ్డ గత 9 మ్యాచ్‌ల్లో అయిదింటిలో రాజస్థాన్ రాయల్స్ విజయం సాధించింది.

**రాజస్థాన్ రాయల్స్:** యశస్వీ జైస్వాల్, వైభవ్ సూర్యవంశీ, ధృవ్ జురెల్, రియాగ్ పరాగ్(కెప్టెన్), ఫెరీరా, రవీంద్ర జడేజా, రవి సింగ్, జోఫ్రా అర్చర్, యష్ రాజ్, మఫాకా, సందీప్ శర్మ, నంద్రే బర్గర్

**ముంబై ఇండియన్స్:** ర్యాన్ రికల్టన్, రోహిత్ శర్మ, నమన్ ధీర్, సూర్యకుమార్ యాదవ్, తిలక్ వర్మ, హార్ధిక్ పాండ్యా, విల్ జాక్స్, కార్బిన్ బాష్, దీపక్ చాహర్, జస్‌ప్రీత్ బుమ్రా, ఘజన్‌ఫర్, శార్దుల్ ఠాకూర్

# పంజాబ్ నెగ్గింది.. రాయల్స్ ఓడితేనే ఛాన్స్?

లక్నో: తప్పక గెలవాల్సి న మ్యాచ్‌లో పంజాబ్ కింగ్స్ జోరు చూపింది. లక్నో సూపర్ జెయింట్స్‌ను దాని సొంతగడ్డపై ఏడు వికెట్ల తేడాతో ఓడించింది. ఈ విజయంతో పంజాబ్ పాయింట్ల సంఖ్య 15కు చేరింది. అయినా ప్లే ఆఫ్ బెర్త్ కోసం రాజస్థాన్–ముంబై మ్యాచ్ ఫలితం కోసం వెయిట్ చేయాల్సి న పరిస్థితి. రాజస్థాన్ రాయల్స్ గెలిస్తే మాత్రం పంజాబ్ ప్లే ఆఫ్‌కు ముందే నిష్క్రమిస్తుంది.

197 పరుగుల లక్ష్యంతో బ్యాటింగ్‌కు దిగిన పంజాబ్‌ను ఆరంభంలోనే షమీ బెంబేలెత్తించాడు. ఇన్నింగ్స్ తొలి బంతికే ప్రియాన్ష్ ఆర్యను డకౌట్‌గా, రెండో ఓవర్లో కూపర్ కొన్నోలీ(18)ని క్లీన బౌల్డ్‌గా అవుట్‌చేశాడు. 22 పరుగులకే రెండు వికెట్లు కోల్పోయిన పంజాబ్‌ను మరో ఓపెనర్ ప్రభ్ సిమ్రాన్ సింగ్(39 బంతుల్లో 69; 7 ఫోర్లు, 2 సిక్స్‌లు)తో కలిసి కెప్టెన్ శ్రేయాస్ అయ్యర్(51 బంతుల్లో 101 నాటౌట్; 11 ఫోర్లు, 5 సిక్స్‌లు) గెలుపు దిశగా నడిపించాడు. ఇద్దరూ లక్నో బౌలర్లపై విరుచుకు పడుతూ మూడో వికెట్‌కు 140 పరుగుల భారీ భాగస్వామ్యాన్ని అందించారు. ప్రభు సిమ్రాన్‌ను అర్జున్ అవుట్ చేయగా, శ్రేయాస్ చివరి వరకు క్రీజ్ లో నిలిచాడు. దీంతో పంజాబ్ 18 ఓవర్లలోనే మూడు వికెట్లు కోల్పోయి గెలుపందుకుంది.



అంతకుముందు మొదట బ్యాటింగ్ చేసిన లక్నోకు పవర్‌ప్లేలోనే పంజాబ్ బౌలర్లు గట్టి షాక్ ఇచ్చారు. తొలి మ్యాచ్ ఆడుతున్న అర్షిన్ కులకర్ణి డకౌట్ కాగా, నికోలస్ పూరన్(2) మరోసారి నిరాశపరిచాడు. దీంతో 20 రన్స్‌కే 2 వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడింది. కష్టాల్లో ఉన్న జట్టును ఆయుష్ బదోనీ తన మెరుపు బ్యాటింగ్‌తో ఆదుకున్నాడు. ముఖ్యంగా మార్కో జాన్సెన్ వేసిన పవర్‌ప్లే ఆఖరి ఓవర్లో 4, 6, 6, 2, 4 లతో ఏకంగా 24 పరుగులు సాధించాడు. కేవలం 18 బంతుల్లోనే 43 రన్స్ చేసిన బదోనీని చాహల్ కంగుతినిపించాడు. మరో ఎండ్‌లో ఓపెనర్ జోష్ ఇంగ్లిస్ పంజాబ్ బౌలర్లను వణికించాడు. నలుమూలలా షాట్లు ఆడుతూ కేవలం 29 బంతుల్లోనే హాఫ్ సెంచరీ పూర్తి చేశాడు. మొత్తంగా 44 బంతుల్లో 9 ఫోర్లు, 2 సిక్సులతో 72 పరుగులు చేశాడు. చివర్లో వచ్చిన ఇంపాక్ట్ ప్లేయర్ అబ్దుల్ సమద్ బౌండరీలతో విరుచుకుపడటంతో లక్నో 20 ఓవర్లలో 196 రన్స్ చేసింది.



# ఎట్టకేలకు అర్జున్ తెండూల్కర్ షో

**లక్నో:** క్రికెట్ దిగ్గజం సచిన్ తెండూల్కర్ తనయుడు అర్జున్ తెండూల్కర్‌కు ఎట్టకేలకు ఈ ఐపీఎల్ సీజన్‌లో ఆడడమే కాక అదరగొట్టాడు. లెఫ్టార్మ్ పేసర్ అయిన అర్జున్ పూర్తి కోటా 4 ఓవర్లు వేశాడు. 9 ఎకానమీతో 36 పరుగులిచ్చి ఓ వికెట్ పడగొట్టాడు. చివరి మ్యాచ్‌లో లక్నో తుది జట్టులోకి వచ్చిన అర్జున్ బ్యాటింగ్ లో 5 బంతులు ఎదుర్కొని 5 పరుగులు చేశాడు. ఆతర్వాత బౌలింగ్‌లో సత్తా చాటాడు. తొలి ఓవర్ మొదటి రెండు బంతులను డాట్స్ చేసిన అర్జున్... ఆ ఓవర్లో నాలుగు సింగిల్స్ మాత్రమే ఇచ్చి ఆకట్టుకున్నాడు. రెండో ఓవర్‌లో లయ తప్పి మాత్రం 15 పరుగులిచ్చినా.. మూడో ఓవర్లో జోరు మీదున్న ప్రభుసిమ్రాన్‌ను అద్భుత బంతితో ఎల్బీగా అవుట్ చేశాడు.

అర్జున్ తెండూల్కర్‌కు ఈ సీజన్‌లో ఇదే తొలి మ్యాచ్. కాగా ఇప్పటివరకు 6 ఐపీఎల్ మ్యాచ్‌లు ఆడాడు. మొత్తంగా 4 వికెట్లు తీశాడు. 2021 ఐపీఎల్ వేలంలో అర్జున్‌ను ముంబై ఇండియన్స్ 20 లక్షల బేస్ ధరకు దక్కించుకుంది. 2022లో 30 లక్షలకు ముంబై రిటేన్ చేసుకుంది. 2023 సీజన్‌లో కోల్‌కతాపై తొలి మ్యాచ్ ఆడే అవకాశం దక్కింది. సన్‌రైజర్స్‌పై తొలివికెట్ సాధించి జట్టు విజయంలో కీ రోల్ పోషించాడు. 2024 సీజన్‌లో ఒకే ఒక మ్యాచ్ ఆడాడు. 2025లో లక్నో సూపర్ జెయింట్స్‌కు మారినా ఈ సీజన్‌లో కానీ అర్జున్‌కు ఆడే అవకాశం రాలేదు.

# 75వేల మద్దతు స్థాయిని బ్రేక్ చేసిన బిట్‌కాయిన్



**న్యూఢిల్లీ, మే 23:** క్రిప్టోకరెన్సీ మార్కెట్‌లో బిట్‌కాయిన్ అత్యంత కీలకమైన 75వేల మద్దతు స్థాయిని శనివారం బ్రేక్ చేసింది. అంతర్జాతీయ క్రిప్టో మార్కెట్ మానిటరింగ్ సంస్థ ట్రేడింగ్ వ్యూ లైవ్ చార్ట్ ఆధారాల ప్రకారం బిట్‌కాయిన్ ప్రస్తుతం 74,678 వద్ద ట్రేడవుతోంది. ఇటీవలి కాలంలో సాధించిన గరిష్ఠ స్థాయిల నుంచి ఇది ఒక గమనించదగ్గ పతనంగా అంచనావేస్తున్నారు. గడచిన రోజులుగా బిట్‌కాయిన్ 77,000 నుంచి 78,000 రేంజ్‌లో గట్టి పట్టు సాధించడానికి ప్రయత్నించింది. మార్కెట్లో కొనుగోళ్ల మద్దతు గట్టిగానే కనిపించింది. శనివారం మాత్రం భారీ పతనం చవిచూసింది. ఈ మధ్యాహ్నం తర్వాత మార్కెట్ సెంటిమెంట్ ఒక్కసారిగా మారిపోయింది. 76,500 స్థాయిల వద్ద ఉన్న సపోర్ట్‌ను బ్రేక్ చేస్తూ ధర నేరుగా 74,250 వరకు పడిపోయింది. ప్రస్తుతం అక్కడ నుంచి స్వల్పంగా కోలుకుని 74,678 వద్ద కొనసాగుతోంది. గ్లోబల్ ఫైనాన్షియల్ మార్కెట్లలో నెలకొన్న అనిశ్చితి మధ్య బిట్‌కాయిన్ ఒడుదొడుకులను ఎదుర్కొంటోంది. ఈ తాజా పతనానికి ప్రధానంగా మూడు కారణాలు కనిపిస్తున్నాయి.

అంతర్జాతీయంగా నెలకొన్న ఆర్థిక పరిణామాలు, భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు. పెద్ద పెద్ద సంస్థలు, ఇన్వెస్టర్లు తమ పెట్టుబడుల వ్యూహాలను మార్చుకోవడం. ఇటీవలి కాలంలో బిట్‌కాయిన్ దిగువ స్థాయిల నుంచి భారీగా పుంజుకోవడంతో, ట్రేడర్లు ఈ స్థాయిలో లాభాల స్వీకరణకు మొగ్గు చూపడం వంటి కారణాలను చెప్పుకొస్తున్నారు. సాధారణంగా బిట్‌కాయిన్ పతనమైతే దాని ప్రభావం మొత్తం క్రిప్టో మార్కెట్‌పై పడుతుంది. లైవ్ వాచ్‌లిస్ట్ డేటా ప్రకారం బిట్‌కాయిన్ పతనం కారణంగా ఇథీరియం మైనస్ రేంజ్‌లోకి వెళ్లగా, మిగిలిన ప్రధాన ఆల్ట్‌కాయిన్స్ కూడా తీవ్ర విక్రయాల ఒత్తిడిని ఎదుర్కొంటున్నాయి. దీనివల్ల గ్లోబల్ క్రిప్టో మార్కెట్ క్యాపిటలైజేషన్ కూడా కొంత మేర కుంచించుకుపోయింది.

ప్రస్తుత మార్కెట్ సెంటిమెంట్ కాస్త ప్రతికూలంగా ఉన్నప్పటికీ, సుదీర్ఘ కాలంలో డిజిటల్ అసెట్ గా బిట్‌కాయిన్‌కు ఉన్న క్రేజ్ కొనసాగుతుందని ఇన్వెస్టర్లు భావిస్తున్నారు. స్వల్పకాలిక ట్రేడర్లు మార్కెట్ స్థిరీకరణ కోసం వేచి చూడాలని, ఇటువంటి సమయంలో ఎలాంటి భావోద్వేగ లేదా తొందరపాటు నిర్ణయాలు తీసుకోకుండా, రిస్క్ మేనేజ్‌మెంట్‌ను కఠినంగా పాటించాలని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

# మైక్రోసాఫ్ట్‌ను వీడుతున్న మెహదీ



**శాన్‌ఫ్రాన్సిస్కో, మే 23:** ప్రముఖ టెక్ దిగ్గజం మైక్రోసాఫ్ట్‌లో 35 ఏళ్లుగా పనిచేస్తున్న కీలక నిపుణుడు, కన్స్యూమర్ చీఫ్ మార్కెటింగ్ ఆఫీసర్ యూసఫ్ మెహదీ తన పదవి నుంచి వైదొలుగుతున్నారు. ఉద్యోగులకు పంపిన ఒక అంతర్గత మెమోలో ఆయన తన నిర్ణయం వెల్లడించారు. మైక్రోసాఫ్ట్ చరిత్రలో అత్యంత సుదీర్ఘకాలం పని చేసిన వారిలో మెహదీ ఒకరు. వచ్చే ఏడాది జూన్ వరకు, మైక్రోసాఫ్ట్ తదుపరి ఆర్థిక సంవత్సరం ముగిసే వరకు ఆయన కంపెనీలో కొనసాగుతారు. ఈ సమయంలో ఏఐ ఆధారిత ఏజెంట్ల కోసం విండోస్‌ను పునర్ నిర్వచించడం, మైక్రోసాఫ్ట్ 365 వృద్ధి, వన్ కోపైలట్ విజన్‌ను ముందుకు తీసుకెళ్లడంపై దృష్టి సారిస్తానని తెలిపారు. సున్నితమైన మార్పు ప్రక్రియ కోసమే ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. ఇంటర్న్‌గా ప్రస్థానం మొదలుపెట్టిన మెహదీ మైక్రోసాఫ్ట్ చరిత్రలో అనేక కీలక భాగమయ్యారు. విండోస్ 95, సెర్చ్ ఇంజిన్ బింగ్, ఎక్స్‌బాక్స్ వన్, విండోస్ 10, ఇటీవలి కోపైలట్ ప్లస్ పీసీల ఆవిష్కరణలలో ఆయన కీలకపాత్ర పోషించారు. మైక్రోసాఫ్ట్‌లో 35 ఏళ్ల అసాధరణ ప్రయాణం తర్వాత నా తదుపరి సాహసయాత్రను ప్రారంభించడానికి ఇదే సరైన సమయమని నిర్ణయించుకున్నట్లు మెహదీ తన మెమోలో పేర్కొన్నారు. సీఈఓ సత్య నాదెళ్ల నేతృత్వంలో మైక్రోసాఫ్ట్ ఏఐపై భారీగా దృష్టి సారిస్తున్న తరుణంలో జరుగుతున్న నాయకత్వ మార్పులలో భాగంగానే యూసఫ్ మెహదీ నిష్క్రమణను విశ్లేషకులు చూస్తున్నారు.




# సెంట్రల్ బ్యాంకులో ఆఫర్ ఫర్ సేల్

# 8శాతం వాటా విక్రయం

**న్యూఢిల్లీ, మే 23:** లాభదాయకతలేని ప్రభుత్వరంగ సంస్థలు, బ్యాంకుల్లో వాటాలను తగ్గించుకునేప్రక్రియను కేంద్రం వేగవంతంచేసింది. ప్రభుత్వ రంగ బ్యాంకుల్లో ఒకటైన సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియాలో కూడా ఆఫర్ ఫర్‌సేల్ పద్ధతిలో వాటాల్ని అమ్మేస్తుంది. శుక్రవారం రోజే నాన్ రిటైల్ ఇన్వెస్టర్లకు అందుబాటులోకి తీసుకొచ్చింది. అయితే ఇక్కడ ఇన్వెస్టర్ల నుంచి ఊహించని స్థాయిలో అదిరిపోయే రెస్పాన్స్ వస్తుండటంతో అదనంగా వాటా విక్రయించేందుకు సిద్ధమైంది. ముందుగా 4శాతం వాటానే విక్రయించాలని నిర్ణయించి మరో 4శాతం గ్రీన్ షూ ఆప్షన్ లేదా ఓవర్ సబ్‌స్క్రిప్షన్ ఆప్షన్ కింద ఉంచింది. ఇప్పుడు మంచిరెస్పాన్స్ లభించగా మిగతా 4శాతం వాటాను కూడా ఓఎఫ్ఎస్ కింద అంటే మొత్తం 8శాతం వాటాలను ఆఫర్‌ఫర్‌సేల్‌కింద విక్రయిస్తోంది. నాన్ రిటైల్ ఇన్వెస్టర్లకు షేర్లను విక్రయించేందుకు ఓఎఫ్ఎస్ ప్రక్రియ చేపట్టింది. ఇక్కడ మొత్తంగా 32.58 కోట్ల షేర్లను రిజర్వ్ చేయగా ఇలా అందుబాటులో ఉన్న షేర్లు 2 రెట్లకు మించి రెస్పాన్స్ వచ్చింది. మొత్తం 76.86 కోట్ల షేర్లకు బిడ్స్ దాఖలయ్యాయి. ముందురోజు క్లోజింగ్ ధర రూ. 33.92 తో చూస్తే చాలా తక్కువ ధరకే రూ. 31 నే ఫ్లోర్ ధరగా నిర్ణయించింది. మార్కెట్లో ఉన్న ధర కంటే కాస్త తక్కువకే షేర్లను కొనుగోలు చేసేందుకు అవకాశం కల్పిస్తోంది. వారాంతంలో మాత్రం షేరు ధర దాదాపు 8 శాతం తగ్గి రూ. 31.22 వద్ద స్థిరపడింది. ఈనెల 25 రెగ్యులర్ ఇన్వెస్టర్లు లేదా రిటైల్ ఇన్వెస్టర్లకు ఓఎఫ్ఎస్ అందుబాటులో ఉంటుంది. సోమవారం రోజు షేర్లకు బిడ్స్ దాఖలు చేసేందుకు వీలుంటుంది. ముందుగా 4 శాతం వాటా 36.20 కోట్ల షేర్లు అందుబాటులో ఉంచగా, ఇప్పుడు మరో 4శాతం అంటే మొత్తంగా 72.41కోట్ల షేర్లను అందుబాటులోకి తెచ్చింది.

# పెట్టుబడులకు లాంగ్‌టర్మ్ ఫండ్స్ మేలు

**ముంబయి, మే 23:** పెట్టుబడులకోసం స్టాక్ మార్కెట్, మ్యూచువల్ ఫండ్స్, బ్యాంక్ ఫిక్స్‌డ్ డిపాజిట్లు, రియల్ ఎస్టేట్, గోల్డ్, ఆర్బీఐ సేవింగ్స్ బాండ్లు ఇలా చెప్పుకుంటూ పోతే ఎన్నో ఉంటాయి. బ్యాంక్ ఎఫ్‌డీలు, పోస్టాఫీస్ పథకాలు వంటివి రిస్క్ లేకుండానే మంచి రిటర్న్స్ ఇస్తాయి. గోల్డ్, రియల్ ఎస్టేట్ వంటివి అనిశ్చితిలో ఉంటాయి. రిటర్న్స్ నిలకడగా ఉండవు. వీటికి ప్రత్యామ్నాయంగా స్టాక్ మార్కెట్లు, మ్యూచువల్ ఫండ్లు ఉన్నాయి. ఇక్కడ పెట్టుబడులు పెట్టే వారి సంఖ్య ఎక్కువగానే ఉంటుంది. రిస్క్ ఫ్యాక్టర్ ఎక్కువగానే ఉంటుంది. దానికి తగ్గట్లుగానే రాబడి కూడా ఆకర్షణీయంగా ఉంటుంది. ఇక్కడ చాలా వరకు లాంగ్ రన్ పెట్టుబడుల కోసమైతేనే ఇన్వెస్ట్ చేయడం మంచిది. స్వల్ప కాలంలో రిస్క్ ప్రభావం ఎక్కువగా కనిపిస్తుంటుంది. ఇప్పుడు మే నెలలో పెట్టుబడులు పెట్టేందుకు టాప్ మ్యూచువల్ ఫండ్స్ కొన్ని మార్కెట్‌కు వచ్చాయి. వీటి పెర్ఫామెన్స్ తెలుసుకునేందుకు ఇన్వెస్టర్లు మూడేళ్ల రాబడుల్ని ప్రాతిపదికగా తీసుకుంటారు.

యాక్సిస్ స్మాల్ క్యాప్ ఫండ్ 2013 నవంబరులో లాంచ్ అయింది. గత మూడేళ్ల వ్యవధిలో ఇక్కడ సగటున వార్షిక ప్రాతిపదికన 24.5 శాతం రిటర్న్స్ అందించింది. 2009 డిసెంబరులో లాంచ్ అయిన ఎస్బీఐ స్మాల్ క్యాప్ ఫండ్ సగటున వార్షిక ప్రాతిపదికన 23.4 శాతం రాబడి అందించింది. కోటక్ స్మాల్ క్యాప్ ఫండ్ చూస్తే సగటున గత మూడేళ్లలో వార్షికంగా 25.1 శాతం రాబడి ఇచ్చింది. నిప్పన్ ఇండియా స్మాల్ క్యాప్ ఫండ్ వార్షిక ప్రాతిపదికన సగటున 31.6 శాతం రాబడి అందించింది.







# టిసిఎస్ కొత్త విధానంపై ఉద్యోగుల్లో ఆందోళన

**ముంబయి, మే 23:** వరస లేఆఫ్స్‌తో టెక్ రంగంలో తీవ్రస్థాయి అనిశ్చితి నెలకొంది. ప్రస్తుతం దేశంలో అతిపెద్ద ఐటీ కంపెనీల్లో ఒకటైన టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ నిర్ణయం ఉద్యోగుల్లో ఆందోళన పెంచుతోంది. వేరియబెల్ పే విధానాన్ని మార్చి, ఆఫీస్ హాజరుతో లింక్ చేయడంపై ఉద్యోగులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. 6లక్షల మంది ఉద్యోగులపై తీవ్ర ప్రభావం చూపుతోంది. ఇప్పటి వరకు వేరియబుల్ పే రూపంలో నెలవారీగా లేదా క్వార్టర్లీ వారీగా అందుతున్న మొత్తాన్ని ఇప్పటి నుంచి మంత్లీ పర్ఫామెన్స్ పేగా మార్చారు. దీంతో ఉద్యోగులు ఆఫీస్ హాజరు, ప్రాజెక్ట్ డిప్లాయ్‌మెంట్ ఆధారంగా నిర్ణయించనున్నారు. దీని కారణంగా ఆఫీస్ తక్కువగా వచ్చే ఉద్యోగులకు టేక్‌హోమ్ సాలరీ తగ్గే అవకాశం ఉందనే ఆందోళన వ్యక్తమవుతోంది. మరోవైపు, ఈ ఏడాది టీసీఎస్ సాధారణంగా 5 శాతం నుంచి 8 శాతం వరకు జీతాలను పెంచినట్లు సమాచారం. మంచి పనితీరు కనబరిచిన ఉద్యోగులకు ఎప్లస్ కేటగిరీలో చేర్చి, 10 శాతం నుంచి 13 శాతం వరకు పెంచినట్లు తెలుస్తోంది. తక్కువ రేటింగ్ పొందిన వారికి కేవలం 2 శాతం నుంచి 3 శాతం వరకు మాత్రమే పెరిగినట్లు తెలుస్తోంది.




# రూ.2 వాటా రూ.250కి కొనుగోలు

# విప్రో బైబాక్ తేదీ ఖరారు

**బెంగళూరు, మే 23:** దేశంలోని అతిపెద్ద ఐటీ సంస్థ విప్రో ఇటీవల ఏప్రిల్‌లో 2025–26 ఆర్థిక సంవత్సరం క్యూ4 ఫలితాల్ని ప్రకటన సందర్భంలోనే షేర్ హోల్డర్లకు ఒక బంపర్ ఆఫర్ ప్రకటించింది. రూ.15 వేల కోట్ల విలువైన షేర్ బైబ్యాక్ ఆఫర్ చేయగా ఇప్పుడు దీనికి రికార్డ్ డేట్ ప్రకటించింది. 2026, జూన్ 5 ను రికార్డ్ డేట్‌గా నిర్ణయించింది. ఆతేదీ లోపు విప్రో షేర్లను కలిగి ఉంటే షేర్ బైబ్యాక్‌కు అర్హత సాధిస్తారు. విప్రో షేర్లను ఆ తేదీ లోపు కొనుగోలు చేసి డీమ్యాట్ ఖాతాలో ఉంచుకుంటే బైబ్యాక్‌కు అర్హత సాధిస్తారు. అర్హులైన షేర్ హోల్డర్లు ఇందులో టెండర్ ఆఫర్ ద్వారా పాల్గొనే అవకాశం లభిస్తుంది. ఈ మేరకు రికార్డు తేదీ గురించి స్టాక్ ఎక్స్ఛేంజీలకు విప్రో సమాచారం అందించింది. రూ. 2 ఫేస్ వాల్యూ (ముఖ విలువ) కలిగిన ఒక్కో షేరును రూ. 250 చొప్పున తిరిగి కొనుగోలు చేయనున్నట్లు ప్రకటించింది. మొత్తం 60 కోట్ల షేర్లను టెండర్ ఆఫర్ ప్రాసెస్ ద్వారా విప్రోనే తిరిగి షేర్ హోల్డర్ల దగ్గరి నుంచి కొనుగోలు చేస్తుంది.

విప్రో షేరు ధర వారాంతపు సెషన్‌లో రూ. 203 వద్ద ముగియగా.. దాని కంటే సుమారు 25 శాతం వరకు అధిక ధర చెల్లించి తిరిగి షేర్లను కొనుగోలు చేస్తుండటం విశేషం. ఈ లెక్కన షేర్ హోల్డర్లకు స్వల్ప కాలంలో మంచి లాభాలు వచ్చే అవకాశం ఉంటుంది. జనవరి మార్చి త్రైమాసికంలో విప్రో లాభం కూడా 2 శాతం తగ్గింది. మరోవైపు ఐటీ స్టాక్స్‌లో ఒకవైపు తీవ్ర అమ్మకాల ఒత్తిడి పెరిగిన సమయంలో విప్రో ఇలా బైబ్యాక్ ప్రకటించడం గొప్ప విషయంగా మార్కెట్ వర్గాల్లో చర్చ నడుస్తోంది. కంపెనీ తన సొంత వాటాలను బహిరంగ మార్కెట్ నుంచి లేదా ప్రస్తుత వాటాదారుల నుంచి నేరుగా తిరిగి కొనుగోలు చేసే ప్రక్రియనే షేర్ బైబ్యాక్ అంటారు. షేర్ బైబ్యాక్ ద్వారా కంపెనీ తన వద్ద ఉన్న మొత్తం షేర్ల సంఖ్యను తగ్గిస్తుందని చెప్పొచ్చు. ఇలా మార్కెట్లో షేర్ల సంఖ్య తగ్గడం వల్ల ఒక్కో షేరుపై వచ్చే ఆదాయం పెరుగుతుంది. ఇంకా కంపెనీనే అధిక ధర చెల్లించి తిరిగి కొనుగోలు చేయడం వల్ల వాటికి డిమాండ్ పెరిగి.. షేరు ధర మళ్లీ పెరిగే అవకాశం ఉంటుంది. డివిడెండ్ ద్వారా కంపెనీ తన లాభాల్ని షేర్ హోల్డర్లతో పంచుకునేందుకు ప్రత్యామ్నాయంగా షేర్ బైబ్యాక్ ఆప్షన్ ఎంచుకుంటుంది.

Printed and Published by Gireesh Sanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 1 -187, Kushalpuram, Srikakulam Dist. PIN: 532005 Ph. 270684, 271144, 9848387562 Fax : 08942–271146, RNI No. AP TEL/2004/13708 Editor :*Damerla Sai Baba *Responsible for selection of News under the PRB Act. Regd.: No.J/RNP/VM111 Air Surcharge: Delhi : 40 Ps.